కీర్తనలు

# అన్నమయ్య విన్నపాలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

http://ebooks.tirumala.org



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# అన్నమయ్య విన్నపాలు

రచన



# అన్నమయ్య విన్నపాలు

( తాళ్ళపాక అన్నమాచార్యులవారి
అధ్యాత్మ సంకీర్తనలకు సీసపద్యానుసరణము)

రచన
విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2008

# ANNAMAYYA VINNAPAALU
(Adaptation of AnnamaCharya's Adhyatma Sankirtanas into 'sisam' Verses)

by
**Vidwan Mudivarti Kondamacharyulu**

T.T.D. Religious Publications Series N0: 790
© All Rights Reserved

T.T.D.First Edition: 2008

Copies : 1,000

*Published by*

**Sri. K.V. Ramanachary, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P.* at**

Chief Editor's Office, TTD, Tirupati.

***Printed at***

Tirumala Tirupati Devasthams Press,
Tirupati.

# ఆమోదము

"సకలవేదములు సంకీర్తనలు చేసి
ప్రకటించి హరి బాడి పావనుడైన
అకలంకుడు తాళ్ళపాకన్నమాచార్యులు"

అని తన సంతతివారిచే కొనియాడబడిన అన్నమాచార్యులు క్రీ.శ. 1408లో కడపమండలం రాజంపేట తాలుకా తాళ్ళపాక గ్రామంలో అవతరించాడు. అవతరించిన పదహారేండ్లకు తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైతే అది మొదలు 1503లో తన నిర్యాణ పర్యంతం దినమునకు ఒక పాట వంతున 32 వేల సంకీర్తనలు రచించి స్వామివారికి విన్నపం చేసినట్లు ఆయన మనుమడు తాళ్ళపాక చినతిరుమలాచార్యులు తెలిపాడు.

శ్రీనివాసముద్రాంకితములైన అన్నమయ్య పదాలన్నీ అధ్యాత్మ సంకీర్తనలనీ, శృంగార సంకీర్తనలనీ రెండు విధాలు. వాటిని ఆయన సంతతివారు రాగిరేకులమీద చెక్కించారు. కాని ఆ పాటల్లో సగానికి పైగా కాలవాహినిలో కలసిపోయాయి. శేషించిన వాటి నన్నింటినీ భాషా పరిశోధకులు, మహావిద్వాంసులు వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, గౌరిపెద్దిరామసుబ్బశర్మ గార్ల పరిష్కరణతో తిరుమల తిరుపతి దేవస్థానం 29 సంపుటాలలో ముద్రించి పాఠకులకు అందుబాటులో ఉంచింది.

పదకవితా పితామహుడని ప్రశస్తి వహించిన అన్నమాచార్యులు భగవద్రామానుజ సిద్ధాంతాన్ని పాటించిన మహనీయుడు. జ్ఞానవైరాగ్య నీతి బోధకాలైన తన సంకీర్తనల్లో ఆయన ముఖ్యంగా భక్తినీ, శరణాగత తత్త్వాన్ని ప్రబోధించాడు.

"విన్నపాలు వినవలె వింతవింతలూ
పన్నగపు దోమతెర పైకెత్త వేలయ్యా "

అంటూ ఆ హరికీర్తనాచార్యుడు శ్రీనివాసుణ్ణి సంబోధించి ఆయనమీద ఎన్నో జోలలు, సువ్వాలలు, నివ్వాళులు, జాజఱలు,

గొబ్బిపాటలు, కొట్నాలు, తందానలు, మేలు కొల్పులు రచించాడు. అన్నీ ప్రజలభాషలో, అతిసుందర సులభశైలిలో రచించబడినవే.

ఈ పాటల్లో 300 పాటల్ని సీసపద్యాలలోకి మలచి విద్వత్కవి శిరోమణి శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు "అన్నమయ్య విన్నపాలు" అనే ప్రబంధాన్ని 1988లో ప్రచురించారు. ఆపుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం స్వీయ ప్రచురణగా స్వీకరించి ఇపుడు ప్రచురిస్తున్నది. పాడుకొనేవారికి పాట, చదువుకొనే వారికి పద్యం ఉపకరిస్తుంది. ప్రతిపద్యానికి అవతారిక, సరళశైలిలో తాత్పర్యం రచయిత పొందుపరచడం వల్ల ఈ ప్రబంధం పాఠకుల ఆమోదం తప్పక పొందగలదని భావిస్తున్నాం.

**(కె.వి.రమణాచారి)**
కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

సాహిత్యశిరోమణి
**శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, M.A.,**
సాహిత్యవిభాగాధ్యక్షుడు
శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి.

తిరుపతి
దీపావళి
9-11-1988

# నివేదన

భగవత్తత్త్వము అప్రమేయము. దేవుని మహిమ జీవుని ఊహాపోహల కందదు. "యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ" అని శ్రుతి. మాటలకు మనసుకు పరతత్త్వము గోచరించదు.

జీవుడొక బాటసారి. ఆతని గమ్యము పరమాత్ముడే. అతనిస్థానము లన్నియు పునరావృత్తి గలవి. పరమాత్ముని చెందినవాడు మరల తిరిగి రాడు. " న పునరావర్తతే" " మాముపేత్యతు కౌంతేయ పునర్జన్మ న విద్యతే"- ఇత్యాది శ్రుతిస్మృతులు ఈ నిక్కమును నొక్కి వక్కాణించినవి.

ఏ దేవునిస్వరూపము అవాఙ్మనసగోచరమో, ఆ దేవుడే జీవునకు ప్రాప్యస్థానమగుట వింతగొల్పు విషయము. అయినను అచటికి జీవు డే నాటికయినను పయనించక తప్పదు.

ఒకవంక అగోచరమన్నను మరొకవంక వేదము ఆ పరతత్త్వస్వరూపమును వేనోళ్ల వర్ణించినది. సత్యజ్ఞానానంద స్వరూపునిగా, సకల కల్యాణగుణనిలయునిగా, అది పరమాత్మను స్తుతించినది. భగవానుడు సైతము "వేదైశ్చసర్వైరహమేవవేద్యః" -- సకలవేదములచే తెలియదగిన వాడను నేనే అని చెప్పినాడు. కాని భగవత్ప్రాప్తికై మనము చేయు సాధనలో మార్గదర్శకము వేదమనుట నిశ్చయము.

శ్రుతి ప్రతిపాదితమైన భగవత్ప్రాప్త్యుపాయములను మనకు బోధించుటకే శ్రుతులు, పురాణములు, ఇతిహాసములు మున్నగు అతివిశాలవాఙ్మయము ఉద్భవించినది. వర్ణములసంఖ్య పరిమితమేగాని వాఙ్మయస్వరూప మనంతము. పరతత్త్వముగూడ అనంతమే. అనంతము లైన ఈ రెండింటి కలయిక మిగుల వైచిత్ర్యావహమై తనరారుచున్నది.

ఆంధ్రవాఙ్మయములో పదకవితకు ప్రాభవము కల్గించిన మహానుభావుడు తాళ్లపాక అన్నమయ్య. అందుకే ఆయన పదకవితా

పితామహుడుగా ప్రఖ్యాతిగాంచినాడు. ఆ సంకీర్తనాచార్యుడు వేదములనే పదములుగా వెలయించినాడు. వేంకటేశ్వర పరబ్రహ్మమును వివిధరీతుల వినుతించినాడు. ఆ యేడుకొండల యెకిమీని దయకు పాత్రుడైనాడు. అందుకే ఆ పరమభాగవతోత్తముని సంతతివారు

"సకలవేదములను సంకీర్తనములు చేసి
ప్రకటించి నిను చాటి పావనుడైన
అకలంకుడు తాళ్లపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన వేంకటగిరినిలయ!"

అని శ్రీవేంకటాధిపుని కీర్తించినారు, భగవద్భక్తి, కవితాప్రతిభ- ఇవిరెండును సమపాళ్లలో పెనవేసికొని అన్నమయ్యరూపముతో మనకు సాక్షాత్కరించిన మాట అత్యుక్తిగాదు. ఆదినారాయణుడే అర్చావతారమై అలమేలుమంగా విభుడుగా కలియుగమున ప్రత్యక్షమైనాడు. అన్నమయ్యకు ఆరాధ్య దైవ మతడే. ఆ పరమాత్ముని నందకాంశములోనే ఆయన అవతరించినట్లు చరిత్ర చెప్పుచున్నది.

బాల్యమందే అన్నమయ్య ఆడినమాటెల్ల అమృతకావ్యముగా, పాడినపాటెల్ల పరమగానముగా రూపొందినవట! ఆయన మాటలు అనల్పార్థములమూటలు. అవి పాటలై "చాలదా బ్రహ్మమిది సంకీర్తనం" అన్నట్లు బ్రహ్మమునకే ప్రతిరూపమైనవి.

అన్నమయ్య ముప్పదిరెండువేల సంకీర్తనములు పాడినట్లు ప్రతీతి. అందులో ఇంచుమించు పదునాల్గువేల సంకీర్తనములు మాత్రమే మనకు లభించినవి. అవి కూడ ఐదుశతాబ్దముల కాలము శ్రీ వేంకటేశ్వరుని భండారములో దాగియుండి ఈ శతాబ్దపు ప్రథమ పాదముననే వెలుగు చూచినవి.

వేదపురాణాదులెట్లు ఆ పరమపురుషుని కీర్తించినవో అట్లే అన్నమయ్యకూడ కీర్తించినాడు. కీర్తనలన్నింటిని వేంకటేశ్వర ముద్రాంకితము గావించినాడు. రామానుజమతమే ప్రశస్తమని చాటిచెప్పినాడు. భగవత్ప్రాప్తికి శరణాగతినిమించిన సులభోపాయము మఱొక్కటిలేదని నిరూపించినాడు.

ఉపనిషత్తత్త్వములకు, గీతాప్రతిపాదితార్థములకు సంకీర్తనరూపమును కల్పించినాడు. పురాణకథలలోని స్వారస్యమును విశదీకరించినాడు. దశావతారములను ప్రశంసించినాఁడు. భగవానుని గుణకర్మనామములను విస్తృతముగా వర్ణించినాడు. ఆధ్యాత్మికతత్త్వముల నెల్ల పూసగ్రుచ్చినట్లు వివరించినాడు. జీవునికిని, దేవునకును నాయికానాయకభావమును కల్పించి వారి దివ్యశృంగారలీలలను భవ్యముగా, నవ్యముగా పదములలో పాదిగి పాడి వినిపించినాడు.

అన్నమయ్యకు భాషపైగల అధికారము అసాధారణమైనది. ఆయన లోకానుభవము నిరుపమానము. తెలుగు పలుకుబళ్లు, సామెతలు, లోకోక్తులు మొదలైనవి ఆయనకవితలో సామ్రాజ్యము నెఱపినవి. అందుచే ఇతరకవులకు లేని వైశిష్ట్యము ఆంధ్రవాఙ్మయములో అన్నమయ్యకు సంప్రాప్తమైనది.

ఇటీవల అన్నమయ్యసంకీర్తనలకు అనన్యసామాన్యమైన ప్రచారము కలిగినది. విద్వదగ్రణు లెందరో ఈ సాహిత్యమునకు గల ప్రాశస్త్యమును వివరించుచు గ్రంథములు ప్రకటించినారు. పరిశోధకు లనేకులు బహుముఖ పరిశోధనలను నేటికిని కొనసాగించుచున్నారు. గాయక శిరోమణులు ఈ సంకీర్తనములను విస్తృతముగా గానము చేయుచున్నారు. సినీకళాకారులు కూడ ఈ పాటలలోని అందచందాలను గుర్తించి అనువైన చోట తమ రంగములో వీటి నుపయోగించుకొనుచున్నారు. అందువలన ఆంధ్ర వాఙ్మయమునకు, ఆంధ్రసంస్కృతికి, ఆంధ్రకళారంగమునకు అన్నమయ్య పదకవితలు అపూర్వదీప్తిని ప్రసాదించిన వనుటలో సందేహము లేదు.

అన్నమయ్యవాఙ్మయములో 'అధ్యాత్మసంకీర్తనలు', 'శృంగార సంకీర్తనలు' అని స్థూలముగా రెండువిభాగములు గలవు. ఇవి వివిధసంపుటములుగా తిరుమలతిరుపతిదేవస్థానమువారిచే ప్రచురింప బడినవి.

ప్రస్తుతము అన్నమాచార్యులవారి మూడువందల ఆధ్యాత్మ సంకీర్తనలు సీసపద్యములుగా రూపొంచె 'అన్నమయ్య విన్నపాలు'

అయినవి. వీటి కీరూపమును ప్రసాదించినవారు ప్రముఖవిద్వత్కవులు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారు. 'అమృతసారము', 'బ్రహ్మగాంధర్వము' అని ఇంతకుమునుపే ఆచార్యులవారు ఈ ధోరణిలో రెండుసంపుటములను ప్రకటించియున్నారు. "విన్నపాలు వినవలె వింత వింతలు" అన్న పాటలో అన్నమయ్య భగవంతునిచెంత విన్నవించదగిన వింతవింతల విన్నపాలను తానే ప్రస్తావించియున్నాడు. కాబట్టి అన్నమయ్య పాటలన్నియు ఆయన ఏడుకొండలరాయనివద్ద విన్నవించుకొన్న విన్నపాలే. ఒక్కొక్క సంపుటములో మూడువందలుచొప్పున ఇప్పటికి తొమ్మిదివందల సంకీర్తనలను శ్రీమాన్ ఆచార్యులవారు పద్యీకరించినారు.

ఆధునికాంధ్రకవులలో ఆచార్యులవారు అగ్రశ్రేణికి చెందినమహాకవులనుట జగద్విదితమే. కవిత వీరికి వెన్నతోబెట్టిన విద్య. పద్యగద్యాత్మకములైన వీరికృతులు ఇప్పటికే నలుబదికి పై బడినవి. అందు కొన్ని విశ్వ విద్యాలయములలో ఉన్నతకక్ష్యలకు పాఠ్యగ్రంథములుగా ప్రశస్తిపొందినవి. ధర్మదీక్ష, నారాయణమ్మ, పూర్ణాహుతి, అమరసందేశము మున్నగు వీరిరచనలు విద్వదగ్రణుల ప్రశంసల నందుకొన్నవి. శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయము నుండి వీరిగ్రంథములపై పరిశోధన కొనసాగించి ఇటీవల శ్రీ సి హెచ్. హరిశ్చంద్ర అను పరిశోధకవిద్యార్థి డాక్టరేట్ పట్టముగూడ పుచ్చుకొన్నాడు.

ఆచార్యులవారు బహుకాలము తెలుగుపండితులుగా ఉద్యోగించి పెక్కుమంది శిష్యులను ఆంధ్రవాఙ్మయరసికులనుగా తీర్చిదిద్దినారు. కడచిన ఎనిమిదిసంవత్సరాల నుండి వీరు తిరుమలతిరుపతిదేవస్థానములో ధార్మికగ్రంథప్రచురణవిభాగములో పనిచేయుచున్నారు. ఇంతవరకు శతాధికగ్రంథములను పరిష్కరించి దేవస్థానముద్వారా ప్రచురింపజేసినారు. తీరికవేళలలో శ్రీవేంకటేశ్వరకైంకర్యముగా అన్నమయ్య సంకీర్తనలను పద్యీకరించుట కుపక్రమించి ఇప్పటికి మూడుసంపుటములు వెలయించినారు. త్వరలో పెదతిరుమలయ్యగారి సంకీర్తనలను గూడ పద్యరూపములో ప్రకటించుటకు రంగము సిద్ధముచేసియున్నారు.

అన్నమయ్యపాటలు తగినప్రచారము పొందినవికదా! వీటికి పద్యీకరణ మవసరమా అని కొందరు సంశయింపవచ్చును.

ఒకే ఇతివృత్తమును గ్రహించి పద్యకావ్యములుగా, గద్యరచనలుగా,, నాటకములుగా, గేయకృతులుగా రచించుట మన వాఙ్మయములో క్రొత్త గాదు. పద్యవిద్యకు ఆద్యుడగు వాల్మీకి తొలుత అనుష్టుప్ఛందస్సులో రచించిన రామాయణగాథనే అనేకు లనేకవిధముల నిబంధించి విస్తృత ప్రచారమునకు దెచ్చినారు. అట్లే సంకీర్తనసరణిలో అన్నమాచార్యులు ప్రచారముచేసిన తత్త్వరహస్యములను పద్యపద్ధతిలో మరొక సిద్ధహస్తుడైన కవీశ్వరుడు వినిపించుట సమంజసమే.

మరియు పద్యరచన నన్నయకాలమునుండియు ఆంధ్రులకు చక్కగా పరిచితమైనది. పాటలు పాడలేనివారు పద్యములు చదువుట కద్దు. పద్యపఠనకు పెద్దగా సంగీతపరిజ్ఞాన మవసరము కాదు. పద్యపఠన కలవాటుపడిన పాఠకులు ఆచార్యుల వారిరచన చదివి అన్నమయ్య భావములను సులభముగా గ్రహించగలరు.

అన్నమయ్యకాలములో ఈ కీర్తనలను ఎట్లు పాడుచుండిరో తెలియదు. ఇప్పుడు ఒక్కొక్క పాటను పలువురు పలురీతులలో పలురాగములతో పాడుచున్నారు. కొందరు త్యాగరాజకృతులధోరణిలో పాడగా, మరికొందరు భజనపద్ధతిలో పాడుకొనుచున్నారు. అంతేకాక ఆధునికగాయకులు గాన మొనర్చుట కనువుగావి పద్ధతిలో పెక్కుసంకీర్తన లున్నట్లు సంగీతవిద్వాంసుల అభిప్రాయమైయున్నది. అందువలననే పదునాల్గువేలసంకీర్తనలు లభించినను నేటివరకు వందపాటలను మించి అవి తగినప్రచారము పొందలేదు. పాడినపాటలే మాటిమాటికి గాయకులు పాడుచుండుట వినుచున్నాము. నూతనకీర్తనలను స్వరపరచి పాడు ప్రయత్నము తగినస్థాయిలో జరుగుటయు లేదు. అందుచేత అపూర్వభావవిలసితములైన అన్నమయ్య కీర్తనలను పద్యీకరించి తద్వారా పాఠకులలో అన్నమయ్యపై అభిరుచిని కల్గించుటకు శ్రీ కొండమాచార్యుల వారు గావించినకృషి అభినందనీయమే.

పైగా అన్నమయ్యకీర్తనలు త్యాగయ్యకృతులవలె నాద ప్రధానములు కావు. ఇవి భావప్రధానములు. పద్యరూపమున అన్నమయ్య భావసంపదను పఠితృలోకమున కందజేయుటకై చేసినకృషి ప్రయోజనకారి యనుటకు ఏమాత్రము సంశయము లేదు.

లోకము భిన్నరుచి గలది. కొందరికి పాట లిష్టమైనచో, మరికొందరికి పద్యము లిష్ట మగును. అందరను మెప్పించు ప్రయత్నము కవులకు సహజము. ఇంతవరకు ప్రచారమునకు రాని పాట లెన్నో వీరిరచనలో పద్యరూపము నొందినవి. పద్యపఠనాభిలాషుల కవి ఆమోదము గూర్పక పోవు.

ఆచార్యులవారు పద్యీకరించిన వన్నియు అధ్యాత్మసంకీర్తనలే. నేటికాలమున అధ్యాత్మతత్త్వమును బహుముఖములుగా ప్రచారముచేయ వలసిన బాధ్యత కవులపైనున్నది. విద్యలలో అధ్యాత్మవిద్యయే తన స్వరూపమని భగవానునివచనము (అధ్యాత్మవిద్యా విద్యానాం-గీత). కావున ఆధ్యాత్మికతత్త్వమును పాటలుగానే కాక పద్యములుగాకూడ ప్రచారము చేయుట ఆవశ్యకమై యున్నది. శాశ్వతశాంతి సుఖములు ఆధ్యాత్మజ్ఞానము మీదనే ఆధారపడియున్న వన్న సత్యము మరువరానిది.

మరియు పెక్కుకీర్తనలలోని పదబంధములు పద్యీకరించుట కనువుగా నుండుటయు ఈ ప్రయత్నమునకు ప్రేరక మయినది. కీర్తనలోని భావము చెడకుండ పద్యములోనికి తెచ్చుట కొన్నిచోట్ల కష్టసాధ్యమే అయినను పద్యవిద్యలో పరినిష్ఠితులైన ఆచార్యులవారి కది అసాధ్యము మాత్రము కాలేదు. పద్యశిల్పములో గడిదేరినవారు గనుక వీరు బహు సుందరముగా రచన సాగించిరి.

పద్యములు పఠించియు తాత్పర్యము గ్రహింపజాలని పాఠకులను గూడ దృష్టిలో నిడుకొని పద్యములక్రింద సులభశైలిలో తాత్పర్యములుకూడ సమకూర్చబడినది.

అన్నమయ్యవాఙ్మయముపై ఇది ఒక క్రొత్తప్రయోగము. దీనికి శ్రీ కొండమాచార్యులవారే శ్రీకారము చుట్టినారు. వారికవితావ్యవసాయము భగవత్పరముగా నేటి కిట్లు ఫలించినది. ఈ మార్గమునుబట్టి మరి కొందరు పయనించుట కవకాశము కల్గినది.

అన్నమయ్యశృంగారకీర్తనలరాశి చాల పెద్దది. ఈ రాశిపై దృష్టి కేంద్రీకరించి పనిచేయగలవారికి ఆచార్యులవారు మార్గదర్శకు లయిరి.

పరమపవిత్రమైన ఈ కృతి పరమాత్ముని హృదయమును రంజింపజేయు గాక! లోకమునకు శ్రేయోవిధాయక మగుగాక !

****

డాక్టరు. ఎస్. బి. రఘునాథాచార్య,
యం.ఏ.,పి హెచ్.డి.
విద్యాప్రవీణ, డిప్లొమా ఇన్ జర్మన్
సంస్కృతశాఖాధ్యక్షులు, అకడమిక్‌సెనేట్ సభ్యులు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము,
కో ఆర్డినేటరు, పుస్తకప్రచురణవిభాగము
తిరుమల తిరుపతి దేవస్థానములు.

సత్యమ్
తిరుపతి
9-12-1988

## మోదః ప్రమోద ఆనన్దః

పరమపదనాథుని పదపద్మాలకు తన పదకవితలతో పదే పదే నీరాజనా లందించిన పరమభక్తశిరోమణి శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు. ఎందఱికో అందని పరార్థమనే పదార్థాన్ని ఎన్నో దృక్కోణాలనుంచి పరామర్శించి పదిమందికీ అందుబాటులో ఉండేటట్లు వెలకందని ఎన్నోవేల పదకవితల కెక్కించిన పదకవితాపితామహుడాయన. సంకటహరణుడైన వేంకటరమణునితో సమమైన దైవ మింకొక్కటి లేదని ఆ సంకర్షణుని సంకీర్తనమే సమగ్రజీవనసర్వస్వంగా భావించిన సంకీర్తనాచార్యుడా మహనీయుడు.

లలితలలితస్వరవర్ణపద, నిరతిశయలావణ్యార్థనేపథ్య, రసభావభావనారమణీయ, జగన్నాథమోహినియైన అన్నమాచార్య కవితావాహిని జనజేగీయమానయై జగన్మోహినిగా అలరారుతోంది.

అన్నమాచార్యసంకీర్తనామృతాన్ని తనివితీర తాను ఆస్వాదించి, అందమైన సీసాల కెత్తి అందఱికీ అందించే ప్రయత్నం చేసిన శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారు ధన్యజీవనులు. అప్రతిమ ప్రతిభాపయోనిధులు, ప్రశస్తవ్యుత్పత్తి నిధులు, అసమాభ్యాససంపన్నులైన శ్రీ ఆచార్యులవారికవిత ఆంధ్రావనిని, అర్ధశతాబ్దిపాటు ఆనందడోలికలలో ఊగించినమాట వాస్తవమే కాని స్తవ మెన్నటికీ కాదు.

సంకీర్తనలపై సరసపద్యానుకృతికి శ్రీకారంచుట్టినవారు శ్రీ కొండమాచార్యులవారు. వీరు ఇదివఱకే "అమృతసారం", "బ్రహ్మ గాంధర్వం" అని ఇదే బాణీలో అన్నమాచార్య సంకీర్తనలు ఆధారంగా రెండురచనలను ప్రకటించారు. "అన్నమయ్యవిన్నపాలు" అనే ఈ మూడోరచన అధ్యాత్మసంకీర్తనలకు అనవద్యమైన పద్యానుకృతి. ప్రతిపద్యానికి ముందు చేర్చిన హృద్యమైన అవతరణిక, తరువాత సమకూర్చిన సరసమధురమైన సంగ్రహతాత్పర్యం సునిశితపరిశీలనకు చక్కని చిక్కని నిదర్శనాలు. నూతనప్రక్రియను రూపొందించుకొని వినూత్న కవితామాధురిని అందఱికీ పంచిపెట్టిన శ్రీ ఆచార్యులవారిని మనసారా అభినందిస్తున్నాను.

ఏడుకొండలవానిపై కొండంత భక్తిప్రపత్తులుగల శ్రీ కొండమాచార్యులవారికి అవసరమైన అన్ని అండదండల నిచ్చి బ్రహ్మాండనాయకుడైన శ్రీపద్మావతీజాని తనపై ఇంకా అనేకరచనలను చేయించుకోవాలని నా ఆకాంక్ష. ఈ మహాకవి మహనీయభావనలో "పద్మావతీపరిణయం" ఒక ప్రబంధంగా రూపొందితే అది నిజంగా దివ్యప్రబంధమే అవుతుం దనడం అతిశయోక్తి కాదు. ఆ ప్రబంధ చంద్రోదయానికి ఆంధ్రలోకం ఆనందంగా ఎదురుచూస్తున్న దనడంలో ఆశ్చర్యంలేదు.

****

డా.కె.సర్వోత్తమరావు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
రీడర్ తిరుపతి.
అన్నమాచార్యపీఠం, 10-12-1988
తెలుగు అధ్యయనశాఖ.

# కొండమయ్య కొలువు

శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారు జగమెరిగిన కవిపండితులు. శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారివంటి మహాత్ములప్రశంసలు బాల్యంలోనే అందుకొన్న మనీషి. గతంలో వారిని గురించి నాకు తెలిసింది తక్కువే అయినా నా పర్యవేక్షణలో చి॥సి హెచ్. హరిశ్చంద్ర 'శ్రీముదివర్తి కొండమాచార్యులరచనలు- ఒక పరిశీలన' అనే సిద్ధాంతవ్యాసం వ్రాస్తున్నప్పుడు ఎన్నో విశేషాలు తెలుసుకోగలిగాను.

"తాళ్లపాకసాహిత్యందృష్టిలో పడ్డాక మరేసాహిత్యంవైపు మనను మరలదు" అని గురువర్యులు శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారు పదేపదే చెప్పేమాట అక్షరాలా సత్యం. తాళ్లపాకసాహిత్యం ప్రచురించేవారు కొందరు, పరిష్కరించేవారు కొందరు, తులనాత్మకంగా అధ్యయనంచేసేవారు కొందరు, సాహిత్యవిశేషాలను వివరించేవారు కొందరు. భాషావిశేషాలను తరిచి చూసేవారు కొందరు, పలుకుబళ్ళను ప్రచురించేవారు కొందరు కనిపించడం తాళ్లపాక సాహిత్యప్రభావాన్ని రుజువుచేస్తుంది. అయితే కొండమాచార్యులవారు చేసిన కృషి పైవర్గంలో చేరని పరిశ్రమ. సంకీర్తనలకు పద్యరూప మివ్వడం, అందులోనూ సీసాలలో రూపాంతరం చేయడం ఇంతవరకు ఎవరూ ఆలోచించనిదీ, ఒకవేళ అనుకొన్నా ఆచరణలో పెట్టని కృషి. లోగడ శ్రీ ఆచార్యులవారు అమృతసారం, బ్రహ్మగాంధర్వం అనే రెండు గ్రంథా లందించారు. ప్రస్తుతం 'అన్నమయ్యవిన్నపాలు' అచ్చువేశారు. ఈ పుస్తకంలో 300 విన్నపాలున్నాయి.

విన్నపం పలురకాలు. అధికారికి చేసుకునే విన్నపం. వాత్సల్యంతో సాటివారికి చేసుకొనే విన్నపం. తనకు తానే చేసుకొనేవిన్నపం వగైరాలు.

ఆచార్యులవారు ఎన్నుకొన్న మూడువందలవిన్నపాలను మూడురకాలుగా వర్గీకరించవచ్చు.

మొదటిది శ్రీనివాసునితో తన గోడును గాని అంతర్యాన్నిగాని విడమరచి చెప్పే విన్నపం.

ఉదా॥ "నన్నెంచి చూచిన నానావగుణుఁడను
నిన్నెంచ గుణరత్ననీరనిధివి" -98వ పద్యం.

రెండవది శ్రీనివాసునిదర్శన మవసరమంటూ స్వామిమహిమల్ని, క్షేత్రౌన్నత్యాన్ని, ఉత్సవవిశేషాల్ని సామాన్యప్రజాళికి ఆకర్షణీయంగా వివరించే విన్నపం. అదేరీతిలో ఇతర అర్చామూర్తుల్ని వర్ణించడం.

"విశ్వరూప మ్మిదే విష్ణురూప మ్మిదే
హరిరూపె తిరువేంకటాచలమ్ము" -1వపద్యం.

మూడవది తత్త్వోపదేశంతో మానవులు జాగ్రత్తపడాలని గారాబంగా విన్నవించడం.

"వనితల వలవకు; వైరాగ్యమున నుండు;
గొనకొని తపముఁజేకొనుము; గురుల
యానతి మీఱకు; మన్యధర్మమ్ములఁ
దలఁపకు; పరమశాంతమున మెలఁగు" -195వపద్యం.

అనువాదం కాని, రూపాంతరంగాని కత్తిమీది సాములాంటిది. రేడియోల్లోను, పాటకచ్చేరీల్లోను, కేసట్లలోను బాగా వ్యాప్తిఅయిన పాటల్ని పద్యాలలో అదే వేగంతోనే వ్రాయడం చాలకష్టం. ఆచార్యులవారు ఈ పరీక్షలో విజయం సాధించారనే నా పరిపూర్ణమైన నమ్మకం.

మచ్చుకు:

"ముద్దుగాఱు యశోద ముంగిటిముత్యమ్ము
వాసుదేవుఁడు దేవకీసుతుండు" - 16వ పద్యం.

"నడిఁబెట్టెఁ గటకటా! సంసార మియ్యది

జదధిలోపలియాత సాటిఁజెప్ప"                -38వ పద్యం.

"వనధి బంధించి దాఁటెను రాఘవుం డాలఁ,

దలరి యూరకదాఁటె హనుమ యాతఁ,

డలుకతో రావణు నద టణంచె నతండు

మైరావణుని పిల్కుమార్చె నితఁడు"    -278వ పద్యం.

ఇంక పద్యాలకు సరళగద్యంలో తాత్పర్యం సంధించడం. త్యాగయ్య కృతులకు శ్రీ కల్లూరి వీరభద్రశాస్త్రిగారు విశేషవివరణలు వ్రాశారు. శ్రీమాన్ రాళ్ళపల్లివారు, శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారు, శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి గారు, శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారు అన్నమయ్య సంకీర్తనలలో కొన్నింటికి సందర్భానుసారంగా అర్థవివరణచేసిన మాట వాస్తవమే. అయితే 900 పద్యాల కనంది లేదా పాటలకు అర్థవివరణలు సమకూర్చియిచ్చిన కవిపండితులు శ్రీమాన్ ఆచార్యులవారొక్కరే. కొన్నిచోట్ల మూలానికి వివరణప్రాయంగా తాత్పర్యము సాగింది.

మచ్చుకు:

"గడనకొఱకుఁజిక్కి కాముకవిద్యలఁ

జొక్కి దేనినిఁగన్న నిక్కి నిక్కి"              -141వ పద్యం.

"ఎల్లవారలచూడ్కు లేకమంటకు గుఱి

కొండ కొండయెగాక గుడిసె యగునె?"   -165వ పద్యం.

బాగా ప్రసిద్ధిపొందిన సాహిత్యాన్ని, పాడడానికి వీలున్న సంకీర్తనల్ని పద్యాలుగా వ్రాయడ మెందుకు అనేప్రశ్న కొందరిలో లేకపోలేదు. దీనికి తగిన జవాబు ఆచార్యులవారికి తాళ్లపాక సాహిత్యంపై వున్న అనురక్తి. ప్రబంధాలు వ్రాయకుండ పాట లెందుకని అన్నమయ్యకాలంలోకూడ ఈలాగే అపహసించేవారుండవచ్చు. వారందరికీ సమాధానంగా అన్నమయ్య చెప్పిన కీర్తనలే ఆచార్యులవారి కృషిని విమర్శించే వారికి సరిపోతాయి.

"కొందఱు ననుఁజూచి కోపగించినమేలు
నను(జెంది సంతసించినను మేలు
నిందించి కొందఱు నేఁడె రోసినమేలు
మనసార ననుఁ బొగడినను మేలు" -232వ పద్యం.

"వెఱ్ఱులారా ! మీకు వేఁడుక గలిగిన
నఱ్ఱువంచి తడక నల్ల రాదొ" -270వ పద్యం.

కాలగర్భంలో కలసిపోయిన సాహిత్యం పునరుజ్జీవనం పొందాలంటే అన్నిరకాలవారిని ఆకట్టుకోవాలంటే ఈలాంటి మహాకవుల ప్రయత్నా లవసరమని నా అభిప్రాయం. ఆచార్యులవారి సారస్వతకృషి అవిరామంగా సాగాలని అభిలషిస్తున్నాను.

****

బహుభాషావిద్వాంసులు, మహారచయితలు
**డా. ముట్నూరి సంగమేశం,**
ఎం.ఏ., పి.హెచ్.డి.,డి. లిట్,
అన్నమాచార్యవాఙ్మయపరిశోధకులు.

18-3-56 శాంతినగర్,
కపిలతీర్థంరోడ్,
తిరుపతి,
14-12-88.

శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారి అధునాతనకృతి యీ 'అన్నమయ్యవిన్నపాలు'. అన్నమాచార్యసంకీర్తనలకు పద్యరూప మిస్తూ వారిదివరకే రెండుసంపుటాలు వెలువరించారు. ఆ కోవలో ఇది మూడవది. మొదట అన్నమాచార్యునిసంకీర్తనల్లో 300 గ్రహించి ఆ భక్తి రసామృతాన్ని 'అమృతసార' మనే పేర 'సీసా' లలో నింపి అందించారు. ఆ తర్వాత శ్రీ వేంకటేశ్వరపరబ్రహ్మతత్త్వాన్ని వివరించే అన్నమాచార్యగాంధర్వవేదాన్ని, దాని 300 సీసపద్యాలలో 'బ్రహ్మగాంధర్వ' మనే పేర అనువదించారు. ఇప్పుడీ 'అన్నమయ్యవిన్నపాల'లో మరో 300 కీర్తనలను సీసపద్యాలుగా వ్రాసి, ఆ మహాకవి పేరుమీదనే శ్రీ వేంకటేశ్వరునికి విన్నవించారు. ఏసితో-

"నీకృపనేర్చిన నుడుగుల
నీకథలన్ నుడువఁబోక నియమస్థుఁడనై
కాకమ్మకతలు సెప్పితి"

నని వారు పొందిన పరితాపం పటాపంచ లయింది. దీనితో ఇప్పటికి 900 సీసపద్యాలలో వెలసిన ఈ తొమ్మిదిశతకాలు ఆంధ్రశతకవాఙ్మయ సరస్వతికి సరిక్రొత్తగా తొడిగిన నవరత్నాభరణాలుగా శోభిస్తున్నాయి.

శ్రీమాన్ కొండమాచార్యులవారు కవిగా ఇతఃపూర్వమే ప్రసిద్ధులు. 30-40 గ్రంథాలు వ్రాసి ఆంధ్రసరస్వతికి అందాలుదిద్దిన ఈ మహాకవి సాహిత్యం నేడు పి హెచ్.డి. పరిశోధకవ్యాసరచనలకు వస్తువు నందిస్తూందంటే వారిసాహితీ ప్రతిభనుగూర్చి వేరే చెప్పనక్కరలేదు.

అన్నమాచార్యసంకీర్తనసాహిత్యానికి సీసపద్యానుసరణమే ఇంత వరకు వీరు వెలయించిన మూడుసంపుటాలలోను నిండింది. అయితే, ఈ సంపుటాలు ఇంతటితో నిల్చిపోతాయని అనుకోను. ఇంకా ఎన్నో సంపుటాలు వారిచేతిమీద రాగలవనే ఆశిస్తున్నాను. వా రొకసారి నాతో ముచ్చటిస్తూ

"అన్నమాచార్యులవారి సంకీర్తనలు, అతనిపదాలు, పదబంధాలు వాడుతూనే సీసపద్యాలుగా వ్రాయాలని తలపెట్టాను" అన్నారు. ఆ మాటలు క్రియారూపంలో చూపించారు, సిద్ధసంకల్పులు.

అన్నమాచార్యునిపాటలలోగల పదబంధాలు, జాతీయాలు, నుడికారాలు వగైరా లిప్పటి కెందరో అనుకరించారు. అన్నమాచార్యుని తనయుడా? కాదా? అని పండితులు సందేహించి తర్కించుకొంటూన్న కవికర్ణరసాయనకర్త నరసింహకవి అన్నమాచార్యుని సంకీర్తనచరణాలనే కొన్నిటిని తన కావ్యంలో సీసపద్యచరణాలుగా మలచుకొన్నాడు. ఉదాహరణకు, 'అన్నమాచార్యసంకీర్తనలు-గాయక ప్రతి'లోని నెం 111రు పదం, ఈ క్రింద చూడవచ్చు.

సుదతికి మీ రిందఱుచుట్టలుగలఫలము
మదనుని వేడుకోరే మంచిదౌ గాని ॥పల్లవి॥

పొదలపై సంపంగిపువ్వులు వెదచల్లరే
ఉదుట తుమ్మెదగుంపు లుడుగుఁగాని,
పదిదిక్కులను రఘుపతిపేరు నుడువరే
గుదిగొన్న కోవిలలు కుయ్యకుండుఁగాని ॥సుదతి॥

పాటలలో శంకరాభరణ మాలపింపరే
నీటుచల్ల (సొంపు) గాలి నిలుచుఁగాని
నీటున శ్రీవేంకటేశుఁ డింతలోనే చెలిఁగూడెఁ
జాటించరే యివి గొన్ని జాడనుండుఁగాని ॥సుదతి॥

కవికర్ణరసాయనం; ఆశ్వా3పద్యం 109చూస్తే పై సంకీర్తనభావాన్ని అలాగే చాటించడానికా అన్నట్లు రూపిస్తుంది. రెండోచరణం మినహాగా మిగతచరణాలన్నీ పైపదానివే.

సీ. అహికులాధిపు వ్రాసి యంత్రించి దక్షిణ
గంధవహునిరాకఁగట్టువఱతు
రాహుపూజాభిచారవిధాన మొనరించి
శశిబిట్టిబియగుడు చంపివైతు
నలువైన శ్రీరామనామమంత్రంబుచేఁ
గలకంఠతతుల వాకట్టి విడుతు
సంపంగి నౌషధసంప్రయోగము సూపి
మొకరితుమ్మెదపిండు మూర్ఛపుత్తు"

ఇలా ఎప్పుడో అంతంతగా ఆరంభించిన యీ సీసపద్యానుసరణం నేటికి శ్రీకొండమాచార్యులవారిచేతిలో పరిపక్వదశకు వచ్చి పరిమళించిందంటే అది సహృదయు లందరికీ పరమామోదకరమైన విషయం. "పాడుకొనేవారికి పాటలు, చదువుకొనే వారికి పద్యాలు ఉపకరిస్తాయని భావించాను. ....సంకీర్తనలల్లో ఆమహాకవి పొదిగినపదాలు, పదబంధాలు యథాతథంగా పద్యాలలో పొందుపఱచడానికి ప్రయత్నించాను" అని వ్రాసినకవిగారిమాటలు అక్షరసత్యాలు. ఎన్నోచోట్ల వీరిపద్యాలు చదువుతూంటే మూలసంకీర్తనలు స్ఫురించడమే కాదు, మూలమేచదువుతున్నామేమో అని అనిపిస్తుంది. ఇది వీరికవితాపారీణతకు తార్కాణ. ఉదాహరణకు ఈ సంపుటంలోని 184, 185, 189 వగైరా సంఖ్యగల పద్యాలు ఆయామూల సంకీర్తనలతో సంవదించి చదివి చూడవచ్చు. అంతేకాదు, మూలంలో కొంత క్లిష్టమనిపించే పదా లెన్నో యీ పద్యాలలో సుస్పష్టంగా అదేవరుసలో వ్రాసినా సరళసుబోధకాలుగా వెలశాయి. మచ్చుకు, ఈ సంపుటంలోని 124,125, 152 వగైరా సంఖ్యలుగల పద్యాలను మూలంతో సరిచూచి చవి చూడవచ్చు.

సంగీతప్రియులకు కూడా ఈ రచన సంతృప్తి నిస్తుందనే నా నమ్మకం. సీసపద్యం తాళలయలకు లొంగుతుంది. పాటలలోచరణాలవలెనే దీనిలో చరణాలుస్వతఃసంపూర్ణంగా వెలసే అవకాశం ఉంది. ప్రాసానుప్రాస ప్రాసయతులు సంకీర్తనలలో ఉన్నట్లే ఉండవచ్చు. పల్లవిలోవలె గీతంలో

మూలభావం చరణాలతో ముడిపడగలదు. ఈ రహస్యాలన్నీ ఎరిగిన మహాకవి కొండమాచార్యులవారు ఈ పద్యాలను సంకీర్తనసమతుల్యంగానే నడిపించారు. ఇది ఎంతైనా ప్రశంసార్హం.

అన్నమాచార్యులవారి సంకీర్తనలలో శ్రీ వేంకటేశ్వరముద్ర సాధారణంగా కనిపిస్తుంది. కాని అది అక్కడక్కడ ఆ స్వామిని స్ఫురింపజేసే 'కోనేటిరాయ' వంటి ఇతరపదాలలో కూడ కనిపిస్తుంది. ఒకటి రెండు చోట్ల 'తిరుమలగిరి' కూడ ముద్రగా వాడబడింది. శ్రీమాన్ కొండమాచార్యులవారు తమ యీ సీసశతకాలకు మకుటం వేరే ఉంచి వ్రాయకపోయినా, ప్రతిపద్యంలోనూ ఆ 'శ్రీపతి' పేరును, ఏదో రూపంలో, ముద్రగా వాడుకొన్నారు. అదే యీ సీసశతకాలకు మకుట మనుకోవచ్చు.

పద్యాలకు, ఆరంభంలో పద్యమూలభావాన్ని తెలియజేస్తూ అవతారికలు, చివర పద్యభావాన్ని సరళంగా వివరించే తాత్పర్యార్థాలు సమకూర్చి కవిగారు అన్నమాచార్యసాహిత్యంలోని లోతు లెరుగదలచిన పాఠకులకెంతగానోతోడ్పడ్డారు. ప్రతిపద్యానికి మూలం, ఏ రేకులో, ఏ సంపుటంలో, ఎన్నో సంఖ్యగలదిగా ఉన్నదో చూపి పరిశోధకులకు చక్కని చేయూత నిచ్చారు.

భక్తి ప్రపత్తులతో, భక్తజనానుసరణ మొనర్చుచూవ్రాసిన యీ రచనలు అన్నమాచార్యసాహిత్యానికి వెలలేని వ్యాఖ్యలు. ఆ సాహిత్య ప్రచారానికి ఇతోధిక సహాయకాలు.

ఆంధ్రలోకం వీరికృషిని అన్నివిధాలా ఆదరించగలదని ఆశిస్తాను.

****

'అన్నమయ్య వాఙ్మయ ప్రచారకులు'
**శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు శెట్టి**
ఎం.ఏ.,

"ద్వారకామాయి"
19-12-119, బైరాగిపట్టెడ,
తి.తి.దేవస్థానం కాలనీ,
తిరుపతి.

19-12-1988

అన్నమయ్యసారస్వతక్షీరసాగరంలో మునకలు వేస్తూ 'అమృతసారాన్ని' 'బ్రహ్మాగాంధర్వాన్ని' కల్పించి 'అన్నమయ్య విన్నపాలను' కూడ ఆవిష్కరించ సంకల్పించారు మీరు.

అన్నమయ్య 'పదప్రాసాదం' లో ప్రవేశించిన మీతో 'పద్యప్రసాదం' వినియోగింప చేస్తున్న కొండలయ్యలీలలు ఊహాతీతాలు. ఇప్పటికి 900 పాటలను పద్యీకరించి మీరు దాహం తీర్చుకొన్నా అందలిరసానికి పరవశించి 'దాసోఽహ' మనే కళారసికులు తప్పనిసరి. అన్నమయ్యతోపాటు పెదతిరుమలయ్యకు కూడ పద్యకుసుమాలను సమర్పించుకో దలచిన మీచిత్తశుద్ధి, సంస్కారం గొప్పది. చినతిరుమలయ్యను కూడ మీపద్య సుమార్చనలో చేర్చగలరని నామనవి. 'భగవన్నుతిపరమైన ఒక్క చిరుకబ్బమేని చెప్పకపోతినే' యన్న మీవ్యథను తిరుపతి దేవుడు తీర్చినట్లే. సంకీర్తనాచార్యులపై మీకుగల అచంచల భక్తి విశ్వాసములు మీ పద్య ముక్తకాలలో ప్రతిఫలిస్తున్నవి.

రసానుభవమునకు అలవాటుపడిన మనసు ఎందుకో అభిప్రాయ నివేదనల కున్ముఖము కాకున్నది. ప్రాయశః అట్టి యోగ్యతాధికారములు నాకు చాలవేమో! అన్నమయ్యపాటతో గొంతు కలపడమే నేను చేయ గలిగింది.

"విన్నపము వినవయ్య తిరుపతివేంకటాచలనాయకా !"

****

'అవధానిచక్రవర్తి'
**డా. మేడసాని మోహన్,**
డైరెక్టరు, అన్నమాచార్యప్రాజెక్టు.

తి.తి.దేవస్థానములు,
తిరుపతి,
9-1-1989.

బ్రహ్మాగాంధర్వకవితావించికాస్వ
రప్రపంచవిహారనిర్మగ్నబుద్ధి
నగుట పూర్వపుణ్యఫలం బటంచు నెంతు
రసనిధానానుభవవిభూతి సమకొంట.

అన్నమాచార్య సంకీర్తనాబ్జనేత్ర
సరసయౌవనప్రాగల్భ్యసరణి నొందె
సత్కవనశిల్పి కొండమాచార్యుఁ డెలమి
నలవరించిన పద్యచీనాంబరముల.

శ్రీముదివర్తి మహాకవి
ప్రామాణ్యము మాదృశులకు; పటుతరపద్య
శ్రీమాద్యత్ గద్యావి
ద్యామంజులభావలోకమం దిడుకతనన్.

****

**డా. జి. చలపతిగారు**
శాసనశాస్త్రోపన్యాసకుడు
శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయం

తిరుపతి.
4-1-1989

# కైమోడ్పు

ఆంధ్రదేశంలో సుస్థిరమైన ఖ్యాతిగడించుకొన్న మహాకవి శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు. వీరితో నాపరిచయం దశవర్షాలు దాటకున్నా ఎన్నో సంవత్సరాల అనుబంధమున్న అనుభూతికలుగుతూ ఉంటుంది. ఆచార్యులవారంటే నాకెంతో అభిమానం. ప్రేమ. భక్తి. ఆస్తిక్యబుద్ధి, ఋజువర్తనం, పరోపకారపారీణత వీరివ్యక్తిత్వానికి అద్దంపట్టే లక్షణాలు.

ఆచార్యులవారు చేయితిరిగిన పద్యశిల్పి. అచ్చమైన కవి. ముప్పైఅయిదు కావ్యాలకు కర్త. వస్తువైవిధ్యం, రచనాసౌందర్యం, భావమాధుర్యం వీరికావ్యలక్షణాలు. వీరిరచనలలోని మృదుమధుర భావాల పోహళింపు సమ్మోహనంగా ఉంటుంది. సరసకవితాస్వాదనప్రియులే గాక సంప్రదాయాభిమానులుగూడా, వీరికావ్యాలను మెచ్చడం వీరికవిత్వ మహత్వానికి గుర్తు.

అన్నమయ్యసాహిత్యంపై ఆచార్యులవారికి ఇంపు పుట్టిన తర్వాత వెలువరించిన మొదటిగ్రంథం అమృతసారం. రెండవది బ్రహ్మాగాంధర్వం. మూడవది ప్రస్తుతరచన 'అన్నమయ్య విన్నపాలు'. ఈ మూడుగ్రంథాలలో తొమ్మిదివందల అధ్యాత్మసంకీర్తనలకు ఆచార్యులవారు నిర్మించిన తొమ్మిదివందల సీసాలు శ్రీవారి ఆలయప్రాంగణంలో నిత్యనూతనంగా వెలిగే రత్నదీపాలు. ఆచార్యులవారిని స్వామికి సన్నిహితంచేసే వాగ్రూపాలు. జీవుని ఆర్తిని ఈశ్వరునికి నివేదించేవి అన్నమయ్యపాటలు. ఈపాటలతావి అబ్బడం జన్మాంతరసంస్కారవిశేషం. 'జ్ఞానకర్మభక్తిప్రపత్తులఁ గటిక పేదనమ్మ' అని ఆచార్యులవారు అమ్మకు విన్నవించుకోవడంలో నిజమైన శీలసంపద, ముముక్షుత్వం కనిపిస్తున్నాయి.

అన్నమయ్యకు కొండమయ్యకు ఆరాధ్యుడు శ్రీవేంకటేశ్వరుడు. అన్నమయ్య స్వామిసన్నిధిలో వుంటూ సంకీర్తనలనుగానంచేశాడు. కొండమయ్యగూడ గూడూరు నుండి తిరుపతికి వచ్చిన తరువాత స్వామిని

పద్యసుమాలతో ఆరాధిస్తున్నాడు. ఇరువురికీ ప్రేరణ శ్రీనివాసుడే. ఇలా ఈభక్తకవులిద్దరిమధ్యా అభేదం. శ్రియఃపతికరుణావృష్టిలో పులకించిపోతున్న కొండమయ్య జీవితం ధన్యమవుతూవుంది. అందుకే ఆభక్తకవిశిఖామణికి, నా కైమోడ్పు.

****

# అంకితము

మ. జయ గోవింద ముకుంద కేశవ హరే శౌరే మురారే రమా
ప్రియ నారాయణ శంఖచక్రధర గోపీనాథ సద్భక్తసం
చయసంరక్ష విపక్షశిక్ష సరసీజాతాక్ష స్వామిన్ భవ
జ్జయమే నా జయమంచు నెంచెదనయా! సప్తాచలాధీశ్వరా ! 1

ఉ. తూరుపుఁగొండపై నినుఁడు తోఁపకమున్న పురందరాది బృం
దారకబృంద పూజలు సదా గొను ని న్నరవిందలోచనున్
బారెఁడుప్రొద్దుచన్న శయనమ్ము త్యజించి భజింపఁ డీ దురా
చారుఁడు వీని కేమి మది సల్పఁగ నెంచితో వేంకటేశ్వరా! 2

మ. ఫలమో పత్రమొ పుష్పమో జలమొ సద్భక్తిన్ సమర్పింప ని
ర్మలకారుణ్యమనస్కతం గొనెదు; మత్ప్రారబ్ధ మేమందు ? ని
చ్చలు నీ పూజ లొనర్ప; త్వచ్చరణకంజధ్యానముం జల్ప; నీ
యలఘుస్తోత్రము లాలకింప నెటు లప్పా! నన్ను మన్నించెదో! 3

ఉ. కూటికి గుడ్డకున్ కొదవ గూరెను పుట్టిననాటఁగోలె ఈ
పాటున కర్థమేమొ తలపండినప్రాయమునందుఁ గూడ ఏ
పూఁటఁ దలంప; మత్కలుషపుంజము గీటడగించి కావఁగా
నోటికి నామమున్నదని నూల్కొననైతిఁ గదయ్య! మాధవా! 4

ఉ. చావగనున్నవానికిని చావదు పాడుధనాశ; బూదియున్
కావులు దాల్చువానికిని కావర మెత్తగఁ జేయు; దయ్యమై
రేవగ లేడిపించు; మఱి లేవడి మేలనిపించె; శాంతితో
జీవితమెల్లఁ బుచ్చితిని చీకులు చింతలు లేక శ్రీహరీ! 5

మ. పరమైకాంతికభక్తకోటికథ లే భంగిం బ్రవర్తిల్లెనో
మఱి మన్మానసవృత్తి, నీయెడల నస్మత్సేవ యేపాటిదో
యెఱుఁగంజాలనె? యెగ్గుసిగ్గువిడి నాయిష్టమ్ము లీడేర్పఁగాఁ
బరిపీడించెద నిన్ను; పైఁపఁగదవే పద్మావతీవల్లభా ! 6

ఉ. తోఁటలు దొడ్డు లిమ్మనుచుఁ దొందఱపెట్టితి; గొడ్లు బిడ్డలున్
పేటలు కోట లిమ్మనుచు వేఁడితి; నీ చరణాంబుజద్వయిన్
గాటపుబత్తి నిమ్మనుచు గట్టిగ వేఁడితినా మహాప్రభూ !
మాటలు వేయునేల కొఱమాలినకోర్కుల నేమి చేకుఱెన్.? 7

మ. ఒకఁడేదో యపకారముం జలుపఁగా నుంకించినాఁ డంచు, వే
ఱొకఁ డేమేమియొ తూలనాడెనను చిట్లుల్లంబులో వ్రగ్గెదన్;
సకలంబున్ భవదాజ్ఞచే నడచు నన్ సత్యంబు గుర్తింప; బో
ధకళన్ మాపవె కైటభాంతక! మదంతశ్శత్రుతామిస్రమున్. 8

మ. అతఁడాచారవిహీనుఁ డీతఁడు కఠోరాత్ముండు; లుబ్ధుం డతం
డతఁ డజ్ఞాని; యహంయు వీతఁడని నిత్యం బన్యదోషంబులన్
ధృతిమై చాటెద; నాదుదుర్గుణము లీరీతిం జెలంగన్ గృపా
మతి నే రీతిని బ్రోతువో యెఱుఁగ శ్రీమద్వేంకటాద్రీశ్వరా ! 9

చ. ఒకటియొ రెండొ పద్దియము లుప్పన చప్పనగా రచించి గొం
తుక పగులంగ వాగి తన తోయమువారల తోడుపాటుతో
ప్రకటధనావళుల్ గొనెడివారల నవ్వెద; విద్యలందు
వాణికి మగలై యకించనత నిట్రులునసల్పెడివారి కేడ్చెదన్. 10

ఉ. ఈ కాలం బెపు డిట్టులుండునె? జగం బీ కైవడిన్ సాగునే?
నాకీవ్యర్థవిచార మేల? సకలాంతర్వర్తి వీ వౌటచే
లోకంబెల్ల భవత్స్వరూపముగ నాలోకించు సద్బుద్ధినే
శ్రీకాంతాకుచకుంకుమాంకితవపుఃశ్రీకా! ప్రసాదింపవే! 11

ఉ. పుట్టితిఁ; బెండ్లియాడితిని. బొజ్జలఁ గాంచితి; పొట్టకోసమై
వెట్టి యొనర్చుచుంటి; నిఁకవీసము సౌఖ్యము శాంతి గంటినే
కట్టెఁడి కాఁపురమ్మున? నఖండవభవప్రదభక్తిలేనివాఁ
డెట్టి విపశ్చితుం డయిన నేమిఫలంబు? వృషాద్రినాయకా ! 12

శా. గీతాశాస్త్రము వల్లెవేసినను భక్తి జ్ఞాన వైరాగ్యముల్
చేతుల్ ద్రిప్పుచు బోధచేసినను సుశ్రేయంబు సిద్ధించునే?
గోతుల్ ద్రవ్వెడు క్రూరకర్మునకు? నీకుం గిన్కపుట్టింపునో
యేతప్పుల్ మఱి వానిఁ జేయనటు తంబ్రీ ! నన్ను శిక్షింపవే? 13

మ. ద్వయ మష్టాక్షరి పైతృకంబయిన విత్తం; బన్యధర్మాల యా
శ్రయమేలా? దురితౌఘముం దొలఁచి సంరక్షింప దివ్య ప్రప
త్తి యెనంగన్ భయమేల ? నీ వొకఁడవే దిక్కంచు నీ భక్తినా
వయె తీరంబును జేర్చునంచు మది సంభావించి సేవించెదన్. 14

మ. కలికాలం బిది; శాంతిసౌఖ్యములకున్ కాలంబుగా దిద్ది; బాం
కులు అంకుల్ గృహదాహముల్ గలబలున్ కొట్లాటలున్ దోఁపిడుల్
తెలుపన్ శక్యమె? దీనమానవులకున్ దిక్కెవ్వరయ్యా ! వృషా
చలవాసా! అభయప్రదుండవని విశ్వాసమ్ముతోఁ గొల్చెదన్. 15

మ. ప్రతిమన్ గొల్చుట వట్టిదండుగ; ‘అహం బ్రహ్మాఽస్మి’ ముఖ్యోక్తులన్
మతిఁ జర్చింపుఁడు; మాయ వీడుఁ డనుచున్ మాయావులౌ జోగు లీ
క్షితిలో నూరి కొకండుగా వెలసి యాస్తిక్యమ్ము కూలార్పఁగా
జతనంబుం బొనరింత్రు; వారి నెపుడున్ శాసింపవే యచ్యుతా ! 16

ఉ. దైవతవిగ్రహావళుల దారుశిలాదికబుద్ధులైన యీ
జీవులు సంప్రదాయమును చిన్న మెఱుంగ కవైదికంబులౌ
భావము లేవొ త్రొక్కి పదిపాపులు చేతుల వేసికొంద్రుగా
కేవగ ముక్తి గాంతురు మఱెన్నిభవమ్ములకేని కేశవా ! 17

చ. కులమతజాతివర్గములకున్ బలిగాక మెలంగు పుణ్యచి
త్తులు హరిదాసులౌ బుధులతో సహవాసము; వారి ధర్మబో
ధలు విను భాగ్య మీఁగదవె! దంభము దర్పము క్రోధముఖ్యదు
ర్విలసన మెల్ల మాపఁగదవే! భువనైకగతీ ! రమాపతీ ! 18

చ. కలియుగదైవతం బనుచు కామితదాయకుఁ డంచు సత్కృపా
జలనిధి వంచు నీ సుగుణజాలము మెచ్చుచు నీమనోజ్ఞమం
గళమహనీయవిగ్రహము కన్నులఁ గాంచుచు నీ మహత్త్వముం
దలఁచుచు నీదుభక్తులు ముదంబును జెందెదరో జనార్దనా! 19

చ. అలజడు లట్టె తమ్ములమినప్పుడు "త్వాం శరణం ప్రజామి మా
మలఘుదయావలోకనతయా పరిపాహి హరే" యటంచు ని
శ్చల మగుభక్తి వేఁడఁగనె చయ్యన ఓయను చేగుదెంచి భ
క్తుల కడగండ్లు మాన్పు నిను కోరిభజించెద భూమనోహరా! 20

మ. గుడిలో నీ సముఖమ్మునన్ నిలిచి దృక్కుల్ రెండు సొంపారు నీ
యడుగుందామరలందుఁ జేరుచుటయే యాలస్య; మీ చిత్త మె
క్కడకున్ బిచ్చము నెత్తఁ బోవునొ యెఱుంగన్ రాదు; డాకాలితో
పడఁదన్నంగదవయ్య ! సిగ్గు జనియింపన్ దారికిన్ వచ్చునో? 21

చ. కట్టెలఁబెట్టి కాల్చినను కామము బూడిద బుగ్గిగాక యే
పట్టుననేని వీడ కిటు బాధలు పెట్టఁగ దీనిధాకకున్
తట్టుకొనంగలేక సురతాపసవందిత ! నీ పదాబ్జముల్
గట్టిగ పట్టుకొంటి ననుఁ గ్రన్నన మన్ననసేసి కావవే ! 22

ఉ. కరముల శంఖచక్రములు కంఠమునందు సువర్ణహారముల్
శిరమున రత్నశోభితకిరీటము మోమున పుండ్రకమ్ము భా
స్కరశతకోటితేజమునఁ గ్రాలుచు మన్మథమన్మథుండవై
వఱలెదు శ్రీనివాస! నిను వారము వారము చూడఁగోరెదన్. 23

ఉ. రూఢిగ నీ వత్యద్భుతమృతరూపుఁడవే; సముఖంబుఁ జేరఁగా
గాఢసమాధి గల్గు; నినుఁ గన్నులఁ జూచియుఁ జూడ నట్టులే
బాధముదంబుతోడ గుడివాకిలి వీడిన యంతలోన ని
ర్వ్యాధ మమత్వ ముప్పతిలి ఉయ్యెలయై మన మూఁగులాడెడిన్. 24

చ. పదములు కొండక్రిందికిని భావము మీఁదికి లాగుచుండఁగా
వదలఁగలేక నిన్ వదలి వచ్చినత్రోవల నేగు భక్తులన్
సదమలచిత్తులం గనుట చక్కఁగ ని న్గనుగొంటయే సుమా!
తదుదితవాక్కులన్ వినుట తావకవాక్కులు వింటయే యగున్. 25

మ. అలమేల్మంగనుఁ బెండ్లియాడితివి; నెయ్యమ్మార మమ్మెల్ల బి
డ్డలుగాఁ గంటివి; భుక్తిముక్తు లొసఁగన్ డంబైన శ్రీ వేంకటా
చలవాసంబును స్వీకరించితివి; విశ్వంబందు నీసాటి వే
ల్పులు లేరంచు పురాణముల్ దెలుప కేల్మోడించి కీర్తించితిన్. 26


మ. నిను నే నమ్మినయట్లు నాసతినిగానీ కూఁతులంగాని నా
తనయుంగాని యొకింత నమ్మను; భుజాదండంబు సారించి యొ
డ్డునకుం జేర్చిరె యేటమున్గిన తఱిన్; డోలోత్సవశ్రీలలో
ననుఁ దేలించితి; నీదునామమహిమన్ వర్ణింపఁగా శక్యమే? 27


మ. నలువన్ గాంచినవాఁడు భూభువనజన్మ స్థేమభంగాది లీ
లలు గావించెడువాఁడు భక్తజనులన్ లాలించి పాలించువాఁ
డల వేదాంతములందు వర్ణితుఁడు బ్రహ్మం బెవ్వఁడా శ్రీనివా
సులు కారుణ్యకటాక్షదృక్కుల మమున్ వొక్కంబుగాఁ జూచుతన్. 28

ముక్తిం గోరను నాకు జేయుమనుటల్, నీ భృత్యభృత్యుండనై
నీకొంపే దలంచుచుంటిను నటుల్, నీనామసంకీర్తనల్
నాకుం జాలనియట్లు గాదె పరమానందంబుతో సల్పున
ట్లాకాంక్షించెద. భక్తవర ఉ! మదీయాభీష్ట మీడేర్పవే! 29

ఉ. "భక్తవశంవదుండు" దయాంబునిధానము ముక్తిదాత యౌ
వినేశ్వరుండు ప్రాజ్ఞులుపొగడ్డ కలండుహేయమంను మెం
కన్నకు నీకు భక్తి మెయి నంకిత మిచ్చితి నీకొసంగదే
మన్నన నో ఫణీంద్రగిరిమందిర! యో జగదేకసుందరా! 30

****





# అన్నమయ్య విన్నపాలు

అవ: శ్రీ వేంకటాచలమును, అచటి చరాచరములమహత్తును వర్ణించు చున్నాడు.

సీ. విశ్వరూప మ్మిదే విష్ణురూప మ్మిదే
హరిరూపె తిరువేంకటాచలమ్ము;
నిండిన మృగములే నిత్యముక్తజనమ్ము
పండిన తరులె కల్పద్రుమాలు;
భావింప హరిరూపు బంగారుగోపుర
మ్మచట వ్రాలిన పక్షు లమరవరులు;
కోనేటిచుట్టు వైకుంఠపత్తనమెపో
యిట మాకు పొడసూపు నిహమె పరము;

గీ. కోటిమదనులచెలువుతో గుడిని వెలుఁగు
వేంకటేశ్వరుఁ డీతఁడే పొంక మైన
సొమ్ము లెదపైని మంగమ్మ సొంపుగులుక
నిలిచియున్నాఁడు శ్రితుల ధన్యుల నొనర్ప. 1

ప్రపంచస్వరూపము, సర్వవ్యాపకము అయిన శ్రీహరిరూపమే పాపములు దహించు ఈ వేంకటాచలం. ఈ కొండలో నిండియున్న జంతువులే నిత్యులు, ముక్తులైన జనులు. పక్వఫలములైన వృక్షములే కల్పవృక్షాలు. ఆలోచింపగా ఆ కనుపించే బంగారుగోపురం హరిరూపమే. ఆ గోపురంమీద వాలిన పక్షులే దేవతా శ్రేష్ఠులు. స్వామిపుష్కరిణి నలువైపులు వైకుంఠమేసుమా! ఇచ్చట మాకు అగుపించే ఇహలోకమే పరలోకము. కోటిమన్మథుల అందంవంటి అందం గలిగి వెలిగెడు ఈతడే శ్రీవేంకటేశ్వర స్వామి. అర్హములైన కవచకుండలాదులు, వక్షం పైన అలమేలుమంగమ్మ అందాలు చిందుతుండగా ఆశ్రయించేవారి నాదుకొని కృతార్థులను చేయుటకే ఇక్కడ అదేపనిగా స్వామి నిలబడి యున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| విశ్వరూప మిదివో | 271 | 409 | 3 | 275 |

అవ: వేంకటాచలపతి సర్వకారణభూతుడని సోదాహరణంగా నిరూపించు చున్నారు.

సీ. ఇలువేలు పీతఁడే యిందఱకును మఱి
వలు వేలుపులతోడఁ బని యిఁకేల ?
కమలామనోవిభు కరుణాఫలముగాదె
యమరులు గొనియాడు నమృతరసము?
దనుజాంతకుని బొడ్డుదామరయే గదా
జననకారణ మాయె సర్వమునకు
సరసిజనేత్రుని సతిమహిమయెగదా
యఖిలభూముల నిండినట్టి సిరులు?

గీ. అతనిసుతు రచనయెగదా సతులు పతులు
జరుపు సంసారరతి; ప్రాణిజాత ముండు
నెల వతనిదేగదా! వృషాచలము శ్రీవి
కుంఠమేగద! యితఁడెగా కొండలప్ప ! 2

ఈ ప్రపంచంలోని సర్వప్రాణులకు కులదైవం శ్రీవేంకటేశ్వరుడే అయివుండగా ఇతరదైవములతో నిక ప్రయోజన మేమి? లే దనుట. శ్రీప్రియుని కనికరపుపంటయేగదా దేవతలు పానంచేసిన అమృతము? రాక్షససంహారకుడైన హరిబొడ్డుదామరయేగదా సకలసృష్టికి హేతువు. సృష్టికర్త బ్రహ్మదేవుడు మహావిష్ణువు నాభికమలంనుంచి పుట్టె ననుట. సకలక్షేత్రము (పొలము) లందు నిండిన సస్య సంపత్తి తామరలవంటి కన్నులుగల నారాయణుని పత్నియగు భూదేవిమహిమేగాదా! ఆ మాధవుని కుమారుడు మారునిమహిమచేతనేగదా ఆల్మగలు అనురాగంతో కాపురించుట? ప్రాణిసమూహమునకు ఆధారనిలయుడు అతడేనుమా! వృషభాద్రి వైకుంఠమేకదా ! అందులో వెలసినవాడేగదా ఈ కొండలప్పుడు !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇలువే ల్పితఁడే | 323 | 133 | 4 | 89 |

అవ: అంజనాద్రీశుడు అన్నివిధముల తమకౌనే ఆప్తబాంధవుడని నిరూపించుచున్నాడు.

సీ. తలఁచినప్పుడు వచ్చు దయ యెప్పుడు దలంచు
కలసినబంధువు కమలనేత్రుఁ;
డాత్మలోననె యుండు నన్నిఁటఁ బాయఁ డే
మేమైనఁ దా నిచ్చు నివల నవలఁ;
జేయు కర్మమ్ములఁ జెడనీయఁ డెన్నండు
నాతురబంధువు హరి యొకండె;
నిచ్చ విందులు వెట్టు నెలఁతల నొడఁగూర్చు
నిచ్చయెఱిఁగి కోక లిచ్చుఁదాల్ప
మెచ్చు నేమిటి కైన యిచ్చినట్టివి గొను
ముచ్చటౌ బంధువు మురహరుండె;

గీ. తోడునీడయై నెఱపించు దొరతనంబు
నింద్రియమ్ములఁ బంపుసేయించుఁ గూర్మి
నిత్యసంసారమందున నిద్ర దెలుపు
వేడుకౌ బంధువు వృషాద్రివిభుఁ డొకండె. 3

స్మరించితేచాలు చెంతకు జేరవచ్చును. ఎల్లప్పుడు దయదలచు చుండును. కమలములవంటి కన్నులుగల ఆ దేవుడు కలసిమెలసియుండే చుట్టము. అతడు ప్రతిజీవి ఆత్మలో నుండును. అంతటనూ వదల కుండును. ఇహపరాలలో దేనినైనను అత డీయగలడు. భక్తులుచేసే కర్మలను రిత్తకానీక వాటికి తగినఫలముల నిచ్చువా డతడే. వేంకటాచలపతి యొకడే రోగార్తుల నాదుకునే చుట్టము. సదా ఇష్టమృష్టాన్నముల నొడగూర్చును. అనుకూలవతియగు ఇల్లాలిని లభింపజేయగలడు. మన ఇష్టానుసారంగా ధరించుటకు కావలసిన అమూల్యవస్త్రాలను అను గ్రహించును. దేనిని సమర్పించినను మెప్పుతో స్వీకరించును. భక్తితో 'పత్రం పుష్పం ఫలం తోయం' అన్నట్లుగా ఏది యిచ్చినను గ్రహించును. ప్రాణులకు ముచ్చటగొలిపే బంధువు శ్రీహరియొక్కడే. భక్తులకు తోడునీడయై తిరుగుతూ తన ప్రభుత్వమును నెఱపుచుండును. ఇంద్రియములచే తన యాజ్ఞలు నెఱపుచుండును. ఎడతెఱపిలేని సంసారములో జాగృతి గలిగించును. ఉత్సాహం సమకూర్చే బంధువు వృషభాద్రినాథు డొక్కడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తలఁచినప్పుడు వచ్చు | 225 | 140 | 3 | 94 |

అవ: శ్రీనివాసుని కృష్ణావతారలీలలను ఉపమానములతో వర్ణించు చున్నాడు.

సీ. పొత్తులఁ బవళించెఁ బురుషోత్తముఁడు తొల్లి
పరఁగ మఱ్ఱాకుపైఁ బండినట్లు
కృష్ణమ్మ తా నొత్తగిలి బోరగిలసాగె
కూర్మావతారమై కొఱలినట్లు
తప్పటడుగు లిడెఁదగఁ ద్రివిక్రముఁడౌచు
నిలను పాదాలతోఁ గొలిచినట్లు
అప్పుడే కొదలు మాటాడఁజొచ్చె మురారి
త్రిపురకాంతలకు బోధించినట్లు

గీ. ఆడఁదొడఁగెను ద్రేపల్లెవాడలోన
మెచ్చుల వికుంఠపురమందు మెఱసినట్లు
పన్నగాచలనిలయుఁడై యున్నవాఁడు
అచ్చుగా జీవులం దాత్మ యైనయట్లు. 4

బాలముకుందుడు మునుపు మఱ్ఱియాకుపై పవళించిన చందముగా పురుషోత్తముడు చిన్నికృష్ణుఁడై పొత్తి గుడ్డలపై పవళించెను. తాను కూర్మావతారంలో వలెనే మరి కొద్ది వయసురాగా పొర్లుచు బోర్ల పడసాగెను. ఇకకొంచెం వయస్సురాగా తాను త్రివిక్రమావతారంలో లోకాలను పాదాలతో కొలిచినరీతిగా తప్పటడుగులు వేయసాగెను. మురసంహారకుడైన భగవంతుడు కోడెప్రాయంలో త్రిపురాసురకాంతలతో వలె కొఱవకొఱవగా మాటాడ మొదలిడెను. వైకుంఠంలో విహరించిన విధంగా ద్రేపల్లె వీథులలో క్రీడింపసాగెను. స్పష్టంగా జీవులలో అంతరాత్మగా నున్నటులే ఇప్పుడు శేషాద్రియే స్థానంగా కలిగియున్నాడు.

బాల్యాదిగా యౌవనపర్యంతము శ్రీకృష్ణపరమాత్మవయోవస్థలను ఆ పురుషోత్తముని అవతారాంతరచర్యలతో పోల్చి వర్ణించుట ఇందలి విశేషము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అని బ్రహ్మాదు లెంచేరు | 345 | 262 | 4 | 175 |

అవ: శ్రీ వేంకటాద్రిపతి శ్రీకృష్ణుడుగా అవతరించినప్పటి చర్యలు మహిమలు వర్ణించుచున్నాడు.

సీ. మురహరుఁ డీతండు గిరిధరుఁ డీతఁ డౌ
రౌర! నందునికొడుకాయెఁ గాని
సర్వేశ్వరుఁ డితండు సవరక్షకుఁ డితండు
వ్రేపల్లెలో విహరించెఁ గాని
వేదమూర్తి యితండు విష్ణుదేవుఁ డితండు
కానలఁ బశువులఁ గాచెఁ గాని
ఆదిమూల మ్మితఁ డమరవంద్యుఁ డితఁడు
దొంగగ రోలఁ గట్టుపడెఁ గాని

గీ. బాలుఁడై యుండెఁ గాని శ్రీలోలుఁ డితఁడు
వెన్నమ్రుచ్చాయెఁ గాని గోవిందుఁ డితఁడు
వ్రజవధూటులచేఁ దిట్టువడియెఁ గాని
పరఁగ శ్రీ వేంకటాచలపతి యితండు. 5

ఆశ్చర్యము! నందునిపుత్రుడుగా అవతరించిన యీతడే మురుడనే రక్కసుని సంహరించినాడు. గోవర్ధనగిరిని ధరించినాడు. వ్రేపల్లెలో తిరిగినవాడుగదా యని సామాన్యమానవునిగా లెక్కింపరాదు. ఇతడు సకలమునకు ప్రభువు. యజ్ఞసంరక్షకుడు. అడవిలో పశువులు మేపినవాడని తక్కువగా దలపరాదు. ఇతడు వేదస్వరూపుడు. సకలవ్యాపకుడు. వెన్నదొంగయై రోట కట్టువడెనని చులకనగ చూడరాదు. ఇతడు ఆదిమూలమా యని తన్ను వేడిన గజేంద్రుని రక్షించినవాడు. దేవతలకుగూడ నమస్కరింపదగినవాడు. ఇతడు బాలుడని భావింపరాదు. శ్రీదేవియందు ఆసక్తి గలవాడు. వెన్నదొంగయైనను సాధురక్షణార్థమై అవనిలో నవతరించినవాడు. గొల్లెతల ప్రణయపూర్వకమైన దూరునకు పాత్ర మైనను ఇతడు వేంకటాచలపతిగా వెలసియున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అనుచు మునులు ఋషులు | 342 | 249 | 4 | 167 |

అవ: శ్రీనివాసచక్రవర్తి భక్తకోటిని అనుగ్రహించెడితీరు ఇట వివరించు చున్నాడు.

సీ. కోరినవరములు కొలుచువారల కిచ్చి
తలఁచువారలను ధన్యుల నొనర్చి
పొలుపు మిగుల మంచి పూలతోఁటలనీడ
విలసిల్లుచుండె శ్రీవేంకటపతి
శరణన్న వారికిఁ జన విచ్చి రక్షించి
యర్చించువారల నతికృపఁగని
శ్రీవికుంఠవిరక్తి శేషశైలముమీఁద
వెలసియున్నాఁడు శ్రీవేంకటపతి

గీ. తన్ను నమ్మినవారికి ధనము లిచ్చి
కని నుతించెడు వారికి కల్పక మయి
కనకమయమైన మేడలఁ గాఁపురించి
వినుతి కెక్కెమా వేల్పు శ్రీవేంకటపతి. 6

తన్ను కొలిచేవారికి కోరే వరా లిచ్చుచు, స్మరించేవారిని ధన్యులను జేయుచు, అందము చిందే మంచిమంచి పూదోటలనీడలలో శ్రీవేంకటేశ్వరుడు విలసిల్లుచున్నాడు.

శరణన్న వారిని చనవుతో కాపాడి, పూజించేవారిని మిక్కిలి దయతో తిలకించుచు శ్రీవేంకటాచలపతి వైకుంఠముపై విరక్తి చెంది శేషాచలంపై వెలసియున్నాడు.

తనయందు విశ్వాసం కలవారికి ధనసమృద్ధి నిచ్చుచు దర్శించి కీర్తించేవారికి కల్పవృక్షంవంటివాడై బంగారంతో నిర్మించబడిన గుడిలో నుండి మా దైవం శ్రీవేంకటాచలాధీశుడు ప్రసిద్ధి కెక్కినాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మతంగపర్వతము | 328 | 165 | 4 | 111 |

అవ: అలనాటిరాముడే నేటి యర్చామూర్తి శ్రీవేంకటేశ్వరు డని వర్ణించుచున్నాడు.

సీ. రాముండు రఘుపతి రవికులుఁ డీతండు
భూమిజాపతియైన పురుషవరుఁడు
అల పుత్రకామేష్టియందుఁ బాయసమునఁ
బరఁగఁ బుట్టిన పరబ్రహ్మ మితఁడు
సురల రక్షింప నసురులను శిక్షింపఁ
దెరలివచ్చిన దివ్యతేజ మితఁడు
చింతించు యోగుల చిత్తపద్మాలలో
సాకారమైయున్న శాంత మితఁడు
వింతగా మును లెల్ల వెదకి కాంచెడునట్టి
పరమమౌ కైవల్యపద మితండు

గీ. సకలవేదవేదాంత శాస్త్రమ్ము లందుఁ
బాదుకొను పరమార్థ మనాది యితఁడు
విజయనగరమ్మునను తిరువేంకటాద్రి
తావుగొన్నట్టి యర్చావతార మితఁడు. 7

ఈ శ్రీనివాసుడే సూర్యవంశంలో రఘుకులంలో రాముడై సీతాపతియైన పురుషోత్తముడు. ఆ పుత్రకామేష్టిలో పాయసమును దశరథుని పట్టపురాణి కౌసల్యాదేవి భుజింపగా ఆవిర్భవించిన పరబ్రహ్మస్వరూపుడు. రాక్షసులను శిక్షించడానికి, దేవతలను రక్షించడానికి దిగివచ్చిన దివ్యతేజోరూపుడు ధ్యానించే యోగుల మానససరసీరుహాలలో ఆకారముతో గోచరించే శాంతమే ఈతడు. ఆశ్చర్యంగా సకలఋషులు అన్వేషించి దర్శించే పరమకైవల్యపద మితడే. సకలములైన వేదములు వేదాంతములు శాస్త్రములు-వీటియందు పాదుకొనియున్న పరమార్థమితఁడే. అనాది యితడే విజయనగరము, శ్రీ వేంకటాద్రి తనకు నెలవుగావెలసిన అర్చావతార మితఁడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రాముఁడు రాఘవుఁడు | 329 | 169 | 4 | 113 |

అవ: స్వామివారి దశావతారచర్యలు చమత్కారంగా వర్ణిస్తున్నాడు.

సీ. మ్రోఁత లెత్తెడునీట నీఁత నేర్చినవాఁడు
ప్రాఁతగిల్లినమాఁతఁ బండువాఁడు
పెనుముట్టితో మట్టి పెల్లగించెడువాఁడు
కడుఁబ్రేగు పేరులు గలుగువాఁడు
కోడికూఁతలవాని కూరిమి తమ్ముండు
బూదిపూఁతలవాని బుద్ధివాఁడు
మాడవన్నెల లేటిమాయఁ దగిలినవాఁ
డాలఁ గాచుచు దొరయైనవాఁడు

ఆ. మింటఁ బాఱు నూరిమెలఁతల మానముల్
కొల్లగొట్టువాఁడు గుఱ్ఱ మెక్కి
తిరుగువాఁడు శేషగిరి నిందిరంగూడి
యెల్లజగము లిప్పు డేలువాఁడు. 8

శ్రీనివాసుడు ఆటుపోటులతో అల్లకల్లోలంగా వున్న సముద్రంలో ఈదగలిగి వేదాలను వెదకి వెలికి దెచ్చినవాడు (మత్స్యావతారం). అగాధసముద్రంలో అట్టడుగున శయనింపగలిగినవాడు (కూర్మావతారం). బలసిన తనముక్కుతో భూమిని పెల్లగించినవాడు (వరాహావతారం). గొప్పవగు హిరణ్యకశిపుని ప్రేవులను దండలుగా ధరించినవాడు (నారసింహావతారం). అహల్యాకాముకుడై కోడియైకూసిన ఇంద్రునికి తమ్ముడు (వామనావతారం). భస్మదిగ్ధగాత్రుడైన త్రినేత్రునిమనస్తత్త్వంవంటి మనస్తత్త్వంగలవాడు- అనగా శత్రువులను భస్మంచేసినవాడు (పరశురామావ తారం). బంగరురంగు లీనే మాయలేడికి లోబడి వెంబడి పడినవాడు (రామావతారం). గోవులను కాచుచు దొరయైనవాడు (శ్రీ కృష్ణావతారం). ఆకాశంలో పయనించే త్రిపురముల కాంతలను కంతుబారి కప్పగించినవాడు (బుద్ధావతారం). గుఱ్ఱమెక్కి సంచరించువాడు (కలికిఅవతారం). అట్టి వైకుంఠుడు ఇందిరతోగూడి సకలలోకముల నేలుచు ఇప్పుడు శేషగిరియం దున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెప్పగా మఱ్ఱాకుమీఁద | 81 | 295 | 5 | 201 |

అవ: శ్రీవేంకటేశ్వరుని ఇతరావతారాలలోని కొన్నిఅద్భుతములను వర్ణించు చున్నాడు.

సీ. ఆదిమపూరుషుఁ డచ్యుతుఁ డచలుం డ
నంతుఁ డీతఁడె వేంకటాద్రివిభుఁడు
ఏకార్ణవం బయి యేచిన జలముల
వటపత్రశయనుఁడై వఱలె నీతఁ;
డరుదుగ బలిమద మణఁచఁ ద్రివిక్రమా
కృతి ముజ్జగమ్ముల నితఁడ కొలిచెఁ;
బాదాంగుళమ్మునఁ బదియామడలదవ్వు
మేటి దుందుభిమేను మీటెనితఁడె;

గీ. శేషపర్యంకశాయిమై క్షీరవార్ధి
ధరణి సిరియును తనదు పాదమ్ము లొత్తఁ
జేరి బ్రహ్మాదులు భజింపఁ జెలువుమీఱు
శ్రీ మహావిష్ణువే వృషశిఖరి విభుఁడు. 9

ఆదిపురుషుడు, నాశంలేనివాడు, చలనంలేనివాడు, అంతం లేనివాడు ఈ వేంకటేశ్వరస్వామియే. ప్రపంచమంతా సముద్రజలంలో మగ్నంకాగా మఱ్ఱియాకుపై పవళించిన మహనీయు డితడే. ఆశ్చర్యంగా బలిచక్రవర్తి మద మణచుటకై త్రివిక్రముడై మూడులోకములను కొలిచిన అమేయు డితడే. దశరథరాముడై దుందుభి అనే రాక్షసుని కళేబరమును తన యెడమకాలిబొటనవ్రేలిగోటితో మీటి పదియామడల కావల పడవేసిన మహాబలశాలి ఇతడే. పాలసంద్రమున ఆదిశేషుడనే పాన్పుపై పవళించి శ్రీభూదేవులు తన చరణము లొత్తుచుండగా, బ్రహ్మాదిదేవతలు దగ్గతించి సేవించుచుండగా, అందరికి అందము ఆనందము పంచునట్టి శ్రీమహావిష్ణువే ఈ వృషాద్రినాథుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆదిమపూరుషు | 13 | 80 | 1 | 55 |

అవ: శ్రీనివాసుని అవతారములకు సర్వవ్యాపకత్వమును తెలియబలుకుచున్నాడు.

సీ. ఎక్కడ వెదకిన నితఁడె యీతని కన్న
నతిమహిమాఢ్యదైవతము గనము
అంభోధులందు మత్స్యావతారము రసా
తలమందుఁ గూర్మావతార మితఁడె
అడవుల భూవరాహావతారము నృసిం
హావతారమ్ము మహాద్రిగుహల
త్రైవిక్రమావతారము భూనభోంతర
మందునఁ; బరశు రామావతార
మల వీరకోటిలోఁ; దలఁపుల తారక
రామావతారమ్ముఁ; రామకృష్ణ
యుగళావతారమ్ము తగ నాలమందల;
దనుజల బుద్ధావతార మితఁడె;

గీ. కాలపుంగొట్టకొనలందుఁ గల్కినామ
కావతారం బితండె; భూతాళిలోన
నంతరాత్మగ మెఱయు చిహమ్మునందుఁ
బరమునం దొప్పు వేంకటపతి యితండె. 10

ఎచ్చట వెదకినను ఈ దేవుడే గోచరించుచున్నాడు. ఇతనిని మించిన మహిమోపేతు డైన దైవము నెచ్చటను చూడలేము. ఈ భగవానుడే సముద్రములలో మత్స్యావతారముగా, పాతాళమందు కూర్మము (తాబేలు) గా,అరణ్యములలో భూవరాహస్వామిగా, మహాపర్వతగుహలలో నరసింహ మూర్తిగా, భూమ్యాకాశములందు వామనుడుగా, శూరుల సమూహములో పరశురాముడుగా, స్మరణజపములలో తారకరాముడుగా, గోసంరక్షణ విషయములో బలరామకృష్ణులుగా, రాక్షసస్త్రీల మనసులను కలుషితం చేయుటలో బుద్ధుడుగా, కలియుగాంతములో కల్కి అనే పేరుగలవాడుగా, సర్వప్రాణులలో అంతరాత్మగా నలరారుచున్నాడు. ఇహపరముల యందు మెఱయుచున్నవాడు ఈ కొండలప్పయే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇతనికంటే మరి దైవము | 264 | 370 | 3 | 249 |

అవ: అందరికి సులభుడై శ్రీనివాసుడు శేషగిరియందే ఉన్నా డనుచున్నాడు.

సీ. యోగీశ్వరుల మతినుండు దేవుఁడు క్షీర
సాగరశయనుఁడౌ సర్వవిభుఁడు
భాగవతాధీన పరమపూరుషుఁ డాగ
మోక్తవిధులయందు నొప్పువాఁడు
వైకుంఠమందున్న వనజనాభుఁడు పర
మాకారమందున్న యాదిమూర్తి
భానుమండలమందుఁ బరఁగు పరంజ్యోతి
బ్రహ్మాండములు దాల్చు బ్రహ్మతండ్రి

గీ. విశ్వరూపమై నిలిచిన శాశ్వతుండు
వేదవేదాంతములు సదా వెదకు ధనము
అందఱకుఁ జాల సులభుఁడై యంజనాద్రి
నెనఁగుచున్నాఁడు శ్రీ వేంకటేశ్వరుండు. 11

పరమయోగుల మనస్సులలో గోచరించువాడు, పాలకడలిలో పవ్వళించెడివాడు, సకలమునకు ప్రభువు, భక్తుల కధీనుడైన పరమ పురుషుడు, శాస్త్రములందు చెప్పబడిన విధులం దొప్పియున్నవాడు, వైకుంఠములోనుండు మహావిష్ణువు, మహీయసుడై యుండు ఆదిమూర్తి, సూర్యమండలములో శోభిల్లు పరంజ్యోతి, బ్రహ్మాండములను భరించువాడు, బ్రహ్మకు తండ్రియైనవాడు, ప్రపంచస్వరూపుడై మూడుకాలములందుండువాడు, వేదములచే, వేదాంతములచే నెప్పుడును వెదుకబడు ధనమైనవాడు- ఇప్పుడీ అంజన పర్వతముపై సర్వులకు సులభముగా దర్శనమిచ్చుచు శ్రీ వేంకటేశ్వరుడుగా ప్రకాశించుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అందరికి సులభుఁడై | 249 | 281 | 3 | 190 |

అవ: వలవని దుష్టుల వాదాలతో పనిలేదు; తెలిసినవారి కితడే దేవు డనుచున్నాడు.

సీ. పురుషోత్తముఁ డితండు పురుషులలోపల
నటు నరుల నరనారాయణుండు
పరదైవతములకుఁ బరమేశ్వరుఁ డితండు
పరమమూఢులకు నెవ్వరో యితండు?
పలు బ్రహ్మలకు పరబ్రహ్మ మీతండు పెం
పెసఁగు నీశులకు మహేశ్వరుండు
ఇల నాత్మలందున నిటు పరమాత్ముండు
ఖలుల కెట్లుండునో కాన మితఁడు

గీ. వేదములలోన వేదాంతవేద్యుఁ డీతఁ
డాదిమూలంబు కరిఁ గాచునట్టివేళ
నీ దెసను వేంకటేశ్వరుఁ డిందఱకును
గుటిలబుద్ధుల నెపుడు గైకొనఁ డితండు. 12

ఈ వేంకటాచలపతి పురుషులలో నుత్తముడు. కాన పురుషోత్తము డైనాడు. నరులలో నరనారాయణస్వరూపుడు. దేవతల కందఱకును ప్రభువు గనుకనే పరమేశ్వరుడు. అజ్ఞానులకు ఇత డేమగునో ? అనఁగా మూఢులు పైవారిలో నొకనిగా నైన ఈతని నెఱుంగ రనుట. సృష్టికర్త లెందరో యుండగా వారికి కారణమైన పరబ్రహ్మమే యీ స్వామి. అతిశయించియుండు పదునొకండుగురు రుద్రులకు మూలమైన పరమేశ్వరుడు. ఆత్మలలో పరమాత్మగానుండు నితడు నీచుల కెట్టివాడుగా తోచునో తెలియరాదు. ఉపనిషత్తులచే తెలియదగిన ఈ మూలపురుషుడు కరిరాజును కాపాడు పట్టున మహావిష్ణువుగా తోతెంచెను. ఇపు డిచట నందరకు వేంకటేశ్వరుడుగా దర్శన మిచ్చుచున్నాడు. ఇతడు వక్రబుద్ధుల నెన్నడును అనుగ్రహింపడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలిసినవారికి దేవుఁడితఁడే | 283 | 480 | 3 | 323 |

అవ ఉర్వికి ఎక్కుడైన దైవం ఒక్కడే. ఆతని నెఱుంగు మనుచున్నాడు

సీ. ఉన్నట్టి జీవుల కొక్క బ్రహ్మ గలండు
మహిసురుల్ తాము బ్రహ్మల మటండ్రు
నడుమ తొమ్మిదిమందినలువ లొప్పుచు నుండ్రు
జగ మెల్ల బ్రహ్మల సంత యయ్యె;
కలఁ డొక్క రుద్రుండు కైలాసమున మఱి
పదునొకండుగురు చూపట్టుచుండ్రు
కాలరుద్రుండును గడపట నున్నాఁడు
జగ మెల్ల రుద్రుల సంత యయ్యె;

గీ. విష్ణుమయము జగమ్మన వినుతి కెక్కి
యెన్నొ యవతారములు దాల్చి యెసఁగు దేవుఁ
డంజనగిరీంద్రనాథుఁడై రంజిలంగ
జగము జమలివరమ్ముల సంత యయ్యె. 13

ఉన్నప్రాణు లందరికీ బ్రహ్మ యొక్కడే. కాగా బ్రహ్మజ్ఞానం కలవారు తామూ బ్రహ్మల మనుచుందురు. అంతేకాక మధ్యలో నవప్రజాపతు లున్నారు పై వారివల్ల లోక మంతయు బ్రహ్మమయమై యున్నది కైలాసంలో ఈశ్వరుడొక డున్నాడు మరియు ఏకాదశరుద్రులు కన్పించు చున్నారు ఇక కాలరుద్రుడు కల్పాంతములో ప్రత్యక్ష మగుచుండును. కనుక లోక మంతయు రుద్రమయ మగుచున్నది. జగ మంతయు విష్ణుమయమని ప్రసిద్ధి కెక్కి అనేకము లైన అవతారములు దాల్చి విరాజిల్లే దేవుడు అంజనాద్రిప్రభువై విరాజిల్లుచుండగా ప్రపంచమంతయు ఇహపరసౌఖ్యము లిచ్చే వరములతో నిండిపోయినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒక్కఁ డెవ్వఁడో | 258 | 333 | 3 | 225 |

అవ: హంపీవిజయనగరమున వెలసిన శ్రీరాముడే శ్రీ వేంకటేశ్వరుడని వినుతించుచున్నాడు.

సీ. అదె లంక సాధించె నవనిభారము దించె
విదితప్రతాపుఁడై వెలసె నితఁడు
రవివంశతిలకుండు రాఘవుం డీతండు
పొగడొందు దశరథపుత్త్రుఁ డితఁడు
భవుఁ డెంచు తారకబ్రహ్మమే యీతండు
పావని కిడె బ్రహ్మపట్ట మితఁడు
బలువుఁడు జానకీప్రాణేశ్వరుఁ డితండు
తలవంగ వాలిమర్దనుఁ డితండు
విలసిల్లు నేకాంగవీరుఁ డీతఁడు ఘన
కోదండదీక్షైకగురుఁ డితండు

గీ. సకలశరణార్థివజ్ర పంజరుఁ డితండు
సమరదుర్జయ దైత్యభంజనుఁ డితండు
వరదుఁ డై నట్టి వేంకటేశ్వరుఁ డితండు
విజయనగరాధిపతియైన విష్ణుఁ డితఁడు. 14

లంకను రూపుమాపి, భూభారమును బాపి, తన ప్రతాపం ప్రఖ్యాతి వహింపగా ప్రకాశించినవాడు, రఘువంశమునకు అలంకారమైనవాడు, రాఘవుడని ప్రసిద్ధి కెక్కినవాడు, దశరథుని కుమారుడుగా పొగడ్త గన్నవాడు, ఈశ్వరు డుపాసించు తారకబ్రహ్మ మీ రామచంద్రుడే. భక్తాగ్రేసరుడైన హనుమంతునికి బ్రహ్మపట్టం కట్టినవాడు, మహాబలిశాలి, సీతాప్రాణ వల్లభుడు. వాలిని మర్దించినవాడు, అసహాయశూరుడు, ధనుర్విద్యయం దేకైకగురువు, శరణు పొందినవారి పాలిటికి వజ్రపంజరమై కాపాడువాడు, యుద్ధములో అజేయులైన రాక్షసులను నిర్జించినవాడు, వరములిచ్చేవాడు ఈ వేంకటాచలపతియే. ఈతడే విజయనగరాధినాథుడైన శ్రీమహావిష్ణువు (శ్రీరాముడు).

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అదె లంక సాధించె | 389 | 514 | 4 | 347 |

అవ: రామావతారంవల్ల కలిగిన ఫలితము లుగ్గడించుచున్నాడు.

**సీ. రాముఁడు లోకాభిరాముఁడు జనియింపఁ**
**బుడమి వాల్మీకికిఁ బుణ్య మబ్బెఁ;**
**దటుకున మారీచు తల పోయెఁ; గర్మము**
**కుటిలశూర్పణఖ ముక్కున ఫలించెఁ;**
**బటుకునఁ దెగె దైత్యభామల మెడత్రాళ్ళు**
**క్రూరదానవులకు నూఱు నిండెఁ;**
**దఱిఁగె రావణు పూర్వతపముల యాయుస్సు;**
**కాలమ్ము దీఱెను ఖరముఖులకు**
**గరిమ లంకకు నవగ్రహములు భేదించె;**
**నంతటి యింద్రజి త్తాకు చినిఁగె;**
**గీ. జననదివసంబు కుంభకర్ణునకు వచ్చెఁ;**
**గాంత మందోదరికి పెనుగండ మొదవె;**
**రమణ సాకేతపురికి భాగ్యములు పండె**
**వేంకటేశ్వరు చేఁతలు వినుతి కెక్కె.** 15

జగన్మోహను డగు రాము డవతరింపగా ఇహమందు వాల్మీకిమహర్షికి పుణ్య మబ్బినది. రామకథాకథనమువల్ల వాల్మీకి ధన్యు డాయెనని భావము. రాముని ఒకబాణంతోనే మారీచుని తల ఎగిరిపోయినది. కుత్సితస్వభావురాలగు శూర్పణఖకు ఆమె ముక్కుననే కర్మము పరిపక్వ మైనది. అనగా దానిముక్కు కోయబడిన దనుట. రాక్షసకాంతల మంగళసూత్రములు పటుక్కు మని తెగిపోయినవి. దైత్యు లందరిని నిర్మూలించె ననుట. క్రూరులైన రక్కసు లందరికి నూరేండ్లు నిండినవి. వారిని సంహరించెనని భావము. రావణాసురుని పూర్వతపస్సుల ఆయుస్సు తఱిగిపోయినది. ఖరదూషణాదులకు కాలం తీరిపోయినది. లంకాపట్టణ మునకు నవగ్రహాలు తారుమారైనవి. ఇంద్రునిజయించిన ఇంద్రజిత్తు ఆకు చినిగినది. అనగా మరణించె ననుట. కుంభకర్ణునికి జననదివసం చేరినది. అనగా చచ్చెననుట. మందోదరికి గండ మైనది. అయోధ్యానగరమునకు భాగ్యములు ఫలించినవి. శ్రీవేంకటాచలపతి అపూర్వామోఘకార్యములు కీర్తితము లైనవి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రాముఁడు లోకాభిరాముఁడు | 390 | 520 | 4 | 351 |

అవ: శ్రీనివాసుని నవరత్నాలరాశిగా వర్ణించుచున్నాడు.

సీ. ముద్దుగాఱు యశోదముంగిటిముత్యమ్ము
వాసుదేవుఁడు దేవకీసుతుండు;
అఱచేతి మాణిక్య మల గొల్లెతల కెల్లఁ
బంతాలకంసునిపాలి వజ్ర;
మందిందు మాలోన నలరు కృష్ణుఁడు త్రిజ
గమ్ముల మేలైన గరుడపచ్చ;
పడఁతి రుక్మిణిమోవి పగడమ్ము గోమేధి
కమ్ము గోవర్ధనగ్రావమునకు;
శంఖచక్రమ్ముల సందున వైదూర్య
మెపుడు మమ్మేలు నబ్జేక్షణుండు;

గీ. కాళియభుజంగుశిరములఁ గొంతు లీను
పుష్యరాగమ్ము; వేంకటభూమిధరపు
టింద్రనీలమ్ము; క్షీ రాబ్ధి నెపఁగు దివ్య
రత్న మిటు నందునింటఁ బాఱాడు శిశువు. 16

దేవకీవసుదేవులకు పుత్రుడైన శ్రీకృష్ణుడు యశోదాదేవి ముంగిటిలో ముద్దులొలికే ఆణిముత్యము. అతడు గొల్లకాంతలకు అరచేతిలోని మాణిక్యము. పంతగాడైన కంసభూపతిపాలిటికి వజ్ర మైనవాడు. ఎటు చూచినను మాలోననే మెలగు నీతడు ముల్లోకములందు మేలైన గరుడపచ్చ. తరుణీమణి రుక్మిణి లేత పెదవికి పగడంవంటివా డయినాడు. గోవర్ధన పర్వత ముద్ధరించిన గోమేధికమణి యీతడే. సదా మమ్ము సంరక్షించు ఈ కమలలోచనుడు శంఖచక్రములనడుమ వఱలునట్టి వైదూర్యము. ఇతడు కాళియుడనే మహాసర్పముపడగలపై నాట్యమాడుచు పుష్యరాగకాంతులను ప్రసరింపజేసినవాడు. వేంకటాచలముపై నున్న ఇంద్రనీలమణి అనగా మేఘశ్యాము డీతడే. ఈతడే కృష్ణావతారమున నందుని ఆనందనిలయములో పసిబిడ్డడై పారాడినాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ముద్దుగారే యశోద | 299 | 577 | 3 | 387 |

అవ: శ్రీనివాసుని మహౌదార్యమును బహుముఖముల ప్రశంసించు చున్నాడు.

సీ. కలఁడె యింతటిదాత కమలనాభుఁడె గాక
 కలఁడన్న వారికిఁ గలుగు వేల్పు;
ఇంద్రాదులకు నెల్ల నితఁ డిచ్చె సంపద;
 లిచ్చె శుకాదుల కిహపరాలు;
అనిమిషకోటికి నమృతంపువిం దిచ్చెఁ;
 గమలచేతికిఁ గట్టెఁ గంకణములు;
పవనజునకు నిచ్చె బ్రహ్మపట్టమ్ము; ఘం
 టాకర్ణునకు వికుంఠమ్ము నిచ్చె;

గీ. బాలునకు నున్నతోన్నతపదవి నిచ్చె;
భక్తవత్సలబిరుదంబు పరఁగఁ దాల్చె;
నిట్టి పొడసూపి శేషాద్రి నిందఱకును
ధన్యు లగుఁడని తన ప్రసాదమ్ముఁ బంచె. 17

కమలము నాభియందుగల శ్రీ వేంకటేశ్వరునివంటిదాత మరొక్కడు లేడు. భక్తిప్రపత్తులతో తన్ను నమ్మినవారికి చెంతనే యున్నాడు. ఇంద్రుడు మొదలైనవారికి సంపద లిచ్చినవాడు, శుకాదులకు ఇహపరము లిచ్చినవాడు, దేవతానమూహమునకు అమృతము పంచియిచ్చినవాడు, పద్మావతీ హస్తమునకు కంకణం కట్టినవాడు, హనుమకు బ్రహ్మపదమును, ఘంటాకర్ణునకు శ్రీ వైకుంఠము నను గ్రహించినవాడు, బాలుడైన ధ్రువునికి అత్యున్నతమైన ధ్రువపదము నిచ్చినవాడు, భక్తులయెడ వాత్సల్యం కలవాడని బిరుదు పొందినవాడు ఇతడే. ఈ శేషాద్రిపై ఈ విధముగా వేంకటాచలపతిగా నిలిచి నమస్తజనులను ధన్యులు కండని తన అనుగ్రహమును పంచి యిచ్చుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలఁడా యింతటిదాత | 343 | 255 | 4 | 171 |

అవ: సకలసత్కార్యఫలము శ్రీ వేంకటేశ్వరుని సన్నిధాన మని వివరించు చున్నాడు.

సీ. దానమ్ముల ఫలమ్ము తపముల ఫలమును
మౌనమ్ముల ఫలమ్ము మాధవుండె;
జ్ఞానమ్ముల ఫలమ్ము జపముల ఫలమును
నానాఫలమ్ములు నందసుతుఁడె;
వేదమ్ముల ఫలమ్ము వినుతుల ఫలమును
మనసులోనిఫలమ్ము మధురిపుండె;
దినముల ఫలమును తీర్థయాత్రలఫల
మ్మఖిలపుణ్యఫలమ్ము నచ్యుతుండె;

ఆ. యతులలోనిఫలము జితకాముల ఫలమ్ము
సతతయోగఫలము చదువుఫలము
మోక్షఫలము తలఁప ముచికుందవరదాయి
శేషశిఖరివాసి శ్రీ విభుండె. 18

సర్వవిధములైనదానములు, తపస్సులు, మౌనవ్రతములు, జ్ఞానములు, జపములు, వేదాధ్యయనము, స్తోత్రములు, మానసిక ధ్యానములు, పుణ్యవాసరోపవాసములు, తీర్థయాత్రలు, పుణ్యకర్మములు, యత్యాశ్రమము, కామజేతృత్వము, ఎడతెగనియోగము, భాగవతాది గ్రంథపఠనము--వీటి యన్నింటియొక్కఫలము మాధవుడే; నందసుతుడే; మధురిపుడే; అచ్యుతుడే; ముచికుందవరదుడే; శేషాద్రి వాసుడు శ్రీనివాసుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భావించి తెలుసుకుంటే | 350 | 291 | 4 | 195 |

అవ: సర్వప్రాణిసంరక్షకుడు శ్రీవేంకటేశ్వరుడే యనుచున్నాడు.

సీ. **తానెకా కెవ్వరు దాత దైవము తన**
**లోని మా కెందు లోనైనవాఁడు**
**చదివించి కమ్మనిచవుల బోనము వెట్టి**
**జాఱకుండఁగ విల్లు చక్కఁగట్టి**
**బెదరుపుట్టని బుద్ధి పిన్ననాఁడే చెప్పి**
**యెదిరినడిగి ద్రవ్య మెల్ల నిచ్చి**
**బాగుగాఁ బాలించువాఁ డింక మోహ వి**
**యోగమ్ము మోహానురాగ మిట్టి**

గీ. **దేహపువిభాగమును లెస్స తెలుపువాఁడు**
**ఐహికమ్మునఁ దిరువేంకటాద్రి యందు**
**సర్వదేహిరక్షణమున నవతులేని**
**వాఁడు పద్మావతీ మనోవల్లభుండె.** 19

మాకు దాతయు దైవము శ్రీవేంకటేశ్వరుడుగాక మరెవ్వరు? మమ్ములను కడుపులో దాచుకొని కాపాడువాడు అతడే. మమ్ము చదివించి (సోమకాసురుని సంహరించి వేదము లుద్ధరించి జను లందరు చదువునట్లు చేసినమత్స్యావతారుడు), మాకు కమ్మనిభోజనము పెట్టి (మందరగిరినెత్తి అమృతోద్భవమునకు కారణమై తీయని సుధను దేవతలకు పంచిపెట్టిన కూర్మావతారుడు), మేము నివసించుటకు గృహము నమకూర్చి (నివసించుటకు ఆధారమైన భూమిని జలరాశిలో ముంచిన హిరణ్యాక్షుని చంపి పుడమి నుద్ధరించిన వరాహావతారుడు), మాకు చిన్నవాడే ధైర్యవంతమగు బుద్ధి గఱపి(జనకుడైన హిరణ్యకశిపునివలన బాలుడైన ప్రహ్లాదునిబుద్ధి బెదరి పోకుండ చేసి కాపాడిన నృసింహావతారుడు), వరుల నడిగి (దేవతలకొఱకై బలిని యాచించిన వామనావతారుడు), గడించిన ద్రవ్య మంతయు కై కొమ్మని యిచ్చి (రాజలోకమును నిర్మూలించి అక్షత్రియ ధనమంతయు కశ్యవప్రజాపతికి ధారపోసిన పరశురామావతారుడు, మమ్ము పదిలముగా పాలించువాడు (జనానురంజకముగా) ధరణీరాజ్యపాలన మొనర్చిన శ్రీరామావతారుడు), మోహవిచ్ఛేదముకావించిన వాడు (తనకై పరితపించు గోపికలకు ఉద్ధవునిద్వారా సందేశ మంపిన కృష్ణావతారుడు, మోహానురాగబంధము కూర్చువాడు (త్రిపురాసురవనితలకు మరులు పుట్టించిన బుద్ధావతారుడు), దేహాత్మ విభాగము తేటపఱచువాడు (కల్క్యవతారుడు) శ్రీ వేంకటేశ్వరుడే. ఇహలోకమున శ్రీ వేంకటాచలముపై విలసిల్లుచు సాటిలేని విధముగా సకలప్రాణిరక్షణమును నలుపుచున్నవాడు ఈ పద్మావతీప్రాణవల్లభుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తానెకా కెవ్వరు | 31 | 192 | 1 | 129 |

అవ: శ్రీ వేంకటాచలపతి అవతారాంతరవృత్తాంతమును జ్ఞప్తికి దెచ్చుకొను చున్నాడు.

సీ. ఏటేటఁ జేసెడు నింద్రయాగపుముద్ద
లపుడారగించిన యతఁడె యితఁడు;
చెప్పి పంపి మునుల చెలువలు దెచ్చిన
విందులు గుడిచెను వీఁడె నాఁడు
బ్రహ్మదాచిన బాలురకు దూడలకు మారు
గడియించినట్టి యాతఁడె యితండు;
నిలుచుండి యేడుప్రొద్దులు వ్రేలఁగొండెత్తి
యిల నాలఁగాచినాఁ డితఁడె నాఁడు;

గీ. బాలుఁడై పూతనాదులఁ బట్టిచంపి
యలరుచును నాటలాడినయతఁడె యీతఁ
డెలమి శ్రీవేంకటాచల మెక్కినాఁడు
ఏలె చతురాననాదుల నితఁడెనాఁడు. 20

ప్రతియేట జరిపే ఇంద్రయాగపుప్రసాదపుముద్దలు భుజించిన ఆ శ్రీకృష్ణుడు ఈ వేంకటాచలపతియే. కృష్ణుడై తాను కబురంపగా ఋషిపత్నులు తెచ్చిన ఓగిర మారగించినవా డీ స్వామియే. బ్రహ్మదేవుడు దూడలను గోపబాలురను దాచిపెట్టగా తానే ఆ దూడలుగా గోపబాలురుగా మారి అందరి కనుగప్పిన వాడితడే. ఏడుదినములు తాను నిలబడి వ్రేలితో గోవర్ధనపర్వతము నెత్తిపట్టి వర్షభీతిని మాన్పి గోగోపకులను రక్షించిన శ్రీకృష్ణుడే శ్రీనివాసుడు. ఆనాడు బాలుడుగా పూతనాదిరాక్షసులను మట్టుపెట్టి సంతోషముగా క్రీడించినవా డితడే. అప్పుడు, బ్రహ్మమున్నగు దేవతలను గాచినవాడే ఇప్పుడు శ్రీవేంకటాద్రిపై నిలిచియున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అందరివలెనే వున్నాడు | 108 | 48 | 2 | 33 |

అవ: శ్రీవేంకటేశ్వరుని సాకారుగా నిరాకారుగా కొనియాడుచున్నాడు.

సీ. దేవదేవుఁ డితండు తేజస్వి యీతండు
భావించగారాని బ్రహ్మ మితఁడు;
శ్రీవల్లభుఁ డితండు జీవరక్షకుఁ డీతఁ
డమృతరూపుఁడు దైత్యహంత యితఁడు;
పరమాత్ముఁ డీతండు భయహరుఁ డీతఁడు;
నిరుపమగుణముల నిత్యుఁ డితఁడు;
వరదుఁడీతఁడు సర్వవంద్యుఁ డీతఁడు గిరి
దరుల నొప్పెడు నృకేసరి యితండు;

ఆ. కాలరూపుఁ డితఁడు కరుణానిధి యితండు;
మేల్మిజగములందు మేటి యితఁడు;
ఫణిగిరీశుఁ డితఁడు బలవంతుఁ డీతఁడే
యితనిబంట్ల మగుచు బ్రతుక వలదె? 21

ఈ స్వామి దేవతలకు దేవుడు. తేజోరూపుడు. ఊహింపరాని పరబ్రహ్మము. సిరి మగడు. ప్రాణి పోషకుడు. అమృతస్వరూపుడు. రాక్షసులను సంహరించినవాడు. ఇతడే పరమాత్మ. భక్తుల భయమును బాపువాడు. అనంతకల్యాణ గుణపరిపూర్ణుడు. త్రికాలాబాధ్యుడు. వరము లిచ్చువాడు. అందరికి వందనీయుడు. ఇతడే కొండచఱియలలో విహరించే నరసింహస్వామి. కాలస్వరూపుడు. దయకు పెన్నిధి. సకలలోకాధికుడు. శేషాద్రినాథుడు. బలవంతుడు ఇతడే. ఇతనిదాసులమై మన వలదా ?

శ్రీశుదాసులై శుభములు పడయు డనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బలవంతుఁ డితనిబంట్లమై | 851 | 302 | 18 | 202 |

అవ పరమాత్మస్వరూపుని వేంకటాచలపతిని పలువిధముల ప్రస్తుతించు చున్నాడు.

సీ. నారాయణుని జగన్నాథు త్రిలోకైక
పారాయణుని కృపాభరణు పరసు
శుకముఖమునిజనసులభు చిరంతను
భక్తపావను యదువంశదీపు
భవదూరు భయహరు పరమాత్ము సుగుణ సం
పన్ను పరాత్పరు పరమపురుషు
పంకజాసననుత భవ్యపాదాంబుజు
నిరతశయానందు నిగమవంద్యు

గీ. భువనభూషణు శుభకరు నవనపాలు
కరివరదు గరుడగమను హరి ముకుందు
విగతభయు విజయసఖు గోవిందు శ్రీశు
వేంకటాధిపు శాశ్వతు వేడ్కఁ గొలుతు. 22

నీరము నివాసస్థానముగా గలవాడు, జగత్తులకు నాథుడు, మూడులోకములకు ధ్యేయుడైనవాడు, దయయే ఆభరణముగా కలవాడు, పరసుడు, శుకుడు మొదలుగాగల మునులకు సులభుడైనవాడు, అనాదియైనవాడు, భక్తులను పవిత్రుల గావించువాడు, యదుకులమును ప్రకాశింపజేసినవాడు, పుట్టుక లేనివాడు, భయమును హరించువాడు, పరమాత్ముడు, సర్వగుణసంపన్నుడు, పరాత్పరుడు, పరమపురుషుడు, బ్రహ్మచే నుతింపబడిన శుభకరములగు పాదపద్మములు గలవాడు, పరమానందస్వరూపుడు, ఆగమములచే కీర్తింపదగినవాడు, ప్రపంచమున కలంకారమైనవాడు, శుభము లిచ్చువాడు, యజ్ఞరక్షకుడు, కరిరాజును గాచినవాడు, గరుడవాహనుడు, పాపహరుడు, మోక్షమిచ్చువాడు, భయరహితుడు, అర్జునుని మిత్రుడు, గోవుల నేలువాడు, లక్ష్మీవల్లభుడు, శాశ్వతుడు, వేంకటాద్రికి విభుడగు తిరుమలప్పను ప్రీతితో గొలుతును.

ప్రథమ సంపుటములోని, 264, 265,267 కీర్తనలలోని పదాలతో-

అవ: ఉదయకాలమున వేంకటాచలపతిని మేలుకొలుపుడని యుద్బోధించుచున్నాడు.

సీ. పైపయిఁ బ్రొద్దెక్కెఁ; బద్మముల్ విరిసెను
 మేలుకొమ్మనరె లక్ష్మీ కళత్రు
దీపముల్ తెలఁబాఱెఁ దిమిర మంతయుఁజాఱె
 విశ్వంభరున్ కను విప్పు మనరె?
కలువలు ముకుళించెఁ గలవింక లెలుఁగించె
 దేవదేవుని నిద్ర దెలుప రమ్మ !
జలధిపొం గణఁగెఁ; జుక్కలు మాసె నుప్పవ
 డమ్ము గమ్మనరె కైటభవిరోధిఁ

గీ. జెంగలించెను దరువులు; జీవకోటి
మేలుకనె; రాతి రెల్లను మించుబోండ్లఁ
గూడి యలసెనొ ! వేంకటకుధరపతిని
చేయియంటి లెమ్మనరె ! విచ్చేయు మనరె ! 23

అంతకంతకు ప్రొద్దెక్కినది, తామరలు విరిసినవి. లక్ష్మీవల్లభుని మేలుకొలుపుడు. దీపములు కాంతివిహీనము లైనవి. అంధకారము మాయమైనది. జగద్భర్తను కనులుదెరువు మనుడు. కలువలు ముడుచుకొన్నవి. ఊరబిచ్చికలరచుచున్నవి. దేవదేవుని నిద్రమేల్కొల్పుడు. సముద్రపుపొంగు అణగారినది. నక్షత్రములు మాసిపోయినవి. కైటభవిరోధిని మేలుకొను మనుడు. తరువులు నవనవలాడుచున్నవి. జీవరాశి మేలుకొన్నది. రాతి రంతయు ఇంతుల పొందుచే ఒడలు మరచి నిద్రించు గరుడాద్రినాథుని చేతులతోతట్టి లెమ్మనుడు; కొలువుకూటమునకు రమ్మనుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రాతి రెల్ల సతులతో | 323 | 130 | 4 | 87 |

అవ: ధనుర్మాసమున స్వామికి మేలుకొలుపులు పాడుచున్నాడు.

సీ. పులగాలు పచ్చళ్ళు బోనము వెట్టిరి
వెలయ ధనుర్మాసవేళ యయ్యె;
బలసి సంకీర్తనపరులు పాడెద రిదే
జలకమాడఁ గదయ్య ! జలజనేత్ర !
తోడ గంధాక్షతల్ ధూపదీపా లివే
కోటివిప్రుల వేదఘోష లివియె;
పూజించవలె కమ్మపూలమొత్త మ్మిదే
విచ్చేయఁగద వయ్య ! వీడ్య మిదియె;

గీ. వైష్ణవులు పఠింతురు తిరువాయి మొళిని;
కాచుకొని యుండె శ్రీసతి గదిసి ముందె;
ఏమినిద్ర మహాప్రభూ ! యెంతదాఁక ?
మేలుకని భక్తజనముల నేలుకొనుము. 24

ఓ వేంకటాచలపతీ ! పులగములు, పచ్చళ్ళు, భోజనము సిద్ధమైనది. ధనుర్మాసపూజాసమయ మైనది. సంకీర్తనపరులైన గాయకులు గానము చేయుచున్నారు. జలజాక్షా ! స్నానమాడుము. గంధాక్షతలు, ధూపదీపములు ఇవిగో ! పలువురు బ్రాహ్మణుల వేదపారాయణధ్వని యిదే; ఆలకింపుము. మంచిపూ లివిగో ! నిన్ను అర్చించవలెను. ఇదిగో! కపురపువీడ్యము, దయచేయుము. దివ్యప్రబంధవేత్తలైన శ్రీవైష్ణవులు 'తిరువాయిమొళి' అను దివ్యప్రబంధమును పాయించుచున్నారు. ముందుగనే శ్రీదేవి వచ్చి కాచుకొని యున్నది. ఓ మహాప్రభూ ! ఇంకను ఏమినిద్ర ? ఎంత సేపు? మేలుకని భక్తులను కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమి నిద్దిరించేవు | 284 | 464 | 3 | 325 |

అవ: ఉట్లపండుగను వర్ణించుచున్నాఁడు.

సీ. **గొల్లచేడెల యుట్లు కోలలతోఁ గొట్టి**
**హస్తములం జాచి యారగింపఁ**
**బీతాంబరముమీఁదఁ బెనుకిరీటముమీఁద**
**బలునేతి పాలచాఱ లవి నిండె;**
**అరుదుగ వీథుల నన్ని యుట్టులు గొట్టి**
**దొరతనమ్ములతోడ దొమ్మి సేయ**
**సొరిది సొమ్ములమీఁద సొబగుచెక్కుల మీఁదఁ**
**బెరుఁగులు మీఁగడల్ పేరుకొనియె;**

గీ. **ఊరఁగల వాడవాడల యుట్లుగొట్టి**
**హర్షమున నారగించుచు నడరుచుండ**
**రంగుగా వేంకటేశుపై మంగపైని**
**తేనెలును పంచదారలు తెట్టెగట్టె.** 25

చిన్నికృష్ణుడు గొల్లపడుచుల ఉట్లను కోలలతో కొట్టి చేతులుసాచి భక్షించగా అతని పట్టువస్త్రంపైన, కిరీటంపైన పెద్ద పెద్ద పాలనేతిచారలు ఏర్పడినవి. అబ్బురముగ వీథులలో ఉట్లనన్నిటిని గొట్టి దొరతనంతో దొమ్మి సేయగా అతని ఆభరణాలపైన, అందమైన చెక్కిళ్ళమీద పెరుగుమీగడలు పేరుకొనిపోయినవి. ఊళ్ళో వీథి వీథుల ఉట్లుగొట్టి సంతోషంతో తింటూ చెలరేగుతుండగా అందంగా వేంకటేశ్వరునిపైన, అలమేలుమంగపైన తేనెపంచదారలు తెట్టెలు గట్టుచున్నవి.

అనగా లక్ష్మీయుక్తుడైన శ్రీనివాసునకు పంచామృతాభిషేకం పసందుగా జరుగుననుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పచ్చిదేరుచు | 227 | 150 | 3 | 101 |

అవ శ్రీనివాసుని మజ్జనసమయములో దేవతల యుపచారములను హెచ్చరించుచున్నాడు

సీ. మందరధరునకు మజ్జనవేళ సం
 దడి సేయఁబోవక దారి విడువుఁ;
డాలవట్టము లిడుఁ డఖిలదిక్పతులార !
 కాళంజి పట్టుము శూలపాణి !
చంద్రుఁడా ! సూర్యుఁడా ! చామరల్ దాల్చుఁడు
 భారతీరమణుఁడా! ప్రణుతి సల్పు ;
మణిమాదిసంపత్తి నలరారు శేషుఁడా !
 మణిపాదుక లొసంగు మతిచెలంగ

ఆ. వేదఘోషణమ్ము విడువక చేయుఁడీ
మాన్యులార! ఆదిమౌనులార !
శ్రీకళత్రుఁడైన శేషాచలేశ్వరుం
డాదరమున సిరుల నందుచుండె. 26

దేవతలారా ! శ్రీనివాసునకు మజ్జనసమయ మైనది. అందఱు సద్దుసేయక దారితొలగుడు. ఓ అష్టదిక్పాలకులారా ! మీరాయనకు వీచుటకై వస్త్రముతో గుండ్రముగా చేయుబడిన విసనకఱ్ఱలు పట్టుకొనుడు. శూలమును ధరించే శివుడా ! నీవు తమ్మపడిగమును ధరింపుము. సూర్యచంద్రులారా! మీరు చామరములు చేకొనుడు. వాణీవల్లభుడవైన బ్రహ్మదేవా! నీవాయనను వినుతించుము. అణిమాదిసిద్ధులతోనొప్పిన ఆదిశేషుడా! నీవు మనసారా రత్నఖచితములగు పాదుకలను స్వామియుం దుంచుము. పూజ్యులైన పరమర్షులారా! ఎడతెఱపిలేక మీరు వేదాధ్యయనము గావింపుడు. ఈ విధముగా లక్ష్మీభర్త యగు శేషాచలాధీశ్వరుడు అదరముతో సర్వసంపత్తిని అనుభవించుచున్నాడు.

శ్రీనివాసుడు సర్వదేవతాధికుడని, అసదృశవైభవోపేతు డని ఇందలి సారాంశము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సందడి విడువుము | 2 | 12 | 1 | 8 |

అవ: స్వామివారి తిరుమజ్జనవైభవము నుగ్గడించుచున్నాడు.

సీ. వేదఘోషముల నుర్వీకళత్రునిమీఁదఁ
బన్నీటికాలువల్ పాఱె నదివో!
మునులు హస్తముల గుప్పిన కప్పురపుధూళి
కనులపండువుగాఁగఁ గప్పె నదివో!
నలువంక దరదళన్నాళీకనయనుపై
వలపు తట్టుపునుంగు వడిసె నదివో!
కాంతలు నునుచంద్ర కావిపుట్టముగట్ట
నాసల మొలయందు నమరె నదివో!

గీ. సకలభూషలు వేంకటేశ్వరునిమేన
దళముకొని భవ్యకాంతులఁ దనరె నదివో!
లీల నెద నెలకొని యలమేలుమంగ
చల్లఁగఁ గృపారసమ్మును జల్లె నదివో! 27

అదిగో! భూదేవిభర్తయైన శ్రీవేంకటేశ్వరునిమీద వేదఘోషలతో పన్నీటి కాలువలు ప్రవహించుచున్నవి. వేదపారాయణం సాగుచుండగా స్వామివారికి తిరుమజ్జనకైంకర్యం జరుగుచున్న దన్నమాట! పరమమునీంద్రులు గుప్పిళ్ళతో పచ్చకర్పూరపుపొడిని ఆ వేళ కనువిందుగా గుప్పించుచున్నారు. అదిగో! ఇంచుక వికసించిన తామరలవంటి కన్నులుగల శ్రియఃపతిపై నాల్గువైపుల పూయబడిన కమ్మనిపునుగును తిలకింపుడు. స్త్రీలు ఎంతో ఆశతో సన్నని కావివన్నెపుట్టమును స్వామికి కట్టబెట్టగా అది నడుమున చక్కగా అమరియున్నది, కనుగొనుఁడు. అన్నివిధములగు అలంకారాలు ఆ స్వామిమేన దట్టముగ వెలసి దివ్యకాంతులతో దీపించుచున్నవి, చూడుడు! ఇట్టిప్రభుని యురమునెక్కి అలమేల్మంగతాయారు చల్లగా కృపారసమును భక్తులపై చిలుకుచున్నది, దర్శింపుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మదనజనకునికి మజనవేళ | 229 | 163 | 3 | 109 |

అవ: వేంకటనాయకుని తిరుమజ్జన వైభవమును వర్ణించుచున్నాడు.

సీ. భువిగల కప్రమ్ము పొడిచేసి నిలువెల్ల
నేమాన నిందఱు నీకుఁ జాత
హేమంతకాల మిట్లిపుడు నీ తిరుమేన
నాముకొని జనించినట్టు లుండె;
తట్టుపునుంగు చిత్తడిగ సర్వాంగాలఁ
బూని యిందఱు నీకుఁ బూయఁగాను
వానకాలము నీలివన్నెతోఁ దిరుమేన
సోనయై కురిసిన సొబగు దోఁచె

గీ. వెస నురమ్మున మంగతో వింతనగలు
పొసఁగఁజేసి ని న్నందఱు పొగడఁగాను
చక్క నీ తిరుమేన వసంతకాల
మెసఁగి నటు కనువిందయ్యె వృషగిరీశ ! 28

ఓ వృషగిరీశా! లోకములోనుండు పచ్చకర్పూరము నంతయు దెచ్చి మెదిపి నీశరీర మంతటికి అద్దగా హేమంతఋతువు నీమంగళకరమగు మేనిపై ఈ విధముగ అలముకొన్నదేమో అన్నట్లు చూపట్టుచున్నది. పునుగును పదనుచేసి నీసర్వాంగము లకు పూయగా అపూత వర్షాకాల సంబంధమగు నల్లనికాంతితో వానజల్లు నీతిరుమేన కురిసినట్లు అందగించు చున్నది. పద్మావతీసహితమైన నీయొక్కవక్షమున వింతవింత నగలు తగురీతి నలంకరించి స్తోత్రము చేయగా నీ దేహమున వసంతఋతువు విజృంభించినట్లు కనులకు విందుగూర్చుచున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కంటి మిదివో నేము | 1324 | 142 | 23 | 95 |

అవ: తనివోక మరల శ్రీనివాసుని తిరుమజ్జనవైభవమును కొనియాడుచున్నాడు.

సీ. కమలనాభునికిని కప్పురపుంగాపు
సముచితమ్ముగ మేనఁ జాతి నప్పు
డమృతమ్ము ద్రచ్చెడు నా వేళ తుంపరల్
దట్టమై మెయినిండినట్టు లుండె ;
దైవతమణికి మై తట్టుపునుఁగు రాసి
చేయారఁగా సేవ చేయునపుడు
యమునాస్రవంతిలో తమి నీఁదులాడఁగాఁ
గాళిమ గప్పిన లీల నుండె;

గీ. మంగతో నట్టె వేంకటమందిరునకు
నెలమి సొమ్ము సమర్పించి యెంచినపుడు
కూడఁగా గొల్లెతలచనుగుబ్బల పయి
నడరు పసుపెల్లఁ గ్రమ్ముకొన్నట్టు లుండె. 29

కమలము నాభియందుగల స్వామికి మెదిపిన పచ్చకర్పూరము మేన తగురీతి నద్దినపుడు పాలసంద్రమును చిలుకునమయమున శరీరముపై రాలిన అమృతపు తుంపరలో అన్నటులుండెను. దేవతాశిరోమణియగు శౌరికి తట్టుపునుగును తనువున నలది చేతులార సేవచేయగా యమునానదిలో ఈదులాడే నీరజనేత్రునకు అంటిన నీలిమయా అన్నట్లు తోచెను. మంగాంబిక నురమునందు గల్గిన శేషాద్రినాథునకు బంగరుసొమ్ములు సమర్పించి దర్శించినపుడు యాదవవనితల స్తనములమీది పసువు అతని వక్షము నంటుకొనినదా యనిపించెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇన్నిటి మూలము | 1557 | 281 | 25 | 188 |

అవ తగినవాడు కాడని త్రోసిపుచ్చక, రాజు వలచినదే రంభయను నానుడి పాటింపు మనుచున్నాడు

సీ. అవ్యాజబంధుండ వఁట జీవులకు నెల్ల
మొగముఁ జూపఁగదయ్య మ్రొక్కు లిడెద ;
నికరమ్మనౌ చుట్టఱికము దాఁచఁగ నేల ?
లలితమౌ మమత దెల్పవలెఁ గాని
ప్రాణంబ వంట చరాచరంబుల కభ
యం బిమ్ము నిను స్తవనం బొనర్తు ;
మనసైన కూటముల్ మానుప మఱియేల?
బలుప్రియమ్ములు జరుపవలెఁ గాని

గీ. ఎపుడు నీదానకోటికి నేలిక వఁట
విమలమతి నిన్నుఁ గొలిచెద వేళ దెలుపు;
మింక నేల పరాకు? శ్రీ వేంకటేశ !
భక్త సులభతఁ జెల్లింప వలయుఁ గాని. 30

ఓ యేడుకొండలవాడా! ప్రాణులకు నీవు నిష్కపటివైన చుట్టమవని అంటారు నీకు నమస్కారములు చేసెదను. మొగమును జూపుము నిజమైన మన చుట్టరికమును దాచుటెందులకు? వీడు నా వాడనే మమకారమును నీవు చూపవలెనుగదా! చరాచరమైన సకలప్రాణి జాతమునకు నీవు ప్రాణమైనవాడ వట! నిన్ను పొగడుచున్నాను; అభయ మొసగుము భక్తులపై నీకు మనసుంటే కలయికలను వీడనేల? మరి మరి ప్రేమకలాపములు సాగించవలదా? ఎల్లపుడు దాసులకు నీవు ప్రభుడవంటారు పరిశుద్ధమైన మనస్సుతో నిన్ను ఆరాధింతును. సమయము దెలుపుము. ఓ వేంకటాచలపతీ ! భక్తసులభుడ వనుమాట నిలబెట్టుకొనుము. పరాకు మానుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సరిగాఁడు వీఁ డనవలదు | 162 | 298 | 2 | 199 |

అప: గురూపదేశమున వెదకి వెదకి కడ కీయర్థముఁ గంటి ననుచున్నాడు.

సీ. అన్యధర్మమ్ము ల య్యవి మాను మంటివి;
శరణాగతివి నీకు నల్పు మంటి;
వణఁచెద దురితమ్ము లంటివి; మోక్షంబు
నిచ్చెద నంటివి యెందు నీవె
గతియను మంటివి; గట్టిగా నొకసారి
యనఁ జాలు నంటివి; యభయ మిత్తు
నందఱ కంటివి; యదె నాదు వ్రత మంటి;
వాసమానినవాఁడె యధికుఁ డంటి

గీ. వతని వెనువెంటఁ దిరిగెద నంటి; వతని
పాదరేణువు నంటివి ఫణిగిరీశ !
నీదువచన మ్మమోఘము నీప్రతిజ్ఞ
సత్య మిందుల కేనిన్ను సతము గొలుతు. 31

శేషపర్వతాధీశ్వరా ! ఇతరధర్మములను వదలిపెట్టు మనియు, నన్ను శరణు పొందు మనియు, సకలపాపములను పోగొట్టుదు ననియు, మోక్ష మిత్తు ననియు, అన్నిట నీ వేగతియని పల్కు మనియు, దృఢంగా ఒక్కపరి నన్ను తలచిన చాలు ననియు, అందరికి అభయ మిత్తు ననియు, అదేనావ్రత మనియు, ఆశలేనివాడు అధికు డనియు, ఆతనివెంటనుందు ననియు, నేను ఆతని పాదరేణువు ననియు పలికితివి. నీమాట రిత్తవోనిది; నీ ప్రతిజ్ఞ సత్యము. కనుకనే ని న్నెప్పుడు కొలుచుచున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి గోవిందా | 170 | 339 | 2 | 22 |

అవ: జీవబ్రహ్మములకు గల తారతమ్యము పేర్కొని భగవంతుని పరమదయా పరత్వమును ప్రశంసించుచున్నాడు.

సీ. **అనుపమ కల్యాణ గుణరత్న నిధివి నీ**
**వమితదుర్గుణరాశి నగుదు నేను;**
**అటు నిన్నుఁ దలపోయ నమితస్వతంత్రుఁడ**
**వస్వతంత్రుండ నే ననుట నిజము;**
**నీ వన్నో సర్వదేవరక్షకుఁడవు**
**జీవుఁడ నింద్రియసేవకుండ;**
**అవల బ్రహ్మాండాల కన్నింటఁ బొడవ వీ;**
**వణువుకంటెను నణు వగుదు నేను;**

గీ. **నావలన నేమి గంటివి ? నీవు వదల**
**వంతరాత్ముండ వగుచు న న్నహరహమ్ము;**
**శ్రీపతివి నీవు పరమదరిద్రుఁడేను**
**నీకు నా కెట్టు జతగూడె? నీవు నన్ను**
**నెట్టు మన్నించితి మఱెట్టు లేలినాఁడ;**
**వీ కరుణకే నమించితి నిందిరేశ !** 32

సాటిలేని కల్యాణగుణములనే రత్నములకు నీవు నిధియైనవాడవు. నే నన్నో సకలదుర్గుణములకు రాశియైనవాడను. ఆలోచింపగా నీవు సర్వస్వతంత్రుడవు. ఇక నేనో అస్వతంత్రుడను. ఇది నిజము. నీవో ఎల్లదేవతల గాపాడువాడవు. నే నన్నో జీవుడను. ఇంద్రియాలకు సేవకుడను. నీవు బ్రహ్మాండములకంటెను మహత్తరుడవు. నేను అణువుకన్నమ అతిసూక్ష్మమైనవాడను. పైకారణములచే నావల్ల నీకేమియుపయోగము? లే దనుట. సర్వదా నన్ను వదలక అంతరాత్మగ నున్నావు. నీవు లక్ష్మీపతివి. నేనో దరిద్రుడను. నీకును నాకును జతగూడుట దుస్సాధము. అయినను న న్నెంతగనో మన్నించితివి; న న్నేలితివి. ఈనీ దయకే రమాప్రియా ! నీకు నమస్కరించుచున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీకు నాకు నెట్టుగూడె | 230 | 178 | 3 | 116 |

అవ: భక్తునికి భగవంతునకుగల అంతరమును నుడువుచు, శ్రీనివాసుని అనంత కల్యాణగుణములు ఇంద్రియములతో గ్రహింప నలవిగా వనుచున్నాడు.

సీ. **అల్పశక్తుండ నే; నధికశక్తుఁడ వీవు;**
**పోల్చ నెంతవనికిఁ బూనుకొంటి?**
**నీ పదధ్యానాన నెలకొనె మతి; దేన**
**స్మరియింపఁ గలను నీ సగుణమూర్తి?**
**చూపు నీశృంగారరూప మందునఁ జిక్కె;**
**నంగకాంతులు దేన నరయఁ గలను?**
**నాల్క నీ కడలేని నామముల్ నుడువు; నీ**
**సుగుణమ్ము లేమిటఁ బొగడఁ గలను?**
**కర్ణద్వయమ్ము నీ కథలఁ దవిసె; దేన**
**నాలింపఁ గల నీ యనంతమహిమ ?**

గీ. **నిను శరణుఁ జొచ్చి ధన్యుండ నే నయితిని**
**కలితసేవల నిఁక నేమి గట్టుకొందు?**
**ఇందిరానాథ ! శ్రీ వేంకటేశ ! నీకు**
**జన్మఫలముగ నొకమ్రొక్కు చాల దొక్కొ?** 33

నేను అల్పశక్తిమంతుడను. నీ వధికశక్తి సంపన్నుడవు. పోల్చుకొనగా నే న సాధ్యమైన పనికి బూనుకొన్నాను. నామనస్సు నీ పదధ్యానమందే స్థిరపడినది. మతీ యే యితరేంద్రియముతో అనంతగుణాలతో గూడిన నీ మూర్తిని స్మరింపగలను? స్మరణసాధనమగు మనస్సు భగవంతుని పాదముల లగ్నమైనందున ఆ దివ్యసుందరమూర్తిని సాకల్యముగా సంస్మరింపజాల దనుట. చూపు నీ సింగారపు రూపున జిక్కగా విడివిడిగా నీ అవయవముల కాంతులను మరి దేనితో చూడగలను? అనగా దర్శనసాధనేంద్రియము చక్షుస్సు ఒకచో చిక్కిపోగా తక్కిన అవయవముల శోభ చూడ శక్యముగా దనుట. అనంతములగు నీ తిరునామముల నుచ్చరించే ఈ నాలుక నీ సుగుణముల నెటువలె పలుక గలదు? చెవులజంట నీకథలతో నిండిపోయినది. కనుక నీ యనంతగుణములను ఆలకించుటకు కర్ణేంద్రియములలో తావులేదు. నిన్ను శరణుపొందుటచే నేను ధన్యుడ నైతిని. ఇక సేవలు చేయడంచేత నాకు ఒరిగే దేమియు లేదు. ఇందిరామందిరాయిత హృదయారవిందా! గోవిందా! నా జన్మ ఫలంగా నీకు ఒకమ్రొక్కు మ్రొక్కు తున్నాను. ఇది నీకు చాలదా యేమి, స్వామీ!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అల్పశక్తి వాఁడ | 178 | 390 | 2 | 263 |

అవ: కారణగుణములు కార్యమున సంక్రమించునని ఉదాహరణములతో
సమర్థించుచున్నాడు.

సీ. ఘనపుణ్యపాపాలఁ గలిగిన జన్మమ్ము
బలుపుణ్యపాపాలు సలుప కున్నె?
ముష్టివృక్షమ్మునఁ బొడమిన శాఖలు
కన ముష్టికాయలు గాయకున్నె?
పంచేంద్రియమ్ములఁ బరఁగిన యీమేను
పంచేంద్రియభ్రమఁ బడకయున్నె?
పొరి పురీషమ్ములోఁ బుట్టిన కీటమ్ము
లా పురీషము చవు లానకున్నె ?

గీ. విత్తొకటి చెట్టొకటి యౌనె? వేంకటేశ !
నీవు చేసినమాయలు నీవలననె
మాయుఁగాక నే కర్తనె ? మాన్పుటకును
నిష్ఠుర మ్మిట్లు మాయందు నిలిచెఁ గాక ! 34

ముష్టిచెట్టున పుట్టిన కొమ్మలు ముష్టికాయలను గాయకుండునా? అటులే జన్మము పుణ్యపాపరూపకర్మాచరణమువల్ల కల్గినది గాన జన్మి పలుపుణ్యపాపములు సలుపక మానదు. మలమున పుట్టు పురుగులు ఆ మలమును రుచిచూడకుండని విధముగానే పంచేంద్రియములతో పెంపొందిన ఈ దేహము ఇంద్రియవిషయములకు లోనుగా కుండదు. విత్తొకటి నాటిన చెట్టొకటి మొలవదుగదా ! ఓ వేంకటేశ్వరా ! నీవు చేసిన మాయలను నీవే మాన్పవలెగాని ఆ పనికి నేను కర్తనా ? కా ననుట. మాయకు లోనై మనుజులు చరింతు రని ఒకనింద మాపై నిలిచినది.

భక్తునికి గల్గిన మాయను భగవంతుడే పరిహరింపవలెనని పిండీకృతార్థము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అదియేల తామాను | 178 | 389 | 2 | 262 |

ఉప: ఇహసుఖములు కోరుట లేదు. నీగుడిలో ప్రవేశించితిని. నన్నుజూచి కావకున్న నీ వెందుల కని స్వామితో నిష్ఠురము లాడుచున్నాడు.

సీ. పొలఁతులు భువిలేరొ భోగింప నేలేనొ
నా కింద్రియాల కాణాచి లేదొ?
లేదొ సంసారమ్ము లేవొ కోరికలు ? ని
న్నెలమి భజించుట యిందు కయ్య?
ధరలోఁ బసిఁడి లేదొ? తగులు నాసలు లేవొ?
దళకొను నజ్ఞానతమము లేదొ?
అరయఁ జవులు లేవొ? యాన నాలుక లేదొ?
యిచ్చలో నినుఁ గొల్చు టిందుకయ్య?

గీ. నన్ను సర్వాపరాధి యనంగ నేల?
యిట్టి రాళ్ళలో మలిగండ్ల నేర నేల?
గడపఁ ద్రొక్కిన ననుఁ జూచి కావకున్న
నేడుకొండలదొర ! నీ వి కేటి కయ్య ! 35

సప్తగిరిధామా ! ఈ లోకములో స్త్రీలు లేరా ? ఉపభోగింప నేను చాలనా? ఇంద్రియముల బహుకాలానుభవము లేదా ? అన్నియూ ఉన్నవే. వాటిని కోరుట లేదనుట. సంసారము లేదా? కోరికలు లేవా? ఉన్నవే. నిన్ను కొలుచుట ఇందు కొఱకా ? కాదు; మోక్షాపేక్షతో ననుట. ఇచట బంగారము లేదా? దానిపై నాకు ఆశలు లేవా ? తుచ్ఛములగు వానిపై నిచ్చలేదా? వానిపై మరులు గొలుపు అజ్ఞానమనే చీకటి లేదా? ఇవన్నియు ఉన్నవన్న మాట. ఈ యల్పములకై కాదుగదా నిన్ను మది దలంచుట? నన్ను సకలాపరాధములు చేసినవానిగా నెన్ననేల? నాలో నెరను లేరుట రాళ్ళలో మలిగండ్ల నేరిన ట్లుండును. అనగా నాలో నన్నియు నపరాధములే. నీ సన్నిధిలో అడుగిడితిని. నన్ను చూచి కావుము. కానిచో నిక నీ వెందులకు?

తప్పక నన్ను కాపాడు మని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అట్టయితే నా యంతర్యామి | 189 | 454 | 2 | 306 |

అవ: కోనేటిరాయడు సహజదయార్ద్రదృష్టితో ప్రాణికోటిని రక్షించువాడు. అట్లైనను ఆశలకు లోనై జీవుడు దేవుని సేవించుచున్నా డను చున్నాడు.

సీ. నిర్వ్యాజకృపతోడ నీవు రక్షింతువు
నిచ్చ నాకొఱకెపో నీదుసేవ;
ముం దిత్తువని సిరుల్ మోక్ష మిచ్చెద వని
బందుకట్టుదు దుఃఖపటల మంచు
నేచిన భయభక్తు లిట్టియాసలనెపో
యెందు నావల్ల నీ కేమి లేదు
జననముల్ మరణముల్ సారెసా రెకుఁజూచి
వెనుకటి నీకథల్ విని విని విని
ఈ యాసతోడనే యిటు నిన్నుఁ బొగడుట
యాసయే హితగురు వాయె నాకు ;

ఆ. లోకు లెల్లఁ గొలువ లోన నీ వుండఁగా
గురుఁడు బోధసేయఁ గొండలప్ప !
నీవు గనికరింప నిన్ను భజింతు నీ
యానతోనె నీదు దాసుఁ డగుచు. 36

ఓ వేంకటేశ్వరా ! నీవు సహజమగు దయతో అందరిని రక్షింతువు. ఇహలోకసంపద లిచ్చి అంతమున మోక్ష మొసంగుదువని, భక్తుల కష్టములను బంధించి వేయుదువని-ఇటువంటి కోరికలతో అధికభయ భక్తులతో కూడినవాడ నై నిన్ను సేవింతును. అంతేకాని నావల్ల నీ కెట్టి ప్రయోజనమును లేదు. చావుపుట్టుకల పరంపరలను పలుమారు పరికించి మహిమాన్వితము లైన నీచిత్రచరిత్రలను మరల మరల ఆకర్ణించి రక్షింతువను ఆశతోనే నిన్ను స్తోత్రము చేయుచున్నాను. ఆశయే హితమును సల్పు గురువైనది. అనగా ఆశాపూర్తికి భగవత్ప్రార్థనము భక్తుడు సల్పు చున్నాడు కాన ఆశ గురువువంటి దైనదనుట. ఆశ చెడ్డదైనను పరమ గురువువలె పరమోపకారకమైన దని చెప్పుట సారస్యము. భక్తులందరు నిన్ను సేవింపగా నీవు హృదయములో నున్నందుచేతను, గురుని చరమోపాయ బోధ చేతను, ఆశాపూర్తికై నీ దానుడనై నీదయగోరి నిన్ను సేవింతును.

భక్తుడు ఉభయలోకసుఖములను కోరుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిరుహేతుకాన నన్ను | 192 | 468 | ౭ | 315 |

అవ: కామాదులకు జిక్కి దిక్కుదెలియకున్న భక్తుని భగవంతుని కరుణయే పవిత్రుని గావించి మోక్ష మిచ్చునని నిర్వచించు చున్నాడు.

సీ. కామమ్ము క్రోధమ్ము కలుషాత్ము నను( జుట్టి
తగ నీదు సేవకు దవ్వొనర్చె(;
గంట కేంద్రియములు కడుహితశత్రులై
మోక్షసౌధము తల్పు మూసివైచె(;
ద్రిప్పి నాయాసలు దివ్యవైష్ణవధర్మ
కుండమ్మునన్ దో(గకుండ(జేసె;
సంసార మకట! యాచార్యదాస్యమునకు
నెడమీక నను( బుణ్యహీను( జేసె

గీ. పాతకపుమేను మనసును బండనీక
గురుతరాజ్ఞానమునకు దా(వురము( జేసె;
ఎవరు దిక్కనియుండ న న్నింతలోనె
నిర్మలుని( జేసె గోవింద ! నీదుకరుణ. 37

పాపాత్ముడగు నన్ను కామక్రోధాదులు చుట్టుముట్టి నీ సేవకు దూరము చేసినవి. క్షుద్రశత్రువులవంటి యింద్రియములు హితశత్రువులై (గోముఖవ్యాఘ్రములై) మోక్షమనే మేడను చేరనీక తలుపులు బిగించినవి. పాడమిన యాసలు, మరల్చి దివ్యవైష్ణవధర్మము లనెడి పుణ్యతీర్థములలో మునుగకుండ జేసినవి. అయ్యో! సంసారము ఆచార్యునిపరిచర్యకు ఎడమీయక నన్ను పాపాత్ముని చేసినది. పాపములపాతరయైన ఈ శరీరము మనస్సును పరిపక్వము కానీయక నిబిడమైన అజ్ఞానమునకు నివాసస్థానము చేసినది. నేను దిక్కుమాలియుండగా ఓ గోవిందా ! నీదయ నన్ను పవిత్రునిగా చేసినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వరు దిక్కింక నాకు | 214 | ౬0 | 3 | 54 |

అవ: శ్రీనివాసునిదాసులకు సంసారం సుఖమునిచ్చునట్టిదే యనుచున్నాడు.

సీ. సడిఁ బెట్టెఁ గటకటా ! సంసార మియ్యది
జడధిలోపలియీత సాటిఁ జెప్ప
జమునోర్రిఁబ్రదుకు సంసారమ్ము పరికింపఁ
జమురుదీసిన దివ్వె సామ్య మొందు;
సమయించు పెనుదెవుల్ సంసార మెంచంగ
సమరంబులో నున్కి శంక లేదు;
సందిగట్టినత్రాడు సంసార మూహింప
సందికంతల త్రోవ చక్కఁ గనిన;

గీ. చందురునిజీవనమ్ము క్రొంజలువలోని
వేఁడి జలపూఁతబంగారు చూడఁ జూడ
ఫణిగిరీశ్వర ! నీ దాసవర్గమునకుఁ
జలువలకుఁ జల్వఁ దలఁప సంసార మెపుడు. 38

అయ్యయ్యో ! ఈ సంసారం చాలా సంకటం తెచ్చిపెట్టింది. చెప్పవలె నంటే ఇది సముద్రంలో ఈత వంటిది. ఆలోచింపగా ఇది యముడినోటిలో జీవించడం వంటిది. చూడగా ఇది చమురునశించిన దీపం వంటిది. ఆరి పోవుటకు సిద్ధంగా ఉన్నదని భావం. ఇది ప్రాణంతీసే ఘోరమైన వ్యాధివంటిది. తలపోయగా ఇది యుద్ధంలో ఉనికి వంటిది. ఇందులో సందేహం లేదు. ఈ సంసారం రెక్కల క్రిందగట్టిన త్రాడువంటిది. భావించగా ఇరుకుసందులలోని త్రోవ వంటిది. ఇంకా ఈ సంసారం చంద్రునిజీవనం వంటిది. అనగా వృద్ధిక్షయాలతో కూడినదని అభిప్రాయం. ఇది చల్లని పచ్చకర్పూరంలో ఉండే ఉష్ణగుణంవంటిది. అంతేకాదు; పైపూత బంగారం వంటిది. అనగా మీదికి మెఱుగుగా కన్పించినా ఏమాత్రం ప్రయోజనంలేని దన్నమాట. సంసారం ఇట్టిదైనప్పటికినీ నీదాసులకు మాత్రం ఈ సంసారం చలువవస్తువులలోనికెల్ల చలువ వస్తువై సౌఖ్యకరమై ఉన్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సడిఁబెట్టె గటకటా | 32 | 199 | 1 | 132 |

అవ: అన్నిచోద్యములకు కర్త శ్రీవేంకటేశ్వరుడే యనుచున్నాడు.

సీ. చూడవే గోవింద ! చోద్యము లిన్నియు
 నిన్నిటఁ గర్త వీవే గదయ్య !
చీరినఁ దునుఁగక చేసిన దురితమ్ము
 నారకైవడిఁ గడు నారటిల్లు;
కారుకొని తలంపు కలఁకగుణంబుల
 వారక పెనునదివలెనె పాఱు;
ఎఱ్ఱగా క్రూరత్వ మెదయనుకొలిమిలోఁ
 గ్రాఁగుచుండు నినుపకఱ్ఱమాడ్కి;
ఒఱ్ఱియై ప్రకృతి తా నొరయుచు వేఁటలో
 నెలయించుకొనిపోవు నిఱ్ఱిభంగి;

గీ. వెంటవెంటనె నీమూర్తి వీడఁబోక
తోడునీడయై నిచ్చలు తొరలుచుండు;
ఈడనే నీదుమహిమ మంగేశ్వరుండ !
వాడని వనమ్ములం బలె పల్లవించు. 39

ఓ గోవిందా ! ఈ వింత లన్నియు చూడుము. ఈ అన్నింటికి కర్తవు నీవేగదా ! చేసిన పాపములు ఎంతగా చీల్చినను (పోగొట్టుకో దలచినను) అవి నారమాదిరి సాగుతూనే ఉన్నవి. కలుషితములైన గుణాలచేత తలపు (కోరిక) అతిశయిల్లి పెద్దనదివలె అడ్డులేక ప్రవహించుచున్నది. హృదయమనే కొలిమిలో ఇనుపకఱ్ఱవిధంగా క్రూరత్వము ఎఱ్ఱగా (తీక్షణంగా) క్రాగుతున్నది. వేటలో ఏమార్చి తప్పించుకొని పరుగిడే లేడిచందంగా కపటపుప్రకృతి (మాయ) తాకి నన్ను తనవెంట త్రిప్పుకొను చున్నది. తోడ్తోడనే పచ్చనివనములోని ఇగుళ్ళవలె నీ మూర్తి వదలక తోడునీడయై గోచరించును. ఓ మంగాపతీ ! ఇక్కడే అనగా పైవానిని భక్తుడు పోకార్ప లేకుండుటలోనే నీ మహిమ తెలియుచున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చూడవే గోవింద | 239 | 224 | 3 | 150 |

అవ: శ్రీ వేంకటేశ్వరుని చరణమహిమను ఉగ్గడించుచున్నాడు.

సీ. చింతాపయోధులఁ జిక్కిన దాఁటింప
నీ పాద మనియెడి తేప చిక్కెఁ;
గాంతల మోహంపుఁగట్టులు ద్రెంపంగఁ
బదనైన నీ పాదపరశు వొదవె;
అతిపాప మను పంక మంటినఁ గడుగంగ
నీ పాద మను గంగనీరు గలిగె;
రవరవ కర్మాగ్ని రాఁజిన నార్పంగ
నీ పాద మను వాన నిలిచి కురిసె;

గీ. గరిమ నజ్ఞాన మనెడి చీఁకటులు వాయఁ
బరఁగె నీ పాద మనియెడి భానుదీప్తి ;
నన్నుఁ బాలింప వేంకటనగనివాస !
శరణ మాయెను నీ పాదసరసిజమ్ము. 40

ఓ వేంకటేశ్వరా ! చీకు చింతలనే సముద్రములో చిక్కుకొన్నప్పుడు దాటుటకు నీ పాదమనే తెప్ప చిక్కినది. భగవంతుని పాదములు చీకుచింతలను పాగొట్టు ననుట. స్త్రీల వ్యామోహమనే కట్టులు త్రెంచుటకు పదనుగల నీపాదములనెడి గండ్రగొడ్డలి దొరకినది. భగవంతునిపాదములు గొల్చు భక్తునికి స్త్రీ వ్యామోహము నశించు ననుట. మిక్కుటమగు పాపమనే బురద హత్తుకొనగా దానిని కడిగికొనుటకు నీ పాద మనే గంగోదకము లభ్య మైనది. శ్రీశునిపాదసేవనము పాపహర మనుట. కర్మలనే అగ్ని చిటచిటలాడుచు రగులుకొనుచుండగా నీపాదసేవ అనే వాన నిలిచి కురిసి దాని నార్పుచున్నది. అజ్ఞానమనే అంధకార మావరింపగా నీ పాదమనెడి సూర్యకాంతి సంప్రాప్త మైనది. ఓ వేంకటాచలపతీ ! నన్ను కాపాడుటకు నీ పాదమనే పద్మము దిక్కైనది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నారాయణ నిను నమ్మిన | 368 | 402 | 4 | 270 |

అవ: ఏడుకొండలవాని స్మరణ మనన కైంకర్యాదుల ప్రభావమును ప్రశంసించు చున్నాడు.

**సీ. తలఁపులోపల నీవు దగ్గఱినం జాలుఁ**
**గైవల్యమే సుమ్మి కాఁపురమ్ము;**
**నీ పేరు నాల్కపై నిలిచినచోఁ జాలుఁ**
**దొలిమిన్కులే సుమ్మి పలుకు లెల్లఁ;**
**జేతికి నీ పూజ చిక్కినచోఁ జాలు**
**బొమ్మరిల్లే సుమీ బమ్మజగము;**
**ఘనమైన నీ భక్తి గలిగినచోఁ జాలు**
**నగ్రజాతియె సుమీ యంత్యజాతి ;**

**గీ. ఒడల నీ ముద్ర లవి కనఁబడినఁ జాలు**
**నతుల పరతత్త్వ సుఖమె సూ రతిసుఖమ్ము ;**
**అన్నిటను నీవు గూడిన నంతె చాలు**
**పాపమే పుణ్యమగుఁ జుమ్ము ఫణిగిరీశ !** 41

శేషాద్రినాథా ! మనసులో నీవు మెదలినచో వానికాపురమే కైవల్యమగును. ఎవనినాలుక నీ నామము నుచ్చరించునో అట్టివాని పలుకులన్నియు వేద వచనములే యగును. చేతులార నిన్ను పూజించినచో బ్రహ్మచే సృజింపఁబడిన ఈ జగత్తంతయు వానికి బొమ్మరిల్లుగా తోచును. అనగా ఈ లోకము అస్థిరమను వైరాగ్యభావము కలుగు ననుట. హీనకులములో పుట్టినవా డైనను దృఢంగా నీ భక్తి కల్గియున్నచో వాడు ఉన్నతకులంలోనివాడే యగును. శరీరముపై నీ శంఖ చక్రాదిముద్రలు ప్రకాశించుచుండగా క్షణికమైన రతిసుఖమే నిరుపమానపరతత్త్వ సుఖము నిచ్చును. మానవుని ప్రవర్తనలో ప్రతియంశ మందును నీ సంబంధమున్నచో పాపములు గూడ పుణ్యములుగా మారునుసుమా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గోవింద నీ వన్నిటిలో | 322 | 128 | 4 | 86 |

అవ: అనుభుక్తములైన ఐహికసుఖాలపై ఆశ తీరియు తీరకున్న తన్ను దయతో నుద్ధరింపు మని శ్రీనివాసుని ప్రార్థించుచున్నాడు.

సీ. మున్ను భోగించిన భోగమ్ములు దలంచి
యాలుబిడ్డల మాటి కటు దలంచి
కంచపుఁగూళ్ళను కన్న వెల్లఁ దలంచి
యొనర నిన్ దలఁప కి ట్లుంటి మయ్య !
కనులఁ జూచిన వెల్ల కడు నాసలఁ దవిలి
విన్న వినుకు లెల్ల వేడ్కఁ దవిలి
యనుభవింపంగ సౌఖ్యముల వెంటఁ దవిలి
యొగి నిన్నుఁ దగుల కి ట్లుంటి మయ్య !

గీ. మందిరారామభూముల మరగి నిన్ను
మరగి మరగక యిట్లున్న మాకు నింక
నేది గతి? మమ్ముఁ గరుణ నీడేర్చ వయ్య !
ఈశ్వరేశ్వర ! నీసాటి యెవ్వరయ్య ! 42

దేవాధిదేవా ! అనుభవించిన సుఖాలనే మరల స్మరించుచు, భార్యా పుత్రాదులను మాటికి తలపోసికొనుచు, ఎంగిలిఅన్నమును చూచిన దాని నెల్లను ఆశించుచు, ఒప్పుగా నిన్ను స్మరింపక ఈ గతి నందితిమి. అగపడినవాటి నంతయు కోరుచు, విన్నమాటల కెల్ల అపేక్షపడుచు, సుఖాల ననుభవింప మరగి నిన్ను చేరక ఈ స్థితిలో నున్నాము. గృహారామక్షేత్రముల మీద మమకారంతో నిన్ను తెలిసియు తెలియలేక ఈ రీతిగా నున్న మాకు గతి యేమిటి? సాటిలేని మేటిదైవమా ! ఇట్టి దుర్దశలో నున్న మమ్మ దయదలచి గట్టెక్కింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏది మాకు గతియింక | 326 | 153 | 4 | 103 |

అవ: శరీరము అవలక్షణముల కన్నిటికి ఆకరమని, అట్టానిని నీదాస్యమునకు ఉన్ముఖం చేయుమనీ శేషాచలవాసుని ప్రార్థిస్తున్నాడు

సీ. మూల మీకాయంబు మోహబాంధవముల;
కూహ కపోహకు నునికి మేను;
దప్పి కాఁకటికిని తానకం బీ గాత్ర;
మిహిహి! వైరాగ్య మిం దెట్లు గలుగు?
పంచేంద్రియములకుఁ బాదు శరీర; మ
త్యాశలకున్ నెల వవఘనంబు;
అఖిలదుర్గుణముల కాకరం బీ దేహ;
మింక వివేక మిం దెట్లు గలుగు?

గీ. ఇహసుఖంబులకును హేతు వెంచఁ దనువు;
బహుళపుణ్యాపాపములకు ఫలము వపువు;
అనిశముం దీని నీదు దాస్యమునఁ జొనిపి
నన్ను నీడేర్తుగాక పన్నగగిరీంద్ర ! 43

జడత్వమునకు బంధుత్వరూపబంధకమునకు, తర్క వితర్కములకు ఆకలి దప్పులకు ఈ శరీరము స్థానము. ఛీఛీ ! ఇట్టి శరీరములో వైరాగ్య మెట్లుదయించును? చక్షురాదిపంచేంద్రియములకు, అధికాశలకు, అన్ని చెడుగుణాలకు ఈ తనువు నిలయము. అబ్బే! ఈ మేనిలో తెలివి యెట్లుపుట్టును? ఇహసౌఖ్యానుభవమునకు సాధనము ఈ దేహము. పురాకృతపుణ్య పాపఫలముగా ఈ కాయము వచ్చినది. ఈ హేయమైన శరీరమును నిత్యమూ నీ దాస్యములో ప్రవేశపెట్టి ఓ ఫణిగిరినాథా ! ఎట్ట కేలకు నన్ను గట్టెక్కింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| విత్తొకటి వెట్టఁగా | 307 | 42 | 4 | 28 |

అవ: సర్వమునకు ప్రభువగు వేంకటాద్రినాథునకు శారీరకములైన తన ఇంద్రియాదుల నివేదించి త న్నేలుకొమ్మని మ్రొక్కుచున్నాడు.

సీ. అన్నిటి కొడయండ వైన శ్రీపతివి నీ
    విదిగో ! మా బలగమ్ము నెంచుకొమ్ము ;
జ్ఞానేంద్రియము లైదు ; కర్మేంద్రియము లైదు ;
    కామాదివైరివర్గమ్ము లాఱు ;
గుణము లెంచఁగ మూఁడు; తనువికారము లాఱు
    పంచభూతములు- మా పౌఁజు చూడు !
ఉడివోని విషయమ్ము లొక యైదు; బుద్ధ్యహం
    కార మనమ్ములు-కనుము పౌఁజు !

గీ. క్షుత్పిపాసలు, శీతోష్ణ సుఖ విషాద
ములును, మానావమానముల్ మొనసియున్న
మూక గమికాఁడ నీ కిదే మ్రొక్కులిడెద
నేఁకటారంగ మాపౌఁజు నెంచుకొమ్ము ! 44

ఓ రమాపతీ ! నీవు సర్వమునకు ఏలికవు. కాన నిదిగో ! నాశారీరకమైన బలగమును గుర్తింపుము. త్వక్చక్షుఃశ్రోత్రజిహ్వాఘ్రాణములు అనునట్టి అయిదు జ్ఞానేంద్రియములు, వాక్పాణిపాదపాయూపస్థలు అను అయిదుకర్మేంద్రియములు, కామక్రోధలోభ మోహమదమత్సరములు అనునట్టి అరిషడ్వర్గము, సత్త్వరజస్తమో గుణములు మూడు, పుట్టుట, వృద్ధిపొందుట, వండుట, ఎండుట, కృశించుట, నశించుట అనే శారీరకములగు వికారములు ఆరు, పృథివ్యప్తేజోవాయ్వాకాశములైదు, వదలకుండే శబ్దస్పర్శరూపరసగంధము లను విషయము లైదు, బుద్ధి, మనస్సు, అహంకారము, ఆకలిదప్పులు, శీతోష్ణములు, సుఖదుఃఖములు, మానావమానములు నన్ను ఆవరించియున్నవి. వీనిని నేను కల్గి యున్నాననుట. ఇవన్నియు నా పౌజు అనగా నా సేన. దీనికి శరీరధారియగు నేను పతినై యున్నాను. స్వామీ! నీకు నమస్కారము. నీవు సర్వప్రభుడవు. నా పౌజు నెంచి, గమనించి, మంచి నొడ గూర్పుము. అనగా పైవానిని రూపుమాపి మోక్ష మొసగు మని యర్థించుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్నిటికి నొడయఁడ వైన | 111 | 64 | 2 | 43 |

అవ: దేవు డిచ్చిన అవయువవములతో ఆతని నర్చింప కుండుట మహాపరాధమని ఉద్బోధించుచున్నాడు.

సీ. అనిశ మేఁ జేసిన యపరాధములు సూచి
కరుణించి యొకఁడైనఁ గావఁ గలఁడె?
కరచరణాదులు గలిగించినట్టి నీ
శ్రీపాదయుగసేవఁ జేయ నైతి ;
ఏతరి నగుచు నే నెఱిఁగి చేసినయట్టి
పాతక మొకఁడైనఁ బాపఁ గలఁడె ?
ఆత్మలోపలనుండి యలరి నీ వొసఁగిన
చేతమునన్ నిన్నుఁ జేరనైతి ;

ఆ. శ్రీనివాస ! తమకుఁ జేసిన సేవల
కొక్కఁ డేని కరుణ నొలకఁ గలఁడె ?
యీ వొసంగినట్టి యీ మేనితోడ నీ
వాఁడ ననెడి బుద్ధి వఱల నైతి. 45

శేషగిరివాసా ! చేతులను కాళ్ళను నీ వనుగ్రహించితివి. వానితో నీచరణ నీరజాలకు సేవ చేయనైతిని. మరి యెవడైనను వదలక నాచేయు తప్పులను మన్నించి రక్షింప గలడా? లే డనుట. నాయాత్మలో నీవు నివసించుచు నీవు ప్రసాదించిన మనసుతో నిన్ను చింతింపక మరచి అవినీతిపరుడనై తెలిసియే యెన్నియో పాపములు చేసితిని. వాటిని నీవుగాక మరి యెవడెనను పోగొట్టగలడా? లే డనుట. ఓ శ్రీపతీ ! ఇతరులకు నేను చేసిన సేవల కొక్కడైనను కరుణ జూపునా ? చూప డనుట. నీ వనుగ్రహించిన ఈ దేహమును ధరించియు నేను నీవాడ ననెడి బుద్ధి లేకుంటిని. స్వామి యను గ్రహించిన ఈ శరీరమును స్వామి కైంకర్యమునకే ఉపయోగింపవలె నని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎన్నిలేవు నా కిటువంటివి | 5 | 31 | 1 | 20 |

అవ: అంజనాచలవాసుని ఆశ్చర్యచర్యల కబ్బురముతో నుబ్బిపోవుచున్నాడు.

సీ. గరుడునిపై నెక్కి గమనించితివి యప్పు
  డరుదైన పారిజాతాపహృతికి
గరిమతో రథ మెక్కి కదలితి వల్లనాఁ
  డొగి విప్రబాలుర నుద్ధరింపఁ
జక్కఁ గుబేరు పుష్పకమెక్కి వెడలితి
  మక్కువ సీతతో మరలి పురికి
వాయుజు నెక్కి శంభత్ప్రతాపముతోడ
  వెస లంకపై దాడివెట్టినావు

గీ. కొట్టకొనఁ దోలితివి రాతిగుఱ్ఱ మెక్కి
యణఁచఁగ నధర్మమును, వేంకటాద్రిమీఁద
నెక్కినాఁడవు పల్లకి నింపుమీర
నిందిరను గూడి పెండ్లి నూ రేగువేళ
నవుర ! యెటు నేర్చి తిన్నివాహనము లెక్క
మిమ్ము నిందుకె హరి! కడు మెత్తు మయ్య ! 46

అలనాడు శ్రీకృష్ణుడవై స్వర్గమునుండి పారిజాతము దెచ్చుటకై గరుడ వాహనారూఢుడవై పయనించితివి. మరియొకప్పుడు గురువగు సాందీపని కుమారుల దెచ్చుటకై రథమెక్కి హుందాగా ప్రయాణ మైతివి. ఇంకొకపరి (రామావతారంలో) కుబేరునియొక్క పుష్పకవిమానము నెక్కి ప్రీతితో సీతతో నయోధ్యకు తిరిగి వచ్చితివి. వాయువేగముగల వాయుపుత్రుడు హనుమనెక్కి మిక్కిలి శౌర్యముతో లంకపైకి దాడి వెడలితివి. కడపట కల్క్యవతారమున రాతిగుఱ్ఱమును దౌడుదీయించి అధర్మము నణగార్చితివి. పెండ్లి యూరేగింపులో పద్మావతీసమేతుడవై పూలపల్లకి నెక్కి అందముగా వేంకటాచలముపై ఊరేగితివి. ఔరా ! ఇన్ని వాహనము లెక్కుట ఎట్లు నేర్చితివి ? ఈ నీ సాహసమును మిగుల మెచ్చుచున్నాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎట్టునేరిచితివయ్యా | 1018 | 105 | 20 | 71 |

అవ: ఏడుకొండలవానిని నమ్మి మ్రొక్కనట్టివారు బాగుపడుదు రని చెప్పుచున్నాడు.

సీ. **నిన్ను నమ్మిన వాఁడు నిఖిలవంద్యుఁడు హరి !**
**నిన్ను నమ్మనివాఁడు నీరసుండు**
**మును దేవతలు నీకు మ్రొక్కుచు బ్రదికిరి**
**నిన్నొల్ల కసురులు నీల్గిరి హరి !**
**నీదుపేరిటివాఁడు నిజముగ ధన్యుండు**
**నిర్భాగ్యుఁ డొల్లఁడు నీదు పేరు**
**నిన్ను నుతించి రాణించె నారదమౌని**
**నినుఁ దిట్టి చైద్యుండు నీటఁ గలిసె;**

గీ. **ఇట్టి నీ విచ్చేడి వరమ్ము లెపుడు చెడవు**
**గట్టిగా నీ విడని వెల్ల కల్లలె హరి !**
**అఖిలభూతాంతరాత్మ ని న్నహినగేశుఁ**
**జేరి కనకుంట దేహి కొచ్చెము గదయ్య !** **47**

ఓ హరీ ! నిన్ను నమ్మినవాడు అందఱకును నమస్కరింప దగినవాడగును, నమ్మనివాడు నీరసించిపోవును. చెడు ననుట. ఇందుల కుదాహరణము: దేవతలు నీదానులై మనగలిగిరి. ని న్నంగీకరింపక రక్కసులు నీల్గిరి. నీ నామస్మరణం చేయువాడు నిజముగా ధన్యుడు. నిర్భాగ్యుడు నీ నామమును స్మరించడు. ఇందులకుదాహరణము: నారదుడు నీ నామస్మరణముచేత ఎంతయో ధన్యుడైనాడు. నీ నామమును సహింపని శిశుపాలుడు నీటిపా లైనాడు. నిజముగా నీ విచ్చెడి వరములెన్నడును వ్యర్థములు గావు. నీ వనుగ్రహింపని వన్నియు కల్లలే. సకల ప్రాణులలో అంతరాత్మగా వెలిగే ఓ శేషాద్రీశా ! నిన్ను దగ్గఱించి దర్శింప కుండుట ప్రాణికి కొఱతయే గదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంత విచారించుకొన్నా | 86 | 420 | 1 | 281 |

అవ: బ్రహ్మాదిదేవతలు నిన్ను గొలుచుచుండగా నామ్రొక్కులు నీకెట్టు లందునో యని సంశయించుచున్నాడు.

సీ. కొలుచుబంటులు నీకుఁ గోటానఁగోటులు

తెందేప లున్నారు తెలచు బుధులు

వేఁడువారలు తలవెంట్రుక లంద టీ

సందడి నా కొల్వు సాగు టెటులొ?

పను లొనర్చెడివారు బ్రహ్మాది దేవతల్

వినుతిసల్పెడునది వేదరాశి

ధ్యానించువారలు మౌను లెందఱొ మఱి

వినఁగ నా మనవికి వేళ యెపుడొ ?

గీ. నిన్ను మోవ గరుడశేష లున్నవార

లలరు నలమేలుమంగ బాహ్వంతరమున

నన్నుఁ బాలించు వేంకటనగనివాస !

అందు టెట్టులొ నామ్రొక్కు ? లానతిమ్ము. 48

ఓ శ్రీనివాసా ! నిన్ను సేవించే భక్తులు కోటానుకోట్లు; అపారంగా నున్నారు ప్రార్థించే దేవతలు; వేడికోళ్ళు చేసేవారు తల వెంట్రుక లందరు; లెక్కకు మీఱినవా రనుట. ఈ వీరిసందడిలో నాకొలువు ఏవిధంగా సాగును? సాగ దనుట. నీకు ఊడిగము సలుపువారు బ్రహ్మాదిదేవతలు; నిన్ను స్తోత్రంచేయునట్టివి వేదములు. ఎందరో మునులు ధ్యానం చేయువారు. ఇక నామనవిని నీవు అవధరించుటకు సమయమెప్పుడు? సమయం లేదనుట. ని న్నూరేగించువారు గరుడుడు. శేషుడు. వారు నీకు వాహనాలు. నీ బాహుమధ్యంలో అలమేలుమంగ అలరారుచున్నది. నన్ను పాలించే ఓ వేంకటాద్రినాథా ! నా మ్రొక్కులు నీ కెట్టు లందునో ఆనతిమ్ము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆనతియ్యఁ గదవే | 163 | 201 | 2 | 201 |

అవ: ఉత్తమమైన మానవజన్మమును పొందినవాడు భక్తుడై అక్షయ మైన మోక్షము నంద యత్నింపవలెగాని తుచ్ఛముల నిచ్ఛయింపరాదని హితవు గఱపుచున్నాడు.

సీ. **అక్షయంబగు మోక్ష మందుటే తగుఁగాక**
**ప్రాణమీఁదగునఁటే పండ్లకొఱకు ?**
**కొండంతపసిఁడివి కూరాకుకై వెల**
**యిడుట వివేకు లొప్పెడు విధంబె ?**
**దండముపెట్టి నిన్ దలఁచిన ఫలమెల్ల**
**పాపసంహృతికిఁ బాల్పఱుపఁ దగునె ?**
**గుఱుతైన రతనంబు గుగ్గిళ్ళ కొసఁగుట**
**యాత్మబుద్ధివిపర్యయమునఁ గాదె?**

గీ. **కామధేనువు గొనివచ్చి కాసు కిడిన**
**కడుఁ గొఱఁత గాదె కామించు ఘనుల కెల్ల;**
**నీయడుగుఁదమ్ములం గొల్చి నేమమునను**
**అంజనగిరీంద్ర ! తుచ్ఛమ్ము లడుగ నగునె?** 49

అంజనాద్రీశా ! మోక్షమును పొంద గోరుటే యోగ్యముగాని అల్పఫలమునకై ప్రాణము లర్పింప దగునా? తగ దనుట. కొండంత బంగారమును ఆకుకూరకై వెచ్చించుట వివేకులు సమ్మతించు మార్గమా? అనగా పుణ్యమువల్ల వచ్చిన ఈ మానవజన్మమును మోక్షసాధనం చేసికొనదగునుగాని అల్పసుఖాలకై ధారపోయరాదని భావము. నమస్కార పూర్వకంగా లభించిన నీ నామస్మరణఫలమును పాపక్షయమున కర్పణము చేయదగునా ? తగ దనుట. ప్రకాశవంతమైనరత్నము నొసగి గుగ్గిళ్ళను కొనుట తనబుద్ధివిపర్యానముననేగదా ? అనగా అమూల్యమైన ఈనరజన్మమును ఐహికసుఖసంపాదనకు సాధనముచేయుట తగ దనుట. కామధేనువును తెచ్చి ఒకకాసుకు విక్రయించినచో ఆ కామధేనువును కోరువారికి ఎంతో కొఱత కల్గునుగదా ? ముక్తిసాధనమైన ఈ దేహమును తుచ్ఛములకు లోనుగావించుట ముముక్షువుల కెంతయో మనస్తాపము గల్గించు ననుట. నియమముతో నీ పాదపద్మములను సేవించి నీచములైన కోర్కులు కోరదగునా? తగ దనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అక్షయంబగు మోక్ష | 300 | 582 | 3 | 391 |

అవ: సకలేశ్వరుడు వేంకటేశ్వరుడుగాన వారిప్రేరణచొప్పున సకలము నడచును గాన మానవుని దినచర్య భగవత్పరిచర్యయేగనుక భక్తుల కేకొదవయు లే దనుచున్నాడు.

సీ. ఈవె యంతర్యామి; వీ వున్నదె వికుంఠ
మవల పరంధామ మనఁగఁ గలదె?
ఈ వొసంగిన రూపు లీ ప్రాణులు ధరించి
బొందితో నీకయి పుట్టినారు;
కడఁగి ప్రపంచంపుఁ గైంకర్యములు చేసి
అయిరి జీవన్ముక్తు లన దిఁకేమి?
ఇంద్రియభోగమ్ము లెల్ల భోగించుచు
నీ యాజ్ఞ తలఁదాల్చి నెగడినారు
నీదుగర్భస్థులై నిన్నుఁ బాయరు; లోక
మియ్యదే సాలోక్య; మేమి కొదవ?
గీ. స్వామిపనులందు జ్ఞాన మజ్ఞాన మేది ?
నీపనులలోన మత్తులై నిలిచినారు
సకలభువనేశ ! నీదు నాటకములోన
నిత్యులైనారు లోటేమి నీ శ్రితులకు.? 50

ఓ స్వామీ! నీవు అంతర్యామివి. నీ వున్నచోటే వైకుంఠము. ఇక వేరే వైకుంఠ మున్నదా ? లేదు. అంతయు వైకుంఠమే యనుట. నీ విచ్చిన రూపాలు ధరించి ప్రాణులు ఈ శరీరంతో నీ కైంకర్యానికే పుట్టినారు. అయినను ప్రపంచంలోని వారికి సేవలు చేయుచున్నారు. అందరిలో నీ వున్నావుగాన నీ సేవలు చేసినట్లే. అందువల్ల అట్టివారు జీవన్ముక్తులవు తున్నారు. ఇంద్రియభోగా లనుభవిస్తూ నీ యాజ్ఞగా భావించి తలదాల్చినారు గాన అట్టివారు నీ వారే అగుచున్నారు. జీవు లందరు నీ ఉదరములోనే ఉన్నారు గనుక ఈ లోకవే సాలోక్యము. ఇక ఇట్టివారికి కొరత ఏమున్నది? స్వామిసేవలందు జ్ఞానాజ్ఞానములతో నిమిత్తము లేదు. అందరు నీ సేవలో నిమగ్నులై యున్నట్లే. సర్వలోకేశా ! నీ వాడించే ఈ జగన్నాటకంలో అందరు నిత్యులై పాత్రధారులై యున్నారు. నీభక్తి గలమానవులకు తక్కువేమియు లేదు. సర్వమూ శ్రీనివాసునిస్వరూప మని ఎరిగినవారు నిత్యముక్తు లనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీవే యంతర్యామివి | 300 | 579 | 3 | 389 |

అవ: లోభదైన్యాదులు జయింపరాని వనియు, స్వామికృపగల్గినగాని సాధ్యము కావేమో యని సంశయించుచున్నాడు.

సీ. **లోకమంతటఁ దానె లోభమ్ము పరికింపఁ**
**దేఱి యెచటఁ గన్న దీపనమ్మె**
**వెక్కసంబగు తాను వేగి లేచినదాది**
**చేసెడు పని- యేమి సెప్పవలయు ?**
**పలుమారు వచ్చెడి పనిమాలిన పరాకు**
**వళుచుకొన్నది తానె వట్టి భీతి**
**నిలిచియున్నది నిట్టనిలువుననే సిగ్గు**
**మెలవున నెటువలె మెదల నగును ?**

గీ. **ఎందుఁ గార్పణ్యమే; దైన్య మెల్లయెడల;**
**యాచకత్వమె మించు నహర్నిశంబు;**
**ఇవల నీ కృపగల్గిన నేమొ కాని**
**యెవ్వరివశంబు వీని జయింవ? స్వామి!** **51**

ఆలోచింపగా లోకంలో అంతటను లోభము తానై కనిపించును. పారజూచినచో అంతట ఆకలియే అగుపించును. మానవుడు వెక్కసముగా ఉదయాస్తమయములు చేయునట్టిపనులు చెప్పనలవి గానివి. పనికిమాలిన పరధ్యానం పలుమారు ఆవరించుచున్నది. అకారణముగా భయ మెప్పుడును డగ్గరించి యుండును. సిగ్గు ఎప్పుడును నిలువునా నిలిచి యుండును. ఈ స్థితిలో మెలకువతో మెలగుట కెట్లు సాధ్య మగును? ఎప్పుడు చూచినను, ఎక్కడ చూచినను లుబ్ధత్వము, దీనత్వము, యాచకత్వము గోచరించు చున్నవి. వేంకటేశా ! వీనిని తొలగించుటకు నీకృపగల్గినను సాధ్యమగునో కాదో !

పైవానిని నిర్జింపవలెనని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వరి వసము గెల్వ | 239 | 225 | 3 | 151 |

అవ: మానవులు తెలివినందిన వారైనను మాయామోహముచే అజ్ఞానులగుచున్నారు. ఇట్టిమూఢులను కాపాడుమని దేవుని వేడుచున్నాడు.

సీ. తమ్ము దైవమ్ము నంద ఱెఱుంగుదురు వావి
వర్తన లెఱుఁగనివారు లేరు;
చావుపుట్టువుల కష్టము నష్ట మెఱుఁగుదు;
రెఱిఁగి సంసృతిఁబడి పొరలుచుందు;
రుపదేశముల విందు; రొగి పురాణమ్ములు
విందురు; స్వర్లోకవిభవములను
నరకయాతనలు విందురు; సారె విని విని
మాయ కధీనులై మలయుచుంద్రు;

గీ. నలుపుదురు తీర్థయాత్ర; లాచారమందు
నడతు; రొనరింతు రెన్నొ దానములు నీవు
గలుగ వనులఁ దపశ్చర్య నలయుచుందు;
రిట్టి మూఢులఁ గరుణింపు మిందిరేశ ! 52

తామెవరో దైవ మెవరో అందరూ ఎరుగుదురు. వావివరుస లెరుగని వారే లేరు. జననమరణములు, కష్టసుఖములు వీనిని విమర్శించి విరక్తులైనను మరల మరల మాయవల్ల సంసారములో పడి పొర్లాడు చుందురు. గురూపదేశములను పురాణములను విందురు. స్వర్గసుఖాలను నరకబాధలను పలుమారు వినియు మాయకు లోబడి క్రుంగిపోవుచుందురు. ఆచారవంతులై తీర్థయాత్రలు, ఎన్నో దానములు చేయుచుందురు. అరణ్యములలో తపస్సుచేసి అలసిపోవుచుందురు. కాని మాయను జయించలేరు. ఓ పద్మావతీనాయకా! ఇట్టిమూఢుల విషయములో దయజూపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పామరుల కెంతైనా | 237 | 214 | 3 | 143 |

అవ: భగవంతుని లీల లగమ్యగోచరములని, సర్వమునకు ఆతడే సాక్షియని వాకొనుచున్నాడు.

**సీ. కొందఱు దేవతల్ కొందఱు దానవు**
**లీవ యంతర్యామి విందఱకును;**
**ఒకరిపైనిఁ బ్రసాద మొకరిపైఁ గోపమ్ము**
**తగునె యీ పక్షపాతమ్ము నీకు?**
**ఒకరికి స్వర్గమ్ము నొకరికి నరకమ్ము**
**గల్పించినావు నీ గర్భమందె;**
**ధరఁ జీఁక టొకవంకఁ దగ వెన్నె లొకవంక**
**నెఱపెదు నీ మాయ నీకె తెలియు**

**గీ. శిష్టపరిపాలనము దుష్టశిక్షణమ్ము**
**వాసి గైకొనినాఁడవు స్వవశములుగ**
**నీవలనలేదు దోసమ్ము నీరజాక్ష !**
**చిత్తమునఁ బెట్టితివి వారి చేఁత లింతె.** 53

శ్రీశా! ఈ నీసృష్టిలో కొందరు దేవతలు. మరికొందరు రాక్షసులు ఈ యందరిలో నీ వంతర్యామివిగా నున్నావు. అటు లుండగా ఒకరిపై ననుగ్రహము మఱొకరిపై కోపము నీ కెందుకు? ఈ పక్షపాతం నీకు తగునా? నీ కుక్షిలో నుండే జీవులలో కొందరికి స్వర్గము, మఱి కొందరికి నరకం కల్పించినావుగదా ! ఒకవైపు చీకటి, వేరొకవైపు వెన్నెల కలిగించితివి. ఈనీమాయ నీకే తెలియవలెను. దుష్టుల శిక్షించుటయు, సాధువుల రక్షించుటయు పనిగా గ్రహించియున్నావు. తామరల వంటి కన్నులుగల వేంకటేశ్వరా ! నీ వలన ఎట్టి దొసగును లేదు. చూడగా అన్ని దోషములు ప్రాణులవే. ప్రాణులచేతలను నీవు తటస్థుడవై చూచుచుందువు. ఇంతియే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పుట్టించేవాఁడవు నీవే | 208 | 43 | 3 | 29 |

అవ: వేంకటేశ్వరు డిహపరములకు కర్తయని, సర్వసము డని, నాస్తిక తామసార్చకులైన విష్ణువిరోధులను భక్తుడు సహింప డని తెల్పుచున్నాడు.

సీ. **పాషండ దుర్వాక్యపటలి వీనులఁ బడ్డ**
**నెనరేఁగు కినుక సహింప రాదు;**
**దనుజులపుట్టువుఁ దాల్చిన వారని**
**జ్ఞాన మొక్కింత యొసంగ వీవు;**
**తగ మాకు వారి కంతర్యామి వొక్కెడ**
**వెలుఁగును జీఁకటిఁ బెంచె దేల?**
**ఖలతామసార్చనల్ గని యోర్వరాదు పా**
**పు లటంచు నీ భక్తిఁ జెలఁగ నీవు;**
**ఇందఱపూజలు గొందు వీవే; పుణ్య**
**పాపాల సరిఁ గన భావ్య మటవె?**

గీ. **వైష్ణవద్రోహినహమైత్రి వలవ దాత్మ ;**
**యిట్టివారల సృజియింప కీవు మాన ;**
**విహపరమ్ములకుం గర్త వీవ; నిన్ను**
**శరణు వేఁడిన స్వామి ! యిందఱకుఁ గలవు.** 54

ఓ ప్రభూ! నాస్తికుల దుర్వచనములు చెవులు సోకినంతనే నాకు ఓర్చుకొనజాలనంత కోపము పుట్టును. ఆ నాస్తికులు రాక్షసాంశతో పుట్టిరని వారికి కొంచెమైనను నీవు జ్ఞాన మనుగ్రహింపవు. ఆస్తికులకు నాస్తికులకు గూడ నీవు అంతర్యామివై యుండి నాస్తికులలో తమోగుణమును, ఆస్తికులలో జ్ఞానమును గలిగించుచున్నా వనుట. దుష్టులగు తామసులు చేసే తుచ్ఛమైన పూజలను చూచి నా యోరిమి దూరమై పోవుచున్నది. వారు పాపులని, వారిలో నీ భక్తిని కలిగింపవు. ఇందరిపూజలను (తామసుల యొక్క, జ్ఞానులయొక్క) నీవే స్వీకరించుచున్నావు. ఉభయుల పూజలను నీవు గైకొనుట పుణ్యపాపములను సమముగా చూచుటయే గదా! ఇది నీకు తగునా? తగ దనుట. విష్ణుభక్తులకు అవకారముచేసే వారి చెలిమిని నామనస్సు అంగీకరించదు. అట్టి వైష్ణవద్రోహులను నీవు పుట్టింపకయు మానవు. ఇహపరసుఖము లిచ్చుటకు కర్తవు నీవే. ఎట్టివాడైనను నిన్ను శరణు వేడితే వానిపాలిటివాడవై కాపాడగలవు స్వామీ!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చెలఁగి యధర్మము పుట్టింప | 281 | 469 | 3 | 315 |

అవ: జ్ఞానులు, అజ్ఞానులు స్వామికృవకు పాత్రు లగుదురు. అరగౌరచదువులు, మాయ వారిని పెడదారి పట్టించుచున్న వనుచున్నాడు.

సీ. అజ్ఞానులకు దోన మంటదు వారలు
 భావ మెఱుంగని పసులు గాన;
సుజ్ఞానులకు లేదు సుంతయుఁ గలుషమ్ము
 స్థిరభక్తి నిన్నుఁ గొల్చెదరు గాన;
పలుచదువులదె యీ పాపమ్ము నమ్మించి
 చెఱుచు నానార్థముల్ చెప్పుఁ గాన ;
నీ దాసులకు లేదు నేరమి సద్గతి
 నీవయం చెంచి యుండెదరు గాన ;
నేరమియే లేదు నీ కాదినుండియు
 నఖిలంబునకుఁ గర్త వగుదు గాన
సాగిపోయెడి ప్రపంచంపు నేరమి యిద్ధి
 యొకచో నిజములేక యుండుఁ గాన ;

గీ. లే దధర్మమ్ము జనులకు నీదు చేఁత
లిన్నియుంగాన; ముక్తుల కెపుడు లేదు
నీకరుణ గాంచి రటుగాన; నీదుమాయ
దే యధర్మ మెక్కడ నడ్డ మేగుఁగాన. 55

అజ్ఞానులు భావము దెలియని పశువులు. కాబట్టి వారిని పాప మంటదు. జ్ఞానులు నిశ్చలభక్తితో నిన్ను సేవింతురు గనుక వారికి కొంచె మైనను పాపము సోకదు. పలుచదువులు పలురకములైన అర్థములు చెప్పి నమ్మించి పాపమున కొడిగట్టించుచున్నవి. కాన వానిదే యీ పాపము ! నీవే గతియని నమ్మి యుందురు గాన నీదాసులకు పాపమే లేదు గదా ! నీవు సకలమునకు కర్తవుకాబట్టి మొదటినుండియు నీకడ నేర మున్నదని చెప్పనేరము. ఈ ప్రపంచములోని జనులు ఒకదైవముపై నమ్మకము, స్థిరత్వము లేకుందురుగాన ప్రవాహంగా కదలిపోవు ఈ ప్రపంచానిదే యీ నేరమి. ఇవన్నియు నీ కార్యములే గనుక జనులకు అధర్మమే లేదు. నీదయకు పాత్రులుగాన ముక్తులకు అధర్మము లేదు. కాని నీ మాయదే అధర్మము. అదియే జ్ఞానమున కడ్డు తగులుచున్నది. దానిని తొలగింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వరి దూరఁగఁ జోటు లేదు | 269 | 396 | 3 | 267 |

అవ: ఔగాము లెఱుగక నిన్ను చేరిన మమ్ము నీవే కాపాడవలయు ననుచున్నాడు.

సీ. సావయవ నిరవయవ సగుణ వినిర్గు
ణాదియౌ తర్కవాదాళి ఘనము
జగములో చదువుల సంశయంబే గాని
తెగనీదు నీమాయ దెలియ వశమె?
వేదమార్గము గొంత వేదబాహ్యము కొంత
పలు మతమ్ముల పోరు తలఁప ఘనము ;
బహుముఖమ్ములు ఋషివాక్యముల్ పాటింప
సోదించి యొకదారిఁ జూప లేవు ;

గీ. ఒక్కవంకఁ గర్మము జ్ఞాన మొక్కవంక
బహుబలీయము లీ రెండు వశము గావు ;
నీవు శ్రీ వేంకటేశ్వర ! కావ వలయు
మూఁగవై యున్న నీ వాదు ముగియఁ బోదు. 56

శ్రీ వేంకటేశ్వరుడు రూపము కలవాడా ? కాడా ? గుణములు గలవాడా? కాడా ? అనునట్టి తర్కవాదములు చాలగ నుండును. లోకములోని చదువులు సందేహకారణములు. నీవు సృజించిన మాయా మహిమ తెలియ దరమా ? వేద మార్గము ననుసరించే మతాలు కొన్ని. వేదబాహ్యములైన మతములు మఱికొన్ని. వీటి పరస్పరవిరోధములు నీ నిజతత్త్వమును దెలుపజాలవు. ఋషులమాటలు పలుబాటలను జూపునుగాని ఆలోచింపఁగా చక్కగా నెఱింగి నిన్ను చేరు దారిని చూపలేవు. ఓ ప్రభూ ! ఒకవైపు కర్మమార్గము; మఱొకవైపున జ్ఞానమార్గము. బలీయము లైన ఆ మార్గములద్వారా నిన్ను జేరుట కలలోని మాట. స్వామీ! నిన్ను జేరు మార్గము నీవే తెల్పి దయతో మమ్ము కాపాడవలయును. నీవు పెదవి విప్పకున్నచో ఈ వాదు ముగియదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏవల్ల నౌఁగాము లిఁక | 298 | 570 | 3 | 383 |

అవ: మాయవలన ప్రాణులకు ప్రాణధనగృహాదులందు దురభిమాన మేర్పడుననియు విష్ణుభక్తులుదప్ప మాయ నితరులు దాట లేరనియు నిర్వచించుచున్నాడు.

సీ. **పలుచవులందునఁ బ్రాణ మెక్కుడు తీపి**
**తీపులఁ బ్రాణ మెంతేని తీపి ;**
**ఇలఁ బూజ్యులందున నింతులే పూజ్యులు**
**త్రోయఁగలారె నీమాయ నరులు?**
**తగు చుట్టఱికముల ధనమె చుట్టఱికమ్ము**
**కట్టనికట్టులు కాఁపురములు ;**
**గుణములందున వైరగుణము నిజగుణమ్ము**
**జీవు లిఁకెట్లు గెల్చెదరు మాయ ?**

గీ. **తలఁపఁ దమలోనఁ దనజాతి తనదు నేర్పు**
**తనకు నెక్కువగాఁ దోఁచుఁ దక్కు వనరు ;**
**ఎందు నీదాసులే కాని యితరు లెల్లఁ**
**బాయఁ జాలరు నీమాయ ఫణిగిరీంద్ర !** 57

రుచులు పలురకములు. ఆ రుచులలో తీపి ప్రాణము వంటిది అనగా అందరినీ ఆకర్షించునట్టి దనుట. పూజింపదగినవారలలో స్త్రీ లే పూజింపదగిన వారైరి. ఓ స్వామీ! నీ మాయ నెవ్వరును దాటలేరు గదా ! ఆ స్త్రీలట్లగుటకు నీమాయయే కారణము. బాంధవ్యము నానావిధములు. వానిలో ధనమూలంగా చుట్టరికము కల్గు ననుట. "ఎప్పుడు సంపద గల్గిన నప్పుడు బంధువులు వత్తు" రను నుడి స్మరింప దగినది. ఇక సంసారము అబద్ధబంధకము. గుణములలో విరోధగుణమే నిజమైన గుణ మైనది. ఈ స్థితిలో జీవులు మాయ నెట్లు గెలువ గలరు? గెలువజాల రనుట. ఎవని కైనను తనజాతి, తన నేర్పు గొప్పగా తోచునుగాని తక్కువగా కానరాదు. పైవాని కంతటికిని కారణము అజేయమగు నీ మాయయే. ఓ ఫణిగిరీశా ! నీభక్తులు తప్ప త క్కొరులు నీమాయ నతిక్రమింప జాలరు.

భక్తులకు మాయ అంట దని తాత్పర్యము

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దైవమా నీవే యిందు | 295 | 551 | 3 | 370 |

అవ: నీకును. నీదాసులకును దాసు డైనచో జన్మకర్మలతో నిమిత్తంలేక అధమాధికభేదం పాటించక వానిని కరుణింతు వనుచున్నాడు.

సీ. అల రావణునితమ్ముఁ డసురుండు నరభోజి
యపుడు నీవాఁడు తా నయిన మీఁదఁ
గులజుండు పుణ్యుండు గుణనిధి యోగ్యుండు
తలఁప నెట్టిదొ నీదు దాస్య మహిమ?
పాతకుండు కిరాతజాతివాఁ డఁట సత్య
తపుఁడు భవద్దాసదాసబోధ
నావల బ్రహ్మర్షి యయ్యె నష్టాక్షరి
త్వద్దాససేవాప్రభావ మేమొ?

గీ. ఎట్టి జన్మ మైన నే తను వైనను
భక్తియున్నఁజాలు పరమపురుష !
అధముఁ డంచు నధికుఁ డంచు నెంచక సరిఁ
గాతు వీవు నీదు కరుణ యేమొ? 58

ఓ పరమపురుషా ! లోకకంటకుడైన రావణునితమ్ముడు పుట్టుకతో రాక్షసుడు. మానవులనే తినువాడు. అట్టి విభీషణుడు నీశరణు పొందడము చేత కులపుణ్యగుణములచేత యోగ్యు డయ్యెను. ఆలోచింపగా నీదాస్య మహిమ ఎంతగొప్పది! చాల ఉన్నతస్థితికి జేర్చునట్టి దనుట. కిరాత జాతి వాడు, పాతకుడు అయిన సత్యతపుడు (వాల్మీకి) నీదాసదాసులబోధచేత అష్టాక్షరీమహామంత్రము జపించి పిదప బ్రహ్మర్షి యాయెను. అహా! నీదాస దాస్య ప్రభావము నేమని మెచ్చనగును? అది ఉచ్చస్థాన ప్రాపక మనుట. జన్మ మెట్టిదైనను, శరీర మెట్టిదైనను నీ పై భక్తి యున్నచోచాలును. భక్తుని ఉచ్చనీచతలను తలంపక మించిన కనికరముతో కాపాడుదువు. నీకరుణ అపారముగదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ధరలో నాజన్మమే | 283 | 479 | 3. | 322 |

అవ: తనసర్వస్వము సమర్పణ మొనర్చి స్వామిని శరణు వేడుచున్నాడు

సీ. ఇంతటఁ గావవే యిందిరానాయక!
కాకాసురునిఁ గృపఁ గాచినట్లు
తగఁ బంచభూతాల తనువుఁ దాల్చితిఁ గాన
నజ్ఞానమున నిన్ను నరయఁ జాలఁ;
బంచేంద్రియములచేఁ బట్టువడితిఁ గానఁ
జెప్పరాని యఘమ్ముఁ జేసినాఁడ;
మిన్నంత జఠరాగ్ని మ్రింగి యుంటిని గాన
కన్న వెల్లను వేడి కష్టపడితి;
పాడుసంసారంపుభ్రమపాలయితిఁ గాన
గంపవేల్పుల కరిగాఁప నయితి;

గీ. ఆత్మ నీవుండుభాగ్యంబు నందుకొన్న
వాఁడఁ గానఁ జైతన్యాన వాసుదేవ!
పరఁగ శరణంటి; నీపాలివాఁడఁ గాన
నొప్పన మొనర్చినాఁడ నా కున్న దెల్ల. 59

పాంచభౌతికమైన శరీరమును ధరించినాడను గనుక 'కారణగుణాః కార్యే సంక్రామంతి' అను న్యాయానుసారంగా జరత్వాదు లీ దేహమున సహజముగా నుండును. అందువల్ల అజ్ఞానముచే ని న్నెఱుంగలే కున్నాను. ఇంద్రియములచే జయింపబడితిని గాన ఇంతింతనరాని పాపము లొనర్చితిని. ఆకాశమంత ఆకలి నాకడుపులో నున్నందున అగపడ్డ వానినెల్ల అర్థించి కష్టపడితిని. కొరమాలిన సంసారభ్రాంతిలో పడి క్షుద్రదేవతలకు దాసుడ నైతిని. ఓ ఇందిరానాయకా! పరమదుష్టుడైన కాకాసురుని కనికరించితివిగదా! నే నంతదుష్టుడను కానుగదా! వానిని కరుణించిన విధమున నన్నును కరుణింపుము. ఓ వాసుదేవా! నాభాగ్యమో అన్నట్లు నా ఆత్మలోనే నీ వున్నావు. కాన ఆ తెలివితో నిన్ను శరణనుచున్నాను. నేను నీవాడను. నా సర్వము నీ కప్పగించితిని. నన్ను రక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంతటఁ గావఁగదే | 277 | 443 | 3 | 298 |

అవ: శ్రీ వేంకటేశ్వరు డొకడే దేవుడనీ అతడే సర్వనామములతో పిలువ బడుననీ తెలియబలుకుచున్నాడు.

సీ. ఎన్నిచందమ్ముల నెట్లైన నుతియింతుఁ
గనుఁగొంటిఁ గనుక నా కనుల నిన్నె;
గోవిందుఁడ వటంచుఁ గొలిచిన నిన్ను నే
శ్రీవల్లభుఁడ వంచుఁ జింతసేతు;
భూనాయకుఁడ విది పునరుక్తి యనకుమీ !
దైవ మొక్కండవే ధరకుఁ గాన ;
పరమాత్ముఁడ వటంచు భక్తి సేసియు నిన్ను
నరహరి వంచు ధ్యాన మ్మొనర్తు ;
సరవులఁ జర్వితచర్వణ మనకుమీ
యఖిలాంతరాత్ముండ వగుదు గాన;

గీ. గుఱిగ ముమ్మాటికిని నీదు చరణదాస్య
మేను మరఁగితి; దిరిగినయెడ నిదేల
తిరిగెద వటంచు ననకుమీ ! తిరుమలేశ !
పాదు నాకెందు నితరంబు లేదు గాన. 60

ఓ తిరుమలేశా ! నా కనులార నిన్ను గాంచగల్గితిని గాన ఎన్నియో విధముల ఎటులైనను కీర్తింతును. వైకుంఠము వదలి భువిని చేరినందు వల్లను లేక కృష్ణుడవై ఆలమందల గాచినందువల్లను గోవిందుడనీ; ఎట్టిపట్టునగాని సిరిచెలువ చెలికారం వీడనందున శ్రీవల్లభుడనీ నిన్నుచింతనసేతును. ప్రపంచమున కంతటికి నీవు ఒక్కడవే దేవుడవు. కాన నిన్ను భూనాయకు డనుట పునరుక్తి కాజాలదు. నీవు పరమాత్ముడవని, నరసింహమూర్తివని భక్తితో ధ్యానము సేతును. నీవు అఖిలమునకు అంతరాత్ముడవై యుందువు. ఒకేవ్యక్తిని నిన్ను మాటిమాటికి పలుమాటలతో పలుకుట చర్వితచర్వణ మనకుము. అనగా భక్తితో నెన్నో రీతుల భక్తుడు ప్రార్థించుటలో పునరుక్తిదోషం లేశమైనను లేదనుట. తదేకధ్యానంగా త్రికరణశుద్ధిగా నీపాదదాస్యమును చేయుటకు నేను అలవాటుపడితిని. తిరిగిన చోటనే మరల మరల తిరిగెదవు అని అనకుము. అనగా చేసినదాస్యమును మాటి మాటికి ఏల చేసెద ననగా దానిరుచి న న్నాకర్షించిన దన్నమాట. నీపాదాలు వినా నాకు వేరొక దిక్కు లేదని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎన్నిచందముల నిట్లైన | 274 | 427 | 3 | 287 |

అవ: మంచిచెడుగులు (సుఖదుఃఖాలు) మానవుని సంకల్పములవల్ల కలుగునని, వేంకటాచలపతి దయయుంటే ఈ లోకమే వైకుంఠమని భావించుచున్నాడు.

సీ. గగనమ్ము గ్రమ్మిన కారుచీఁకటిపిండు
భానునిచే వెలుఁగైనయట్లు
హరి! నీవు చక్రమ్ము నంటిన యప్పుడే
యసురులు సురలయి యలరినారు;
గతియయి పరుసమ్ము గదిసిన లోహమే
యచ్చపుబంగార మైనయట్లు
తమి నీదునామమ్ముఁ దలఁచిన వారల
భూరిదుష్కృత మదే పుణ్య మాయెఁ;

ఆ. గొంకుమాని నిన్నుఁ గొలిచిన మనుజులే
యసములౌ శుకాదు లైనవారు
కడలనుండిరావు కాని వైనవి; నీదు
కరుణ గలుగ జగమె పరమపదము. 61

కారుచీకటిగుంపు గగనమును దట్టముగా ఆవరింపగా సూర్యునిచే అది పటాపంచలై వెలుగువచ్చిన విధంగా ఓ హరీ! నీవు చక్రమును చేతబట్టగనే రాక్షసులు దేవత లైరి. అనగా సూర్యుడు లోకమున చీకటిని పారదోలి అచ్చట వెలుగును ప్రసాదించిన తీరుగా నీచేతిచక్రము రక్షస్సులలోని రాక్షసత్వమును పోకార్చి దైవీసంపత్తిని అంకురింపజేసె ననుట. ఇనుము పరుసవేదిసంబంధముతో బంగారమై పోవును. అటులే నీనామస్మరణముతో ఘనకలుషరాశి అగణ్యపుణ్యంగా పరిగణింపబడును. జంకుగొంకులులేక నిన్ను సేవించిన మానవులే సాటిలేని శుకాదిపరమయోగులుగా మారిరి. మంచిచెడుగులు ఎక్కడినుండియో రావు. ఓ స్వామీ! నీదయ గలిగితే ఈ లోకమే వైకుంఠము.

భగవంతుని శౌర్యము, నామమహిమ, సేవాఫలము అమోఘములని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కడనుండి రావు | 253 | 307 | 3 | 207 |

అవ: భగవదవతారములు పలుభంగులని, అతడు సర్వాంతర్యామి యని, కారణోపాత్తశరీరుడని తెలియజెప్పుచున్నాడు.

సీ. పలుదెరువులు నీకుఁ బాటింపఁగాఁ జెల్లు
నీదాసు లగుటయే మాదు తెరువు;
జీవు లందఱు నీకుఁ జింతింప నొకటియే
సురల కెక్కుడు నీవు చూడమాకు;
ఇరవులు గలవు నీ కెక్కడఁ గనుఁగొన్న
మాకు నీ చరణాలె మంచి యిరవు;
నందాదులకు నెల్ల నందనుండవు నీవు
తలపోయ మా కెల్లఁ దండ్రి వీవె;
శబరియిచ్చిన విందు సకలభాగ్యము నీకు
నీప్రసాదమె మాకు నిఖిలభాగ్య;
గీ. మచ్చుగ మునీంద్రు లెపుడు నీ కరయ బంటు
లేలికలు మాకు నీదాసు లెల్లవారు;
నీ విహపరాలు హరి! మాకు: నీదుమఱుఁగు
సూదివెంబడిదారమై చొచ్చినాము. 62

ఓ శ్రీహరీ! అనేకములైన అవతారము లెత్తుట నీకు తగియున్నది. అయితే నీదాసుల మగుట ఒక్కటే మా ముక్తికి మార్గము. జీవు లందరు నీయంశలే కనుక ఆలోచింపగా ప్రాణులపట్ల నీవు సమత్వము గలవాడవైనను దేవతలకు నీవు మిక్కిలి ముఖ్యుడవని మాకు తెలియుచున్నది. అనగా రాజసతామసార్చకులు నిన్నుపాసించ రనుట. సర్వవ్యాపకుడవుగాన ప్రత్యణువునూ నీకు స్థానమే. మా కన్నినో నీ పాదములే మంచిస్థానము. మోక్షమిచ్చున దగుటచే నని భావము. కారణవశాత్తు నందుడు మొదలగు కొందరికి నందనుడవై ఆనందము గూర్చినను, ఆలోచింపగా జీవులమగు మా కెల్లరకు తండ్రివి నీవే. "పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి" అను రీతిగా శబరి భక్తితోనిచ్చిన ఫలాదులే నీవు మహాభాగ్యముగా స్వీకరించితివి. నీయనుగ్రహమే మాకు సకలభాగ్యప్రదము. చూడగా పరమమునులు నీదాసులే. నీదాసు లెల్లరు మాకు స్వాములే. సేవ్యు లనుట. ఓ హరీ! మా కిహపరములు నీవే. సూదివెంట దారము విధంగా మేము సర్వదా నిన్ను అనుసరించువారలమే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పలుదెరువులు నీకు | 256 | 321 | 3 | 217 |

అవ మాయని మాయను మాయింప మామనోహరుడుగాక మరెవ్వడు సమర్థుడనుచున్నాడు

సీ. ఇంతకాలమ్మాయె యేమన్నవా రేరి?
చిక్కించనే కాని చెడనిమాయ
ప్రభవింపఁ జేసిన పద్మజు లెందఱో
యము లెందఱో మట్టినట్టివారు ;
ఇందు కందుకె కాని యే నొనర్చిన పాప
మాఱిచి కాచినవారు లేరు;
తనువు పెంచినవారు తలిదండ్రు లెందఱో
యతివ లెందఱొ కూడినట్టివారు
చిల్లరపనులకుఁ జేరఁబిల్చుటె కాని
వైకుంఠ మొసఁగెడివారు లేరు :

గీ ఏడదు కర్మమ్ము ; కాలమ్ము వీటిఁబోయె;
మూలనుండి యెవ్వారికి మొఱ లిడెదము ?
అంతరాత్ముండ వగు వేంకటాద్రినాథ !
యింతపని కెవ్వరుంజాల రేలు మయ్య ! 63

ఎంతకాలమునుండియో యీ మాయ స్థిరంగా ఉన్నది. దీనిని ఎవరుగాని ఏమన్నవారు లేరు సృష్టికర్తలైన బ్రహ్మలెందరో గడచిపోయిరి ఎందరో యమధర్మరాజులు పుట్టిన ఈ జీవులను మట్టుపెట్టుచున్నారు. ఆ పుట్టించిన బ్రహ్మ, ఈ గిట్టించిన యముడు ఆయాపనులు చేయగల్గిరేగాని నాపాపపటలాన్ని భస్మీపటలం చేసి న న్నుద్ధరింప జాలక పోయిరి. ఈ శరీరమును పోషించిన తలిదండ్రులును, ప్రాప్తించిన పడతులును నిరుపయోగములైన చిల్లరమల్లరపనులు నాచే చేయించు కొన్నవారేగాని వీరిలో ఒకరైనను వైకుంఠ మొసగగల్గినవారు కారు కర్మము వదలదు కాలం వ్యర్థముగా గడచినది ఓ వేంకటేశ్వరా ! నీవు జీవులలో అంతరాత్మవై యున్నావు నిన్ను కాదని ఎక్కడివారికో ఎక్కడ మొఱపెట్టుకొందుము? వైకుంఠ మిచ్చుటకు నీవు దప్ప మరెవ్వరు సమర్థులు గారు. స్వామీ మమ్మేలుకొనుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంతగాలమాయ | 256 | 323 | 3 | 218 |

అవ: తామసులు కర్మసంసారములను రుచులను అభిరుచులను వీడనేరరని తెలిసి అసహాయుడైన తన్ను కరుణతో గావుమని దేవుని వేడుకొనుచున్నాడు.

సీ. నూతేండ్ల బ్రతుకె యీ ధారుణిలో నాది
కల్పాంతములదాఁకఁ గలవు పనులు ;
నిలిచినవాఁడను నే నొక్కఁడనె గాని
పాడుసంసారమ్ము బండ్లకొలఁది;
ఎపుడేని పట్టెఁ డన్నపువాఁడనే గాని
కోటానఁగోటులు కోర్కు లెంచ ;
జేనకు మించదు జిహ్వ నానారుచుల్
తెప్పలకొలఁదియై తీరిపోవు ;

గీ. రతిసుఖ మ్మొకనిమిషమాత్రంబె ; విరహ
వేదనలు వేనవేలు శ్రీ వేంకటేశ !
యెంత తామసచిత్త మేనేమిసేతు ?
నీ మఱుఁగుఁ జొచ్చితిని గావు నిండుకరుణ. 64

ఓ స్వామీ ! ఈ భూమిలో మానవజీవితం నూరుసంవత్సరముల పరిమితి గలది. కాని ప్రళయంవరకు పనులు నిలిచియుండును. ఉన్నవాడను నే నొక్కడనే. కాని నా సంసారము బండ్ల కెత్తవచ్చును. అనగా సంసార మనాది, అనంత మని చెప్పుట. నేనేమో పట్టెడన్నముతో పొట్టనింపు కొనువాడనే. ఐనను దీనిని నింపుకొనుటకు కల కోర్కులు మాత్రం కోటానగోటులు. ఈనాలుక జేనకన్న చిన్నదే. కాని దీనికి కావలసినరుచులు నానావిధములు. వేనిచేతను ఇది తనియదు. కూటమి వలని సుఖము క్షణకాల ముండునదియే. అయినను స్త్రీపురుషులయెడబాటు వలని కష్టములు లెక్కలేనన్ని. ఓ వేంకటేశ్వరా! నాచిత్తము ఎంతో తమోగుణముతో గూడినది. నే నేమియు చేయలేను. నీయండ జేరితిని. దయతో నన్ను కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమి సేయఁగల | 257 | 329 | 3 | 222 |

అవ: శ్రీనివాసుడు తనలో నున్నాడని అతడే తన్ను మంచిమార్గంలో నడిపించి ముక్తి నొసగవలెనని ప్రార్థించుచున్నాడు.

సీ. శ్రీపతీ! నీసేవ చిత్తమ్ము గోరదు
పాపాలవెంబడిఁ బరుగు లెత్తు ;
తెగని కర్మమ్ములు దేహ మియ్యది కోరు
నీఁగ వ్రణమ్ముల నెపుడు కోరు;
నగుచుఁ దొల్లింటి నానాకర్మములు కూడి
పొగరుభోగమ్ములు పొందఁజేయు
సంసారముం గోరు జవ్వన మ్మిది; కోరు
చీకురువాయులు జీడిమాను
దీకొని నాతోడఁ దివిరి యింద్రియములు
కైకొనిమర్మముల్ కలఁచివైచు;

గీ. వేదవిజ్ఞాన మెప్పుడు విరతిఁగోరు
సతము నీదాసుఁడైననే శరణుఁగోరు
నీవు నాలోన నుంటివి నిలుకడగను
గరుణ నను దారిలోనిడి కావు మయ్య ! 65

లక్ష్మీనాథా! నామన సెప్పుడును పాపపుపనులవెంట పరుగులు దీయుచుండునే గాని నీ సేవలో నిమగ్నం కాదు. ఈగ పుండుపై ముసురుచుండునుగదా! ఈ దేహము అనంతకర్మములనే ఆశ్రయించును. పురాకృతశుభాశుభకర్మలు ఏకమై పొగరుపుట్టించు భోగముల ననుభవింప జేయును. గబ్బిలములు జీడిచెట్టును ప్రబ్బికొన్నట్లు ఈ యౌవనం సంసారమునే కోరుచుండును. పంచేంద్రియములు న న్నెదురుకొని ప్రయత్నముతో నా ఆయువుపట్టుల పట్టు దప్పించుచున్నవి. వేదవేదాంత విజ్ఞానము సర్వసంగపరిత్యాగ మొనరింపజేసి అన్నిటిని మానుకొనుటను కలిగించును. ఏకాంతభక్తుడైనచో నీశరణము గోరును. ఓ దేవా ! నీవు నాలో నిశ్చలముగా నివసించుచున్నావు. నన్ను మంచిదారిలో నడిపించి మోక్ష మిచ్చి కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| శ్రీపతి నీ సేవ | 319 | 107 | 4 | 72 |

అవ: 'దాసరితప్పులు దండముతో సరి' అన్నట్లు మే మెట్టివారమైనను మమ్ము కాపాడుట నీకు తప్ప దనుచున్నాడు.

సీ. **భారమ్ము నీదని పలుమారు పాపముల్**
**చేరి మొక్కలమునఁ జేసినాఁడ**
**నేమిచేసిన పిల్ల లెంతో ముద్దుగఁగంద్రు**
**తల్లిదంద్రులు తప్పుఁ దలఁప రెపుడు;**
**కావంగఁ గలవని కడదాఁక నేరముల్**
**వేవే లొనర్చితి వెఱవకుండ**
**గృహయజమానుండు కెరలి పశువు పైరు**
**చెడమేసినను కీడు చేయఁబోఁడు ;**

గీ. **నీవు పుట్టించువాఁడవు నేము పొదలు**
**వార మెట్లున్న నీకుఁ దప్పుదు గదయ్య !**
**అట్టిటులు పొర్లినను నోడఁగట్టినట్టి**
**దూల మండవాయదుగదా! తోయజాక్ష !** 66

పసిబిడ్డలు ఎన్ని చిలిపిచేష్టలు చేసినను తల్లిదండ్రు లాపనులను తప్పులుగ లెక్కింపక ప్రీతితో వారిని చూచుకొందురుగదా! మేము కుటిలస్వభావులమై భారము నీపై నుంచి ఎంచరాని పలు పాపాలు చేసితిమి. ఓ శ్రీనివాసా! అటులైనను పిల్లలను తల్లిదండ్రులవలె మమ్ము కాపాడుట నీధర్మమని భావము. రైతు పొలమును తెగమేసిన దని తన పసరమును కోపించి చావబాదడుగదా! కరుణా స్వభావముతో కాపాడునట్టి స్వామివి నీ వున్నావను దీమసముతో లెక్కకు మిక్కుటమగు దొసగు లొనర్చితిమి. జీవుల ఉత్పత్తికి కారణము నీవు. నీ దయతో వర్ధిల్లెడు వారము మేము. ఓడ అటు నిటు పొరలినను దానికి నడుమ రక్షకముగా నుండు దూలము ఓడను మునుగ నీయక కాపాడుచుండును. అట్లే మే మెన్నితప్పుదారులు త్రొక్కినను మమ్ము అధోగతిపాలు గానీయక కాపాడువాడవు, తామరలవంటికన్నులుగల వేంకటేశ్వరా ! నీవేగదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఈ తగవే నాకు నీకు | 217 | 97 | 3 | 65 |

అవ: మంత్ర గురు ముద్రా దాస్యాదుల మహిమలను ఉగ్గడించుచున్నాడు.

సీ. కరుణానిధివి నీవు కలిగియుండంగ నీ
తిరుమంత్రమే నాకు దిక్కుగాఁగ
వరుస నాచార్యుండు వహియించుకొనియుండఁ
బరఁగఁ దపము చేసి బడలవలెనె?
నలినాక్ష ! నీదుముద్రలు కాచుకొనియుండ
నాకు దాస్యమ్మె కాణాచిగాఁగ
తమితోడ వైష్ణవుల్ దావుదండై యుండ
మించి తీర్థములు సేవించ వలెనె?

గీ. అనుపమంబైన నుతి యుపాయంబుగాఁగ
గొప్పదగుసేవ గతియయి యొప్పుచుండ
నిమ్మగు ప్రపత్తియే రక్షకమ్ముగాఁగ
వేయిదానాలు గావించి వేఁడ వలెనె? 67

ఓ గరుడాద్రివాసా! శ్రీనివాసా! దయకు నిధివంటివాడ వగు నీవు మాపాలి దైవమై యుండగా, నీ తిరుమంత్రమే మాకు రక్షకముకాగా, మ మ్ముద్ధరించుట కాచార్యుడు బద్ధకంకణుడై యుండగా, మేమిక దుష్కరతప మొనరించి గాసిచెందుటెందులకు? పైమూడు సమకూడగా తపస్సు వ్యర్థమనుట. మరియు నో పద్మనయనా! నీదుశంఖచక్రాదిముద్రలు మాభుజముల తళ్కొత్తి కాపాడుచుండగా, ఇంక నీదాస్యమే మాకు పరంపరాగతధనము కాగా, విష్ణుభక్తు లందరు ప్రీతితో మాకు చేదోడుగా వాదోడుగా నిలిచియుండగా-కాదని పుణ్యతీర్థసేవనము నల్పవలెనా? అవసరములే దనుట. తీర్థసేవనము కన్న మిన్నగ పావనత్వము గూర్చు నట్టివి పైమూడుఅంశము లనుట. ఓ ప్రభూ! నిన్ను జేరుటకు సాటిలేని నీస్తుతి ఉపాయమై యున్నది. గొప్పగా నీసేవ నొనర్చుట ఉత్తమగతియై యుండెను. ఒప్పిదమగు ప్రపత్తియే మాకు కాపై యుండగా, ఎన్నో దానములుచేసి నిన్ను ప్రార్థింపవలెనా? స్తుతిసేవాప్రపత్తులే చాలునని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీవారైన వారికి | 238 | 219 | 3 | 147 |

అవ: మనసు ఇహలోకసుఖాలనే కోరుచున్నది; పరలోకసుఖాన్ని సుంతైనా కోరదు. అట్టిదాని నరికట్టి నీపాదాలకడ నుంచుకొమ్మని వేడుచున్నాడు.

సీ. అరయ నాకుఁ బ్రపంచ మలవడినటువలె
వైరాగ్య మది యలవడదు సుంత;
తరుణీమణుల రతిఁ దలఁచిన యటువలెఁ
దలఁపదు నీదు నిద్దంపురూపుఁ
గొనకొని యర్థంబు గోరిన యటువలెఁ
గొనయైన మోక్షమ్ము గోరుకొనదు ;
తనుభోగములకును దగిలిన యటువలెఁ
దవిలి నీ కథలకుఁ దనియ దింత

గీ. అక్కటా! దుష్కృతము చవియైనయట్లు
తనకుఁ జవిగాదు పుణ్య ; మీ మనసు నేమి
చేయఁ గలవాఁడ? నీపాదతోయజములఁ
గట్టిపడవేయు మయ్య! వేంకటగిరీశ! 68

వేంకటాద్రీశా! చూడగా నాకీప్రపంచం నచ్చినవిధంగా మనసులో వైరాగ్యం బొత్తిగా నచ్చకున్నది. నామనసు వయసుకత్తెల పొత్తున హత్తుకొన్న చందంగా నీ దివ్యమంగళవిగ్రహమును దర్శింప దలంపదు. ప్రయత్నంతో ధనమును అపేక్షించినంతగా దుర్లభమైన మోక్షము నపేక్షించదు. శారీరకభోగములందు చవిగొన్న విధంగా నీకథల నాలకించుటయందు ఇంచుకైనను మక్కువ చెందదు. అకటా ? పాపము రుచించినట్లు తనకు (మనసునకు) పుణ్యము రుచించదే ! ఈ మనస్సును నే నెట్లు లోగొందును? ఓ స్వామీ! నాచిత్తమును బంధించి నీపాదసన్నిధిలో జేర్చుకొనుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| లేదందువల్లఁ దెలివి | 237 | 216 | 3 | 143 |

అవ: ఎడతెగక నిన్ను సేవించే దాసుని భరించి రక్షించి శాశ్వతసుఖము నీయవలదా అని కోరుచున్నాడు.

సీ. నీయాజ్ఞ దేహమ్ము నేను మోచితి నింతె
యేల విజ్ఞానమ్ము నీయవయ్య ?
వేఁగుదాఁక నొనర్చి వెట్టి నే నలసితి
నించు కేనియు నూరడించ వలదె ?
నీవుచేసెడి కర్మ మేను చేసెద నింతె
యేల నా కానంద మీయవయ్య ?
గొనకొని సారెకుఁ గొలిచెడి బంట్లకుఁ
దివిరి సుంతయు దప్పి దీర్చవలదె?

గీ. మతిఁ దిరుమలప్ప! నిన్ను నే మనికిఁ గొంటిఁ
దతిని నా పాటునకు దయ దలఁచ వలదె?
పనియొనర్చెడు తన యింటి పసరమునకు
తిండి కుడితియు నిడి సేద దేర్చవలదె ? 69

ఏడుకొండలప్పా ! నీయాజ్ఞచొప్పున నే నీశరీరమును ధరించితిని. అట్లుకాగా నీవేల విజ్ఞానమును ప్రసాదించవు? దేహము నొసగినవాడు తరణోపాయమునుగూడ తెలియజేయవలదా యనుట. రాత్రింబవళ్ళు వ్యర్థపుపను లెన్నియో చేసి యలసితిని. కొంచెమైనను నన్ను బుజ్జగింప వలదా? అనగా కర్మల నాచరించుటను మాన్పించి నిష్కామముగ భగవత్కైంకర్యములజేయ నుద్బోధించరాదా యనుట. పనిగట్టుగొని పలుమారు పాదసేవలుచేయు దాసులకు కొంచె మైనను కోర్కులు దీర్చి సాయుజ్యమీయరాదా యనుట. ఓ ప్రభూ ! తిరుమలరాయా ! నేను నిన్నే నా నెలవుగ నెన్ను కొంటిని. సమయములో నాకష్టమునకు దగినఫలమును దయతో ననుగ్రహింపుము. కష్టపడునట్టి ఇంటిపశువునకు తిండి తీర్థము లొసగి శ్రమ బాపవలదా ?

అనగా పశుతుల్యుడ నగు నన్ను పోషించి రక్షించి సమయములో ముక్తి నీయవలెనని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చెప్పినంతపని | 335 | 207 | 4 | 139 |

అవ: తన్ను పశువుగా, గుఱ్ఱముగా, ఏనుగుగా పోల్చుకొని అజ్ఞానినగు నన్ను దయతో కాపాడుమని వేడుచున్నాడు.

సీ. పాపపుంజమ్మను బందెలు మేసితిఁ
గాయం బనెడి కట్టుగాఁడి నుంటిఁ;
గొసరి కర్మపు మెడగుదియ మోచితి నన్నుఁ
బాలింపు వనరముఁవంటివాఁడ ;
పంచేంద్రియములను బాడిగ మోచితి
పాడుసంసారంపు లాడెఁ బడితి ;
ఆసల బందమ్ము హత్తించుకొంటిఁ గా
పాడుము గుఱ్ఱమువంటివాఁడఁ;

గీ. దివిరి యజ్ఞానమదమెత్తి తిరిగినాఁడ
మరుఁ డనెడిమావటీని పెన్మాయఁ బడితి
శేషగిరివాస ! కరిని గాచితివి గాన
నీవు కరివంటి ననుఁ గరుణింపు మయ్య ! 70

పాపసమూహమనే దొంగపైరును మేసినాను. ఎన్నో పాపములు చేసితి నన్నమాట. శరీరమనే కట్టుగాటిలో పడియున్నాను. అనగా పశువు గాట కట్టబడినట్టుగా జీవుడు ఈ శరీరములో బంధింపబడియున్నాడనుట. కర్మలనే మెడగుదియను మోయుచున్నాను. దొంగపైరుమేయు గొడ్డునకు మెడగుదియ తగిలింతురు. కనుక ఓదేవా! నేను పశువువలె నజ్ఞానిని. పంచేంద్రియములను బాడుగకు మోయుచున్నాను. బండిలోనివారి ఇష్టానుసారము గుఱ్ఱము పయనించును. అటులే గుఱ్ఱమువంటి మూఢుడు ఇంద్రియముల ఇష్టానుసారము నడచు ననుట. వ్యర్థమైన ఈ సంసారమనే బరువునుగూడ మోయుచున్నాను. ఆశలనే బంధముచే బద్ధుడ నైతిని. మేయునపుడు గుఱ్ఱము ముంగాళ్ళను త్రాళ్ళతో బంధింతురు. ఓ వేంకటనాయకా! గుఱ్ఱమువలె నజ్ఞానిని. నన్ను గావుము. మన్మథుడనే మావటీని మాయలోబడి అవివేకమనే మదము విజృంభింపగా ఇచ్చవచ్చినరీతిని సంచరించితిని. ఓ ఫణిగిరినివాసా ! శరణన్న గజరాజును గాపాడితివిగదా ! అటులే మాయామోహితుడనైన నన్ను దయ దలంపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అటు గొన్నాళ్ళుందాక | 339 | 227 | 4 | 152 |

అవ: మనోవాక్కాయములచే నిన్నే తలచుచున్న నన్ను కరుణించుమని విన్నవించుకొనుచున్నాడు.

సీ. మనసులోనికి గుఱి మఱి నీదుపాదాలు
తనువుపై గుఱి నీ సుదర్శనమ్ము
కనుచూపులకు గుఱి క్రమమౌ నీరూపు
పనులలో దోషమ్ము పట్టకయ్య !
చేతులకును గుఱి చేసెడు పూజలు
నాలుకకును గుఱి నామపటలి
సరి నుదుటికి గుఱి తిరుమణీ తీర్పులు
సలుపు నేరమ్ములఁ దలఁప కయ్య !

గీ. ఆత్మకును గుఱి నీమీఁది యమలభక్తి
పరఁగ నిహపరములకుఁ బ్రపత్తియె గుఱి
యన్నిటికి గుఱి నీ కృప యహినగేశ !
యింక నే నెటు లున్నఁ దప్పెంచ కయ్య ! 71

ఓ భుజగగిరివాసా ! నామనస్సు, శరీరము, కన్నులు నీ పాదములను నీ ఆయుధమైన సుదర్శనచక్రమును నీసుందరరూపమును గురిగా చేసుకొనియున్నవి. మరియు నాచేతులు, నాలుక, నొసలు నీ పూజలు నామజపము తిరుమణిధారణమును లక్ష్యముగా కలిగి యున్నవి. అనగా ఎల్లప్పుడు వానిని విడువ నని భావము. ఇంకను నా ఆత్మకు ప్రపత్తికి నీమీది పరిశుద్ధమగు భక్తియు ఇహపరసుఖములే లక్ష్యములైయున్నవి. నా సకలకార్యములకు నీ దయయే పరమలక్ష్యము. నీకృపను గోరియే సమస్తము నే నాచరించుచున్నా ననుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలదొక్కటే గురి | 345 | 266 | 4 | 178 |

అవ: తీర్థసేవనము, కర్మాచరణము వేదాధ్యయనము - వీనికన్నను సులభముగా శరణాగతివల్ల మోక్షం పొందవచ్చునని వెల్లడించు చున్నాడు.

**సీ. ఈ తను వేగదా హేయ మెల్లను మోచె**
**నామీఁద తీర్థమ్ము లాడుఁగాక**
**ఈ రెంటి సంగాత మే నొనరించుచు**
**నటు నెందువాఁడఁ గానైతిఁ గాక**
**చిత్త మియ్యదెగదా చింతించెఁ బాపాలు,**
**పుణ్యాలు మఱి తలపోసెఁగాక**
**రిత్తకు రిత్తయి రెంటినడుమఁ జిక్కి**
**యడుసులోపలి కంబ మైతిఁగాక**

**గీ. ఇందఱ నుతించు నాలుక యిదియగాదె**
**తాను శ్రుతులను స్మృతులను దడవుగాక**
**నిను శరణుఁ జొచ్చి నేను రెండిటను గడచి**
**పరఁగఁ దుద కెక్కెదను గాక ఫణిగిరీశ ! 72**

శేషశైలాధిపా ! ఈ శరీరము మలమూత్రాది నీచపదార్థములను మోయుచునే యున్నది. మరి పవిత్రతకై తీర్థాల వెంబడి తిరుగుచున్నది. ఈరెంటి సంబంధమువల్ల నేను ఇటు పరిశుద్ధతనుగాని, అటు అపరిశుద్ధతను గాని చెందక రెంటికింజెడిన రేవడనైతిని. అనగా శారీరకశుద్ధికి తీర్థస్నాన మాచరించి మరల నింద్యవస్తువులను మలమూత్రాదులను శరీరములో ధరించుటచేత ఇట్లైతి నని భావము. ఈ మనస్సొకటియే పుణ్యములను పాపములను గూడ చింతించును. ఈ పుణ్యపాపాలనడుమ ఎటూ స్థిరంగా నిలువక అడుసులో పాతిన కంబమువలె అస్థిరుడ నైతిని. శ్రుతిస్మృతులను నాలుక పలికినను పలువురను స్తోత్రంచేయుటవల్ల దానికి పవిత్రత శూన్యమైనది. కనుక శరీరధారణము, తీర్థసేవనము, పాపపుణ్య కర్మాచరణము, నరస్తుతి వేదపఠనము- ఈ జంటలను వదలి ఒప్పిదముగా నీ శరణుజొచ్చి మోక్షము పొందగలను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి నీవాఁడనే కానా | 308 | 44 | 4 | 30 |

అవ: సృష్టికర్త, రక్షకుడు, కర్మానుగుణఫలప్రదాత, బంధువు- ఈ సకలము నీవేయని వేంకటాచలపతిని ప్రశంసించుచున్నాడు.

సీ. మునుపె యీ జగమీవు మొలవఁబెట్టినది నీ
వాఁడ నే నను విన్నపమ్ము లేల ?
నీ రక్షణములోన నిఖిలజీవు లెలర్ప
వేఱె కావు మటంచు వేఁడ నేల ?
కర్మానుగుణముగ కలిమి నీ వీయ నా
కవి యివి యిమ్మని యడుగ నేల ?
తలి దండ్రి సంతు బాంధవులు నీవై యుండ
వెస నిన్ను నిందందు వెదక నేల ?

గీ. వరము లొసఁగుచు చేరువై వఱల నీవు
అన్యదైవతకోటిపై నాసలేల ?
వేంకటేశ ! నీ లెంక: నే వీథు లెఱుఁగ
దాఁచ నేటికి నీవె యింతయును మాకు. 73

ఓ వేంకటాచలపతీ! మొదట నీవే ఈ జగత్తును సృజింపజేసితివి. కనుక నేను నీ వాడనని మనవిచేయ నవసరం లేదు. నీ కాపుదలలో ఈ జీవులు మనుచుండగా ప్రత్యేకించి నన్ను కాపాడుమని వేడ నక్కఱ లేదు. పూర్వజన్మకర్మల ననుసరించి కలిమిలేములు నీవలన కలుగుచుండగా వేఱుగా ఏవేవో ఇమ్మని నిన్ను బతిమాల పనిలేదు. తలిదండ్రులు, సంతానము, చుట్టములు నాకు నీవై యుండగా ఇక నిన్నెక్క డెక్కడనో వెదుక నక్కఱలేదు. 'దైవం మానుషరూపేణ' అని శాస్త్రము. కోరినవరము లిచ్చుచు, చేరువ నీవు సంచరించుచుండగా ఎవ రెవరో ఇతరదేవతలకై ప్రాకులాడ నవసరం లేదు. ఓ స్వామీ! నేను నీదాసుడను. ఇతరమార్గము లెఱుగను. రహస్య మేమున్నది ? నా సర్వము నీవే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి నే నిన్నిందులకుఁ గాదు | 318 | 105 | 4 | 70 |

అవ: సంసారరోగనివృత్తికి తగినఔషధము (భక్తి) నిమ్మని వేంకటాద్రినాథుని వేడుకొనుచున్నాడు.

సీ. మాయసంసారమ్ము మరగిన కర్మమ్ము
మరగ దేటికొ నిన్ను మఱచియైన
మరుకేళిమీఁద తమక మొందుచిత్తమ్ము
మరుతండ్రి నీమీఁద మలయ దేల ?
నలుసంత బంగారు నమ్మినట్టి బ్రదుకు
నెమ్మది నీ భక్తి నమ్మదేల?
కొఱగాని పదవులు గోరెడి జీవుండఁ
గొనకొని నిజముక్తిఁ గోర నేల ?

గీ. పాపపుణ్యమ్ములకె పాలుపడిన నేను
ఏలొకో తప్పిదారి నీపాలఁ జిక్క?
సంకటహరుండ ! నాలోని వేంకటేశ !
ఇందు కేదైన మందు నా కీయరాదె ! 74

ఈ మాయసంసారమును మరగిన నాకర్మము పొరపాటున నైన నిన్ననుసరింపదు. మన్మథకేళికి ఉత్సాహపడునట్టి ఈనామనస్సు మన్మథుని తండ్రివైన నీమీదికి మరలదు. అల్పాల్పమగు ధనమున కాశపడు ఈ జీవితము మనస్సున నీభక్తిని విశ్వసింపదుగదా! పనికిమాలిన పదవుల కఱ్ఱులుసాచు జీవుడగు నేను ప్రయత్నముతో నాముక్తిని కోరుకొనను. పాపపుణ్యరూపకర్మలకే అంకితమైన నేను తప్పిదారియైన నీ పాలబడ కున్నాను. అనగా నీ సేవలు చేయనేర ననుట.

నాలోనున్న వేంకటరమణా ! సంకటహరణా ! ఇందుకు తగినమందు నిమ్ము. తగినమందు భక్తి. దానిని ప్రసాదింపు మనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య. | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమి సేతు నిందుకు | 335 | 204 | 4 | 137 |

అవ: నీవు పూనుకోకపోతే మిథ్యావాదిగణంచేత వివేకులకు బ్రదుకున్నదా యనుచున్నాడు.

సీ. అతఁడు నిరాకారుఁ డనెడి మాటలచేత
విజ్ఞాన మెల్లను వీటిఁబోయె;
నంత మీరు త్రివిక్రమాకారముం జూపి
వేదసత్యము నిరూపించినారు;
అవల "నహం బ్రహ్మ" యనెడి బుద్ధులచేత
ఘనభక్తి యెల్లను గాలిఁ బోయె
ప్రహ్లాదునికిగా హిరణ్యకశిపునొద్ద
ప్రభుభృత్యభేదంబు పగటినారు;

గీ. సర్వ మేకంబను నధర్మచరులచేత
కొల్లఁబోయి పుణ్యం బెల్ల గుంతఁ బడియె
నింతట బళారె ! యెక్కుడు నే నటంచు
విఱ్ఱవీగితి కొండెక్కి వేంకటేశ ! 75

శ్రీనివాసప్రభువు ఆకారములేనివా డనుటవల్ల దైవసంబంధమగు జ్ఞానము కలుషితమై వ్యర్థమైనది. ఈ వాదం సరికాదని ఓ వేంకటాద్రినాథా! నీవు త్రివిక్రముడవై వేదసత్యమును నిరూపించితివి. "అహం బ్రహ్మాస్మి" తామే పరబ్రహ్మస్వరూపుల మనెడి మరికొందరి ఆలోచనలచేత గాఢమగుభక్తి గాలిలో కలిసిపోగా భక్తుడైన ప్రహ్లాదుని రక్షించుటకై హిరణ్యకశిపునికడ సేవ్యసేవక భావమును ప్రకటించితివి. దీనిచే అహంబ్రహ్మాభావము అణగారిపోయినది. అధర్మముగా ప్రవర్తించువారు అంతా ఒకటే అన్నారు. ఇందువల్ల పుణ్యం కొల్లబోయి గోతిలో పాతుకొనిపోయినది. ఇట్లు పలువురు అపమార్గంలో పయనించే ఈ కలిలో ఓ ఏడుకొండలప్పా ! నీవు తిప్ప నెక్కి నేను అన్నిటికన్నను ఎక్కుడైనవాడ వని విజృంభించితివి. ఇప్పుడు నీవు ఈ విధంగా ప్రత్యక్షంకాకున్నచో ఈ టక్కరులదగ్గర పరమభక్తులకు బ్రతుకుండునా? ఉండ దనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కాకుంటే యీశూన్యవాద | 212 | 68 | 3 | 46 |

అవ: భగవంతునిపాదములే ఇహపరసాధనములని కొనియాడుచున్నాడు.

సీ. **గోపికావల్లభా! గోవర్ధనోద్ధార !**
**శ్రీపుండరీకాక్ష! శేషశయన !**
**పరమపురుష ! పాపహర! మధుసూదనా !**
**నీ పాదములె మాకు నిఖిలనిధులు**
**పురుషోత్తమా! హరీ! భువనపాలక! రమా**
**రమణీశ్వరా! కరిరాజవరద !**
**మురహరా! సురవరా! ముచికుందరక్షక!**
**ధరణి నీ పాదాలె తల్లి దండ్రి**

గీ. **దేవకీనందనా! యోగిదివిజవంద్య!**
**కలివిభంజన! కృష్ణ! సంకర్షణాఖ్య!**
**అచ్యుత! అనంత! సకలజీవాంతరాత్మ!**
**యెంచ నీ పాదములె మాకు నిహముఁ బరము.** 76

గోపికలకు ప్రియుడైనవాడా! గోవర్ధన మను కొండ నెత్తినవాడా! అందములైన తెలిదామరలబోలిన కన్నులు గలవాడా! ఆదిశేషుడు పాన్పుగా గల్గినవాడా! పురుషోత్తమా! పాపములను హరించువాడా! మధువను రాక్షసుని సంహరించినవాడా! నీ పాదములే మాకు సకలనిధులు. పురుషోత్తమా! పాపహారకా! లోకరక్షకా! శ్రీకాంతాహృదయేశ్వరా! గజరాజునకు వరము లిచ్చినవాడా ! మురాంతకా! సురగణాగ్రణీ! ముచికుందుని గాచినవాడా! ఈ లోకంలో నాకు నీపాదములే తల్లియు తండ్రియు. దేవకీపుత్రా! యోగులచేత, దేవతలచేత నమస్కరింపబడువాడా ! పాప వినాశకా! నల్లనిమై చాయగలవాడా! సంకర్షణుడను పేరుగలవాడా! (సృష్టి సంహార సమయము నందు ఒక్కసారిగా జనులను తనలోనికి లాగు కొనువాడు) నాశము, అంతము లేనివాడా! సకలజీవులకు అంతరాత్మ యైనవాడా! పరికింపగా మా కిహపరలోకసాధనములు నీ పాదములే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎదురేది యింక మాకు | 344 | 256 | 4 | 171 |

అవ: దాసులమహిమ చక్కగా ప్రశంసించుచున్నాడు.

సీ. హరి! నీవు లేవయ్య అన్ని చోటులఁ దొల్లి ?
నరయ నీ దాసులే యరుదుగాక;
కంటిమి దాసులఁ గనుపండువుగ పాద
తీర్థము గొంటిమి తృప్తిఁదీఱ;
వింటిమి నీ నామవిసరమ్ము కర్ణ పే
యముగ; మోక్షముత్రోవ నడుగనేల?
మాటాడితిమి దాసమండలితోడను
మతిఁ జొక్కితిమి దాస్యమహిమచేత
కంటిమి వారిసంగతి కూటములవల్ల
విమలవిజ్ఞానమ్ము వేఁడనేల?

గీ. దండములు వెట్టితిమి నీదుదాసులకును
పరమపద మిహమందునఁ బడసినాము;
నీదుదాసులు మన్నింప నెగడినాము
కడమ లేముండె మాకు వేంకటగిరీశ ! 77

ఓ శ్రీహరీ ! నీవు అన్నిచోటుల ఉన్నావుగదా! చూడగా నీ దాసులే అరుదుగ నుందురు. నీ దాసులను నేత్రోత్సవంగా దర్శించితిమి. తనివిదీర వారి పాదతీర్థమును గ్రహించితిమి. చెవులకింపుగ నీనామసముదాయమును వింటిమి. ఇక మోక్షమార్గ మేదియని వేఱుగ నడుగ నక్కఱలేదుగదా! భగవన్నామ శ్రవణముచేత మోక్షము సులభ మనుట. నీదాససమాజముతో సంభాషించితిమి. వారి దాస్యంవల్ల మానసికముగ పారవశ్యము చెందితిమి. భక్తులగోష్ఠులలో చేరుటవల్ల ని న్నెఱిగితిమి. ఇక విజ్ఞానమును వేఱుగ కోర నక్కఱలేదుగదా! అనగా సాధుగోష్ఠీసంబంధముచేత విజ్ఞానము తానుగా వచ్చి చేరునని భావము. నీ దాసులకు మ్రొక్కితిమి. ఈచర్యలవల్ల పరమపదములోని సుఖము ఈ లోకముననే పొందితిమి. నీదాసులు గౌరవింపగా ఉబ్బిపోయితిమి వేంకటాద్రినాథా! ఇక మాకు కొఱత లేమున్నవి? మేము పూర్ణకాముల మైతిమని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి నీవు లేవా | 341 | 243 | 4 | 163 |

అవ: భగవంతునికి దాసు డైనంతమాత్రమున నే ఈ లోకబంధములను త్రెంచవచ్చు ననుచున్నాడు.

సీ. బాపురే నీమాయ భ్రమపెట్టు జీవుని
దవులకుఁజొర; దుండు దాపునందె;
మోక్షరుచి గనండు ముందర నుండఁగా
సాక్షియై జగమిది చవులుసూప;
దీక్షకుఁ జొరఁడు భక్తియు లేదు నీపైని
తన యాలుబిడ్డలు దండనుండ;
ఇంపదు జ్ఞాన మొక్కింత నానాయోని
సంభవమ్మగు మేను సడలుచున్న;
అంటదు వైరాగ్య మలవాటులేమిచే
కట్టిడి కర్మముల్ గాసిఁబెట్ట;

గీ. మంచి దంచును తిరుమంత్ర మెంచుకొనఁడు
బలసి పంచేంద్రియము లాత్మఁ బట్టిలాగ
నంచితమ్ముగ నీ దాసుఁ డయినమాత్ర
నన్నిటి జయించు శ్రీవేంకటాద్రినాథ ! 78

ఓ వేంకటగిరినాథా! శ్రీనాథా! ఔరా! నీమాయ జీవుని భ్రమింపజేయుచు దగ్గఱనే యుండును; దూరముగా వెళ్ళదు. ఈ లోకము ఎదుటనే సాక్షిగానుండి చవులూరించుచుండగా మోక్షరుచి నెఱుగలేడు. భార్యాపుత్రాదుల బంధములో చిక్కిన వాడు దీక్షను, భక్తిని పొందలేడు. బహుజన్మము లెత్తిన తనకు శరీరం సంధి బంధములు సడలిపోవుచున్నను జ్ఞానమించుకైన రుచింపదు. క్రూరపుకర్మములు తిప్పలు పెట్టగా వాడుక లేనందున వైరాగ్యము ఒంటబట్టదు. చక్షురాదీంద్రియములు తన్ను విషయములలోనికి లాగుచుండగా తిరుమంత్రము మంచిదని ఎంచడు. ఇట్టి దుస్థితిలో బడినను నీ దాసుడైనచో అన్ని ఐహికములను జయించి నిన్ను చేరగలడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బాపురే నీమాయ | 344 | 257 | 4 | 172 |

అవ: తనసర్వస్వమూ శ్రీవేంకటేశ్వరుడే అనియు, వీడక తన్ను కాపాడేవా
డతడే అనియు కృతజ్ఞత దెలుపుకొనుచున్నాడు.

సీ. మతిలోని చీఁకటిమాన్ప మాణిక్యంపు
దివ్వెవై నాల్కకుఁ దేనె వగుచుఁ
గతలయి చొక్కింపఁ గర్ణామృతంబవై
గతివైతి వీవెగా కమలనయన!
చేరి కంటియెదుట శృంగారరసమవై
తగఁ బ్రోవఁ బిత్రార్జితంబ వగుచు
సారపు టిహపర సంసార సుఖమవై
యీరీతిఁ బెంచితి విందిరేశ!

గీ. తను వొసంగిన తల్లివి దండ్రి వగుచు
ధన మగుచు దాత వగుచును దైవ మగుచు
నంతరాత్ముండ వగుచు శేషాచలేంద్ర!
నన్నుఁ బాయక మన్నించినాఁడ వయ్య! 79

తామరపూలవంటి కన్నులుగల ఓ ఇందిరాపతీ! నాబుద్ధిలోని చీకటి (అజ్ఞానము)ని పోకార్చుటకు నీవు మాణిక్యాలు చెక్కిన దీప మైతివి. నాలుకకు తేనె వైతివి. నీనామోచ్చారణము తేనెవలె మధురమైన దనుట. నీవు కథలై (అనగా నీకథలు నాచెవులకు అమృతంవంటి వనుట) అన్ని విధముల నాకు దిక్కయితివి. నాకన్నులయెదుట నీవు శృంగారరసమూర్తివై దగ్గఱించి తగురీతి బ్రోచుటకు నాతండ్రితాతలసొత్తుగా నయితివి. సారవంతములగు ఇహపరసాంసారికసుఖాలను సమకూర్చి ఈ విధముగా నన్ను వృద్ధి నొందించితివి. తల్లిగా తండ్రిగా ధనముగా దాతగా దైవముగా అంతరాత్మగా నయి ఓ శేషాచలపతీ! నన్ను వదలక కాపాడుచున్నావు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నేనేమి బాఁతినీకు | 266 | 381 | 3 | 257 |

అవ: వేంకటాచలపతియందుగల పరబ్రహ్మలక్షణములను ప్రశంసించు చున్నాడు.

సీ. **ఆర్తుఁడ నేను నీ కర్థ మెందును లేదు**
**మూర్తిత్రయాత్మక! బ్రోవు మయ్య !**
**సర్వసాక్షివి నీవు సర్వాంతరాత్మవు**
**సర్వసర్వంసహాచక్రవర్తి !**
**నిర్వాణమూర్తివి నిగమాంతకీర్తివి**
**సర్వాపరాధముల్ సైపు మయ్య !**
**పరమ! పరానంద ! పద్మాక్ష! కారుణ్య**
**నిలయ! పరంజ్యోతి! నీలవర్ణ!**
**శరణాగతుఁడ నన్ను సరగునఁ గావవే**
**కరిరాజవరద ! సంకటవినాశ!**

గీ. **అణుబృహద్రూప! ఆదిమధ్యాంతరహిత!**
**అప్రమేయ! హరీ! అణిమాదివిభవ !**
**ప్రణుత వేంకటగిరినాథ! పరమపురుష!**
**జలధిబంధన! నాపాలఁ గలుగు మయ్య !** 80

బ్రహ్మవిష్ణుమహేశ్వరస్వరూపుడవైన వేంకటాచలపతీ ! నేను బాధితు డను. నీ కెందును అర్థము లేదు. నన్ను రక్షింపుము. సకలజగత్తులకు చక్రవర్తివైన ఓ దేవా! నీవు సర్వమును దర్శింపగలవాడవు. సకలమందు అంతర్యామిగా నుండువాడవు. ముక్తిస్వరూపుడవు. ఉపనిషత్తులందు కీర్తింపబడువాడవు. నా అన్నితప్పులను మన్నింపుము. పరమా! పరమానందా! పద్మములవంటి కన్నులుగలవాడా! దయకు నెలవైనవాడా! జ్యోతిస్స్వ రూపుడా! నల్లనిమేనిచాయ గలవాడా! శరణువేడిన గజరాజును కాపాడితివి; సంకటములను బాపువాడవు. నేనును నీశరణు వేడితిని. నాకును వరము లిచ్చి నన్ను బ్రోవుము. నీవు అణురూపుడవు. మహత్స్వరూపుడవు. ఆది మధ్యాంతములు లేనివాడవు. ఎట్టిప్రమాణములచేతను ఇంతటివాడ వని ఇట్టివాడవని తెలియరానట్టివాడవు. శ్రీహరీ! అష్టైశ్వర్యసంపత్తిగలవాడవు. వాసి కెక్కిన వేంకటాచలమునకు నాథుడవు. పరమపురుషుడవు. సముద్రమునకు సేతువు నిర్మించినవాడవు. అట్టినీవు నాపాలిటివాడవు కమ్ము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆర్తుఁడ నేను | 177 | 382 | 2 | 257 |

అవ: సర్వమును శ్రీనివాసమయముగా సంభావించుచున్నాడు.

సీ. నిలిచినరూపులు నీ గుళ్ళుగఁ దలంతుఁ
జైతన్య మీవని సారెఁ దలఁతు ;
భవదుపకరణముల్ పంచభూతము లని,
ధ్వను లెల్ల నీ పల్కులని తలంతు;
నై వేద్యములుగాఁగ భావింతు పంటలు;
నీ తీర్థముగ నెంతు నీటినెల్ల;
లలితపూజాద్రవ్యములు భోగము లటంచు
పను లెల్ల నీ లీల లని తలంతు;

గీ. గతు లటంచుఁ దలఁతుఁ గాలత్రయ; మ్మను
చరు లటంచుఁ దలఁతు సురల నెల్ల;
మనసులోని నిన్ను జనకుగా, నీ దేవు
లను దలంతు స్వామి! జనను లంచు. 81

కనిపించే రూపాలన్నీ నీగుళ్ళనీ, ప్రాణులలోని చైతన్యము నీవే యని, పలుమా రనుకొందును. పృథివ్యాదిపంచభూతములు నీకు సాధనములనీ, వినిపించే శబ్దము లన్నీ నీ మాటలని తలంతును. పండేపంటలు నీ నైవేద్యములని, అగుపించే నీరంతా నీ పాదతీర్థమే యని భావింతును. భోగము లన్నియు మనోజ్ఞములగు నీ పూజాద్రవ్యాలుగా, చేసేపను లన్నియు నీ లీలలని అనుకొందును. భూతభవిష్యద్వర్త మానకాలములను నీగమన మనియు, దేవత లందఱు నీ సేవకులని తలపోయుచుందును. మనసులో నున్న నిన్ను తండ్రిగా, నీరాణులను తల్లులుగా ఓస్వామీ! యెంచుదును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్నిటా నీవే వుందు | 167 | 324 | 2 | 217 |

అవ: నే నపరాధిని; సేవకుడను; ఆశ్రయించితిని, నీవాడనగు [illegible] కాపాడు మనుచున్నాడు.

సీ. దగ్గఱి భజియింతుc దారతమ్యముc జూడc
        జేరిపాడుదు నిన్ను సిగ్గుపడక
    చిత్తం బెఱుcగకుండc జేసెద విన్న పా
        లెగ్గులు నావల్ల నెన్ని లేవు?
    పాదాలు ముట్టెద పరిశుద్ధి భావింపc:
        దలcపను సత్తువc; గొలువ వత్తు;
    నెంగిలినోరని యెంచc గొండాడెదc;
        బరమమూఢుcడ నేమి పలుకc [illegible]

గీ. మందెమేల మ్మనక మంచమందుc దలcతు;
    కంచపుంగూళ్ళ నర్పింతుc గాదనకయె;
    నే ననంతాపరాధిని నీదులెంకc
    బంచcజేరితిc బ్రోవు నీ పాలివాcడ. 82

ఓ ప్రభూ! నీనాఅంతరువు సెంచకయే నీచెంతకు జేరి సేవింతును. సిగ్గు లేక నిన్ను కీర్తింతును. నీమనఃప్రవృత్తి నెఱుగక ఎన్నో విన్నపాలు చేయుదును. నాయెడ తప్పు లెన్ని లేవు? ఎన్నో వున్న వన్నమాట. తారతమ్య మెఱుగకుండుటయు, చిత్తవృత్తిని గమనింపక ప్రవర్తించుటయు తప్పులే. పవిత్రత తెలియక దోషినగు నేను నీపాదము లంటెదను. నీబలిమి నూహింపను. నిన్ను సేవింప జేరెదను. నానోరు ఉచ్ఛిష్టము కుడిచేది అని తలంపక అట్టిదోష యుక్తమగు నోటితో నిన్ను పొగడెదను. ఏమందును? నేనెంతమెుఅకువాడను. ఉపేక్షాభావమని యెంచక అపవిత్రమగు మంచముమీద పరుండియే చులుకనగా నిన్ను స్మరింతును. అశుద్ధములగు కంచాలలోని ఆహారమును తగ దనుకొనక నీ కర్పణ సేతును. నే నెన్నో అపరాధములు నీపట్ల చేసినవాడను. అటులైనను నీ బంటును; నీ సాన్నిధ్యం చేరినాను; నీవాడను; నన్ను కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అనంతాపరాధి నేను | 167 | 323 | 2 | 216 |

భావ: చేసినతప్పు లొప్పుకొన్నాను గనుక మన్నించునని విశ్వసించుచున్నాడు.

సీ. **సర్వాపరాధముల్ క్షమియించు కొనుమయ్య !**
**యేమి సల్పితినొ నే నెఱుఁగకుండఁ**
**బరిహరించఁ గదయ్య! నరకబాధల నెటు**
**వలెఁ గాచుకొన్నవో తెలియ నయ్య !**
**అమరుల మొఱల ము న్నాలకించితి వంట**
**నన్నుఁ గాచుట నీకు న్యాయ మయ్య !**
**భావింప సకలభువనరక్షకుఁడ వంట**
**తమి నన్నుఁ బ్రోచుట తగవు నీకు;**

గీ. **అడ్డపడరావె తిరువేంకటాద్రినాథ !**
ఏ నను భవింపఁ గర్మము **లేమిగలవొ!**
**చెప్పినం బాయునందురు చేసినట్టి**
**దోసములు-నన్ను మన్నింప వాసి నీకు.** 83

ఓ తిరుమలయ్యా! తెలియక నేనేమితప్పు లొనర్చితినో ఆ తప్పు లన్నింటిని మన్నింపుము. నా నరకబాధలను పరిహరింపుము. అవి ఏ విధంగా నన్ను బాధించుటకు వేచియున్నవో నాకు తెలియదు. మునుపు సురలమొఱ లాలకించి పాలించినా వట గదా ! అటులే నీ దాసుని నన్ను గాచుట నీకు న్యాయము. ఆలోచింపగా నీవు అన్నిలోకాలను కాపాడు వాడవటగదా! కనుక నన్ను ప్రీతితో గాపాడుట నీకు ధర్మము. వేంకటాద్రినాథా! నేననుభవింప వలసిన కర్మము లిక నెన్నియున్నవో తెలియదు. నాకడ్డపడరావా? నాకర్మ బంధములను త్రెంపు మనుట. చేసినతప్పులు చెప్పినచో ఆ దోషములు నమసిపోవునందురు. నాతప్పులను ఒప్పుకొన్నాను గనుక నన్ను మన్నించుట నీకు యుక్తము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
| --- | --- | --- | --- | --- |
| చెప్పితేఁ బాసునందురు | 165 | 312 | 2 | 209 |

అవ: భగవత్కథాశ్రవణము, తీర్థసేవనము, దర్శనము, పాదాభివందనము, దాస్యము-వీనివలని ప్రయోజనమును తెల్పుచున్నాడు.

సీ. శ్రీపతీ! మీ కథల్ చెవులతో వింటిమి
పాపమ్ము లుడిగెను భయ మణంగె;
దివ్యమైన తులసితీర్థమ్ము గొంటిమి
శాపాలు చనె పుట్టు సఫల మాయె;
గోవింద! మిముఁ గనుగొన్నార మిప్పుడే
పావను లైనాము బ్రదికినాము;
చాఁగి మ్రొక్కితిమి మీ చరణకంజములకు
వేవేలు గలిగెను వేడ్క లాయె;

ఆ. శ్రీనివాస! మిమ్ము సేవించినారము
తాపమెల్లఁ దీఱె తనిసినాము;
భక్తి మూఁడుమార్లు వలగొనివచ్చి నీ
వార మగుచు నేఁడు వఱలినాము. 84

అమృతమథనసమయమున దేవాసురులనుబల్లని శ్రీమహాలక్ష్మిచే వరింపబడిన స్వామీ! నీకథలను వీనులవిందుగా వింటిమి. మా పాపములు మాయమైనవి. భయము తొలగినది. అమోఘమైన తులసితీర్థం పుచ్చు కొన్నాము. దానిచే శాపాలు తీఱిపోయినవి. మాజన్మ సఫల మైనది. గోవిందా! మిమ్ము దర్శించితిమి. ఆ క్షణములోనే పవిత్రుల మైతిమి. మాకు మనుగడ గల్గినది. మీ పద్మములవంటి పాదములకు సాగిలపడి నమస్కరించితిమి. వేనకువేలు శుభము లాయెను. సంతోషముగల్గినది. శ్రీనివాసప్రభూ! మీకు ఊడిగము సల్పితిమి. మాతాపము తీరినది. తృప్తి గల్గినది. భక్తితో ముమ్మారు ప్రదక్షిణించి వచ్చి నీవారమై నెగడితిమి నేడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంతపుణ్యమో యిటు | 167 | 322 | 2 | 216 |

అవ: భగవంతుని దర్శించినవారు, మహిమ లెఱిగినవారు, భాషించినవారు, ఆయన శక్తి తెలిసినవారు, వార్త లడిగినవారు లేరనుచున్నాడు.

సీ. చేరి శ్రుతుల్ నిన్నుఁ జెప్ప వినుటెకాని
        నీరూపు దర్శించువార లెవరు?
    ధారుణి నీయవతారాలె చూచుట
        నీమహిమ లెఱుంగు నిపుణు లెవరు?
    పుడమివారలఁ గాంచి పూజించుటయ గాని
        నీతోడ మాటాడు పూతు లెవరు?
    నీదాసులు వచింప నెఱి యెఱుంగుటెకాని
        దైవశక్తి దెలియు ధన్యు లెవరు?

గీ. వచ్చి సేవించుటయ నీవు వరము లీయ
    కోరి నీమూర్తి వెదకెడివార లెవరు?
    అహిగిరీశ ! నీకరుణవా రౌటగాని
    వలచి నిను సుద్దు లడిగెడివార లెవరు? 85

శేషశైలాధిపా! వేదములు నిన్ను గూర్చి చెప్పగా వినుటదప్ప ప్రత్యక్షంగా నీరూపాన్ని దర్శించినవా రెవరు? ఎవ్వరును లేరనుట. భూమిపై [illegible] చూచుటేకాని నీమహత్త్వమును తెలియగలసమర్థు లెవరు? ఎవరు లేరనుట. ఈ లోకంలో వుండే పెద్దలను జూచి పూజలు చేయుటయే గాని నీతో సంభాషింపగల పావను లెవరు? లేరనుట. నీదాసులు చెప్పగా నిన్ను గూర్చి చక్కగ తెలియుటయే గాని నీశక్తిని తెలిసే ధన్యు లెవరు? ఎవరు లేరనుట. నీవు వరము లిచ్చుచుండగా వానికై వచ్చి నిన్ను సేవించుటేకాని కోరికతో నీమూర్తిని వెదకేవా రెవరు? లేరనుట. ఓ శేషాచలేశ్వరా! నీదయగలవార లగుదురేగాని నిన్ను వృత్తాంతముల నడుగువా రెవరు? ఎవరు లేరని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సర్వేశ్వరా నీతోసరి | 163 | 303 | 2 | 203 |

అవ: తనజీవితము భగవంతుని సొమ్మనీ, తనప్రతిచర్యయూ భగవత్కైంకర్యమే అనుచున్నాడు.

సీ. కనులఁ గాంచెడివి నీకమనీయపాదాలె
విను వినుకులు నీదువిమలకథలె;
పలుకు పల్కులు నీదుపావనమంత్రాలె
నాభావము సమర్పణమ్ము నీకు;
నాదుసంచారముల్ నీదుప్రదక్షిణాల్
నీదుకైంకర్యాలె నాదుపనులు;
నీప్రసాదమ్ములే నే భుజించెడి వెల్ల
నాభోగము సమర్పణమ్ము నీకు;

గీ. నేలపై నాపరుండుటల్ నీకు మ్రొక్కు;
లేను దలఁచుతలంపు నీధ్యాన; మిట్లు
నీయనుజ్ఞను వేంకటనాయకుండ!
చేసితిని నీదుసొమ్ముగ జీవితమ్ము. 86

వేంకటనాయకా! నేను కన్నులతోఁ జూచున దంతయు నీ మనోహరములగు పాదములే. తన కగపడుదానినంతయు భక్తుడు భగవత్పాదములుగ భావించు ననుట. నేను వినునట్టి వెల్లను నీ పవిత్ర ములగు కథలే. నేను పలుకు పలుకు లన్నియు నీ పవిత్రమంత్రములే. నాయాత్మను నీకు సమర్పణము చేసితిని. నాతిరుగుటలు నీకుచేయు ప్రదక్షిణములే. నాపను లన్నియు నీ కైంకర్యములే. నే నారగించునది నీ ప్రసాదమే. నావిభవానుభవము నీకు సమర్పణ చేయబడినది. నేను నేలపై పరుండుట నీ కొనర్చు సాష్టాంగప్రణామములు. నాతలపులు నీధ్యానమే. ఓ స్వామీ! నీయాజ్ఞమేరకు ఈ విధముగా నాజీవిత మంతయును నీసొమ్ముగ సమర్పణ చేసితిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒడఁబరచుకొంటివి | 145 | 201 | 2 | 135 |

అవ: ఎట్టిపరిజ్ఞానము లేకున్నను శ్రీశుని శరణ మొంది ఆయనదయచే నిశ్చలముగనున్నా మనుచున్నాడు.

సీ. కైవల్య మెట్టిదో జ్ఞాన మ్మదెట్టిదో
దైవిక మ్మెట్టిదో తలఁపరాదు
జీవన మ్మెట్టిదో చిత్త మ్మదెట్టిదో
యిట్టిట్టనఁగఁబోల దెవరికేని
వేదమ్ము లెట్టివో విరతి యెట్లుండునో
ఆద్యంతము లవెట్లొ యరయరాదు
భేదమ్ము మఱియు నభేద మెట్లుండునో
శోధించి యెవరికిఁ జూడరాదు
గీ. ఎట్టిదొ ఫలమ్ము భక్తి తా నెట్టిదగునొ
తెలివి యెట్టిదొ పట్టి సాధింపరాదు;
సప్తశైలేంద్రవాస! నీశరణుసొచ్చి
నిలుకడగ నున్నవారము నీదుకరుణ. 87

మోక్షము, జ్ఞానము, దైవికము ఎవ్విధమైనవో యెఱుగరాదు. జీవనము చిత్తము ఇట్టిదట్టిదని చెప్పుట కెవరికిని శక్యముగాదు. వేదములు, కర్మపరిత్యాగము ఇవి ఎట్టివో, ఆద్యంతము లనగా నేమిటో తెలియుటకు సాధ్యము గాదు. భేద మనగా అభేద మనగా ఎటు లుండునో విమర్శించి తెలియుట అసాధ్యము. ఫలము; భక్తి, తెలివి-వీనిస్వరూప స్వభావములు అగమ్యగోచరములు. ఏడుకొండలవాడా ! నిన్ను శరణు పొంది నీదయచే నిశ్చలముగా నున్నాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భావించలే రెవ్వరును | 145 | 200 | 2 | 134 |

అవ: ప్రాణిమాత్రప్రవృత్తికి కారణము శ్రీవేంకటాచలపతి కనుక తన గుణదోషముల నెన్నక కృపతో గావుమని విన్నపము చేయుచున్నాడు.

**సీ. ఎవరివశము బుద్ధి యెఱిఁగి ప్రవర్తింప**
**నివల నీ వీయక యెఱుక లేదు;**
**తనయిచ్చ కొలఁదిని మనసున్నచో రాజ్య**
**మేలవా కాననమృగము లెల్ల ?**
**తలపింప నిన్ను జంతులకు శక్యమె? జిహ్వ**
**కెరలి నీవే పలికింపకున్న;**
**లోకమ్ము తనయిచ్చలోనిదే యయినచో**
**చదువవా కొక్కెరల్ శాస్త్రసమితి?**

**గీ. ప్రాణు లొనరించు పుణ్యపాపములు నీదు**
**చేఁతలే; అస్వతంత్రులు జీవు లగుట;**
**నీవె శరణంటి వేంకటనిలయ! నాదు**
**చేఁత లేటికిఁ గృపతోడఁ గాతుగాక !** 88

వేంకటాచలము నివాసముగాగల ప్రభూ ! మంచిబుద్ధిగల్గి నడచుటకు ఎవరికి సాధ్యము? జ్ఞానమును నీవే ప్రసాదింపవలెను. ప్రాణియిష్టముచొప్పున మనస్సు నడచునట్లైన అడవిలోని మృగములు సైతము రాజ్య మేలవా ? మనోనిగ్రహము కష్ట మనుట. నిన్ను స్మరింపజేయుట ప్రాణులకు శక్యమా ? నీవే అతిశయించి ప్రాణులనాలుకను కదలించి పలుకునట్లు చేయవలెను. లోకమంతయు తన ఇష్టమునకు లోబడి యుండునట్టి దైనచో కొక్కెరలుకూడ శాస్త్రములు వల్లింపవా? తన ఇచ్చచొప్పున లోక ముండ దనుట. జీవులు నీకు లోబడినవారు గనుక వారు చేసే పుణ్యపాపములు నీపనులే. నీవే దిక్కంటిని. నాచెడుగులను లెక్కపెట్టక దయతో నన్ను గాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దేవ నీ విచ్చేయందుకు | 78 | 372 | 1 | 249 |

అవ: భగవన్నామమహిమ నుగ్గడించుచు విశ్వాసము, మనోనిగ్రహము ఆవశ్యకములని నామస్మరణంమాని వ్యర్థంగా కాలక్షేపంచేయరాదని తెల్పుచున్నాడు.

సీ. హరియన్నఁ బాసెడు నన్నిపాపమ్ములు
నాకు పుట్టదుగాక నమ్మకమ్ము;
నరసింహ యన వచ్చు పరమపుణ్యములకుఁ
దిరముగా ఋణములు దీర్పఁగలనె?
దేవదేవ యన్నఁ దెగని జన్మము లేవి?
కైవసం బీ మతి కాదుగాక
గోవింద యన రాని గొప్పపదవు లేవి ?
ప్రొద్దు లూరక వెళ్ళఁబుత్తుగాక

గీ. వేదనారాయణా యన్న విడనిబంధ
ములు గలవె యెందు నీ రేడుభువనములను?
శ్రీసతీప్రియ ! వేంకటశిఖరినిలయ !
యీవె యీడేర్చెదవుగాక యెటులొ నన్ను. 89

నాకు నమ్మకం పుట్టలేదుగాని హరి యన్నచో అన్నిపాపములు అప్పుడే వీడును. 'హరియను రెండక్షరములు' అని కృష్ణశతకము. నరసింహాయని నుడివితే కలుగు పరమపుణ్యాలకు తుల్యమైనది దేనినైనా యిచ్చి ఆ ఋణం తీర్చుకోగలనా? తీర్చలేక భక్తుడు ఋణి ఆయెనని భావము. ఈ పాడుమనస్సు స్వాధీనంకాదుగాని నిశ్చలమనస్సుతో దేవదేవా అంటే ఏజన్మలు నశింపవు ? అన్ని జన్మలు నశించుననుట. వ్యర్థముగా కాలయాపనచేయుచున్నానుగాని ఒక్కసారి గోవిందా యని పల్కితే లభింపని పెద్దపదవు లేవి ? గోవిందనామోచ్చారణచేత అన్ని పెద్దపదవులు లభించుననుట. ఏడేడుపదునాల్గులోకములందును వేదనారాయణా అని పల్కితే వీడని తగులములు ఎక్కడైన కలవా ? లే వనుట. లక్ష్మీప్రియా ! వేంకటాద్రి నిలయముగాగల ప్రభూ ! ఏ విధముగానైనా నీవే నన్ను ఈడేర్తువుగాక !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దైవమా నీకు వెలితా | 84 | 407 | 1 | 273 |

అవ: నీవు సర్వాంతరాత్ముఁడవు; నేను శరణాగతుడను. మరెట్లు అపరాధినైతి నని శ్రీనివాసుని ప్రశ్నించుచున్నాడు.

సీ. పడియున్నప్రాణికి స్వాతంత్ర్యము నొసంగి
కొన కపరాధాలు కొన్నివేసి
నేర్చిన స్వర్గమ్ము నిరయమ్ము లేకున్నఁ
గల్పన మ్మిటుసేయఁ గర్త లెవరు ?
మనసు చూడఁ దలఁచి మాయ నీవే కప్పి
జనులకు విషయాలచవులు సూపి
కనుఁగొన్న మోక్షమ్ము కాకున్నఁ గర్మమ్ముఁ
గట్టఁ బెట్టుట కింక కర్త లెవరు?

గీ. ఒక్కనీగర్భమం దంద ఱున్నవారు
కన్నకన్నభ్రమల్ నీవె కలుగఁ జేసి
యిన్నిటను మమ్ము నేలితి వృషగిరీశ !
నిన్ను నన్నెంచుకొన్నచో నీకె తెలియు. 90

జీవుడు దేవునికి అధీనుడు. ఎక్కడో పడియున్న ప్రాణికి స్వతంత్రతను నీవే కల్పించితివి. చివర కట్టివానిపై కొన్ని తప్పిదములు మోపి సత్కర్మ లాచరించినచో స్వర్గము, దుష్కర్మము లొనర్చినచో నరకము ప్రాప్తించు ననియు కట్టడిచేయుటకు మఱి కర్త లెవరు ? ఎవరు లేరనుట. మనుష్యుల మనసులను కనిపెట్టదలచి వారిపై మాయను గప్పితివి. వారికి ఇహలోక సంబంధములగు విషయవాంఛలను రుచి చూపితివి. భక్తిచే భగవంతుని తెలిసినచో మోక్షమనియు, అటుగాకున్న కర్మమనియు అనుట కిక కర్త లెవరు ? ఎవరు కా రనుట. నీగర్భమందే అందఱు నివసించు చున్నారు. పలురకముల భ్రమలను నీవే పుట్టజేసి వృషాధిపా ! అన్నిటినుండియు మమ్ము కాపాడితివి. నీయొక్కయు నాయొక్కయు అంతరువు నాలోచించినచో అన్నింటికి మూలము నీవేయని నీకు తెలియగలదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సర్వాంతరాత్ముఁడవు | 34 | 409 | 1 | 274 |

అవ: చదువులు, సంపదలు, ఉపవాసములు, దేశాటనము ముక్తి కారణములు కావనుచున్నాడు.

సీ. కలుగదు శాంతమ్ము కటకట! బుద్ధికిఁ
జదివినప్పటికిని జదువు లెల్ల;
నిలువదు చిత్తమ్ము నీమీఁదిచింతకుఁ
గొదవ లేకున్న సంపదల కెపుడు;
తగులదు వైరాగ్యధన మాత్మ కెన్నఁడు
నొగి యుపవాసమ్ము లున్నఁ గాని ;
అగపడ దటు మోక్ష మాసల నాసల
సంచరించినఁగాని జగమునంత;

గీ. నీ యనుమతియొ నాకర్మమో యెఱుంగ
నిహమె పరమయి నను భ్రమియింపఁ జేయు;
నెడయకయ వేంకటేశ ! న న్నీ వె కావ
వలయు; నా తెల్వితేఁటలు పనికి రావు. 91

వేదవేదాంగాదివిద్య లిన్నినేర్చినను అయ్యయ్యో! ఈ బుద్ధికి శాంతము అలవడదు. ఎప్పుడునూ సకలవిధసంపదలకు కొదవ లేకున్నను ఓ వేంకటేశ్వరా! నీచింతనమునకు చిత్తము ఆయత్తముగాదు. హరి వాసరోపవాసములను చేసిననూ వైరాగ్యమనే ధనము ఆత్మకు అబ్బకున్నది. మిక్కిలి ఆశతో జగమంతా సంచరించినను ముక్తి కనుపించదు. ఓ స్వామీ! ఇది నీ అనుమతియో లేక నాకర్మమోగాని ఇహలోకమే పరలోక మను భ్రమ తొలగకున్నది. నన్ను నీవే కాపాడవలెను. నాతెలివితేటలు ముక్తికి సాధనములు కావు.

శరణాగతుని భగవంతుడే దయదలచి కావవలెననుట. దేవునిదయకు గుఱికాని మానవునిప్రయత్నము ఫలవంతము కాజాలదని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి నీ యనుమతో | 88 | 433 | 1 | 290 |

అవ: నీవు సర్వాంతరాత్ముఁడవు; నేను శరణాగతుడను. మరెట్లు అపరాధినైతి నని శ్రీనివాసుని ప్రశ్నించుచున్నాడు.

సీ. పడియున్నప్రాణికి స్వాతంత్ర్యము నొసంగి
కొన కపరాధాలు కొన్నివేసి
నేర్పిన స్వర్గమ్ము నిరయమ్ము లేకున్నఁ
గల్పన మ్మిటుసేయఁ గర్త లెవరు ?
మనసు చూడఁ దలఁచి మాయ నీవే కప్పి
జనులకు విషయాలచవులు సూపి
కనుఁగొన్న మోక్షమ్ము కాకున్నఁ గర్మమ్ముఁ
గట్టఁ బెట్టుట కింక కర్త లెవరు?

గీ. ఒక్కనీగర్భమం దంద ఱున్నవారు
కన్నకన్నభ్రమల్ నీవె కలుగఁ జేసి
యిన్నిటను మమ్ము నేలితి వృషగిరీశ !
విన్ను నన్నెంచుకొన్నచో నీకె తెలియు. 90

జీవుడు దేవునికి అధీనుడు. ఎక్కడో పడియున్న ప్రాణికి స్వతంత్రతను నీవే కల్పించితివి. చివర కట్టివానిపై కొన్ని తప్పిదములు మోపి సత్కర్మ లాచరించినచో స్వర్గము, దుష్కర్మము లొనర్చినచో నరకము ప్రాప్తించు ననియు కట్టడిచేయుటకు మఱి కర్త లెవరు ? ఎవరు లేరనుట. మనుష్యుల మనసులను కనిపెట్టదలచి వారిపై మాయను గప్పితివి. వారికి ఇహలోక సంబంధములగు విషయవాంఛలను రుచి చూపితివి. భక్తిచే భగవంతుని తెలిసినచో మోక్షమనియు, అటుగాకున్న కర్మమనియు అనుట కిక కర్త లెవరు ? ఎవరు కా రనుట. నీగర్భమందే అందఱు నివసించు చున్నారు. పలురకముల భ్రమలను నీవే పుట్టజేసి వృషాధిపా ! అన్నిటినుండియు మమ్ము కాపాడితివి. నీయొక్కయు నాయొక్కయు అంతరువు నాలోచించినచో అన్నింటికి మూలము నీవేయని నీకు తెలియగలదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సర్వాంతరాత్ముఁడవు | 34 | 409 | 1 | 274 |

అవ: చదువులు, సంపదలు, ఉపవాసములు, దేశాటనము ముక్తి కారణములు కావనుచున్నాడు.

సీ. కలుగదు శాంతమ్ము కటకట! బుద్ధికిఁ
జదివినప్పటికిని జదువు లెల్ల;
నిలువదు చిత్తమ్ము నీమీఁదిచింతకుఁ
గొదవ లేకున్న సంపదల కెపుడు;
తగులదు వైరాగ్యధన మాత్మ కెన్నఁడు
నొగి యుపవాసమ్ము లున్నఁ గాని ;
అగపడ దటు మోక్ష మాసల నాసల
సంచరించినఁగాని జగమునంత;

గీ. నీ యనుమతియొ నాకర్మమో యెఱుంగ
నిహమె పరమయి నను భ్రమియింపఁ జేయు;
నెడయకయ వేంకటేశ ! న న్నీ వె కావ
వలయు; నా తెల్వితేఁటలు పనికి రావు. 91

వేదవేదాంగాదివిద్య లిన్నినేర్చినను అయ్యయ్యో! ఈ బుద్ధికి శాంతము అలవడదు. ఎప్పుడునూ సకలవిధసంపదలకు కొదవ లేకున్నను ఓ వేంకటేశ్వరా! నీచింతనమునకు చిత్తము ఆయత్తముగాదు. హరి వాసరోపవాసములను చేసిననూ వైరాగ్యమనే ధనము ఆత్మకు అబ్బకున్నది. మిక్కిలి ఆశతో జగమంతా సంచరించినను ముక్తి కనుపించదు. ఓ స్వామీ! ఇది నీ అనుమతియో లేక నాకర్మమోగాని ఇహలోకమే పరలోక మను భ్రమ తొలగకున్నది. నన్ను నీవే కాపాడవలెను. నాతెలివితేటలు ముక్తికి సాధనములు కావు.

శరణాగతుని భగవంతుడే దయదలచి కావవలెననుట. దేవునిదయకు గుఱికాని మానవునిప్రయత్నము ఫలవంతము కాజాలదని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి నీ యనుమతో | 88 | 433 | 1 | 290 |

అవ: మహారాజులయొక్కయు పరమభాగవతులయొక్కయు ఆతిథ్యమును ప్రీతితో గ్రహించినట్లే దీనుడగు తనయింట నున్న కలిసే ఆరగింపుమని వేడుచున్నాడు.

సీ. కోరి పాండవులింటఁ గూరలు దిన్నట్లు
శబరిపండ్లకు నాల్క సాచినట్లు
లూరక మాయింట నొదవినపాటి నీ
వోఁగాము లెంచక యారగించు;
వ్రేపల్లెలో చల్ది వెస మెసవిన యట్లు
లనసూయచనుబాలఁ దనిసినట్లు
చేసినపాటి మా చిల్లరయింటిలోఁ
జల్లబోనము దిను చాల దనక;

గీ. ఇంపుగా శేషగిరి భుజియించినట్లు
వేంకటేశ్వర ! సిరితోడఁ గొంకులేక
లెంకనయిన నాయింటిలో లేశ మార
గించు నీనాదు భేదమ్ము లెంచఁబోకు. 92

చుట్టములైన పాండవులయింటిలో భోజనముచేసిన రీతిగా, పరమభక్తురాలగు శబరియిచ్చిన యెంగిలిపండ్లకై నాలుకసాచినరీతిగా, ఈభక్తుని యింటిలో కొద్ది పాటి రుచిలేని యాహారమునే మంచిచెడ్డ లెంచక భుజింపుము. గొల్లపల్లెలో చలిదియన్నమును తిన్నవిధముగా, అనసూయాదేవి చనుబాలను గ్రోలి తనిసిన మాదిరిగా మా లేవడియింటిలో సిద్ధంచేసిన కొద్దిపాటి మజ్జిగఅన్నమును సరిపోదనక తినుము. ఓ వేంకటాచలాధిపా! పద్మతోగూడి జంకుగొంకులులేక ఒప్పిదముగా శేషాద్రిపైన అరగించినచొప్పున బంటునైన నాయింటగల కొంచెపుటాహారమును ఆరగింపుము. నీమహారాజుతనమును నా పేదఱికమును పరిగణింపకుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చూపఁ జెప్పఁగల | 110 | 60 | 2 | 41 |

అవ: సర్వజ్ఞుడగు స్వామి పరమొసంగి రక్షింపవలెగాని దాని నార్జించుట మనుజునకు కానిపని యనుచున్నాడు.

సీ. కర్మమూలమ్మైన కాయమ్మునే మోచి
కర్మముల్ విడువ శక్యమ్మె నాకు?
మర్మ మ్మెఱింగి నీవె మాయల బంధింప
విడువఁ బోయిన కట్లు బిగియకున్నె ?
బంధమూలమ్ము ప్రపంచమందుండి నే
బంధమ్ము వాపుకోఁ బాయునె యది ?
అజ్ఞానతిమిరమ్ము నందుఁద్రోసితి; వెలుఁ
గంధకారమ్మున నరయఁ గలదె ?

గీ. దుస్తరభవాబ్ధిలోఁ జొచ్చి తొడరి యొడ్డు
సేర నీదెద నన్నచోఁ జేరఁ గలనె ?
ఏడుకొండలవాఁడ! నీ విహమునందె
పరము నిడి యేలఁగా నన్ని యెఱిఁగినాఁడ. 93

ఏడుకొండలవాడా! కర్మమువల్ల కలిగిన కాయాన్ని నేను కలిగి ఆ కర్మముల నెల్ల విడుచుట సాధ్యమగునా? రహస్యము దెలిసిన నీవే మాయతో కట్టివేయగా వాటిని విప్పబోగా ఆ కట్టులు బిగుసుకొని పోకుండునా ? బంధకారణమగు ప్రపంచములో నుండి నేను బంధముత్రెంప యత్నించినచో నది తెగునా?

అజ్ఞానమనెడి చీకటిలో త్రోసితివి. ఆలోచింపగా చీకటిలో వెలుతు రుండునా? దాటరాని సముద్రములో దిగి ప్రయత్నముతో ఈది గట్టుచేరెద నన్నచో అట్లు చేరగలనా? ఓ స్వామీ! నీవు ఇహమునందే పరమును ప్రసాదించి రక్షించితివిగాన సర్వమును తెలిసికొంటిని. అనగా భక్తుడు అనిష్టమగు ఇహలోకమునం దుండియు వైకుంఠనివాససుఖాన్ని అనుభవించు చున్నాడనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పెట్టిన నీ వెలుఁగుదు | 103 | 15 | 2 | 11 |

అవ: కొందఱు వెఱ్ఱులు మాయచే విభ్రాంతులై మంగవిభుని గొప్పతనము తెలిసియు దేవతాంతరములను గూడ కొల్తురని ఈసడించుకొనుచున్నాడు.

సీ. పరులకు మ్రొక్కకుండరు, మ్రొక్కుదురు నీకుఁ
 జెలఁగి ముజ్జగములఁ గొలిచి తంచు;
వేఱుదైవతముల వేఁడక మానరు
 వేఁడుదు రీవు శ్రీవిభుఁడ వనుచు;
పరులవారల మని పల్కకుండరు నీవు
 పరమేష్ఠిపితవు నీవార మండ్రు:
వేదాలు దెచ్చిన విభుఁడ వీ వని యెంచ
 యెంచక చనరు తా మెపుడు పరుల;

గీ. పరులమాటుఁ జొరకపోరు పరమమునుల
 కేలికని నీమఱుఁగుఁ జొత్తు; రెదుటిమిమ్ము
 నెఱిఁగి వెఱ్ఱులరు భ్రమియింతు రేమివెట్టి !
 మంగపతి ! మాయ లివి పెక్కుమాటలేల ? 94

జనులు సాధారణదేవతలనూ, విజృంభించి మూడులోకములు కొల్చిన వామనుడ వని నిన్నునూ కొలుతురు. ఇతరదైవతములను ప్రార్థించుట మానరు. సిరిమగడని నిన్నునూ ప్రార్థింతురు. తాము ఇతరదేవతాభక్తులమని చెప్పుకొనుట మానరు. నీవు బ్రహ్మదేవుని తండ్రివని, తాము నీవార మనియు పల్కుదురు. మత్స్యావతారమెత్తి వేదముల నుద్ధరించిన ప్రభుడవని ని న్నెఱింగియు ఇతరదేవతలను స్మరింపకుండరు. పెఱదేవతల మఱుగుచేరక మానరు సరికదా, పరమమౌనులకు ప్రభుడవని నీ మఱుగును జొత్తురు. ఇతరులనూ, నిన్నూ చక్కగ నెఱిగియు వెఱ్ఱులు భ్రమచెందుదురు. ఈ స్థితి ఓమంగాపతీ! నీమాయచేతనే కలుగుచున్నది. ఇక వేయిమాట లెందుకు?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పట్టిన ముట్టకుండరు | 343 | 251 | 4 | 168 |

అవ: స్వామిమూర్తిని ఆరాధించువిధానమును వర్ణించుచున్నాడు

సీ. ప్రాణుల కెల్లను బ్రాణంబ వగునీకుఁ
బ్రాణప్రతిష్ఠఁ జేయంగఁ దరమె ?
మా పూజలంగొని మమ్ముఁ గాచెడుపొంటె
నీమూర్తి ప్రాణమ్ము నిలుపఁగదవె;
జగతికి నీపాదజలమె సంప్రోక్షణ
నీకు సంప్రోక్షణ నెఱపఁ దరమె?
మముఁ బావనులఁజేసి మనుపుట కొఱకునై
చేకొను తీర్థాభిషేచనమ్ము :

గీ. వేదములు తెచ్చిన వృషాద్రివిభుఁడ! నీకు
వేదమంత్రాలఁ బూజఁ గావింపఁ దరమె?
నీదుదాసుల మముఁ గరుణించుకొఱకు
వేదమూర్తివై యిచ్చోట వెలయు మయ్య ! 95

శ్రీనివాసా! నీవు ప్రాణులకెల్ల ప్రాణమైనవాడవు. అట్టి నీకు (బింబము) ప్రాణప్రతిష్ఠచేయుట ఎవ్వరి తరము ? ఎవ్వరికీ తరముకా దనుట. మాపూజలు గ్రహించి మమ్ము కాపాడుకొఱకు నీ బింబమున ప్రాణమును నిలుపుము. లోకమునకు నీపాదతీర్థమే పావనత్వముగూర్చు చిలుకరింత. అట్టి నీకు పావనతగూర్చ సంప్రోక్షణముసల్ప ఎవరికి సాధ్యము ? సాధ్యముకా దనుట. ఐనను భక్తులగు మమ్ము పవిత్రుల నొనర్చి కాపాడుటకై మాయీతీర్థాభిషేకమును గ్రహింపుము, వేదముల నుద్ధరించిన వృషాద్రి నాథుఁడవు నీవు. అటువంటి నీకు వేదమంత్రాలతో పూజలుచేయుట శక్యమా ? శక్యము గాదు. నీభక్తుల మగు మమ్ము దయజూచుటకై వేదమూర్తివై ఈ వేంకటాద్రిపై వెలయుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| యజ్ఞమూర్తి యజ్ఞకర్త | 308 | 45 | 4 | 30 |

అవ: ప్రాణు లెట్టివా రైనను దాసు లగుచో భగవంతుడు వారి మంచి చెడుగులు గణింపక కాచు నని వచించుచున్నాడు.

సీ. పరుసమ్ము లోహమ్ముబాగోగు లెంచునా ?
విలువైన పసిఁడి గావించుఁగాక
నిలిపి ని న్నాత్మలోఁ దలఁచువారి యఘమ్ము
లింకించి మేల్ మెఱయింతుఁగాక
నలువంక రవికిరణాలు మేల్గీళ్ళని
తలఁగునా? యన్నిట వెలయుఁగాక
నీ దాసుఁ డెవఁడైన నీ కృపఁ బావను
నొనరించి వేగఁ జేకొనెదుగాక

గీ. ఈడనాడని మానునా ? యెల్లకడలఁ
బొలయు కరువలి జగమెల్ల మలయుఁగాక
వాసిగా వేంకటేశ ! నీ దాసు లున్న
దెట్టి నెలవైన నద్ది నీ కిరవుగాదె ! 96

పరుసవేది ఉక్కుయొక్క గుణదోషముల జూడక బంగారముగా దానిని మార్చును. అటులే ని న్నాత్మలో నిలుపుకొని స్మరించువారి పాపములను పోగొట్టి మేలు చేకూర్తువు. సూర్యకిరణాలు స్థలముల యొక్క మంచిచెడుగులు విచారింపక అంతట సమానముగా ప్రసరించును. నీ దాసు డెవడైనను నీవు కృపతో పవిత్రునిగా జేసి పరిగ్రహింతువు. అంతటా వీచుగాలి ఇక్కడక్క డనక లోకమంతటనూ వ్యాపించుచుండునుగదా! వేంకటనగాధీశా! నీ దాసు లుండుచోటు ఎట్టి నికృష్టమైన దైనను అది నీకు స్థానముకదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిజము దెలియని | 139 | 168 | 2 | 113 |

అవ: స్వామియొక్క సగుణనిర్గుణరూపములను ప్రస్తావించి సగుణో పాసనమే శరణోపాయ మని తన సిద్ధాంతమును తెల్పుచున్నాడు.

సీ. నిను సగుణుం డని నిర్గుణుం డని పెక్కు
వగల వాదింతురు వారు వీరు
అమితస్వతంత్రుఁడ వగుట వాల్మీకి 'గు
ణాత్మనే నిర్గుణాయ నమ' యనియె;
'సోఽహ' మ్మటంచు 'దాసోఽహం' బటంచు ని
య్యిరుదెఱంగులను గొందఱు భజింత్రు;
దాసోఽహ మనుబుద్ధి తలకొన శుకయోగి
కలసె నీలోన జగాలు వొగడ

గీ. ఆఱుశాస్త్రాల మతకర్మ లాఱీట మిము
శరణుఁ జొరక యుపాయ మెవ్వరికి లేదు;
సగుణు సాకారు నిను భక్తజనులు నమ్మి
కొల్చుట ప్రమాణ మగుఁగాదె కొండలప్ప ! 97

ఓకొండలప్పా ! నిన్ను గుణములతో కూడినవాడని కొందఱు, మరికొందఱు నిర్గుణు డనియు వాదించుచుందురు. నీవు మిక్కిలి స్వతంత్రుడవు కావడంవల్ల వాల్మీకిమహర్షి నిన్ను "గుణాత్మనే నిర్గుణాయ నమః" అన్నాడు. అనగా అనంత కల్యాణగుణములు కలవాడనీ, హేయగుణ రహితుడనీ అర్థము. అట్టి నీకు నమస్కార మని భావము. 'సోఽహం'-- పరమాత్ముడ నేనని కొందఱు, 'దాసోఽహం'-- నేను భగవద్దాసుడ నని మరి కొందఱు- ఈ రెండు విధముల ని న్నుపాసింతురు. శ్రీశుకయోగీంద్రుడు "దాసోఽహం" అనే భావనతోనే లోకాలు పొగడగా నీసాయుజ్య మందినాడు. ఆరుశాస్త్రాలకు సంబంధించిన మతకర్మలాఱింటిలో నెంతగ పరిశీలించినను నిన్ను శరణుపొందక ముక్తి లభించదు. సగుణుడు, సాకారుడు నగు నిన్ను భక్తులెందఱోనమ్మి సేవించుటే ఇందుకు ప్రమాణము.

ఆఱు శాస్త్రాలు = సాంఖ్యము, యోగము, న్యాయము,వైశేషికము, మీమాంస, వేదాంతము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సకలోపాసకులకు | 182 | 412 | 2 | 278 |

అవ: భక్తునియొక్కయు, భగవంతునియొక్కయు న్యూనాధికతలు తెలుపు చున్నాడు.

సీ. నన్నెంచి చూచిన నానావగుణుఁడను
  ని న్నెంచ గుణరత్ననీరనిధివి
ఇన్నిట నాకంటె హీను లెవ్వారు లే
  రున్నతుల్ నీకంటె నొరులు లేరు;
నిగిడి కొల్చిన లేను నివ్వరిముల్లంత
  నీవు బ్రహ్మాండాల నిండియుందు
వెవరికిఁ జేయ లే నే నుపకారమ్ము
  తృణము మేరువుసేయు ఘనుఁడ వీవు

గీ. దండిదొర వీవు భృత్యమాత్రుండ నేను
నీవు సర్వాంతరాత్ముఁడ వే నొకండఁ
బలుపలుకులేల ? నే సర్వభక్షకుండ
జీవరక్షకుఁడవు నీవు శ్రీనివాస! 98

శ్రీనివాసా! నన్ను పరికించినచో పలు చెడుగుణములు కలవాడను. నిన్ను విమర్శించి చూడగా గుణములనే రత్నములకు సముద్రము వంటివాడవు. అనంత కల్యాణగుణాకరుడ వనుట. అన్ని విధముల నాకన్న తక్కువైనవారు, నీకన్న గొప్పవారు మరెవ్వరును లేరు. నిగుడదీసి కొలిచినచో నేను నివ్వరిముల్లంత లేను. నీ వన్నో అన్ని బ్రహ్మాండములందును నిండియుండువాడవు. నే నెవ్వరికిగాని ఏపాటి ఉపకారముగాని చేయలేను. గడ్డిపోచనుగూడ మేరువుగా చేయగల ఘనుడవు నీవు. నీవు ప్రతాపముగల దొరవు. నేను సేవకమాత్రుడను. నీవు సకలమునకు అంతరాత్మయైనవాడవు. నేను ఏకాకిని. పలుమాట లెందుకు ? నేను సర్వమును భక్షించువాడను. నీవు సర్వమును రక్షించువాడవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎట్టువలసినాఁ జేయు | 208 | 45 | 3 | 31 |

అవ: నేత్రశ్రోత్రేంద్రియములు, మనస్సు, అజ్ఞానము, సంసారము మున్నగు వాని నైజగుణాలను ఎత్తి చూపుచున్నాడు.

**సీ. తగిలెడు నయనముల్ తగఁ గన్న తావుల**
**శ్రవణముల్ లోకవార్తలను దగులు;**
**మగుడంగ నేరవు మన నండ వీనికిఁ**
**దెగ కొక్క టొక్కటి తీఁగసాగు;**
**అజ్ఞానమున మద మంతకంతకు నెక్కు**
**రిత్తసంసారమ్ము మత్తుగూర్పు**
**తిక్కమెకము రీతి దేహమున్ కర్మమ్ము**
**క్రిందికి మీఁదికిఁ గెరలి త్రిప్పుఁ**

**గీ. బుణ్యపాపాలు పెరుఁగుచుఁ బ్రోగుపడును**
**ఆశ లుడుగవు లంపట మధిక మగును**
**ఎఱుఁగ నాలోని దుర్గుణా; లిన్నినాళ్ళ**
**కేను శరణంటి; నీ చిత్త మింక స్వామి!** 99

అగపడువాని నన్నిటిని నాకన్నులు చూచుచున్నవి. నాచెవులు లౌకిక విషయాసక్తములై యున్నవి. అవి వాటిపనులనుండి మరలవు. ఈ రెంటికి మనస్సు ప్రోత్సాహకారి. అజ్ఞానంవల్ల మద మంతకంతకు పై కెక్కుచున్నది. వ్యర్థమగు ఈ సంసారము మత్తు గల్గించుచున్నది. పురాకృతకర్మము దేహమును తిక్కపట్టిన మృగం మాదిరి నలువైపులకు త్రిప్పుచున్నది. జన్మకారణములైన పుణ్యపాపములు పెరిగి కుప్పతిప్ప లగుచున్నవి. ఆశలు నశింపవు. అందుచే శ్రమ మిక్కుట మగుచున్నది. ఇన్నినాళ్ళకుగా ఇప్పుడు నాచెడుగుణముల నెఱిగితిని. నిన్ను శరణంటిని. ఓ ప్రభూ! ఇక నీయిష్టము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎన్నఁడు నే నిఁక | 215 | 88 | 3 | 59 |

అవ: ఐహికమును వీడలేక పారలౌకికమును పొందలేక రెంటిమధ్య సతమత మగుచూ, భగవంతుని శరణుజొచ్చుచున్నాడు.

సీ. దేహతత్త్వంబును దెలిసికొనినవేళ
ఆహా! యిదే హేయ మగుచుఁ దోఁచు;
మోహించి విషయాల మునిఁగిన వేళలో
నిదె యిత వనిపించు నింతలోనఁ;
జదివి పురాణాలు సారెకు వినువేళ
నమితవైరాగ్యంబు హత్తికొనును
సంసారసుఖములు చవిచూచు వేళలో
మఱీ యన్ని మఱచు దుర్మదము పెరుఁగు

గీ. ఎక్కడ వివేక ? మెవరు జయించినారు ?
చక్కఁ బొడ వెక్కఁగాఁజేసి చఱీని ద్రోయుఁ;
దెలిసీ తెలియని చిక్కిది; తొలఁగఁ ద్రోయ
దిక్కు నీవె; నీ శరణంటిఁ దిరుమలప్ప ! 100

శరీరముయొక్క యాథార్థ్యమును తెలిసికొన్నప్పుడు ఆహా! ఇది ఎంత నీచమైన దని తోచును. అంతలోనే మోహం చెంది ఇంద్రియసుఖాలలో మునిగినప్పుడు ఇదే మంచి దనిపించును. పురాణములు చదివి పలుమారు పెద్దలసూక్తులు విన్నప్పుడు అధికమైన వైరాగ్యం మనస్సున జనిస్తుంది. మరుక్షణంలోనే సంసారసుఖాలు రుచిచూచునప్పుడు ఆ పురాణాలను మరచిపోయి మనసున దుర్మదము పెచ్చు పెరుగును. వివేక మెక్కడ నున్నది? అజ్ఞానమును జయించినవా రెవరు? ఈ అవివేకము బాగుగా నెత్తిపై నెక్కి చఱ్ఱాతిపై పడవేయును. ఈ వివేకావివేకములు తెలిసియు తెలియని గొప్పచిక్కు. ఈ చిక్కు తొలగించుటకు నీవే దిక్కు. ఓ తిరుమలేశా! నీకు శరణనుచున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలిసియుఁ దెలియను | ౭69 | 398 | 3 | 26౮ |

అవ: చక్రాంకనము, ఊర్ధ్వపుండ్రధారణము, దాస్యమువీటివల్ల ఈడేరితి నని హర్షించుచున్నాడు.

సీ. పాఱవేసిన పుల్లె బండిక ల్లైనట్లు
కోరి ముద్రలుదాల్చి కొండఁ గొంటి;
మూఁడుగుణాలలో మునుఁగువాఁడనుగాన
గట్టిగ నొకబుద్ధి పుట్ట దెందు;
నేఁడు నీ శరణను నిశ్చయం బిచ్చితి
గనుక విన్నింటఁ బావనుఁడ నైతిఁ;
బంచభూతమయమ్ము పాటించితిని మేను
పంచేంద్రియవికృతి పాయ దెప్పుడు

గీ. ని న్నెఱిఁగి కొల్వఁగా లేను; నీదుదాస్య
మిచ్చితివి మాన్యముగ నాకు నిందువలన
సఫలమాయెఁ బుట్టువు; లోన సంతతమ్ము
వెలుఁగు నిను నమ్మి బ్రదికితి వేంకటేశ! 101

పారవేసిన ఎంగిలాకు బండిచక్రమైన విధంగా స్వల్పములగు ముద్రలు ధరించి గొప్పదగు కొండలప్పకొండనే కొనగల్గితిని. సత్త్వరజస్తమో గుణములలో మునిగియున్నవాడను కాబట్టి నిశ్చలమగు బుద్ధినాకు ఏర్పడుట లేదు. ఇప్పుడు నీశరణు జొరవలె నను నిశ్చయము గైకొంటిని. కనుకనే అన్ని విధముల నేను పవిత్రుడైతిని. పృథివ్యప్తే జోవాయ్వాకాశములతో నైన ఈ దేహాన్ని గ్రహించితిని. కనుకనే త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు వానిపని నెప్పుడును మానవు. వేంకటేశ్వరా! నిన్ను ఎప్పుడును తెలిసి కొలువలేను, నీ దాస్యమును ఈనాముగా నా కిచ్చితివి. ఇందుచే నా జన్మ సఫలమైనది. నాలో నెప్పుడును అంతర్యామిగా వెలిగే నిన్ను నమ్మి ధన్యుడ నైతిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పారవేసిన | 281 | 466 | ౬ | 313 |

అవ: ముద్రాధారణము- నామజపము - సమాశ్రయణము - దాస్యము- చింతనము- వీని మహిమను ఉగ్గడించుచున్నాడు.

సీ. ఎక్కడి పుట్టువు? లెక్కడి మరణముల్ ?
నీదుముద్రలు హత్త నాదుమేన
కలుషమ్ము లేడవి? కర్మమ్ము లేడవి?
జిహ్వ నీనామమ్ము చెన్ను మీఱఁ;
విషయములకు బంధ వితతికిఁ జిక్కను
జొక్కి నీ మఱుఁగు నేఁజొచ్చియుండ
ఒరుల కేటికి మ్రొక్క ? మొఱపెట్ట నేటికి ?
యిలవేల్పు వీవయి యెసఁగుచుండ

గీ. నీవు నామది వెలుఁగంగ నేరములును
నరకములు మాయ లేమి యొనర్పఁగలవు ?
ఎగ్గుతగ్గులు లేవు నా కుగ్గువోలె
నీప్రసాదమ్ము తను వేమ నీరజాక్ష! 102

తామరలవంటి కన్నులుగల ఓ తిరుమలేశా! నీ ముద్రలు నాశరీరమున నుండగా జననమరణములు నాకెక్కడివి ? అనగా ముద్రాధారణము చావుపుట్టువుల బోగొట్టి ముక్తి నిచ్చుననుట. నా నాలుకపై నీ నామజప మొప్పియుండగా పాపములు, కర్మములు నాకెక్కడివి? ఉండ వనుట. నేను పరవశించి నీయండను జేరి యుండగా ఇంద్రియాలకు లోబడను. సంసారబంధములకు కట్టుపడను. ఇంటి దైవం నీవై యుండగా ఇతరదేవతలకు మ్రొక్కనేల? మొఱపెట్టనేల? అనవసర మనుట. నీవు నా మనస్సున నుండగా, తప్పిదములు-నరకములు-మాయలు నన్నేమి చేయగలవు? ఏమియు చేయజాల వనుట. ఉగ్గువలె నీ యనుగ్రహము నన్ను (నాశరీరమును) కాపాడుచుండగా హెచ్చుతగ్గులు నాకు గలుగబోవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎక్కడి పుట్టుగు | 280 | 46J | 3 | 309 |

అవ: నిజమహిమము నెఱపి అజ్ఞానినగు నన్ను కాపాడు మని వేడుకొనుచున్నాడు.

సీ. ఎఱుఁగను జననంబు నెఱుఁగను మరణంబు
నితవుగ ని న్నింక నెఱుఁగఁ గలనె?
క్షితిని బుట్టించిన శ్రీవిభుండవు నీవె
తతి నాపయిం గృపఁ దలఁతుగాక
తలఁపఁ బాపమ్మని తలఁపఁ బుణ్యమ్మని
తలఁపున ని న్నింకఁ దలఁపఁ గలనె?
అంతరంగమ్ములో నలరు నంతర్యామి
వఱఁచి నా కలుషమ్ము, మనుతుగాక

గీ. తడవ లేను నా నీచత; తడవఁ గలనె
కడఁగి నీమేలు?; నేను దీనుఁడను, నీవు
దేవుఁడవు వేంకటాద్రీశ! దివ్యమహిమఁ
గడవఱకు నన్ను నీ దాసుఁ గాతుగాక! 103

వేంకటాచలపతీ! జననమరణములను గూర్చి నే నెఱుగను. అట్టి నేను నిన్ను గూర్చి చక్కగ నెఱుగగలనా? ఎఱుగలే ననుట. ఈ నేలపై బుట్టించిన ఓ శ్రీపతీ! నన్ను దయదలచి కాతువుగాక! పుణ్యపాపములగూర్చి నే నెప్పు డాలోచించినవాడను గాను. అట్టివాడ నగు నేను నిన్ను గూర్చి ఆలోచింప గలనా? ఆలోచింపలే ననుట. అట్లైనను నాహృదయంలో అంతర్యామిగా మెలగునట్టినీవు పాపముల బోకార్చి కాపాడుదువుగాక! నాలోని నీచత్వమును నేను గుర్తింపజాలను. ఇక నీగొప్పతనమును గుర్తింపగలనా? నేను దీనుడను. నీవు దేవుడవు. నీ దివ్య మహిమతో కలకాలము నీదాసుని నన్ను రక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దీనుఁడ నేను | 232 | 474 | 3 | 319 |

అవ: వినయముతో తనలోపములను వేంకటాచలపతికి విన్నవించు కొనుచున్నాడు.

సీ. నే నపవిత్రుండ నే నమంగళుఁడ నే
నపగతపుణ్యుండ నలసమతిని
కపటకలుషపరికరహృదయుండ నే
నపవర్గమునకు నె ట్లర్హుఁ డగుదు?
అధికదూషితుఁడ నే నతిదుష్టచిత్తుండ
నదయుఁడ హతవివేకాత్మకుండ
ప్రతిలేని మిము రమాపతి దలంపంగలే
నతులసద్గతికి నెట్లర్హుఁడగుదు?

గీ. అసమవిషయపరాధీనుఁ డైనవాఁడ
నతివిమోహభయాతురుం డైనవాఁడ
నిను వినుతిసల్ప ననఘులు మునులుగాక
అంజనాద్రీశ ! నే నెట్టు లర్హుఁ డగుదు ? 104

అంజనాద్రిపతీ ! నేను అపవిత్రుడను; అశుభముల కాలవాలమైన వాడను; పుణ్యహీనుడను; మందబుద్ధిని; కపటదుష్కృతసమూహంతో నిండిన హృదయము కలవాడను; ఇట్టి నేను మోక్షమున కెట్టు లర్హుడగుదును? కా ననుట. పలువురచే దూషింపబడినవాడను; దుష్టబుద్ధిగలవాడను; దయలేని వాడను; తెలివిలేనివాడను. అసమానుడవగు లక్ష్మీపతివి నిన్ను స్మరింపలేనివాడను. ఇట్టివాడ నగు నేను అనుపమానమైన సద్గతికి అర్హుడ నెట్లగుదును? కా ననుట. సాటిలేని (అనమములగు) ఇంద్రియ విషయములకు అధీనుడను. మోహభయము లనే తెగులుపట్టిన వాడను. పాపరహితులైన మునులు నిన్ను నుతింప అర్హు లగుదురుగాని నావంటి అధము డర్హుడగునా? కా డనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరమపాతకుఁడ | 5 | 33 | 1 | 22 |

అవ: వేంకటేశ్వరు గరుడోత్సవమును అభివర్ణించుచున్నాడు.

సీ. ఇటు గరుత్మంతు నీ వెక్కినయంతటఁ
బటపట దిక్కులు బ్రద్దలయ్యె;
ఎగసిన తార్క్ష్యుని నేపున ధేయని
జగ్గుజిగిదొలంక చబుకుసేయ
నిగమసంఘమ్ములు నిగమాంతనిచయమ్ము
గగనమ్ము జగములు గడగడ మనె
బిరుసుగ గరుడనిఁ బేరె మెత్తింపంగ
బెరసి నీవంత కోపించినంత
సకలలోకమ్ములు జర్జరితమ్ములై
దిర్దిర నలుగడఁ దిరుపుగొనియె

గీ. ఈవు పల్లించిన ఖగేంద్రు నెక్కినంత
సమదదైత్యులగుండెలు జల్లు మనియె;
నీ మహిమవెల్లి మునుఁగక నిలువ రెవరు
దేవరాహుత్తరాయ! ఓ తిమ్మరాయ! 105

దేవరాహుత్తరాయా! (బిరుదము) తిమ్మరాయా! (తిర్మలరాయ, తిమ్మరాయ) నీవు గరుత్మంతు నెక్కినంతనే అన్నిదిక్కులు పటపటమని పగిలిపోయినవి. పైకి లేచిన గరుడుని ఏపుగా ధేయని కోలకాంతులు విస్తరించునట్లు నీ వదలింపగా వేదములు, వేదాంతములు, ఆకసము, లోకములు ఒక్కసారి గడగడ వడకసాగినవి. గడుసుగా గరుత్మంతుని పరుగెత్తింపవలెనని నీవు కోపింపగా అన్నిలోకములు పట్టుదప్పి నాల్గుదిక్కులకు చెదరినవి. నీవు జీనివైచి నువర్ణ నెక్కగా మదముతో కూడిన రక్కసులగుండెలు జల్లు మన్నవి. ఓ ప్రభూ! నీమహిమయనెడు వెల్లువలో ఎవరుగాని మునిగిపోవలసినదేగాని నిలబడలేరు.

భగవంతుని మహిమగరిమ సర్వాధికమైనదని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇటు గరుడని | 15 | 92 | 1 | 63 |

అవ: తలపు, పలుకు, కాయము, ఇంద్రియములు, భవము-ఇవి తనకు అధీనములై యుండవుగాన త న్నేలుకొమ్మని నాగాద్రినాథునికి మొఱ పెట్టుకొనుచున్నాడు.

సీ. తలఁచిన ట్టుండదు తలఁపు నాదైనను
కులికి నన్నే పనిగొనునుగాని
నిలిపిన ట్లుండవు పలుకులు నావైన
పొంచి నన్నెటులొ బొంకించుఁ గాని
కలిమిలే మెఱుఁగదు కాయము నాదైనఁ
గొలఁదిలే కేమైనఁ గోరుఁ గాని
నా యంకెకునురావు నాయింద్రియము లైన
వడి మర్మముల గాఁడిపాఱుఁ గాని

గీ. భవము నాదైనఁ జేయదు పంపు నాకుఁ
దెంపునను గర్మవీథులఁ ద్రిప్పుఁ గాని
అహినగేశ! అరాజక మ్మాయె బ్రదుకు
ఏలుకోవయ్య! నను మొఱ లిడెద నీకు. 106

కోరిక నాదే అయినను అది నేను తలచిన ట్లుండక కులుకుచు నాచేతనే పనులు చేయించుచుండును, నామాటలు నా అదుపులో నుండక దాగియుండి నాచే అబద్ధము లాడించుచుండును. నాశరీరము కలిమిలేములను గణింపక హద్దుపీడి ఏమేమో వాంఛించుచుండును. ఇంద్రియములు నాయధీనములుగాక ఆయువుపట్టులను గాయపఱచును. పుట్టుక నాదైనను అది నాయాజ్ఞలో నుండదు; తెంపుతో కర్మమార్గము లందు నన్ను త్రిప్పుచుండును. ఓ ఫణిగిరీశా! నాబ్రతుకు చివరకు అధ్యుడు లేని దాయెను. నన్ను కాపాడుము. నీకు మొరపెట్టుకొనుచుంటిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కాయము నాదే | 310 | 58 | 4 | 39 |

అవ: భక్తవత్సలుడైన వేంకటాచలపతి భక్తులవాకిట కావలిగాయును; దూతగా పనిచేయు నని శ్రీనివాసుని వాత్సల్యాదిగుణములను శ్లాఘించు చున్నాడు.

సీ. **పాతాళముననున్న బలి తలవాకిలి**
**గాతు; వెంచవు నీచకార్య మనుచు;**
**ప్రభుభృత్యు లనియెడి పాటి దప్పెను నిన్ను**
**చేఁజేతఁ గొలువంగఁ జింత యయ్యె;**
**పాండవదూతవై పనిచేసితివి; వారు**
**నీ దూత లగుటయే నీతిగాని**
**గురుదైవతము లను సరణి తప్పిన దిందు**
**మీ దాసులకు మేర మితియు లేదె?**

గీ. **అవునులే! భక్తవత్సలుం డగుదు వీవ**
**ఎఱుఁగ కాడితి మీ మాట లింతదనుక;**
**శేషశైలనివాస! నీ చిత్త మెట్లొ**
**యట్లె గావింపు శరణంటి మయ్య! నీకు.** 107

పాతాళముననుండు బలిచక్రవర్తి యొక్క వాకిట కావలిగాతువు. అది నీచమైనపని యని తలంపవు. ఇట ప్రభువు సేవకుడు అనెడు న్యాయము తప్పినది. ఇట్టి నిన్ను చేతులార సేవించుటకు చింత కలుగుచున్నది. నీవు పాండవులకు దూతగా పనిచేసితివి. చూడగా వారు నీదూత లగుటయే న్యాయ మగును. ఈ సందర్భమున గురుదైవతభావము దారితప్పినది. మీదాసులకు నిన్ను పనిగొనుటలో హద్దుపద్దులు లేవా? ఆహా! తెలిసినది. నీవు భక్తవత్సలుడవుగాన భక్తులకు వశ్యుడవై వారి కెట్టి ఊడిగమునైనను చేతువులే! ఇంతవరకు తెలియక ఏమేమో వదరితిని. ఇపుడు నీకు శరణంటిమి. ఓ శేషాద్రినివాసా! నీచిత్తమునకు నచ్చినరీతి గావింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బంటుకు బంటవుదురా | 338 | 225 | 4 | 151 |

అవ: వేంకటాచలపతిని నృసింహునిగా భావించి హిరణ్యకశిపుని చంపిన నాటి కోపము మానుమని ప్రార్థించుచున్నాడు.

సీ. సకల దేవతలును జయ పెట్టుచున్నారు
చకితులై దానవుల్ సమసినారు;
అకలంకయగు లక్ష్మి యటు నీదు తొడనెక్కె
వికటకోపమ్మును వీడు మయ్య !
తుంబురునారదుల్ దొరకొని పాడెద
రంబుజాసనుఁడదె యభయ మడుగు
సంబరవీథిలో నాడెద రచ్చరల్
కంబుకంధరుఁడ ! శాంతంబు చూపు;

గీ. యక్ష గంధర్వ కిన్నరుల్ హత్తి కొలువ
సిద్ధ సాధ్యులు నుతియింత్రు చిత్తగింపు;
దాసుల భవత్పదాంబుజధ్యానరతుల
వృషగిరినృసింహ! కరుణ మ మ్మేలుకొమ్ము. 108

శేషాద్రిపైనుండు ఓ నరసింహమూర్తీ ! దేవత లందరు జయశబ్దము చేయుచున్నారు. రాక్షసులు భయభ్రాంతులై చచ్చిరి. పరమపవిత్ర యగు లక్ష్మి నీయెడిలో కూర్చున్నది. నీవికటకోపమును వీడుము. తుంబురునారదులు నిన్ను స్తుతిచేయుచున్నారు. బ్రహ్మదేవుడు అదిగో! అభయ మడుగుచున్నాడు. అప్సరసలు ఆకసమునం దాడుచున్నారు. శంఖమువంటి మెడగల నరసింహా ! శాంతింపుము. యక్షులు, గంధర్వులు, కిన్నరులు చేరి కొలువగా సిద్ధులు, సాధ్యులు నిన్ను పొగడుచున్నారు. "యత్ర పూర్వే సాధ్యా స్సన్తి దేవాః"(ఎక్కడైతే సాధ్యులనే దేవతలు కలరో) అని పురుషసూక్తము.

దేవా! చిత్తగింపుము. నీపాదాంబుజధ్యానమునందు అనురక్తిగల దాసులము. మమ్ము వృషభాద్రిపైనుండు ఓ నరసింహస్వామీ! దయతో నేలుకొనుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చిత్తజగురుఁడ | 350 | 292 | 4 | 196 |

అవ: వేంకటాద్రికృష్ణుని బాల్యక్రీడలను రమ్యముగా వర్ణించుచున్నాడు.

సీ. గజ్జె లందెలు గల్లు గల్లని మొరయంగ
బిళ్ళగో డాడెడు నల్లనయ్య;
పొలుపార వీథుల పుట్టచెం డ్లాడెడు
బల్లిదుఁడు గదమ్మ! బాలశౌరి;
గోపాలబాలురఁ గూడి ముంగిటియందు
నుప్పుఁగుందము లాడు నొజపుకాఁడు;
చెమట గాఱఁగ సిరిసింగణావత్తి యా
టాడు నందసుతుండు వీఁడె యమ్మ!

గీ. ఉదుటునం బాఱి పాఱి తా నుద్ధగ్రచ్చ
కాయ లాడెడు ముద్దు లొల్కఁగ మురారి;
యాట లెల్ల తానే యాడి యంజనాద్రి
నడరు వేంకటవిభుఁడు కృష్ణుఁడు గదమ్మ! 109

ఈ నల్లనయ్య గజ్జెలు, అందియలు గలుగల్లు మనగా బిళ్ళగోడను ఆటనాడును. ఈ బాలకృష్ణుడు ఒప్పిదముగా వీథులలో బంతులాడు మిక్కిలిబలముగలవాడు. ఈతడు గొల్లపిల్లలనుగూడి ముంగిట ఉప్పు గుందములాడెడు ఉపాయశాలి. చెమట కారుచుండగా సిరిసింగణావత్తి అనునాట నాడెడు నందకుమారుడు వీడే. ముద్దులు మూటగట్టుచు ఉద్ధతుడై పరుగులెత్తి గచ్చకాయలాట ఆడునట్టి మురాంతకు డితడే. అన్ని ఆటలాడెడు ఆ కృష్ణుడే ఇప్పుడు వేంకటాద్రిలో విభుడుగా వెలసియున్నాడు. గదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| విచ్చన విడినే యాడీ | 330 | 172 | 4 | 115 |

అవ: చిన్నికృష్ణుని చిలిపిపనులను చక్కగా వినిపించుచున్నాడు.

సీ. చూతువు రావమ్మ ! సుతుని యశోదమ్మ !
బూతులఁదిట్టును పొలఁతుకలను
పొడవైన యుట్లెక్కి బుడిగలలో వెన్నఁ
దోడివారల కెల్లఁ దొడికిపెట్టుఁ;
గడవల పాలమీఁగడలు దేవుక తిని
క్రంతలుసేయు పాల్గాఱఁ గడకు
నటు రోళ్ళపై నెక్కి యటుకపై దాచిన
చక్కిలాల్ నురుఁగులు చవులు గొనును

గీ. చేరి బానలపెరుఁగునే యారగించి
పద్దుగా నవ్వు; పట్టగా ముద్దు లిడును;
మంచివాఁడమ్మ కృష్ణుఁడు మంగవిభుఁడు
మించి యింటింటివాకిటఁ బొంచియుండు. 110

ఓ యశోదమ్మా ! నీకుమారుని చూడుము. ఇటురమ్ము. ఆడువారిని బూతుమాటలాడుచున్నాడు. పొడవైన ఉట్లపై కెక్కి పిడతలలోనున్న వెన్నను తనతోడిపిల్లలకు తీసిపెట్టుచున్నాడు. కడవలలోని పాలమీగడలను దేవుకొని తిని చివరకు పాలుకారు నట్లుగా వాటికి రంధ్రములువేయును. అటువైపు రోళ్ళపై కెక్కి అటుకలమీద దాచి యుంచిన చక్కిలములను మణుగు పూలను తినును. మరియు బానలలోనుండు పెరుగును నేతిని బాగుగా తిని పంతగించి నవ్వును. పట్టుకొన్నచో ముద్దులు పెట్టును. మంగభర్త శ్రీకృష్ణుడు చాల మంచివాడమ్మా! ప్రతియింటివాకిటను ఇట్టి తుంటరిపనులు చేయుటకై పొంచియుండును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చూతువు రావమ్మా | 1445 | 267 | 24 | 179 |

అవ: కృష్ణావతారమందలి శ్రీ వేంకటాచలపతియొక్క బాల్యచేష్టలను వర్ణించుచున్నాడు.

సీ. అనరాదు వినఁగరా దాతనిమాయలు
కనఁ గ్రొత్త లాయెను దినదినమ్ము
ఆడెడి బాలుర నంగిలి చూపుఁ డం
చవ్వారినోళుల దువ్వ చల్లి
యీడ మాతోఁ జెప్పె; నేగి చూతుముగదా
పంచదారై దుమ్ము పరఁగె నమ్మ !
తీటతీఁ గెలు చుట్టె దేహాన నగలంచు
పిల్ల లా తీటకు గొల్లు మనఁగ
నీ సుద్ది విని వచ్చి యేము కందుముగదా
అన్ని సొమ్ము లె; చోద్య మాయె నమ్మ!

గీ. కాకిజున్నులు జున్నని గంపెఁడేసి
నోళ్ళఁ గ్రుక్కించె వారు కన్నీళ్ళుగార్చ
నశ్రుబిందుల నాణిముత్యాలు చేసె
నంజనగిరీశుమహిమ లేమందు మమ్మ ! 111

ఆ దేవునిమాయలు చూచుటకును వినుటకును శక్యము గావు. చూడగా ఎప్పటి కప్పుడు అవి క్రొత్తలై కనుపట్టును. అందులో నొకటి: ఆడెడి తనతోడి బాలురనోళ్ళు చూపు డని వారినోళ్ళలో దుమ్ము చల్లి వచ్చి మాతో చెప్పెను. మేము వెళ్ళి చూడగా ఆ దుమ్మంతయు చక్కెరై యుండెను. దురదపుట్టించునట్టి ఒకతీరు తీగెలను దెచ్చి అవి నగలని పిల్లలమెడకు, చేతులకు, నడుమునకు చుట్టివేయగా ఆ దురదకు తాళజాలక వారు మొఱ్ఱోయని ఏడువసాగిరి. ఈ సంగతి విని మేము వచ్చిచూడగా ఆ తీగ లన్నియు బంగారునగలై యుండినవి. మాకు ఆశ్చర్యము గలిగినది. అతడు గంపెడేసి కాకిజున్నులను దెచ్చి జున్నని చెప్పి బాలురనోళ్ళలో గ్రుక్కగా వారు కన్నీళ్ళు గార్చిరి. ఆ కన్నీటికణము లన్నిటిని ఆణిముత్యాలుగా మార్చినాడు. అంజనాద్రినాథుని మహిమ లేమని పొగడగలము?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అనరాదు వినరాదు | 139 | 167 | 2 | 112 |

అవ: బలరామకృష్ణులే శ్రీవేంకటేశ్వరుడుగా అవతరించి రని చమత్కారముగా వర్ణించుచున్నాడు.

సీ. ఏడఁజూచిన వీరె యింటింటిముంగిట
పెక్కుచేఁతలవారు పిలువరమ్మ!
చిన్న యాతఁడు శౌరి; పెద్ద యాతఁడు సీరి
యమడల ట్లున్నార లందగాండ్రు;
వెన్నలదొంగలు వీఁడు వాఁ డొక్కటే
వన్నిక యేమిటో పట్టుకొనరె
నల్లన కృష్ణుండు తెల్లన రాముండు
జోడుకోడెలు బలుసొగసుకాండ్రు;
విచ్చలవిడి వీథివీథులఁ జరియింత్రు
తలిముందు వీరల నిలువరమ్మ !
గీ. ఒకఁడు రోలఁ జిక్కె నొకఁడు రోఁకలి వట్టె
పొంచియున్నవారు పోకలాండ్రు;
మేల్మి వేంకటాద్రి మించినా రొక్కరై
యెవరి నేమి యనకుఁ డింతులార! 112

బలరామకృష్ణులు ఎక్కడ జూచిన తామై ప్రతియింటిముంగిట పలుచేఁతలు చేయుచున్నారు. ఓ గోపికలారా! వీరిని పిలువుడు. ఇడుగో ఈ శౌరి (కృష్ణుడు) చిన్నవాడు. అడుగో అతడు బలరాముడు; పెద్దవాడు. కవలలవలె ఒకేరూపుగా అందంగా ఉన్నారు. వెన్నముచ్చిమిలో వీ రిద్దరొకటే. వీరిపన్నుగడ ఏమిటో తెలియదు. వీరిని పట్టుకొనుడు. నల్లనివాడు కృష్ణుడు. తెల్లనివాడు బలరాముడు. ఇరువురు జతగానున్నారు. అందగాళ్ళు. ఇష్టంవచ్చినట్లు వీథుల్లో తిరుగుతున్నారు. వీరిని వట్టి తల్లి ఎదుట నిలబెట్టండి. ఒకడు (కృష్ణుడు) రోటికి కట్టివేయబడినవాడు. మఱొకడు (బలరాముడు) రోకలిని ఆయుధముగా పట్టినవాడు. ఈమాయావులెందుకో పొంచియున్నారు. గొప్పదగు వేంకటాద్రిమీద ఈ యిద్దరొక్కరై అతిశయిల్లు చున్నారు. ఓ గోపికలారా! ఇక ఎవరినీ ఏమీ అనకండి. అనగా కడచిన అవతారంలోని చిలిపిపనులు ఇపుడు మాని యున్నారనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎక్కడ చూచిన వీరే | 201 | 4 | 3 | 3 |

అవ: ఏడుకొండలవాని కృష్ణావతారములోని చేష్టలను గొల్లెతలు ప్రస్తావించుట స్మరించుచున్నాడు.

సీ. ఇదిగో! మాయింట నేఁ డింతసేసెను గృష్ణుఁ
డదిగో మాయింటిలో నంతసేసె;
గంట వ్రాఁగకయుండఁ గసవును దుఱిగి మా
యిలుసొచ్చె నిద్రింప నింటివారు;
అంటివచ్చిన దూడ యా పూరిమేయ మే
ల్కాంటిమి గణగణ గంటమ్రోఁగ;
ఒకఱోలుజరపి తా నుట్టిపైఁగల కండ
చక్కెరల్ మెసవి మా చంటివాని
నుట్టిమీఁద నునిచి యట్టె ఱోలును దీసి
యేడ దాఁగెనో కంటి మీ విచిత్ర;

గీ. మాల విడువంగ వానికై యరుగ నేను
ఇవల దూడలఁ దెచ్చి తావింటఁ గట్టె;
నెందుఁ గానక వచ్చి నే నింటితలుపు
దెఱువ లోనున్న వావు లా వరదుమాయ. 113

ఒకగొల్లభామ కృష్ణుడు తన యింట చేసిన దుండగమును చెప్పగా మరియొకతె తన ఇంట కృష్ణుడు ఈ విధంగా చిలిపిపనులు చేసె ననెను. ఆ చిలిపిపని యేమనగా: ఆవుమెడలోని గంట మ్రోగకుండునట్లు ఆ గంటలో కసవు దురిగి, ఇంటివారు నిద్రించుచుండగా కృష్ణుడు ఇంటిలో ప్రవేశించెను. ఇతరులు వచ్చినపుడు ఆవు బెదరి లేచినచో గంట మ్రోగును. ఆ చప్పుడువిని ఇంటివారు మేల్కాందురు. అందుకని శ్రీకృష్ణుడు గంటలో గడ్డి దురిగె నని ఎఱుంగవలయును. ఆవు వెంట నంటి దూడ వచ్చుట సహజముగాన అట్లువచ్చిన దూడ ఆ గంటలోని గడ్డిని మెసవగా గంట మ్రోగినది. ఇంటిలోనివారు లేచారు. మఱో చిలిపి చేష్ట: ఉట్టి తనకు అందునట్లు రోలు దానిక్రిందకు నెట్టి ఉట్టియందుగల కండచక్కెరలను తిన్నాడు. అంతటబోక మా చంటిపిల్లవానిని ఆ ఉట్టిలో కూర్చుండబెట్టి దిగుటకు వీలు కాకుండా ఆ రోటిని దూరముగా జరిపి తా నెక్కడో దాగినాడు. ఈ చిత్రము చూచాము. కృష్ణుడు కట్టివేసిన ఆవులవలువులు తొలగించి వెలువలికి తోలినాడు. మేము వాటికై వెళ్ళగా ఈ లోపల వెలుపల నున్న దూడలను తోలుకవచ్చి ఇంటిలో కట్టివేశాడు. మేము ఆవుల నెచ్చటను గానక వచ్చి ఇంటితలుపు తెరువగా ఆవు లన్నియు లోపల నున్నవి. ఇదంతయు ఆ వరదుని మాయయేగదా ! అని గొల్లెత పల్కినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇదివో మాయింట | 139 | 166 | 2 | 111 |

అవ: ఏడుకొండలరాయని ప్రాపుగలవారికి ఎపుడును జయమే యను చున్నాడు.

సీ. ఆపదల్ బ్రాఁతియే యందఱకును తమ
చపలపుసంపదల్ సడిని బెట్టఁ:
బాపముల్ బ్రాఁతియే ప్రాణులకును మతిఁ
బాయని పేరాస బాధ లిడఁగ;
జగడముల్ బ్రాఁతియే జనులకుఁ బిలిచినఁ
బలుకు కోపమ్ములు పై కొనంగ;
వగలు బ్రాఁతియె తమ్ము వలలలో మాటికిఁ
దగిలించు మమత వేదనలు గూర్ప;

గీ. బ్రాఁతె భయములు నరులను బంతగించి
యనిశ మలయించుచుండెడి ధనము లుండ;
బ్రాఁతె జయములు సతతమ్ము పరమపురుషుఁ
డేడుకొండలదొర వేంకటేశుఁ డుండ? 114

చంచలములైన సంపదలు అలజడి గల్గించుచుండగా ఎవరికైనను ఆపదలు దుర్లభములా? అనగా లోభులకు ఆపదలు మెండని భావము.

అడియాసలు బాధపెట్టుచుండగా వానికి లోనైన ప్రాణులకు పాపములు దుర్లభములా ? ఆశాపరులు పాపములు చేతు రనుట. ముక్కుపై కోపముగల జనులకు తగవులు దుర్లభములా? కోపిష్ఠులు తగవులాడుటకు దిగుదు రనుట. మమకారము మానవులను వలల జిక్కించుకొని వేదనలు గలిగింపగా అట్టివారికి దుఃఖములు దుర్లభములా? మమకారము గలవారికి దుఃఖము లెక్కుడనుట. ప్రతినబూని సదా కష్టములపాలు చేసెడి ధన ముండగా భయములు దుర్లభములా? ధనవంతులు భీతులై యుందు రనుట. అటులే ఏడుకొండలరాయని అండ నుండెడి దండిమగలకు జయము దుర్లభమా? యోగేశ్వరేశ్వరుని సన్నిధిని సర్వతోజయ మబ్బు ననుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తలపోఁత బాఁతె | 6 | 41 | 1 | 27 |

అవ: తిరుమంత్రమును మించిన మంత్రము లేదని, శ్రీశు డొక్కడే పాపముల బాపువాడని పలుకుచున్నాడు.

సీ. **కలవు లోకమ్ముల ఘనమైన మంత్రమ్ము**
**లలర మోక్షమ్ము నీయంగ లేవు;**
**సులభమ్ముగాఁ జిక్కఁ గలరు దైవతములు**
**పైకొను పాపమ్ముఁ బాప లేరు;**
**ఉన్నవి పుణ్యమ్ము లూరక యెన్నియో**
**పన్నుగ హరినిఁ జూపంగ లేవు;**
**సన్నిధి నున్నవి సకలశాస్త్రమ్ములు**
**కొన్నియు భవమును గూల్ప లేవు;**

గీ. **ధనములును ధాన్యములు పెక్కు ధరణి గలవు**
**పరమవిజ్ఞాన మొసఁగలే వరసిచూడ;**
**నరుదుగా మమ్ము శ్రీవేంకటాధిపుండు**
**కావ నీడేఱితిమిగాక కడమ గలదె?** **115**

లోకములో ఎన్నియో గొప్పమంత్రము లున్నవి. కాని అవి మోక్ష మొసంగజాలవు. తిరుమంత్ర మొక్కటే మోక్షప్రద మనుట. 'ఓం నమో నారాయణాయ' అనునదియే తిరుమంత్రము. సులభంగా ఎందరో దేవతల నాశ్రయింప వచ్చును గాని వారు మీద ముసిరిన పాపములను పోగొట్టలేరు. వేంకటేశ్వరుడే పాపహరు డనుట. చేసినపుణ్యము లెన్నియున్నను అవి హరిని జూపలేవు. చెంతనే సకలశాస్త్రము లున్నను వానిలో కొన్నియైనను పుట్టుకను మట్టుపెట్టలేవు. ఆ పనిని వేంకటాచలపతియే చేయగల డనుట. ధనధాన్యరాసు లున్నను ఆలోచింపగా అవి శ్రేష్ఠమగు విజ్ఞానము నొసంగ జాలవు. భక్తియే దాని నొసంగు ననుట. అరుదుగా మమ్ములను శ్రీ వేంకటాచలనాథుడు కాపాడగా కడతేరితిమి. మా కేమియు కొఱతలు లేవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చాలుఁజాలు నీ సటల | 337 | 215 | 4 | 144 |

అవ: భగవత్సంబంధములైన చిన్నె లన్నియు తన అవయవాదులకు రక్షకములని విశ్వసించుచున్నాడు.

సీ. చక్రాంకితమ్మే భుజబలమ్ము నాకు; శ్రీ
పతిచింతనమె యాత్మబలము నాకు;
నాకు పేరుబలమ్ము నందాత్మజునినామ;
మిందందు భవభయ మ్మేదినాకు?
అంగపుఁదిరుమణు లవి నాకుఁ బంచాంగ
బల; మీశుపాటలె స్వరబలమ్ము;
కేశవుగుణములే రాశిబలము నాకు
నిహపరమ్ముల నెదు రేది నాకు?

గీ. కనఁగ హరివిగ్రహమె నాకు గ్రహబలమ్ము
భాగవతసేవయే వెనుబలము నాకు;
ఫణినగాధీశ్వరుఁడె దైవబలము నాకు;
పలుపలుకు లేల? నా కన్నిబలము లతఁడె. 116

చక్రపుముద్రలే నాభుజములకు బల మిచ్చునవి. శ్రీశునిచింతనమే నాయాత్మకు బలము. నందనందనుని గోవిందనామమే నాపేరునకు బల మిచ్చునది. కనుక ఎక్కడగానీ నాకు సంసారసంబంధభయమే లేదు. నాశరీరమున ధరించు తిరుమణితిరుచూర్ణములే నాకు తిథివార నక్షత్రాదికమైన పంచాంగబలము. స్వామి పేరిటి పాటలే నాకంఠధ్వనికి బల మిచ్చునవి. కేశవుని గుణసంకీర్తనమే నాకు మేషవృశ్చికాదికమైన రాశిబలము. అట్టినాకు ఈ లోకమందుగాని పరలోకమందుగాని ఎదురే మున్నది? లేదని భావము. ఆలోచింపగా శ్రీహరిరూపును దర్శించుటయే నాకు సూర్యచంద్రాదిగ్రహబలము. భక్తులను సేవించుటయే నాకు వెన్నుబలము. శేషాద్రిపతియే నాదైవబలము. పలుమాట లెందుకు? నాకు సకలవిధబలము లొసంగువా డతడే.

భక్తునిభక్తి బాగుగ ఇందు ప్రస్ఫుట మగుచున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సకలబలంబులు | 119 | 109 | 2 | 73 |

అవ: పొలతుల పొందుచే పాడము దొసగుల నెత్తి చెప్పుచున్నాడు.

**సీ. ఆలరియింతుల యధరామృతమ్ములు**
**కాలకూటవిషాలజాలు నుండి**
**చెలరేఁగి వీరల చెట్టలువట్టుట**
**బాలనాగమ్ములఁ బట్టుటె సుఁడి**
**కాంతలు నవ్వుచుఁ గనులఁజూచెడి చూపు**
**భావింప నలుగులపాఁతఱ సుఁడి**
**బంతుల కెనయైన పడఁతులచన్నులు**
**క్రంత నొడ్డిన పడికండ్లు నుండి**

**గీ. జవ్వనపుఁగామినుల సరసంపుఁబలుకు**
**గములు తలపోయఁ జొక్కుమంత్రములు నుండి**
**వాసిగా వేంకటేశ్వరుదాసుల కివి**
**చివ్వనన్ జెప్పినట్టులు సేయుఁ జుండి! 117**

దుష్టస్వభావముగల స్త్రీల పెదవులజొల్లు పెల్లగు కాలకూటవిషపు జల్లులే సుమా! ఉత్సహించి వీరిని చేపట్టుట వయసు గల ఆడుపాముల బట్టుటయే. స్త్రీలు నవ్వుచు చూచేచూపులు విచారింపగా బాణముల పాతఱయే సుమా! చెండ్ల వంటి వీరిపాలిండ్లు కోటగోడలోని రంధ్రములం దమర్చిన తుపాకులనుండి వెడలెడు గుండ్లేసుమా! వయసుకత్తెల మరులు గొలిపే మాయమాటలు చూడగా చొక్కజేయు మంత్రములేసుమా! శ్రీ వేంకటేశ్వరుని దాసుల కీ చెప్పబడినవి శీఘ్రముగా అదుపాజ్ఞలలో నిలుచును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| జ్ఞానులాల యోగులాల | 105 | 26 | 2 | 18 |

అవ: అతిసులభము శ్రీపతిశరణము. ఇందులకు ప్రహ్లాదాదులు సాక్షు లనుచున్నాడు.

**సీ. వెదకి వెదకి దేవు వేసరకుమ హరి**
**కలఁడు; ప్రహ్లాదుఁ డిందులకు సాక్షి;**
**చేసిన భక్తికిఁ జేటులే దనుటకు**
**దివిలో వెలింగెడు ధ్రువుఁడె సాక్షి;**
**నారాయణునికృప నమ్మిన విజయంబు**
**చొప్పడునంట కర్జునుఁడు సాక్షి;**
**దాస్యంబు రక్షించు త న్ననుటకు సత్య**
**కీర్తి యా బలిచక్రవర్తి సాక్షి;**

**గీ. వేంకటాద్రీశువినుతులు వేడ్కఁ దన్నుఁ**
**బ్రోచు ననుటకు వ్యాసాదిమునిసమూహ**
**మతనిపదసేవ మాయల నణఁచి తన్నుఁ**
**గాచునంటకు సనకాదిగణమె సాక్షి.** 118

భక్తుడా! భగవంతుని ఇక్కడక్కడ వెదకి వేసారవద్దు.

హరి అంతట కల డనుటకు ప్రహ్లాదుడే మనకు సాక్షి. ప్రహ్లాదుడు శ్రీహరి ఉక్కుకంబమున నున్నా డనగానే అచటనే ప్రత్యక్షమాయెనుగదా! భగవంతు డంతట నున్నాడను నమ్మక మవసర మనుట. పిండికొలది రొట్టె యన్నట్లు తానెంత భక్తిచేయునో అంతకు దగిన స్థానము భక్తుడు పొందు ననుటకు ఆకాశములో ఈ నాటికిని వెలుగుతున్న ధ్రువుడే సాక్షి. నారాయణుని నమ్మిన విజయము తథ్య మనుటకు అర్జునుడే సాక్షి."యత్ర యోగేశ్వరః కృష్ణో తత్ర పార్థో ధనుర్ధరః" అని యున్నదిగదా! స్వామిదాస్యము తన్ను కాపాడుననుటకు సత్యకీర్తి యగు బలిచక్రవర్తియే సాక్షి. భగవంతుడు బలిగృహమువాకిలి కాచియున్నాడుగదా ! వేంకటాచలపతి పొగడికలు తమ్ము బ్రోచుననుటకు వ్యాసాదిమహర్షులు సాక్షులు. వ్యాసాదులు స్వామిని కీర్తించి తరించి రనుట. పద్మాక్షునిపాదసేవ మాయను మాయించి తమ్ముగాచున నుటకు సనకుడు మున్నుగాగల యోగిపుంగవులే సాక్షులు, శ్రీశుపద సేవనము మాయాహర మనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతిసులభం బిదె శ్రీపతి | 107 | 41 | 2 | 28 |

అవ: లక్ష్మీపతిసేవలో జాగరూకులై మెలగుటయే జీవుల కర్తవ్య మను చున్నాడు.

**సీ. ఇందిరాధిపుసేవ యేమఱకుంటగా**
**కీజీవతతిబుద్ధి యేటిబుద్ధి ?**
**రేయెల్లఁ గబళించి రేపె వెళ్ళనుమియు**
**బయట నిద్రాదేవి వలుతడవలు;**
**నిచ్చనిచ్చలు చచ్చి చచ్చి జన్మించెడి**
**మాయజీవులదేటి మనికి తలఁప?**
**కను రెప్పమూయఁ జీఁకటియౌను నీ సృష్టి**
**కనుఱెప్పఁ దెఱచినఁ గలుగు మరలఁ**
**గడ కొక్కత్రుటియందె కలిమి లేమియుఁ దోఁచె**
**నీ జీవులకు నింక నేటి యెఱుక ?**
**గీ. జాలుగాఁ బ్రాణములు నూర్పుగాలి వెంట**
**నెపుడు లోనికి వెలికిఁ దా మేగుచుండు;**
**అప్పఁడగు వేంకటేశ్వరుఁ డంతరాత్ముఁ**
**డితఁడె గాచు; జీవుల తలఁపేటి తలఁపు?** 119

శ్రీపతి సేవను ఏమరకుండవలె నన్న బుద్ధియే బుద్ధిగాని వ్యర్థపుటాలోచ నలుగల జీవులబుద్ధి ఏమి బుద్ధి? అది విపరీతబుద్ధి యనుట. నిద్రాదేవి రాత్రులందు జీవులను మ్రింగి (నిద్రలోముంచి) తెల్లవారగనే పెడల గ్రక్కుచున్నది. అనగా లౌకికకార్యోన్ముఖులను చేయుచున్న దనుట. మాటి మాటికి మాయావిష్టులగు మానవులు పుట్టుచు చచ్చుచుందురు. వారిది ఏమి ఉనికి? అదొక ఉనికికా దనుట. భగవంతుడు కనురెప్పమూయగా ప్రపంచ మంధకారబంధుర మగును. కనురెప్ప దెఱచినచో సృష్టి గోచరించును. చివరికొక క్షణకాలములోనే పైరెండుపనులు జరిగిపోవును. ఇక జీవుల తెలి వేమితెలివి ? నిరుపయోగ మనుట. వరుసగా ప్రాణములు గాలివెంట ప్రాణుల లోపలికి వెలికి సంచరించుచుండును. ప్రాణములు అస్థిరము లనుట. అందరిలో అంతరాత్ముడై యుండే వేంకటేశ్వరుడు తండ్రియై యందరిని కాపాడును. అంతేగాని జీవుల ఆశయము లేమియు ప్రయోజనపడవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందిరాధిపుని సేవ | 88 | 434 | 1 | 291 |

అవ: శరణాగతి యొక్కటే పరమపదప్రాప్తికి కారణ మనుచున్నాడు.

**సీ. హరిరూ పెఱుంగుదుమా ? యింతకుం దొల్లి**
**సొరిది వేంకటపతిఁ జూచిగాక**
**గురుమంత్ర మది యెఱుంగుదుమ ? యీతని నామ**
**మురువై జగాలలో నుండఁ గాక**
**వైకుంఠ మిది యని వర్ణింపఁ గంటిమా ?**
**తిరుమలవీథులఁ దిరిగి గాక**
**ఎటనేని వేల్పుల నిటువలెఁ గంటిమా?**
**శ్రీహరిదాసులఁ జేరిగాక**

**గీ. పుట్టు నేఁ గంటినా ? రమాభూకళత్రుఁ**
**డొడలిలో నంతరాత్మయై యుండఁగాక;**
**కొట్టకొన పరమేడ? ఈ కొంచియంపు**
**దేహి నేనేడ ? శరణని తెలతుఁగాక ! 120**

వరుసగా శ్రీవేంకటేశ్వరుని దర్శింపక శ్రీహరిరూప మిట్టిదని తెలియ గలమా? తెలియలే మనుట. ఈ వేంకటాచలపతి తిరునామము విస్తారంగా లోకములం దుండగా దీనిని తెలియక గురూపదిష్టమంత్ర మెఱుంగ గలమా? ఎఱుగలే మనుట. అనగా భగవంతుని పలునామములు పలుమరు పఠించిన ఫలితంగా గురు వుపదేశించు మంత్రము లభించు ననుట. తిరుమలతిరువీథులలో నడయాడకున్నచో వైకుంఠపురమిట్టిదని వర్ణింపగలమా? వర్ణింపలే మనుట. అనగా వైకుంఠపురవీథులతో సమాన మైనవి తిరుమల తిరువీథులనుట. హరిదాసుల సాంగత్యం లేనిదే ఎక్కడైనను దేవతా సమూహము నిటువలె చూచితిమా? చూడలే దనుట. హరిదాసులే వేల్పుగములనుట. శ్రీభూదేవులకు ప్రియుడైనవాడు నాదేహములో అంతరాత్మగా నుండనిచో నే నిటువలె పుట్టియుందునా? పుట్టియుండ ననుట. దేవుడులేని జీవు డుండడుగదా ! పరమపద మెక్కడ? అల్పుడగు ప్రాణి నే నెక్కడ? ఈ రెంటికిని అంతరము అత్యంతము. అటులైనను శరణని మ్రొక్కి కడతేరుదును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఈతఁడే ద్రిష్ట వరము లియ్యగా | 319 | 111 | 4 | 74 |

అవ: వైష్ణవులకు సకలము విష్ణుపాదములే: వాటిని వదలక సేవించువారి కెట్టిపాపము లంటవనుచున్నాడు.

**సీ. మాకు విద్యయు బుద్ధి మధురిపుపాదాలె**
**వదలవే కర్మమా! వైష్ణవులము;**
**ఇహపరమ్ములు మాకు నృహరిపాదమ్ములే;**
**వేదశాస్త్రములు శ్రీవిభుపదాలె;**
**దేవదేవుపదాలె దిక్కును దెస మాకు**
**పాపముల్ ! మము వీడి పాఱిపొండు;**
**హరిపాదములె మాకు నన్న పానమ్ములు**
**పరమాత్ముపదములే పాడిపంట;**
**మురహరుపదములే ముందు వెన్కలు మాకు**
**దుఃఖముల్ ! దవులకుఁ దొలఁగిపొండు**

**గీ. ఆయువు భవిష్య మతనిపాదాంబుజములె**
**దానధర్మాలు శౌరిపాదాలె మాకు;**
**వేంకటేశ్వరు పదములే విడక కొలుచు**
**భక్తులను మమ్ముఁ బాయుఁడీ భవములార!** 121

విష్ణుభక్తులమైన మాకు విద్యయు బుద్ధియు మధుసూదనుని పాదములే. కనుక ఓకర్మమా! మమ్ము వదలి పెట్టుము. మాకు ఇహమును పరమును ఆ నరహరిపాదములే. వేదములును, శాస్త్రములును ఆ సిరిమగని యడుగులే. మాకు దిక్కు, దెస ఆ దేవదేవుని పాదములే. ఓ పాపములారా! మమ్ము విడిచి పారిపొండు. మాకు అన్న పానములు ఆ హరిపాదములే. పాడిపంటలు ఆ పరమాత్ముపదములే. మాకు ముందు వెనుకల రక్షకము లైనవి ఆ మురహరుని పాదములే. కనుక దుఃఖములారా! దూరముగా తొలగిపొండు. ఆయువు, భవిష్యత్తు, దానము, ధర్మము మాకు ఆ శౌరిచరణములే. ఓ పుట్టుకలారా! వేంకటాచలపతిపాదములను విడువక కొలిచే భక్తులను మమ్ము వదలివేయుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| విష్ణుదేవుపాదములే | 326 | 149 | 4 | 100 |

అవ: భగవన్నామచింతనముగలవారికడ పాపము, కర్మ, చింత చేరవనుచున్నాడు.

సీ. నాలుక శ్రీహరినామ మున్నది వేగ
పాఱరో బహుళపాపమ్ములార!
చాలి భుజంబునఁ జక్ర మున్నది భవ
బంధమ్ములార! వే వదలిపొండు;
అంతరంగమ్మున హరియుండె తొలఁగుఁడీ
చిత్తమ్మునం దుండి చింతలార!
విష్ణునిగాథలు వీనుల నున్నవి
మాజోలి వలదు కర్మమ్ములార!

గీ. గరుడపతిసేవ మా కుండెఁ గావుగడగఁ
గామముఖదుర్గుణములార! కాలుమోప
నిందు మీ కెడలేదు లే దించు కేని
నందడింపక యెట కేని జాఱుకొనరొ! 122

పలువిధములగు ఓ పాపములారా! నా నాలుకపై హరినామ మున్నది. వేగముగా పరుగెత్తిపొండు. ఓ భవబంధములారా! నాభుజముపై చక్రపుముద్ర ఉన్నది. వేగమే వెడలిపొండు. ఓ చింతలారా! నా అంతరంగమున హరి యున్నాడు. నా చిత్తమునందుండి మీరు తొలగిపొండు. ఓ కర్మములారా! విష్ణుసంబంధములగు కథలు నాచెవులం దున్నవి. మీ కిక మాజోలి వలదు. మాకు గరుడవాహనునిసేవ కావుగడగా నున్నది. కనుక కామము మున్నుగాగల ఓ చెడుగుణములారా! మీకు కాలుమోపుటకు కొంచె మైనను చోటు లేనేలేదు. కావున మీరు సద్దుసేయక ఎచ్చటికైనను వెళ్ళిపొండి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందునుండ మీ కెడలేదు | 78 | 375 | 1 | 251 |

అవ: హరికి సమానదైవముగాని, హరిదాసులకు సమానులగు మానవులుగాని లేనేలేరని బల్ల గ్రుద్ది చాటుచున్నాడు.

సీ. పాపమ్ము పాపమ్ము ప్రజలార! ప్రజలార!
పైపయి నిటువలెఁ బలుకవలదు
హరియందుఁ బుట్టిన హరుని విరించిని
హరితో సమానులం చనుట యెట్లు?
పొరి కొండలందునఁ బుట్టిన శిల లివి
సరసఁ బెట్టిన గిరిసమత గనునె?
ఇందిరాధిపునివి యిల గల సిరు లివి
యంది మఱొక్కరి వనుట యెట్లు?

గీ. ఏఱుగుడిచి కాల్వల మెచ్చ నెట్లు పొసఁగు?
శ్రీశుసేవకులకు పాటి చెప్పు టెట్లు
లవలివారలఁ? గామధేనువుల కూరఁ
బసులు పదికోటు లైనను బాటి యగునె? 123

హరియందుపుట్టిన శంకరుడు, బ్రహ్మ హరితో సమాను లెట్లగుదురు? "నారాయణాత్ బ్రహ్మా జాయతే, నారాయణాత్ రుద్రో జాయతే" (నారాయణుని నుండి బ్రహ్మయు రుద్రుడు జనించినారు) అని శ్రుతి. "క ఇతి బ్రహ్మణో నామ ఈశో௨హం సర్వదేహినామ్, ఆవాం తదంగే సంభూతౌ తస్మాత్కేశవనామవాన్"- (క శబ్దమునకు అర్థమైన పరమేష్ఠి, ఈశ శబ్దమునకు అర్థమైన శంభుడు విష్ణుదేహమునుండియే పుట్టిరి. కావున విష్ణువు 'కేశవ' నామముచేత పిల్వబడుచున్నాడు) అని స్మృతి. కొండలందు పుట్టిన శిలలను కొండవద్ద నుంచగా అవి కొండలగునా? కా వనుట. హరి కొండవంటివాడనీ, బ్రహ్మరుద్రాదులు శిలలవంటివారనీ భావము. భూమిపైగల ఈ సంపద యంతయు శ్రీవల్లభునిదే. ఇది మరొక్కనిది అనుట ఎట్లు పొసగును? పొసగ దనుట. ఏటిలో నీరుద్రావి కాలువలను మెచ్చుకొనుట యెట్లు? హరి ఏటితో సమానుడని, ఇతరదైవతములు కాల్వలవంటివారని తాత్పర్యము. కామధేనువునకు గ్రామములోని పశువులు పదికోటు లైనను సాటియగునా? కా వనుట. అటులే శ్రీహరిదాసులకు ఇతరు లెందఱైనను సమానులగుదురా? కారని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పాపము పాపము | 261 | 350 | 3 | 236 |

అవ: భాగవత సాంగత్యంతో మనస్సును జ్ఞానమును సవరించుకొని వేంకటేశ్వరుని దర్శించ వచ్చునని ఉపాయము తెల్పుచున్నాడు.

సీ. మానసం బనియెడి మాదుపెంపుడు లేఁడి
పాపమను నడవిఁ బడిన దయ్య!
పరమాత్మకైంకర్యపరులౌ మృగయులార!
యిపుడె దానిని పట్టి యీయ రయ్య!
అంచెల మా జ్ఞాన మను కామధేనువు
పంచేంద్రియపురొంపిఁ బడిన దయ్య!
ఘనవికుంఠమునకుఁ జను తెరువరులార!
తెగువ దానిని వెళ్లఁదీయ రయ్య!

గీ. మా విమోహం బనెడి మదమత్తగజము
తాను మీ దయ యనెడు నోదమునఁ బడెను
శ్రీనివాసుం డనెడు మావటీని చేత
వంచి భక్తికంబమునఁ గట్టించ రయ్య! 124

ఓ భాగవతులారా! మామనసనెడి పెంపుడులేడి పాపమనే అడవిలో జొరబడినది. పరమాత్మునికైంకర్యములో ఆసక్తిగల భక్తులనే ఓ బోయలారా! ఇపుడే దానిని పట్టి మా కప్పగించండి. మాయొక్క జ్ఞానమనే కామధేనువు పంచేంద్రియములనే బురదలో క్రమంగా దిగబడినది. వైకుంఠనగరానికి వెళ్లుతున్న ఓబాటసారులారా! తెగువతో దానిని వెలికి లేవదీయండి. మాయొక్క మోహమనే మదపుటేనుగు మీ కారుణ్యమనే గర్తంలో పడినది. శ్రీనివాసుడనే మావటివానిని రప్పించి వారిచే ఆ మోహమత్తగజాన్ని లొంగ దీయించి భక్తి అనే స్తంభానికి కట్టించండి.

పరమభాగవతుల సాంగత్యంవల్ల భగవద్దర్శనం సంప్రాప్తిస్తుందనీ, నిర్మోహత్వం ఏర్పడుతుందనీ సారాంశం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మొఱవెట్టెదము | 100 | 506 | 1 | 339 |

అవ: పుణ్యాపాపములనుండి విముక్తి ప్రసాదించుమని పంచేంద్రియములను వేడుకొనుచున్నాడు.

సీ. పంచేంద్రియము లను పట్టణప్రభులార!
తెంచి బేరము బర్వు దించరయ్య!
సంసారజలధిలో సతతమ్ము దిరుగాడు
సంగపుటోడ బేహారివాఁడఁ
బొరి పుణ్యాపాపంపునరకులతో బూతు
రేవున దిగినాఁడ- రేలు పవలు
అడరి గుణత్రయం బనెడి తెడ్డులచేత
పడవ నిన్నాళ్ళుగా నడపినాఁడ
చాంచల్య మను తెరచాప నెత్తినవాఁడ
వెడమాయసరకును వెల కొసంగుఁ

ఆ. డాత్మయనెడి కంబ మంతరాత్ముం డెక్కి
నీతి మమ్ముఁ గావ నిలిచినాఁడు
మాకు మీకుఁ గర్త మంగేశుఁ డిఁక ఘాత
మాని యియ్యరయ్య! మాకు గుణము. 125

నేను శరీరమనే నావలో ఉండి ఎప్పుడునూ సంసారమనే సముద్రంలో సంచరించే వ్యాపారిని. పుణ్యపాపాలనే వెడమాయసరుకుతో వ్యామోహమనే రేవులో దిగినాను. పుణ్యపాపాలు రెండును జన్మకారణము లనుట. సత్త్వ రజస్తమోగుణములనే తెడ్డులతో ఈ దేహనౌకను అనాదిగా నడుపుతున్నాను. పడవనడుపుటకు తెడ్లవలె ప్రాణిప్రవర్తనకు గుణత్రయం కారణమనుట. ఈ శరీరమనే పడవకు చంచలమైన మనస్సులో జనించే కోరికలనెడు తెరచాప నెత్తినాను. తెరచాప వాలుగా పడవ నడచునట్లు చాపల్యానుగుణంగా ప్రాణి ప్రవర్తించు ననుట. కన్ను, ముక్కు, చెవి, చర్మము, నాలుక అనే పట్టణప్రభువులారా! నే తెచ్చిన ఈ మాయసరకును వెలకొసగుడు. జీవాత్మడనే పడవలోనిస్తంభమును అంతరాత్ముడు అధిష్ఠించి ఆటుపోటుల నుండి మమ్ము రక్షించుటకు ఉద్యుక్తుడై యున్నాడు. ఆ అంతరాత్ముడే అలమేలు మంగాప్రియుడైన శ్రీవేంకటేశ్వరుడు. వ్యాపారులమైన మాకు (జీవులకు), పట్టణ ప్రభువులైన మీకు (ఇంద్రియములకు) కర్తయై ఉన్నాడు. ఇక మాపై దెబ్బతీయక జనన మరణరూపమైన మా భారమును తొలగింపుడు. భగవత్ప్రాప్తికారణమైన గుణమును మాకు ప్రసాదింపుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పంచేంద్రియములనే | 256 | 324 | 3 | 219 |

అవ: భగవంతుని కొలువకుండుట మానవుల తప్పిదమేగాని, కొలిచినచో సకలమిచ్చి కాచునని చాటుచున్నాడు.

సీ. కరుణకు వెలితియా? కరుణానిలయుఁ డుంట
వేడ్కఁ గొల్వనిదె మా వెలితిగాని
నరులఁ గాచు టరుదు? నరహరి యితఁ డుంట
శరణన కుండుట జనము వెలితి
మఱి వితరణికాఁడె? మామనోహరుఁ డుంట
కోరని వెల్తి లోకులది గాని
బడి వెంటనుండఁడా? భక్తవత్సలుఁ డుంట
భక్తి మ్రొక్కనిదె యీ ప్రజల వెలితి

గీ. చిత్తమున లేఁడె ?వేంకటశిఖరివిభుఁడు
నమ్మియుండుట మాదు భాగ్యమ్ముగాక
ఈయఁజాలఁడె వరముల నింతవాఁడు
వెస నుతింపనిదే మన వెలితి గాని. 126

వేంకటాచలపతి కరుణకు నిలయమైనవాడు. ఆయనలో దయ కొఱతపడలేదు. అట్టివానిని వేడుకతో కొలువకుండుట మా వెలితియే. అతడు నరసింహమూర్తి. నరుల పాపములను హరించి కాచుననుటలో ఆశ్చర్యము లేదు. కాని శరణుపొందకుండుట మానవుల లోపమే. అతడు లక్ష్మీదేవికి భర్త కదా! మరి దాత కాకుండునా? ఆ శ్రీవిభుని యాచింపకుండుట లోకుల దోషమే. భగవంతుడు భక్తులయందు వాత్సల్యము గలవాడుగదా! మఱి భక్తులను వెంబడించి మెలగడా ? భక్తితో మ్రొక్కు లిడకుండుట ఈ ప్రజల తప్పిదమే. వేంకటాచలపతి మనస్సున లేడా? ఆ దేవుని నమ్మియుండుట మాభాగ్యము. ఇంతటిదేవుడు వరము లీయలేడా? అట్టి వానిని పొగడ కుండుటయే మన లోపము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలిసినవా రెల్లా | 321 | 123 | 4 | 83 |

అవ సర్వము బ్రహ్మమయ మనుచున్నాడు.

సీ. తెలిసినవారికి దేవుఁడే యంతయుఁ
 గలఁడన్న వారికిఁ గలఁడు గాన
నందిందుపోయి గోవిందు వెదక నేల?
 పొడకట్టురూపు లా పూరుషునివె;
కొందఱిలోనుండి కోరిక లీడేర్చుఁ;
 గొందఱిలో నగుఁ; గోరి పలుకు;
లోపల వెలిఁ బరలోక మరయనేల?
 యెదుట వైకుంఠమే యెట్టినెలవు;
పొడచూపునెట నెండ పొరిఁగాయు నక్కడఁ
 జాయ వెన్నెల పెక్కుచాయ లగుచు

గీ. వేఱె యానందసౌఖ్యమ్ము వెదక నేల?
తాను శాంతుం డయిన నుండు స్వాంతమందె;
అంజనగిరీంద్రు దాసుఁడ నైతి; నాతఁ
డొక్కఁడే మాకు నన్నింటి కొడయఁ డయ్యె. 127

"కద్దు కద్దన్న వారికి కద్దు" అనేరీతిగా నమ్మినవారికి భగవంతు డున్నాడుగాన, జ్ఞానవంతులకు సకలము దైవస్వరూపమే. కనుపించే అన్ని రూపములు ఆ భగవంతునివే కనుక ఇక్కడక్కడ ఆ గోవిందుని వెదకు టెందులకు? అవసరములే దనుట ఆ దేవుడు కొందరియందు సాక్షాత్కరించి కోరికల నిచ్చును. మరికొందరిలో నానందరూపుడై గోచరించును. ఇక కొందరిలో అధికారభేదము ననుసరించి మాటాడుచుండును. తనలోపల వెలుపల పరలోకము నన్వేషించు టెందులకు? అగుపించున దెట్టిచోటైనను అది వైకుంఠమే. ఎచట ఎండకాయునో అచటనే స్వచ్ఛమైన వెన్నెల నానావిధముల విరియుచుండును. వేఱుగా ఆనందమువలని సౌఖ్యమును వెదకు టెందులకు? తాను శాంతమూర్తియైనచో అది తనమనస్సులోనే నెలకొనును అంజనాద్రీశునకు దాసుడ నైతిని. ఆ దేవు డొకడే మా కన్నిటికిని ప్రభువై యున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలిసినవారి కింతా | 295 | 552 | 3 | 371 |

అవ: "తలంపు" అనగా ఎట్టిదో నిర్వచించుచున్నాడు.

సీ. సిరులు ముంగిటియందు జిగిఁ దడఁబడుచుండ
హరిని మఱవనట్టి దది తలంపు;
దుడదుడ కాంత లెదుట సందడిగొనంగఁ
దిరముగ భ్రమయనిదే తలంపు;
ఒడలఁ బ్రాయపుమద ముప్పతిల్లినతఱి
నడఁచి మెలంగుట యది తలంపు;
చెలరేఁగి సుఖదుఃఖములు తన్ను ముంచిన
నామకీర్తనము మాననిదె తలఁపు;

గీ. మనసు సంసారమాయ గప్పినను గాని
యమితకాంక్షలఁ జొరనట్టి దది తలంపు;
మంగపతిశరణాగతి మంచితలఁపు;
ఎంచ నిహపరసాధన మీ తలంపు. 128

నానావిధసంపదలు తనవాకిట తళతళలాడుచు తడబడుచున్నను శ్రీహరిని మఱవకుండుటయే నిజమగు తలంపు. తనయెదుట నందగత్తెలు సందడిచేయుచున్నను వారిభ్రమలో తాను చిక్కకుండుటయే తలంపు. దేహములో పడుచుదనంవల్ల మదము హెచ్చుచున్నను అణచుకొని వినయముతో మెలగుట తలంపు. అతిశయిల్లిన సుఖదుఃఖములు తన్నణచుచున్నను హరినామసంకీర్తనము మానకుండుట తలంపు. సంసారసంబంధమగు మాయ మనస్సు నావరించుచున్నను అత్యాశలకు లోనుగాకుండుటయే తలంపు. అలమేలుమంగాపతికి శరణాగతుడగుటయే అన్నిటికన్న మంచితలంపు. ఆలోచింపగా ఈ తలంపే ఇహలోకపరలోక సాధనము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇహపరసాధన మీ తలఁపు | 149 | 225 | 2 | 151 |

అవ: సుజ్ఞాన మన నెట్టిదో వివరించుచున్నాడు.

సీ. **కోపమ్ము మానుటే కోటిజపమ్ములు**
**పాపమ్ము సేయమి బలుతపమ్ము;**
**లోన నూరకయుంట లోకసంచారమ్ము**
**వెదకిన తెఱఁగింక వేఱు లేదు;**
**పరకాంత నంటమి బహుపుణ్యములసేఁత**
**సోమపాన మ్మాన సొరిది విడుట;**
**సరి మౌనమున నుంట సన్న్యాసముం గొంట**
**యింతకంటెను తెఱఁ గింక లేదు;**

గీ. **సుఖము దుఃఖమ్ము వాయుటే చూడ ముక్తి;**
**ఉడుగుటయ చంచలత్వంబు యోగ; మెలమి**
**సప్తశైలేశుఁ డిడిన సుజ్ఞాన మిద్ధి**
**యింతకంటెను తెఱఁగులే దివల నవల.** 129

కోపమును మానుట కోటిజపములతో సమానము. పాపము చేయకుండుటే పరమతపస్సులతో సమానము. మనసును చిక్కబట్టి నిశ్చలముగా నుండుట లోకములు తిరిగినదానితో సమానము. ఆలోచింపగా ముక్తికి మార్గ మింతకన్న వేఱులేదు. పరస్త్రీలపొందు లేకుండుట బహుపుణ్య కార్యములు చేయుటవంటిది. ఆశను పూర్తిగా వదలుట సోమపానముతో సాటి. చక్కగ మౌనము కల్గియుండుట సన్న్యాసం స్వీకరించుటతో సమానము. ఇంతకన్న ముక్తికి ఇతరమార్గము లేదు. ఆలోచింపగా సుఖ దుఃఖములు లేకుండుటయే ముక్తి. యోగ మనగా చపలత్వమును వదలుటయే. ఏడుకొండలవా డనుగ్రహించినది ఈ సుజ్ఞానము. ముక్తి కింతకన్న అన్యమార్గ మెచ్చటను లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దేవుఁ డొక్కఁడే గురి | 151 | 241 | 2 | 161 |

అవ: ఏడుకొండలదొరయొక్క మంత్ర మహిమను కొనియాడుచున్నాడు.

సీ. పుచ్చకాయలఁ బఱి వోవని మంత్రమ్ము
ముట్టంటు లేనట్టి మూలమంత్ర;
మెవరు వినిన వాఁడి యింతవీడని మంత్ర;
మున్నమంత్రాలలో మిన్న మంత్ర;
మేనోటి కెంగిలిలేని మంత్ర; మ్మోజ
దప్పిన చెడిపోని గొప్పమంత్ర;
మొకరి కిచ్చిన తేజ ముడివోని మంత్రమ్ము
సాటి యెందును లేని సత్యమంత్ర;

గీ. మిహముఁ బర మీయఁజాలిన యిద్ధమంత్ర
మఖిలవేదాలసారమై యలరు మంత్ర;
మెపుడు నారదాదులు జపియించుమంత్ర
మేడుకొండలదొరమంత్ర మెంతొ ఘనము. 130

'ఓం నమో వేంకటాశాయ' అను శ్రీవేంకటేశ్వరమంత్రము పుచ్చకాయలతో నశింపని మంత్రము. అనగా మహామంత్ర మనుట. ఎట్టినీచులు విన్నను శక్తిని గోల్పోవనట్టిది. మంత్రములలోనికెల్ల గొప్పది. ఎందరినోళ్ళనానినను ఎంగిలిదోష మంటనిది. నియమము తప్పినను రిత్త పోనిది. ఇతరుల కుపదేశించినను ప్రభావం తగ్గనిది. నిరుపమాన మైనది; సత్య మైనది. ఇహలోక పరలోకసుఖముల నీయజాలినది. సకలవేదముల సారమై యొప్పినది. సదా నారదాదులు జపించునట్టిది. అట్టి తిరుమంత్ర మెంతయో ఘన మైనది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఉన్నమంత్రా లిందు సరా | 136 | 153 | 2 | 103 |

అవ: లౌకికవిషయవ్యాపృతుడైన భక్తుడు వృషభాచలేశ్వరుని చరణములే తనకు శరణ మనుచున్నాడు.

సీ. చిత్త మొక్కటె కాని చింతలు వేవేలు
పురుషోత్తముఁ దలంపఁ బ్రొద్దులేదు;
కనులు రెండే గాని కనెడి వనంతముల్
హరిరూపు చూచుటన్నదియ లేదు;
చేతులు మఱి రెండె చేష్టలు లక్షలు
నృహరిని బూజింప నిచ్చలేదు;
నాలు కొక్కటె రుచుల్ నానావిధాలు గో
విందు యంటకుఁగూడ నందు లేదు;

గీ. శ్రవణములు రెండె వినుకుల కవధిలేదు;
పుండరీకాక్షుకథ విన బుద్ధిగాదు;
ఇహము పర మెట్లొ నాకిఁక వృషగిరీశు
చరణయుగళమ్మె శరణమ్ము నంతతమ్ము. 131

ఒకేమనసున అనంతములగు చింతలు (ఆలోచనలు) పుట్టుచున్నవి. ఆ మనసునందు పురుషోత్తము డగు శ్రీనివాసునిగూర్చి తలంచుటకు మాత్రము సమయము లేకున్నది. కన్నులు రెండయినా, వానితో చూడ బడునవి లెక్కలేనన్ని, ఇన్నిటిని చూచు చున్నను శ్రీహరిని చూచే చూపే లేదు. చేతులు రెండే. వానిచేష్టలు మరెన్నో. అవి కొరమాలినపనులు చేయునే గాని నరసింహుని పూజించుట కిచ్చగింపవు. ఒకేనాలుకకు ఎన్నోరుచులు. ఆ నాలుకలో గోవింద యని పలుకుటకుమాత్రము సందు లేదు. నామోచ్చారణ సలుపదన్నమాట. చెవులు రెండేగాని అవి వినే నిరుపయోగవిషయములకు హద్దులేదు. భగవంతుని కథలు వినుటకు ఏమాత్ర మిష్టపడవు. ఇట్టి నా కిక ఇహపరసుఖము లెక్కడివి? లే వనుట, వృషభాద్రినాథుని పాదముల జంటయే నా కెన్నటికినీ శరణము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇహ మెట్లో | 190 | 461 | 2 | 311 |

అవ: కామాదులను ధైర్యాదులచే జయింపవలెనని అట్టిగుణాలను శ్రీవేంకటేశ్వరుడే అనుగ్రహింపవలెనని వాకొనుచున్నాడు.

సీ. ప్రతిలేని ధైర్యమ్ము పదిలపఱచి గాని
మతిలోని వైరుల మట్టరాదు;
మితిలేని శాంతమన్ మేటికైదువఁ గాని
విషయమ్ములన్ గెల్వ వీలుగాదు;
సొరిది నిర్మోహమన్ జోడు దాల్చినఁగాని
మమకారముననుండి మరలరాదు;
విజ్ఞానగృహమున వేడ్క నుండినఁగాని
యెలమి తానై భువి నేలరాదు;

గీ. ఇన్నియును వేంకటేశ్వరుఁ డిడినఁ గాని
తన్నెఱిఁగి వాని గొలువంగఁ దరముగాదు;
కన్నులన్ వెలి లోవలఁ గలయఁగనినఁ
గాని నన్నంబు ఘనమేదొ కనఁగ రాదు. 132

సాటిలేనిధైర్యమును చిక్కబట్టినపుడేగాని, మనసులోని కామాది శత్రువులను జయింప శక్యముగాదు. అంతంలేని శాంతమనే గొప్ప ఖడ్గముచేతగాని, ఇంద్రియార్థములను గెల్వ సాధ్యంకాదు. నిర్మోహమనే కవచమును ధరించినగాని మమకారము నుండి తప్పించుకొనజాలము. విజ్ఞానమనే భవనములో నున్ననేగాని, తానై భూమి నేలుటకు తరముగాదు. ఈ శక్తులు వేంకటేశ్వరుడే అనుగ్రహించినపుడుగాని, తాను భగవదంశ సంభూతుడ నని ఎఱిగి ఆ దేవుని కొలువ వీలుగాదు. జ్ఞాననేత్రములతో అంతర్బహిఃప్రదేశములను కలయజూడనిచో శ్రీశు డధికుడనీ, తాను తదంశ భూతుడనీ తెలిసికొనుటకు సాధ్యము కాదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఘనమనోరాజ్యసంగతి | 49 | 303 | 1 | 202 |

అవ: వేంకటేశ్వర పరబ్రహ్మతత్త్వమును వివరించుచున్నాడు.

సీ. **విశ్వప్రకాశికి వెలియేడ ? లోనేడ?**
**శాశ్వతునకు మఱి జన్మమేడ?**
**సర్వపూర్ణున కిఁక సంచార మదియేడ**
**నిర్వాణమూర్తికి నిలయ మేడ?**
**ఉర్వీధరునకు కాలూనుచో టొకటేడ**
**పార్వతీనుతునకు భావమేడ?**
**అవ లీవల సహస్రాస్యున కేడ? నా**
**నాప్రభావున కేడ నడుము మొదలు?**
**మౌనిహృత్ స్థితునకు మా టేడ పలుకేడ?**
**జ్ఞానరూపికి వింట కంట యేడ?**

గీ. **పరమయోగికి తానేడ పరులు నేడ?**
**దురితదూరునకును నింద స్తుతియు నేడ?**
**వేంకటాచలపతి కేడ విగ్రహంబు?**
**స్వామి నారాయణున కవుగాము లేడ?** 133

లోపల వెలుపల అనక సర్వమును ప్రకాశింపజేయువాడు, ఎల్లప్పు డుండు (జననమరణములులేక) వాని కిక జన్మ మెక్కడిది? అంతటను నిండియుండువాడు గనుక తనులేక తాను దిరుగు చోటెక్కడిది? మోక్షస్వరూపునికి ఉనికి ఎక్కడిది? భూమినే భరించువానికి కాలుంచుటకు వేఱుచో టున్నదా? పార్వతిచే కీర్తింపబడినవానికి స్థితి ఎక్కడ? ప్రాణుల ముఖము లన్నియు ఆయనవే గనుక, ఆయనకు ముందువెనుకచోటు లనెడి భేద మెక్కడిది? బహువిధములైన ప్రభావములు గలవానికి అది మధ్యాంతము లెక్కడివి? మునులహృదయాలలో నుండువానికి మాట పలుకు లుండునా? జ్ఞానస్వరూపునకు వినుట కనుట లెక్కడివి? యోగేశ్వరుడైనస్వామికి తాను, ఇతరులు అను భేద ముండునా? పాపదూరునకు నిందాస్తుతు లెక్కడివి? సర్వస్వరూపుడైన శ్రీవేంకటా చలపతికి శరీర మెక్కడిది? ప్రభువగు నారాయణమూర్తికి మంచిచెడుగు లెక్కడివి? లే వనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| విశ్వప్రకాశునకు | 68 | 355 | 1 | 237 |

అవ: సకలకర్మలను, చింతలను, కోరికలను వదలిపెట్టి తిరుమలేశుని మహిమల దెలియవలెనని విన్నపముచేయుచున్నాడు.

సీ. బంధకారణములౌ పాపపుణ్యమ్ముల
నెట్టికర్మంబైన నేమితనకు?
మీఁదుగానఁగనీవి మెడకాలిసంకెల
యినుపదో పైఁడిదో యేమితనకు?
తను గుఱిసేయఁ జింతలకు, సంపత్తియో
యాపత్తియో యేదియైన నేమి?
ఇనుపదో పైఁడిదో యే గుదెయైన నే
మౌదల చిదుకంగ మోదుటకుమ?

గీ. కర్మఫలముపైఁ గోరిక గలుగ కర్మి
యైన నేమి వికృతకర్మి యైననేమి?
తిరుమలేశ్వరుమహిమలఁ దెలియునట్టి
సజ్జనున కిహపరములు చాలవేమి? 134

పుణ్యపాపములనిచ్చు సత్కర్మదుష్కర్మములు రెండును సంసార బంధమునకు కారణములే. కాన ఈ రెంటిలో నేదైనను ముముక్షువునకు నిరపేక్షితమే. ఉన్నత స్థితి కివి నిరోధకము లనుటలో నుదాహరణము చూపుచున్నాడు. మీదు (వైకుంఠము) చూడనీయక మెడకును కాలికిని చేర్చి తగిలించిన సంకెల ఇనుపదైనను బంగారపు దైనను ఒకటే. అటులే సత్కర్మ దుష్కర్మములును. ఆపదయైనను సంపదయైనను మానవుని చింతలకు గురిసేయును. తల పగులబాదుటకు గుదియ ఇనుపదైనను. పసిడిదైనను తన కేమి? అది చేయుపని ఒక్కటేకదా! అటులే విపత్సంపదలు కూడ. కర్మఫలాలను ఆశించువాడు సత్కర్మియైనను దుష్కర్మియైనను ఒకటే. తిరుమల నాయకుని దివ్యమహిమలు తెలియువానికి ఇహలోక పరలోకము లేవైనను ఒకటే. అనగా ఇహమందే పరసుఖ మందునని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చాల నొప్పి సేయునట్టి | 48 | 297 | 1 | 198 |

అవ: వేంకటాచలపతిపై భక్తి సేయుటవలన ప్రారబ్ధ సంచితకర్మలు నశించి జీవుడు ముక్తు డగునని హితోపదేశము చేయుచున్నాడు

సీ. జన్మ జన్మమ్ముల నలిపిన కర్మముల్
ప్రారబ్ధములుగాఁగఁ బ్రాణి వాని
ననుభవించుచు వీడఁ దనువు, తక్కిన కర్మ
చయము సంచితములఁ జక్కఁజేరు;
పొదల సంచితములు పుణ్యం బిగురు క్రాఁగు
నినుముమీఁది యుదకకణము లట్లు;
పాపమ్ము భారమై పరఁగంగ దేహికి
బహుకల్పములదాఁక భవ ముడుగదు;

గీ. కలుషహరు వేంకటేశ్వరుఁ దలఁచు భాగ్య
మాత్మ కొదవిన ప్రారబ్ధ మవల, సంచి
తము నశించి నిత్యానందధామమునకుఁ
జెలఁగుచు సుఖింపఁ జెచ్చెర జీవుఁ డేగు. 135

ప్రాణి జన్మజన్మాంతరములందు చేసిన కర్మల ననుభవించును. ఇదియే ప్రారబ్ధము. దాని ననుభవించుచు జీవుడు దేహయాత్ర చాలించును. ఈ జన్మలో మఱికొన్ని కర్మములు చేయును. ఇది సంచితము. ఇదియును ప్రారబ్ధముతో చేరగా క్రాగిన ఇనుముపై చల్లిన నీటిబొట్ల వలె పుణ్యము రూపుమాయును. పాపముయొక్క బరు వెక్కుడు కాగా ప్రాణికి అనేక కల్పముల వఱకు పుట్టుక తప్పదు. కనుక పాపములను మటుమాయ మొనర్పగల గోవిందుని స్మరించుభాగ్యము తన కబ్బినచో ప్రారబ్ధసంచిత కర్మములు నశించి తాను నిత్యానందమునకు స్థానమైన పరమపదమును తత్క్షణమే చేరుకొని ఎంతయో సుఖించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బలువగు కర్మము లివిగో | 48 | 296 | 1 | 197 |

అవ: అస్థిరమైన బ్రతుకు, శారీరకసుఖము మున్నగువాటిని నమ్మి శ్రీవేంకటాచలపతిని కొలువక తనువును వమ్ముచేసికొంటి నని వాపోవుచున్నాడు.

సీ. బ్రహ్మకల్పముదాఁక బ్రదికెదమో కాక
బ్రహ్మనిర్వాణమ్ముఁ బడయఁ గలమొ?
ఈ దేహలంపటమే బ్రహ్మ మని పర
బ్రహ్మ వీడితి; మేమి పాడుబ్రతుకు ?
ఒడలితో నిట్టులే యుండెదమో కాక
చెడని పుణ్యము లెల్లఁ జేయఁ గలమొ?
ఎడయ కమరపదం బేలెదమో ? వృథ
చెడియె దినము లేమి చెట్టబ్రదుకు?

గీ. ఆపదలు లేని సుఖముల నందఁ గలమొ?
పాప మంటని మతితోడఁ బరఁగఁ గలమొ?
ఏవుమీఱిన శ్రీవేంకటేశుఁ గొలువ
నోప కూరక తనువు నిట్లోమినాము. 136

మందుమాకులతో బ్రహ్మకల్పముదాకా బ్రతుక గలమా? బ్రతికిన బ్రతుక వచ్చునేమోకాని బ్రహ్మసాక్షాత్కారమునుమాత్రము పొందలేము. దైహికమైన శ్రమనే బ్రహ్మముగా భావించి పరబ్రహ్మముమాటే మరచి పోయితిమి. ఇదెంత వ్యర్థమైనబ్రతుకు? ఈ శరీరంతో ఇట్లే కలకాల ముందు మనుకొందుముగాని శాశ్వతపుణ్యకార్యములను చేయగలమా? చేయలే మనుట. ఎడబాయక దేవపదవి నేలగలమా? లే మనుట. దండుగగా దినములు గడచినవి. ఈ పాడుబ్రతుకు నేమనవలె? ఆపదలు లేకుండ సుఖములను మాత్రమే పొందగలమా? పొందలే మనుట. జీవితములో పాపానక్తముగాని చిత్తముతో వర్తించ గలమా? వర్తించలే మనుట. సర్వాధికుని వేంకటాచలాధి నాథుని ఆరాధింపక వ్యర్థముగా ఈ కాయము నీ విధముగా పెంచుకొన్నాము. ఇహసుఖభోగములు, పదవులు వాంఛింపక వేంకటాచలపతిని సేవించుట పరమసుఖప్రద మని పిండీకృతార్థము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమి దిరిగే మెంధెనను | 18 | 6 | 4 | 364 |

అవ: సర్వకర్మలను పరిత్యజించి ప్రత్యక్షదైవతమైన శ్రీనివాసుని సేవించినచో సర్వసౌఖ్యములు పొందవచ్చునని పలుకుచున్నాడు.

సీ. **కొన్ని పుణ్యమ్ములు కోరి చేయుద మన్నఁ**
**గోర్కు లిచ్చెడు హరి కూడియుండెఁ;**
**జేరఁదగిన చోటుఁ జేరఁ జూచెద మన్న**
**శ్రీవికుంఠవిభుఁడు చేత నుండె;**
**భవహరముగ వేదపఠన సల్పుద మన్న**
**నోటిలో గోవిందు పాట లుండెఁ;**
**దవిలి సంపదలకై దాన మిచ్చెద మన్న**
**మా పూజలో నుండె మాధవుండు;**

గీ. **వేఁడెద మటన్న నిహసౌఖ్యవిసరమునకు**
**నిహ మొసఁగు వేంకటేశ్వరుఁ డెదుట నుండెఁ;**
**జాలుఁ జాలు కర్మమ్ములు; శంక లుడిగెఁ;**
**దనిసితి; మొసంగె నతఁ డన్ని తానె మాకు.** 137

అపేక్షపడి కొన్ని పుణ్యకార్యములు చేయ దలపెట్టినచో అన్ని కోర్కు లీడేర్చెడు హరి చెంతనే యున్నాడు. జీవరాసులకు పరమప్రాప్యమైన పరంధామమును పొంద ప్రయత్నింతు మనుకొనగా ఆ వైకుంఠాధిపతి ఈ వేంకటాచలముపై వెలసియున్నాడు. తిరుమల శ్రీవైకుంఠమే యనుట. పుట్టుకను బాపుకొనుటకై వేదాధ్యయనం చేయుదమన్నచో ఆ ఫలము నిచ్చు గోవిందనామసంకీర్తనము నా నోటనే యున్నది. రాబోవు జన్మలో సంపన్ను డగుటకై ఇపుడు దానములు చేయుద మని భావింపగా సంపద నిచ్చు లక్ష్మీవల్లభుడు మా అర్చనలోనే యున్నాడు. అర్చనలు వినా దానము లనవసర మనుట. ఈ లోకపుసుఖాల సమూహాలకై ప్రార్థింత మని తలంపగా ఈ దేవుడు నాయెదుటనే యున్నాడు. సందేహములు తీరినవి. కర్మము లాచరింప నవసరములేదు. పూర్వకర్మానుసారంగా ఆ స్వామి మా కన్నిటి నొసంగియున్నాడు. దానితో మేము యదృచ్ఛాలాభసంతుష్టులమైనాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంక నేమి సేసేము | 343 | 252 | 4 | 169 |

అవ: గురూపదేశమూలమున శ్రీవేంకటేశ్వరుని దర్శించినవానికి అజ్ఞానం మటుమాయ మగునని బోధించుచున్నాడు.

సీ. **జగములు రక్షింప సర్వేశ్వరుఁడె యుండ**
**నతని యద్భుతశక్తి నరయలేక**
**సంసారరక్షణ సల్పెద నే నని**
**యల్పబుద్ధి నగుచు నాత్మ నెంతు;**
**నాతఁ డంతర్యామియై సుఖదుఃఖాలు**
**గలిగింపఁ బరులసేఁతలుగఁ దలఁతు;**
**నావంటిజీవుల త్రోవలఁ దిరుగుచుఁ**
**గర్మసూత్రములచేఁ గట్టువడెదఁ;**

గీ. **దిరుమలేశ్వరుఁ డెదుటనే వరము లొసఁగ**
**నన్యులను జెయిసాచి నే నడుగుచుందు;**
**నాగురుఁడు నేఁడు వేంకటనాథుఁ జూప**
**విడిచెఁ బెనఁగొన్న తొల్లింటి వెఱ్ఱితనము.** 138

లోకము లన్నింటిని కాపాడుటకు ఆ సర్వేశ్వరుడే సంసిద్ధుడై యుండగా ఆతని యద్భుతమైన శక్తిని తెలియజాలక నేనే నా సంసారమును కాపాడుచున్నానని అల్పమగుబుద్ధితో నా యాత్మలో తలచుచున్నాను. ఆ దేవుడే లోనున్నవాడై కర్మానుగుణంగా జీవులకు సుఖదుఃఖములు గల్గించుచుండగా ఆ సుఖదుఃఖములు ఇతరుల వల్ల నాకు కల్గుచున్నట్లు భావించుచున్నాను. నావంటి వెఱ్ఱివారల దారిలో నడచుచు కర్మలనే త్రాళ్ళతో కట్టబడుచున్నాను. ప్రత్యక్షముగానుండి కోరినవరము లిచ్చుటకు కొండలప్ప సిద్ధంగా ఉండగా ఇతరులవద్దకు వెళ్ళి చేయిసాచి యాచించుచుందును. గురుని మంత్రోపదేశమహిమచేత శ్రీనివాసు నెఱింగి పై దోషములను పారదోలితిని. పూర్వము నన్ను చుట్టుముట్టుకొని యుండిన అజ్ఞాన మంతయు ఇపుడు నశించినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెఱ్ఱిమానుప రెవ్వరు | 212 | 72 | 3 | 49 |

అవ: శ్రీభూదేవుల పెనిమిటికి బంటులమైన మాకు ఇతరులు సిరిసంపద లీయవలెనా యనుచున్నాడు.

సీ. పల్లకీ లందలాల్ పడివాగెతేజీలు
లక్ష్మీవిలాసముల్ - లచ్చిమగని
దైవతం బని మేము ధ్యానింతు మెప్పుడు
వెస మాకు సిరు లొరు లొసఁగవలెనె?
గ్రామముల్ రత్నముల్ గజముఖ్యవస్తువు
లంగభేదములు ధాత్ర్యంగనకును
ఆకెపెన్మిటిఁ గొల్చునట్టి లెంకలము మా
కితఁ డీయఁడే యన్యు లీయవలెనె?

గీ. బ్రహ్మ నిర్మితములు గావె పదవు లెల్ల
బ్రహ్మజనకుండు వేంకటేశ్వరుఁడు మమ్ము
నేలినాతం డొసంగఁడే యిన్ని; మాకు
నిడవలెనె భోగులకు నట్టనడిమిదొరలు? 139

పల్లకీలు మేనాలు సవరణలుగల మేలుజాతిగుఱ్ఱములు శ్రీమహాలక్ష్మీ విలాసములు. ఇట్టి లక్ష్మికి ప్రాణవల్లభుడైన దేవుని మే మెల్లప్పుడు ధ్యానింతుము. అట్టిమాకు ఇతరులు సంపద లీయవలెనా? శ్రీపతియే సర్వసంపద లిచ్చు ననుట. ఇక భూదేవికి గ్రామరత్నగజాదులగు సంపదలు అంగభేదములు ఎన్నియో గలవు. అట్టి భూదేవిభర్తను సేవించెడు సేవకులము మేము. కనుక మా కీసంపదలను ఆ భూదేవిభర్తయే యిచ్చును. అన్యులు మా కీయ నవసరములేదు. ఇంద్రాదిపదవులన్నియు బ్రహ్మదేవునిచే కల్పింపబడినవే. కాగా అట్టి బ్రహ్మకు తండ్రియగు వేంకటేశ్వరుడు మ మ్మేలువాడు. అన్నిపదవు లాతఁడే మా కిచ్చును. కావున భోగులమైన మాకు ఈ నడుమంత్రపుప్రభువు లే మీయవలెను? ఏమియు నీయ నక్కఱ లేదనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పుట్టుభోగులము | 316 | 94 | 4 | 63 |

అవ: అంజనాద్రీశునినామసంకీర్తనము, చింతనము, కథాశ్రవణము, దాస్యము - వీటిమహిమను వర్ణించుచున్నాడు.

సీ. దుఃఖసంహరణమ్ము దురితమోచనము శ్రీ
హరినామకీర్తన నరుల కెల్ల;
భవనిర్హరణము కైవల్యసంధాయిని
పరమాత్మచింత ప్రపన్నులకును;
సారంపుధనములు సంతోషకరములు
శౌరిసత్కథలు సంసారులకును;
కోరిన కోర్కులు కురియు కల్పకుజమ్ము
విష్ణునిదాస్య మూర్వీజనులకు;

ఆ. ఇష్టసౌఖ్యదాయి యిరవగు పట్టమ్ము
స్వామికరుణ మోక్షకాములకును;
నచ్చమైన వేంకటాధిపుశరణమ్ము
మా కనంతరాజ్యమహితపదవి. 140

మానవుల కందఱకును హరినామసంకీర్తనమే కష్టములను పాపములను పోగొట్టునట్టిది. ప్రపత్తిపరులైన వారికి పుట్టువును పోగొట్టునది, ముక్తి నిచ్చునదియు పరమాత్ముని చింతనమే. సంసారులగువారలకు శౌరికథలు వినుటయే బలమగుధనము, సంతోషప్రదమునూ. ఈ లోకములోని జనులకు కోరినకోర్కుల నిచ్చునట్టిది శ్రీమహావిష్ణువుయొక్క ఊడిగమే. మోక్షం కోరుకొనువారికి ఇష్టమైనసౌఖ్యములు, ఇరవైనపట్టము నిచ్చునట్టిది స్వామియొక్కకృపయే. నిష్కపటంగా స్వామిని శరణు జొచ్చుటయే మాకు అంతములేని పూజ్యమగు ముక్తి, సామ్రాజ్యపదవి నిచ్చునట్టిది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇరవగు వారికి | 89 | 439 | 1 | 294 |

అవ: నిజమగు వైష్ణవు డెవడో తెలుపుచున్నాడు.

సీ. **ఇటునటుఁ దిరుగాడి యేమైనఁ జెడనాడి**
**పెట్టి పోయ రటంచుఁ బెక్కులాడి**
**ఎవరినైనను దూఱి యెవరినైనను జేరి**
**వాంఛ చూపనివాఁడె వైష్ణవుండు;**
**గడనకొఱకుఁ జిక్కి కాముకవిద్యలఁ**
**జొక్కి దేనినిఁగన్న నిక్కి నిక్కి**
**యొడలిగుణముతోడ నుదుటువిద్యల వడ**
**బడలని వాఁడెపో వైష్ణవుండు;**

గీ. **అవల నన్యులు చెడనాడ నాలకించి**
**యనిశ మెవ్వరిఁ దాఁ జెడనాడకుండ**
**వేంకటాచలవిభుఁ గొల్చి పెద్దలకృప**
**వావి వర్తన గలవాఁడె వైష్ణవుండు.** 141

వ్యర్థముగా సంచరించుచు, దేనినైనను పాడుచేయుచు, ఇతరులు తనకు పెట్టరని, పోయరని నిందించుచు, విపరీతముగ మాట్లాడుచు, ఎవరినైనను నిందించుచు, మఱి కొందఱిని పొగడుచు యాచింపనివాడే అసలైన వైష్ణవుడు.

సంపాదనమునకు లోనై మన్మథమాయలకు జిక్కి సొక్కుచు చూచిన దాని నంతయు ఆశించి అఱ్ఱులుసాచుచు శారీరకములగు గుణములతో ఉద్ధతములగు విద్యలవలని శ్రమచే బడలికచెందకుండువాడే నిజమైన వైష్ణవుడు.

ఇతరులు తన్ను చాలదూషించినను, తా నెప్పుడు ఎవ్వరి నేమియు ననకుండ వేంకటాచలపతిని గొలుచుచు పెద్దలగువారి దయచేత పెద్ద చిన్న అంతరువు నెఱిగి, మెలగువాడే సిసలైన వైష్ణవుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మదమత్సరము లేక | 9 | 59 | 1 | 39 |

అవ: పరమవైష్ణవులను మెచ్చి వారికి నమోవాకము లర్పించుచున్నాడు.

సీ. **తలఁప రొకప్పుడు ధరణిభోగమ్ములు**
**తలఁప రన్యమతాల దైవతములఁ;**
**దలఁతు రొక్కటె హరిదాసులదాస్యంబు**
**తలఁపు మోక్షమ్ములఁ దగులుఁ గాన;**
**కోరరు బ్రహ్మాదిగురుతరపదములు**
**కోరరు మేరువుకొనసుఖమ్ము;**
**కోరుదురు తదీయకోట్ల సంగమ్మును**
**కోరిక భక్తితోఁ గూడుఁగాన;**

గీ. **కర్మముల నొల్ల; రొల్లరు గణ్యపుణ్య;**
**మొల్ల రొకపరి గర్వమ్ము; నెల్లయందుఁ**
**దుదిపద మెక్కి యున్నట్టి దొడ్డవారు**
**పరమవైష్ణవులకు నమోవాకశతము.** **142**

శ్రీవైష్ణవులు ఈ లోకసంబంధములగు సుఖము లొకప్పుడుగూడ ఆశింపరు. మతాంతరులయొక్క దేవతలను కొలువరు. మోక్షమం దపేక్షగలవా రగుటచే హరిదాసులదాస్య మొక్కదానినే తలంతురు. బ్రహ్మేంద్రాద్యున్నతపదముల నిచ్ఛగింపరు. మేరుపర్వతాగ్రంలో విహరించే సుఖమునుగూడ స్మరింపరు. భక్తి పెంపునకు హేతువైన పరమభాగవతుల సాంగత్యమునే కోరుచుందురు. కర్మములనుగాని ప్రశస్తపుణ్యములనుగాని అంగీకరింపరు. ఒకప్పు డైనను గర్వమును పొందరు. అన్నివిధముల పరమోచ్చస్థానమును పొందినట్టి పెద్దలగు పరమవైష్ణవులకు అనంతకోటి నమస్కారములు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరమవైష్ణవుల | 315 | 86 | 4 | 58 |

అవ: ఆంతరంగికభక్తుడు తనయనుభవమును వ్యక్తీకరించుచున్నాడు.

సీ. ఎన్నెన్ని చదివిన నీ నోటికిన్ విష్ణు
వన్నంత రుచి వానియందు లేదు;
ఎన్నెన్ని రూపులు కన్నులఁ జూచిన
హరిని జూచిన పూర్తి యందు లేదు;
ఎచ్చోటనున్న లక్ష్మీశుమందిరము
జొరఁగఁ జొప్పడునంత సుఖము లేదు;
వీనుల కత లెన్ని విన్న నచ్యుతుని కీ
ర్తనములు విన్నంత రక్తి లేదు;

గీ. ఎందఱకు మ్రొక్కినను ముచికుందవరదు
నడుగులకు మ్రొక్కినంత శ్రేయంబు లేదు;
శ్రీశుఁ బూజించినటువలెఁ జేరి పరుల
మావుదాఁకఁ బూజింపంగ మనసు రాదు. 143

భగవన్నామోచ్చారణము నోటికి రుచించినంతగా ఇతరము లెన్ని చదువులు చదివినా రుచింపదు. లోకములో ఎన్నియో దేవతామూర్తులను దర్శించినను శ్రీ వేంకటేశ్వరుని దర్శనంచేత కలిగే ఆనందము మఱెందునా లేదు. మంగావిభుని మందిరంలోనికి ప్రవేశించగా కలుగునట్టి సుఖం మఱెక్కడికి వెళ్ళినా కలుగదు. అచ్యుతుని సంకీర్తనములు వినుటలోని రక్తి ఇతరకథల నెన్నిటిని విన్నా లేదు. ముచికుందునికి వరా లిచ్చిన వరదునిసేవచే గలుగు శ్రేయస్సు మఱెందరి కాళ్ళకు మ్రొక్కినా కలుగదు. రేయుంబవళ్ళు లక్ష్మీపతిని పూజించినవిధముగా ఇతరులను చేరి పూజించుటకు మనసు రాదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మానరో వో లోకులాల | 343 | 250 | 4 | 167 |

అవ: అన్నియు తనలో నుండగా అవల చూచే వేమున్నవి? తెలియబడని మాయాస్వరూపమును తెలుసుకొ మ్మనుచున్నాడు.

**సీ. ఈడనే సంసార మింద్రజాలము గాఁగ**
**నడిసూడ నేడకో యరుగుచుందు;**
**బహురూపములె గాఁగఁ బలుపుట్టువులు, వానిఁ**
**జూడంగ మాటికి వేడు కగును;**
**నానాటిబ్రదు కిది నాటకమై యుండ**
**నాటకమ్ములను గానంగ నెంతు;**
**ఘటన మాయ లెదుటఁ గనుకట్టులై యుండఁ**
**గనుకట్టువిద్యలఁ గాంచఁ బోదు;**

**గీ. బారివిద్యలుగాఁ బుణ్యపాపము లివి**
**కోపునన్ వానిఁ దిలకింపఁ గోరుచుందు;**
**ఫణిధరాధరపతి నాదు భ్రమను బాప**
**నా పనులు నేనె కనుఁగొంచు నవ్వుకొందు.** 144

నే ననుభవించే సంసారమే ఇంద్రజాలమై యుండగా ఎక్కడనో జరుగుచున్న ఇంద్రజాలమును చూడ వేడుకపడుచుందును. నాటకములోని వేషములవలె పెక్కురూపములతో ఎన్నోపుట్టువు లెత్తితిని. వాటిని పరికింపగా అచ్చెరువు గలుగును. దైనందినజీవితమే ఒక నాటకము కాగా ఎక్కడనో జరుగునాటకమును తిలకింప గమకింతును. మాయాప్రభావముచేత పలుకనుకట్టువిద్దెలు ఎదుటనే సిద్ధమై యుండగా ఏడనో జరుగు కనుకట్టువిద్యలప్రదర్శనమును చూచుట కేగుదును. పుణ్యపాపములు తీగమీద నడచు విద్యలై యుండగా వాటిని చూచుటకు ఉత్సాహపడు చుందును.

శేషాద్రినాథుడు నాభ్రమను (అజ్ఞానమును) పోగొట్టగా నా నిత్యచర్యలనే మాయాజనితము లని ఎఱిగి నవ్వుకొనుచున్నాను.

సకలము మాయ యని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్నియు నాలో నుండఁగ | 333 | 190 | 4 | 127 |

అవ: తన అవయవములను గుణములను భగవత్పరములు కండని వేడుచున్నాడు.

సీ. కొననాలుకా! శ్రీశుగుణములే నుడువవో
మనసా! అతనిదివ్యమహిమ నెంచు;
దేహమా! హరిపాదతీర్థమే కోరుమా
యెనలేని యడియాస లేల నీకు?
విష్ణునిగాథలు వీనులార! వినరొ
చేరి మ్రొక్కరొ కృష్ణు చేతులార!
కమలాక్షుఁ జూడరో కనుచూపులార! యీ
పాపౌఘములబారిఁ బడెద రేల?

గీ. నడువరో స్వామినగరికి నడుగులార!
అచ్యుతునిమీఁద సద్భక్తి! హత్తు కొనవొ
శౌరిసంగతి నుండవో చలమ! నీకుఁ
గోరికలవెంటఁ బరుగిడు కొల యిదేల? 145

ఓ నాలుకా ! లక్ష్మీపతిగుణములనే పలుకుము. ఓ మనసా! ఆతని దివ్యమహిమలనే తలంచుము. ఓ శరీరమా! అంతులేని అడియాస లేల నీకు? విష్ణుపాదమనే తీర్థమునే కోరుము. ఓ చెవులారా! విష్ణుకథల నాకర్ణింపుడు. ఓ చేతులారా! శ్రీమహావిష్ణువునే పూజింపుడు. ఓ కన్నులారా! కమలాక్షుని కాంచుడు; పాపజంబాలములో ఏల పడెదరు? ఓ పాదములారా! హరిసదనమునకు కదలుడు. ఓ భక్తీ! నీవు హరిని ఆశ్రయింపుము. ఓ మచ్చరమా! కోరికలవెంట పరుగిడు దుర్గుణ మేల నీకు? శౌరిసాంగత్యమున నుండుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎన్నఁడుఁ జెడని | 303 | 14 | 4 | 10 |

అవ: వేంకటేశ్వరుడు సకలమందును సర్వదా నిండియున్నాడని విశ్వాసము ప్రకటించుచున్నాడు.

**సీ. సకలజీవులలోన సర్వేశ్వరుఁడు వాఁడె**
**యొకరి నౌఁగాదన నోప నేను;**
**అతని చేఁతలే యందఱి చేఁతలు**
**వికటమ్ము లాడంగ వెఱపు గల్గు;**
**భువియందు దివియందుఁ బురుషోత్తముఁడు వాఁడె**
**వివరించ మేల్కీళ్ళు వెదక నోప;**
**చెవి విన్నమాటలు శ్రీపతియై తోఁచె**
**నివల కల్లనిజాల నెంచఁ జాల;**

**ఆ. పగట రేయి నెపుడు పరమాత్ముఁ డవ్వాఁడె**
**తగిలి పాయునన్న తలఁపు నోప;**
**జిగిదొలంక లోని శ్రీశుండు బగివాయఁ**
**డెన్నఁడున్ విచార మేల మనస!** 146

ఆ సర్వేశ్వరుడు ప్రాణు లందరిలో నున్నవా డగుటచే ఒకరిని గౌరవించుచు మరొకరిని తిరస్కరింపజాలను. సర్వభూతములను సమదృష్టితో చూతు ననుట. అందరు చేయుపనులు ఆ సర్వేశ్వరుని చేతలే కనుక వానినిగూర్చి వక్రంగా మాటలాడ వెరతును.

భూమ్యాకాశములందు పురుషోత్తముడే నిండియుండగా ఇందులో ఒకటి మేలని మరియొకటి కీడని అనజాలను. చెవినిబడ్డ మాట లన్నియు శ్రీపతిమయములై తోచునుగాన దేనినిగాని కల్లమాటగా నెంచను. ఆ పరమాత్మయే రేపవళ్ళు యుండగా నన్ను వీడిపోవునని తలంపను. కాంతి తొణికిసలాడగా లోననుండు శ్రీశుడు నాపార్శ్వముల నెప్పుడును వదలిపెట్టడు. ఓమనసా! ఇక విచారమెందులకు?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| లోకమంతా నిండె | 339 | 228 | 4 | 153 |

అవ: సకలప్రభువైన వృషాద్రివల్లభుని రక్షకునిగా నమ్మి సుఖముగ జీవింపుడని నయోక్తు లాడుచున్నాడు.

**సీ. తలిదండ్రిగలవారు తమ లేము లెఱుఁగక**
**చెలపిళ్ళలై హాయి చెందినట్టు**
**లొడయని హరి నమ్మియున్న ప్రపన్నులు**
**పరమనిర్భరు లౌచు బ్రదుక వలదె?**
**మగఁడున్న నతు లెల్ల మంగళవతు లౌచు**
**నితరమార్గమ్ముల నెఱుఁగ నట్లు**
**వెన్నుని నెదనమ్మి యున్న ప్రపన్నులు**
**బందుపనులు మాని బ్రదుకవలదె?**

**గీ. ఏరికిఁ బ్రియమ్ము సెప్పక యెపుడు బంటు**
**లోలిఁ బతివాకిలిం గాచి యున్నయట్లు**
**ఫణిశయనుదాసులైన ప్రపన్నజనులు**
**రక్షకు వృషాద్రివిభు నమ్మి బ్రతుక వలదె? 147**

తలిదండ్రులు జీవించియుండగా దారిద్ర్యమును తలపోయక స్వేచ్ఛగా సుఖించెడు ముద్దుబిడ్డల కైవడి ప్రభువైన హరిని నమ్మి ప్రపన్నులైనవారు నిండుహృదయాలతో సుఖంగా జీవింపవలదా? జీవింపవలె ననుట. భర్తలుగల నతులు మాంగళ్యయుక్తలై పరపురుష దర్శన స్పర్శనాదులు విసర్జించి వర్తిలు విధముగా శ్రీహరిని హృదయాన నమ్మిన ప్రపన్నులు తుంటరిపనులు మాని అనగా పరదేవేచ్ఛ లేనివారై మనవలదా? మనవలె ననుట. సేవకులు తమస్వామిని వినా అన్యులను కీర్తింపక ఏలికవాకిలి కాచియున్నట్లు శేషశయనుదాసులైన ప్రపన్నులు రక్షకుడైన వృషభాద్రీశ్వరుని నమ్మి జీవితము గడపవలదా? గడుపవలె నని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వట్టిమోపు మోయనేల | 209 | 54 | 3 | 37 |

అవ: వేంకటాచలపతికొలువు మహాభాగ్యమని చాటుచున్నాడు.

సీ. ఇన్ని మేనులు దాల్చి యేమిగంటిగనుక
యున్నతహరిదాస్య మొకఁడె మేలు
హీనజంతువునకు నిభతల్లజమునకు
నంగములే వేఱు హర్ష మొకటె;
నరలోక దుఃఖముల్, సురలోక సౌఖ్యమ్ము
లందు కందుకు మఱి యందుకు సరి;
అందు ఘన మ్మేమి? యరయ నల్పమ్మేమి?
హరిదాసుఁడై మను టదియ దొడ్డ;

గీ. బొట్టెఁ డైనప్పుడును పండి ముదిసినపుడు
బుద్ధి కడులేదు; కాలమ్ముపోక యొకఁడె;
ఏలి కనుచును వేంకటాద్రీశపాద
కమలములఁ గొల్చు టదియ భాగ్యంబుగాక. 148

ఎన్నియో జన్మము లెత్తి ఏమి పరమార్థము సంపాదించితిమి ? గొప్పదగుహరిసేవయే మేలైనది. మోక్షమిచ్చున దనుట. చిన్నప్రాణులకును గొప్పప్రాణియగు ఏనుగునకును శరీరములో భేద మున్నదేగాని అన్నింటి యానంద మొక్కటియే. శరీరములు భిన్నము లైనను భగవద్దర్శనముచేత కలుగు ఆనందము ఒకటియే. భూలోకంలోని దుఃఖములు స్వర్గ లోకములోని సుఖములు కర్మానుగుణముగా పరిమితములై తీరి పోవు నట్టివేగాని అందులో తగ్గుమొగ్గు లేమున్నవి? కాన హరిభక్తుడై జీవించుటయే గొప్ప. హరిభక్తి ముక్తికారణము గనుక. బాలుడైనను వృద్ధుడైనను బుద్ధి హెచ్చగుటలేదు. కాలం బుద్ధిమంతునకు బుద్ధిహీనునకు ఒకేరీతి గడచిపోవుచున్నది. ప్రభువని శ్రీవేంకటాచలపతిపాదపద్మములు గొల్చుటయే మహాభాగ్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇన్ని దేహములఁ బుట్టి | 214 | 84 | 3 | 57 |

అవ: సర్వము నశించుననియు, సర్వశేషిగా నుండెడువాడు మంగాపతి యొకడే యని ఉద్ఘోషించుచున్నాడు.

సీ. అనుదిన మ్మారగించిన యన్నములు తీఱెఁ
దీరవు కోరికల్ దినదినమ్ము;
సారెఁ గొన్న రుచులు చవితో నొడలలేవు
కాంక్షలే మిగిలెను కడకు బ్రతుక;
పోయెను స్వర్గాదిభోగాలు వెనుకనే
నలువఁబోఁ బుణ్యాలు చాలఁ జాల;
ఆయమంటి వెదక నాత్మలోపల లేవు
మిగిలెను కర్మమే మేనితోడ;

గీ. హరిచరణదాసులను గొల్వ నందె ముక్తి;
ముందు వెను కెంచ మూలమ్ము నందసుతుఁడె;
కోపపాపాలు నరకాలు గొండిఁ జిక్కె
నిందు నందున మిగిలె మంగేశ్వరుండె. 149

ప్రతిదినము భుజించెడి అన్న మరిగిపోవును. కాని అనుదిన మనుభవించినను కోరికలుమాత్రము తరుగక దినదినాభివృద్ధి నొందును. పలుమారులు గ్రహించిన కటుతిక్తాదిరుచులుగల పదార్థములు శరీరము నంటిపెట్టుకొని యుండుట లేదు. కాని బ్రతుకుసాగించుటకు కోరికలే మిగిలిపోయినవి. బహుపుణ్యములు సలిపినందుకు ఫలముగా కలిగిన స్వర్గలోకసుఖాలు అనుభుక్తములై ఎప్పుడో నశించిపోయినవి. జీవ స్థానమునుబట్టి వెదుకగా అవి ఆత్మయందు కనుపించవు. ఈ శరీరముతో పాటు కడకు కర్మమే మిగిలినది. కనుక శ్రీహరిపదభక్తులను సేవింపగా ముక్తి లభించినది. చక్కగా పూర్వాపరము లాలోచించినచో అన్నిటికి మూలమైనవాడు ఆ నందనందనుడే. అతని నాశ్రయించగా కోపములు పాపములు ఏ మూలనో అణగిపోవును. లోపల వెలుపల వెలుగువాడు ఆ మంగాప్రియుడే. "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అనిగదా శ్రుతి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇన్నిజన్మము లెత్తిన | 333 | 221 | 4 | 148 |

అవ: జీవుడు కండకావరముచే తనహృదయములోనున్న దేవుని తెలియక అహంయువై తిరిగి తత్త్వ మెఱిగినమీదట సుఖించు ననుచున్నాడు.

సీ. ఏడకుఁ జను జీవుఁ? డేదివైకుంఠ? మి
క్కడ హరియున్నాఁ డెడఁదయందె
ముక్కున నూరుపు మోయుచు పాప పు
ణ్యమ్ములఁ జిక్కి కానండుగాక;
ఏమి విచారించు? నెందు దేవునిఁ బ్రాణి
వెదకు? నెల్లెడ వాఁడు పొదలుచుండ;
దురితసంసారంపుదొంతికర్మములఁ జి
క్కి కనఁడుగాక తా క్రింద మీఁదు

గీ. శ్రీనివాసునిసేవయే చేతనుండ
నే విధు లొనర్చు ? నెవ్వని నేమి పొగడు?
భావ మాతఁడుగా దేహి బ్రదికె నేఁడు
కావరమ్మున నిన్నాళ్ళు కనఁడు గాక. 150

ఇక్కడనే తన హృదయమునందే శ్రీహరియుండగా జీవు డెక్కడికి వెళ్ళుట? ఏది వైకుంఠము? శ్రీహరియున్నహృదయమే శ్రీ వైకుంఠ మని భావము. కాని యీ విషయమును బ్రతికియుండియు పాపపుణ్యములకు లోనై కనలేడు. ఆ హరి సర్వవ్యాపకుడై యుండగా అతనిగూర్చి విచారించు టేమి? ఎక్కడ వెదకుట? ఎంతయిన విచారించవచ్చునని, ఎక్కడనైన చూడవచ్చునని తాత్పర్యము. కాని ప్రాణి పాపముచేగల్గిన సంసారకర్మలలో చిక్కుకొని మంచిచెడుగుల తెలియజాలడు. శ్రీనివాసునిసేవ తన చేతియం దుండగా ఏ కర్మలను చేయుట? ఎవరిని పొగడుట? అనగా శ్రీశదాసునికి ఇతరకర్మములుగాని దేవతాంతరస్తుతులుగాని అక్కర లేదనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఉన్నచోనే మూఁడులోకాలు | 213 | 78 | 3 | 53 |

అవ: శేషాద్రివల్లభుని మాయచే మనుజులు కామమునకు లోనగుదు రని, అట్టి కామమును విసర్జింపవలెనని సందేశ మొసగుచున్నాడు.

**సీ. పాప మెఱుంగదు భయము నెఱుంగదు**
**రూపెఱుంగదు క్రొత్తరుచులు గొలుపు**
**తీపులఁ గడుతీపు పూపవయస్సులోఁ**
**బండు వొడమఁజేయు పచ్చివలపు;**
**సిగ్గెఱుంగదు నడిశిరసున కెక్కు; న**
**న్నింటి కొగ్గించు వన్నియల వలపు;**
**బగ్గన నటు గుండెఁబగిలించుఁ గలిమియు**
**లేమియు నెఱుఁగ దీ లేఁతవలపు;**

**గీ. ముగురుమూర్తులనైనను ముంచివేయు**
**వేడివిరహమ్ములోననే వేఁపు వలపు;**
**తెగువ గలిగించుఁ దెప్పలఁ దేల్చు వలపు**
**వేంకటేశ్వరుమాయ యీ వింతవలపు.** 151

కామము పాపమును భయమును రూపమును సరకుగొనదు. నానాటికి క్రొత్త రుచులను కల్గించును. ఇది మధురపదార్థములలో మిక్కిలి మధురమైనది. ఈ కామము మానవునికి చిన్నవయసునందే వార్ధకము కల్గించును. ఈ కామము తిన్నగా తల కెగబ్రాకును. కామికి సిగ్గు శూన్యము. అన్నిటికిని తల యొగ్గునట్లు చేయును. అనగా కామముగలవాడు ఎట్టినిందలనైనను నోర్చు ననుట. ఈ కామము బండవంటిగుండె నైనను బ్రద్దలుచేయును. కలిమిలేముల నెఱుగదు. అనగా సంపన్నుడు దరిద్రుడు అనుభేదము లేక దీనికి లోబడుదు రనుట. కామము బ్రహ్మవిష్ణు మహేశ్వరులనుసైతము పాతాళమునకు ద్రొక్కును. విరహాగ్నితో వేచును. ఎట్టిఘోరకార్యమునైనను చేయించును. కామము తనలో ప్రాణులను ముంచుచు తేల్చుచుండును. అబ్బురమైన ఈ కామము వేంకటేశ్వరుని మాయవల్ల కల్గినదే. భక్తుడగువాడు మాయాతీతుడై నిష్కామి యగుననుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మూఁడు మూర్తులనైన | 269 | 400 | 3 | 269 |

అవ: కరచరణాదులు పట్టువదలిపోగా నరాధముల కీర్తించి ఆశలు వదలక ఇహపరసుఖము లెరుంగని బ్రతుకు నింద్య మనుచున్నాడు.

సీ. **పూఁటపూఁటకుఁ బోయెఁ బోయెఁ గాల మ్మెల్ల**
**చెయి నోరు నేడాయె సిగ్గు సిగ్గు;**
**తిప్పన్న తొప్పన్న దేవన్న బావన్న**
**వప్పన్న బొప్పన్నఁ బాడిపాడి**
**కుప్పతిప్పలునైన కోర్కులు మతిలోన**
**నెపుడు వాయకపోయె నెంచరోఁత,**
**కాచన్న పోచన్న కల్లప్ప బొల్లప్ప**
**బాచన్న దేచన్నఁ బాడిపాడి**
**ఇహపరసుఖముల నెది సుంత లేదాయె**
**చీచీ విఱిగినాము చెప్పరోఁత**

గీ. **అక్కటా! బుక్క తిక్క కామన్న పేరి**
**బక్క లెందఱనో నోరఁ బాడిపాడి**
**యెక్కుడగు కొండలప్పకు మ్రొక్కలేక**
**కుక్క కాటుకు చెప్పయి కూడె రోఁత.** 152

నానాటికి కాలం గడచిపోవుచున్నది. నోరు, చెయ్యి స్వాధీనం తప్పినవి. అనామకులను కీర్తించి కుప్పతిప్పలగు కోరికలను ఒకప్పుడైనను వదల కుండుట జుగుప్సాకరమైన విషయము. ఈ లోకసుఖము, పరలోక సుఖము అను నీ రెంటిలో ఏదియు కొంచెమైనను లేకపోయెను. భగ్నమనోరథుల మైనాము. చీచీ ఇట్టి బ్రతుకు రోతగదా! కొంద అధములు నీచులను గీర్తింతురుగాని సర్వాధికుడగు శ్రీహరిని గీర్తింపరు; నమస్కరింపరు. అట్టివారికి కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్టు మరల మరల సంసారమే గతియగుచున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పోయఁబోయఁ గాలమెల్ల | 33 | 296 | 1 | 137 |

అవ: వేంకటేశ్వరుని కృపవల్లనే పరమపదము లభించు ననుచున్నాడు.

**సీ. ఎంత వెలుఁగునకు నంతయే చీఁకటి**
**యెంతసంపత్తి యంతే విపత్తి;**
**ఔషధమ్మున కపథ్యమ్మునకును నరి**
**కనఁగన వేసట కడకుఁ గలది;**
**చేసినకూలికి జీతమ్మునకు నరి**
**కర్మమ్మునకును భోగమునకు సరి**
**జన్మ మెత్తుటకును జచ్చుటకును నరి**
**తలపంగఁ జివరకు నలపె కలది;**

**ఆ. మొలచుటకును మేను, ముదియుటకును సరి**
**దైవమె తనలోనఁ దలఁపఁ గలది;**
**జీవులకు వృషాద్రి శేఖరపతి కృప**
**గలుగఁ బరమపదమె కలుగఁ గలది.** 153

వెలుతు రెంతకాల ముండునో చీకటియు అంతకాలముండును. అట్లే ఎంత సంపదగల్గిన అంతపరిమాణంలో ఆపదకూడ కలుగుచుండును. వ్యాధినివృత్తికి ఔషధం సేవిస్తూ అపథ్యం చేసినచో ఆ మందుప్రభావం అపథ్యంతో నశించిపోతుంది. చివరకు అలసటయే మిగులుతుంది. కూలిపనికి తగినజీతమే లభిస్తుంది. ఆ మాదిరి ఆయాకర్మలు వాటిఫల భోగానుభవంతో తీరిపోతాయి. 'యజ్జన్యం తన్నస్యం' అన్నట్లు జన్మము మరణమే ఫలముగా కలిగియుండును. ఆలోచింపగా ఆ మధ్యకాలంలో శ్రమయే మిగులును. కలిగినశరీరం కడకు ముదిమిని పొందియేతీరును. విచారింపగా తనలోని పరమాత్మయే ఎట్టిమార్పు చెందకుండును. అయితే ప్రాణులకు వృషభాద్రినాథుని దయగలిగినచో తప్పక పరమపదము లభించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మాయా మోహము | 298 | 566 | 3 | 380 |

అవ: పుణ్యములు, ఆచారములు మున్నగునవి భగవన్నామముతో, భగవద్ధ్యానముతో సమానములు కావని వచించుచున్నాడు.

సీ. భూమిలో నెన్నియో పున్నెమ్ము లున్నవి
యాచారములకును నంతు లేదు;
సామజవరదుని సద్భక్తి నొకసారి
స్మరియించినందుకు సాటిగావు;
ఉత్తమలోక సుఖోత్కరం బున్నది
ధరణిలో నెన్నియో సిరులు గలవు;
చిత్తజగురుసేవ సేయు పున్నెమువలె
నవ్వి సత్యముగ నిత్యములు గావు

గీ. కొన్ని మతములు ముక్తులు కొన్ని గలవు
కల్పన లొనర్పు మాయలు గలవు పెక్కు;
తలఁప శ్రీవేంకటేశ్వరుదాసుల మగు
భాగ్య మిదిగల్గె భాగ్యాల భాగ్య మగుచు. 154

ఈ లోకంలో పలువిధములగు పుణ్యములు, అంతుపొంతులేని ఆచారములున్నవి. కాని ఇవన్నియు ఆ గజరాజునకు వరమిచ్చి కాపాడిన మహావిష్ణువు నొకపరి భక్తితో స్మరించుటకు సాటి కాజాలవు. అనగా పుణ్యకార్యములు, ఆచారములు అనువాటికంటెను భగవన్నామస్మరణము గొప్పదని భావము. ఈ భూమిలో బ్రహ్మాద్యనేకలోకప్రాప్త్యుపాయములు, ఐహికసంపదలు మరెన్నియో కలవు. అయినను అవి మన్మథునితండ్రియగు మహావిష్ణుసేవవల్ల కలుగు పుణ్యమువలె నిజముగ నిత్యములు గావు. బ్రహ్మాదిలోకములు, ఐహికసంపదలు అనిత్యము లనుట. ఇవిగాక మతములు కొన్ని, మోక్షములు కొన్ని కలవు. భ్రమింపజేయు మాయలును ఎన్నియో కలవు. ఆలోచింపగా శ్రీవేంకటాచలపతికి దాసులమయ్యే ఈ భాగ్యం మనకు కలిగినది. ఇదే భాగ్యము లన్నింటిలోనికి మహాభాగ్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్నిటికి నారదాదు లదివో | 275 | 431 | 3 | 290 |

అవ: అతివలపొందు అనర్థములకు కారణమని, నారాయణభక్తుడు స్త్రీవ్యామోహమును జయించునని వచించుచున్నాడు.

సీ. **అలుగులు పైఁబడ నాయముల్ దాఁకవా?**
**కలుకులచూపులు గాడకున్నె?**
**ఇల తేడుద్రొక్కిన నెండించకుండునా?**
**చెలులయిండ్లకుఁ బోవఁ జిక్కకున్నె?**
**చిచ్చు గౌఁగిటఁజేర్పఁ జిమిడింప కుండునా?**
**కలువకంటులపొందు కాఁచ కున్నె?**
**చిలువవిసము మ్రింగఁ దల కెక్క కుండునా?**
**చెలివలపు భ్రమింపఁ జేయకున్నె?**

గీ. **కడలిఁ జొచ్చిన మివుల లోఁబడకయున్నె?**
**మించుఁబోఁడులమాటలు ముంచకున్నె?**
**వాసిగా వేంకటేశ్వరుదాసుఁడైన**
**సగుటున నివెల్లఁ దమపంపు నలుపకుండు.** 155

బాణములు మీదపడగా అవి ఆయువుపట్టులందు గ్రుచ్చుకొని బాధ కలిగించును. ఆ రీతిగ వయసుకత్తెలచూపులు గుండెలో గ్రుచ్చుకొని వేధించును. తెలియక పంపుత్రొక్కినవానిని అది ఎండింపజేయును. అటులే సానికొంపల కేగువాడు వారికి లోబడకుండునా?(లేక) కృశించి పోకుండునా? చిచ్చును కౌగిలించుకొన్నచో అది చిమిడింపకుండదుగదా! ఆ విధముగనే కులటలసాంగత్యము ఉడికించు ననుట. సర్పవిషమును మ్రింగినచో అది తల కెక్కునుగదా? అటులే గణికలపైని వ్యామోహము భ్రమను గలిగించును. మానవుడు సముద్రములో దిగినచో దానిలో అణగిపోవును. అటులే మాయలాడులమాటలు అగాధములు, అపారములునై మనుజుని ముంచి వేయును. అనగా అధోగతిపా లొనర్చు ననుట. సర్వాధికుడు వేంకట విభునిదాసుడైనచో ఆ దుశ్చేష్టలు అన్నియు ఆ భక్తుని చెప్పుచేతలలో నుండును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మొదలే తెలియవలె మోసపోక | 248 | 273 | 3 | 184 |

అవ: తా నెట్టివాడో ఎదుటివానినికూడ అట్టివానిగానే మానవుడు భావించు నను చున్నాడు.

సీ. **తనలోనిపాపముల్ తన కట్టెదుటివారి**
**నిందింప పెరరేఁచు నిందితులని;**
**మతిలోనిపుణ్యముల్ మహి గన్నవారలఁ**
**బొగడింపఁ జేయును బుణ్యు లనుచుఁ;**
**బూర్వపుమరణముల్ పుట్టినతోడనే**
**యెల్లరుఁ గనఁగఁ ద న్నేడిపించు ;**
**పెల్లురేఁగి యొనర్చు పెనుకర్మనిచయమ్ము**
**నానాటికిని మేను ననిచి పెనుచు;**

గీ. **మూలమగు దేహి తప్పు లొప్పులకుఁ దానె**
**స్వర్గనరకాలు తన వావివర్తనములె;**
**చేతియందలిమోక్షమై శ్రీశుసేవ**
**కేవలమ్మొ ప్రపంచమ్ము గెలువఁ జేయు.** 156

మానవునిలో ఉండే పాపములే ఎదుటివారిని నిందితులని నిందింప ప్రోత్సహించును. తనలోని పుణ్యములే తాను చూచినవారిని పుణ్యాత్ములని పొగడుటకు ప్రేరించును. తాను జన్మింపగానే గడచిన మరణస్మృతులు ఇతరులు చూచుచుండగా త న్నేడిపించును. మిక్కిలిచెలరేగి చేసే బహుళ కర్మలు ఈ శరీరమును పెంచుచుండును. శరీరి(జీవుడు) తన మంచి చెడులకు తానే కారణ మగును. ప్రాణి స్వర్గమునుగాని. నరకమును గాని తన వావి వర్తనల ననుసరించి అనుభవించుట పరిపాటియే. ఇవి అపారములు, అనంతములు అయినను శ్రీవేంకటేశ్వరునిదాన్యము అరచేతిలోని వైకుంఠమై నిశ్చయముగాఈ ప్రపంచమును జయింపజేయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తప్పులు వొప్పులు దేహి | 259 | 341 | 3 | 230 |

అవ దేవుని నమ్మినవానిని పాపములు, నేరములు అంటవని పలుకు చున్నాడు.

సీ. **దేవుని నమ్మిన దేహి తానఁట వాని**
**నెంతపాపమ్మైన నేమిసేయు?**
**భావింప నేరాలు పరిహరించు నతండె**
**కమలాప్తునకు నంధకార మెదురె?**
**పూజగైకొనువాఁడు భువనరక్షకుఁడంట**
**తేజుతో దురితాలు ద్రెంపలేఁడె?**
**రాజు కంటెనుమతీ రాజాజ్ఞయెక్కుడా?**
**పవిహతికోపునా పర్వతములు?**

గీ. **చేతనాత్మకుఁ డఁట శేషశిఖరివిభుఁడు**
**తలఁప బడుగుజీవునికి స్వాతంత్ర్య మేది?**
**కార్యకారణములు హరికల్పితములె**
**పన్నగకులాంతకున కెందు పాము లెదురె?** 157

జీవుడు దేవుని నమ్మినవా డైనచో అట్టివానిని ఎంతటిపాపమైన నంటదు సూర్యునికి చీకటి ఎదురుకాదుగదా? అటులే ఆలోచింపగా భగవంతుడు భక్తుని పాపములను మటుమాయ మొనర్చును. భక్తునిపూజను గ్రహించువాడు సకలలోక రక్షకుడగు భగవంతుడు. అట్టివాడు భక్తుని దురితములను శౌర్యముతో తుత్తునియలు చేయలేడా? చేయగల డనుట. ప్రభువున కన్నను అతనియాజ్ఞ గొప్పదా? కాదనుట వజ్రాయుధముయొక్క దెబ్బకు ఎంతటి పర్వతము లైనను ఓర్చుకొన గలవా? ఓర్వలే వనుట. ఆ శేషగిరినాధుడు శుద్ధచైతన్యస్వరూపుడు. జీవు డన్ననొ స్వామికి దాసుడు, అస్వతంత్రుడు. లోకములోని కార్యకారణము లన్నియు దైవకల్పితములే. గరుడునికి సర్పములు ఎదురు నిలువలేవుగదా! అనగా వేంకటనాయకునికి ఎదు రేదియు లేదని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సేయనివాఁ డెవ్వఁడు | 112 | 72 | 2 | 49 |

అవ: జీవుడు కర్మబద్ధుడయి ఏడుకొండలవానిని సేవింపకున్నా డనుచున్నాడు.

**సీ. ఇటు భంగపడి వేఁడు టిందఱఁ బలుమారు**
**కుటిలదేహమ్ముఁ బెంచుటకుఁ గాదె?**
**చెలువల చూపుఘాతలకు భ్రమించుట**
**చెలఁగి మైమఱచు చేఁతలకుఁ గాదె?**
**బహుజన్మములనెత్తి పాటుపడుట యెల్ల**
**నెమ్మెల సంసృతి కింతెగాదె?**
**ఒకని గొలిచి తిట్ల కొడిగట్టు టెల్లను**
**చక్కుముక్కగు నాల్క చవికిఁ గాదె?**

**గీ. రేలుపవళులు విత్త మార్జించుటెల్లఁ**
**గ్రొవ్వి నాదని విఱ్ఱవీగుటకె గాదె?**
**కొండలప్ప సేవకుఁ జొరకుండు టెల్ల**
**బహుళకర్మమ్ములకుఁ గట్టువడియె కాదె? 158**

ఈ విధంగా భంగపడి అగపడినవారినెల్ల యాచించుట ఈ కుత్సితదేహ పోషణమునకేగదా! స్త్రీలకటాక్షములకు భ్రమచెందుట క్షణికమగు ఆనందమునకే గదా! అనేకజన్మముల నెత్తి కష్టపడుట విలాసవంతమగు ఈ సంసారమును సాగించుటకేగదా! ఎవనినో ఒకనిని సేవించి దూషణములకు పాల్పడుట నాలుకరుచికేగదా ! దివారాత్రములు విశ్రాంతి లేక ధనమును సంపాదించుట ఇదంతా నాదని అహంకారముతో నిక్కుటకేగదా! నానావిధకర్మలకు లోనగుటచేతనే మానవుడు వేంకటాచలపతి సేవకు పూన కున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఈహీ శ్రీహరి గంటే | 112 | 69 | 2 | 47 |

అవ: శ్రీ వేంకటేశ్వరభక్తునికి సర్వము కరతలామలక మనియు కర్మాదు లనవసరము లనియు తెల్పుచున్నాడు.

**సీ. విహితకర్మములు గావించుచు శ్రీహరి**
**సహజమ్ముగాఁ గొల్చు వరసునకును**
**గహనపుకర్మముల్ కడమ లయ్యెను నేమి**
**కనకాద్రికిని పైఁడి కావలయునె?**
**పలుదానముల కెల్ల ఫలమైన గోవిందు**
**బలువుగఁ జేకొన్న భక్తుఁ డెవఁడొ**
**నియమాన నాతఁ డన్నియును జేసినవాఁడె**
**భానునిఁ జూడ దీపములు వలెనె?**
**గీ. వేదవేద్యుండు వేంకటవిభునినామ**
**మాదినుండి పఠించెడి యధికుఁ డెవఁడొ**
**అన్నివిద్యలు నఱచేతి వతని కెపుడు**
**మేదినిం దిరుగాడఁగా మెట్లు వలెనె? 159**

వేదచోదితకర్మల నాచరించుచు శ్రీహరిని సహజముగా కొలిచెడి భక్తునికి కఠినములగు కర్మములు దూరము లయ్యెనుకొఱతలేదు. మేరుపర్వతమునకు బంగారమవసరముకాదుగదా! వేంకటాచలపతిభక్తుడు మేరుసమానుడు. కఠినపుకర్మలు బంగారమువంటివి. బహువిధదానములకు ఫలమైనవాడు గోవిందుడు. అతనిని ఇష్టదైవంగా స్వీకరించినభక్తుడు అన్నిదానములు చేసినవాడే అగును. సూర్యదర్శనమునకు దీపము లవసరముకావుగదా! అంజనగిరీశుడు సూర్యునివంటివాడు. దానాదులు దీపములవంటివి భక్తునికి దానము లనవసరము లనుట. వేదములచే తెలియదగిన వేంకటాచలేశుని నామజపమును తొలుతనుండియు సలుపునట్టివాడు సర్వాధికుడు. అట్టివానికి అన్నివిద్యలును కరతలామలకములు. నేలపై తిరుగాడుటకు సోపానములు అవసరములేదు గదా? అటులే శ్రీశునామజపమునకు ఇతరవిద్య లవసరములే దనుట

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్నిటా శ్రీహరిదాసు | 112 | 68 | 2 | 46 |

అవ: అవివేకియగు జీవుని నైతికపతనము నభివర్ణించుచున్నాడు.

సీ. విజ్ఞానసరణి వివేకింపఁ దఱిలేదు
భవమను పెదపౌఁజుఁ బాఱఁజూచు
చిత్తంబనెడి గొప్పసింహాసనం బెక్కి
'బహావరా' కాయె విశ్వమున దేహి;
గుత్తపుతనువను కొలువుకూటములోనఁ
బ్రకృతినాట్యమ్ము నంరక్తిఁ గాంచుఁ
బంచేంద్రియములను బలుగుఱ్ఱముల నెక్కి
యంచల దేహి వయ్యాళి దోలు
మొనయు కర్మములను ముద్ర పెట్టెలు దెచ్చి
తక్కక లెక్కించి దాచుప్రాణి

గీ. కామకోపాదిహితమంత్రిగణము తాను
దెచ్చి తలపోసికొనుచుండు తగ శరీరి;
అంతరాత్ముఁడై యుండ శేషాద్రివిభుఁడు
పచ్చిగా నాతనింజూచి భ్రమయు జీవి. 160

జీవునికి జ్ఞానమునుగూర్చి యాలోచింప నవకాశముండదు. అతడు పుట్టుకలనెడి పెద్దసేనను తేరిపాఱజూచుచుండును. మనస్సనెడి గొప్పసింహాసనము నెక్కినవాడై శరీరి బరాబరు లందుకొనుచున్నాడు. బిగుతైన శరీరమనే కొలువు కూటములో కొలువుదీరినవాడై మాయాకృతమైన నాట్యమును అనురక్తితో తిలకించును. పంచేంద్రియములనెడు బలిష్ఠము లగు గుఱ్ఱముల నెక్కి (వాటిఇచ్ఛానుసారంగా) స్వారి సాగించును. కలిగిన కర్మములనెడి ముద్రికలుగలపెట్టెలను ముందుపెట్టుకొని విడువక లెక్కించుచు భద్రపఱచును. అనగా తన కర్మఫలముల ననుభవించు చుండును. కామక్రోధాదులను హితులుగా మంత్రులుగా కలిగి వారితో ఏమేమో తరచి తరచి తలపోయుచుండును. సంసారకూపంలో సతమత మయ్యే ఇట్టిప్రాణి తనలో నంతరాత్మగానుండే శేషనగవాసుని చక్కగా దర్శించినంతనే భ్రమించిపోవును. అనగా అబ్బురపడు ననుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వివేకించ వేళ లేదు | 110 | 58 | 2 | 39 |

అవ: నిష్కామము, హరిదాస్యము, ఇంద్రియనిగ్రహము, యోగము అవశ్యకములని బోధించుచున్నాడు.

సీ. తలఁపులు గడుగక తనువు గడుగ నేమి?
విడక కోర్కులు విధుల్ విడిచియేమి?
హరిదాస్యబుద్ధి నిజాత్మలోఁ గలవాఁడు
చెలఁగుచుఁ బనులు చేసిన మతేమి?
ముదియ కింద్రియములు ముదిసియేమి శరీర?
ముడుగ కలుక భోగ ముడిగి యేమి?
భగవంతు నమ్మి నిర్భరుఁడైన నే మార్గ
మనుసరించినఁ గల్గు హాని యేమి?

గీ. యోగ మెఱుఁగక చదువుల నొక్క టొకటిఁ
గఱచియేమి? వేంకటపతి నెఱిఁగి సుఖము
ననుభవించెడు ధన్యుఁ డీ యవనియందు
నిత్యనిర్మగ్నుఁడై యున్న నేర మేమి? 161

కోరికలను క్షాళనం చేసుకొనక శరీరము నెంతశుభ్రంచేసుకున్నా ఏమి ప్రయోజనం? కోరికలను వదలవలె ననుట. కోరికలను వీడక కర్మలను వదలి ఉపయోగంలేదు. శ్రీహరిసేవాబుద్ధిగలవాడు విజృంభించి ఎన్ని కర్మల నాచరించినను దోసము కాదు. ఇంద్రియములకు ముదుసలితనం అవసరము గాని, దేహమునకు గాదు. అనగా ఇంద్రియవ్యాపారముల నరికట్టవలె ననుట. ద్రోహచింత మానక సుఖానుభవం వదలిపెట్టి ఏమి ప్రయోజనం? ద్రోహచింతనమును మానవలె ననుట. వేంకటాచలపతిని నమ్మి పరితృప్తుడై యున్నవాడు జ్ఞానకర్మభక్తి మార్గములలో దేని ననుసరించినను ఎట్టికీడును లేదు. యోగసరణిని దెలియక క్రమంగా ఒక్కొక్కశాస్త్రమును నేర్చినను ప్రయోజనం లేదు. వేంకటాచలపతిని దర్శించి సుఖియై ధన్యు డైనవాడీ జగత్తులో సంసారము నందు మునిగియున్న వాడైనను తప్పేమిటి? అనగా భక్తుడు సంసారియైనను ముక్తుడే యనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| లేదు భయము | 110 | 55 | 2 | 37 |

అవ: ఇంద్రియనిగ్రహము, నిర్మమత, సంసారము-ఇవి భక్తుడుకానివానిని పెడ దారి త్రొక్కించు ననుచున్నాడు.

సీ. **వినువీథిఁ బాఱు లేళ్ళను బండికిం గట్టి**
**వంచుకొనంగ నెవ్వానివశము?**
**చంచలేంద్రియము లేజాడఁ జిక్కును? పొంచి**
**వలపులబొండఁ గీల్కొలుపుఁ గాక**
**మండునగ్గినిదెచ్చి మసిపాఁతలోఁ గట్టి**
**యింట దాచుకొనుట హితకరంబె?**
**మమకార మెటు తన్ను మఱి సాగనిచ్చు నా**
**నలకు బంటొనరించి నలఁచుఁ గాక**

గీ. **పట్టుకొనివచ్చి తలక్రిందఁ బెట్టుకొన్న**
**త్రాచు త్రుళ్ళింత లిడక మందటిలియున్నె?**
**వెట్టసంసార మచ్యుతు వేఁడుకొనని**
**వట్టిమనుజుల పెడవాడ నెట్టుఁగాక!** 162

ఆకాశమును చించుకొని పరువెత్తే జింకలను బండికిగట్టి లొంగదీసుకొనుట ఎవరికి శక్యము? ఎవరికినీ శక్యము కాదనుట. ఆ విధముగా లేళ్ళవలె చంచలములైన ఇంద్రియము లే విధముగా వశ్యము లగును?. కా వనుట. మీదు మిక్కిలి అవి సమయము కనిపెట్టి కోరికలనే బండకొయ్యకు తగిలించును. గనగనలాడే అగ్గిని చింపి పాతలో మూటగట్టి ఇంట దాచుకొనుట ఏమిమేలు? మేలుకాదనుట. అటులే నాదియనెడు బుద్ధి తనను ఉన్నతస్థితికి పోనివ్వదు. మఱి ఆశలకు లోనుగావించి మానవుని శ్రమింపజేయును. త్రాచుపామునుతెచ్చి తలక్రింద దిండుగా నిడుకొన్నచో అది త్రుళ్ళిపడక అణగిమణగి యుండునా? ఉండ దనుట. సంతాపకరమైన సంసారము త్రాచువలె ఏడుకొండలప్పకు భక్తుడుకాని వ్యర్థమానవుని అధోగతికి నెట్టివేయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గడ్డపార మింగితే | 29 | 177 | 1 | 119 |

అవ: వెంకన్న యెదలో నున్నాడనీ, భక్తిమార్గం సులభమనీ, నామసంకీర్తనం మంచిదనీ, స్వామిసేవ తారకమనీ నుడువుచున్నాడు.

సీ. హృదయమ్ములో దేవుఁ డెనఁగంగ నిందందు
వెదకి సందియ మొందు వెకలి నేను;
జననమ్ము దుఃఖకారణమైన వాంఛింతుఁ
జేత దీపమ్ముండి నూతఁ బడుదు;
భక్తిమార్గ మ్మిటు ప్రాణుల కుండఁగా
నింద్రియమార్గాల నేగుచుందు;
హరినామముండి దైన్యమున కుందుదుఁ; జేతఁ
బరుసమ్ము గలిగియుఁ దిరియుచుందు;

గీ. ఏడుకొండలదొర సేవ కెదుటనుండ
జడుఁడనై పొర్లుచుందు సంసారమందుఁ;
గైవసమ్మయి యితఁడె న న్గాచిబ్రోవ
పూవుఁ బరిమళమును బోలెఁ బొదలుచుందు. 163

దేవుడు హృదయమందే యుండగా ఇక్కడక్కడ వెదకే అమాయికుడను. కష్టములకు పుట్టినిల్లైనను పుట్టువునే కోరుచుందును. చేత దీపమున్నను నూతబడు బుద్ధిహీనుడను. అనగా తనలోనున్న దేవుని తెలియక జననమును వాంఛింతు ననుట. ప్రాణిసామాన్యమునకు భక్తి సులభమార్గమై యుండగా దీనిని వదలి ఇంద్రియములపోకడల ననుసరించి పోవుచుందును. హరినామమును కలిగియుండియు దానిని విస్మరించి దీనత్వముతో కుందుచుందును. ఇది చేతిల్లో పరుసవేదియుండియు బిచ్చమెత్తుట వంటిది. ఏడుకొండలస్వామి నాసేవను స్వీకరింప ఎదుట నిలిచియుండగా మందమతినై సంసారములో పొరలాడుచున్నాను. అతడు నాకు దక్కి కాచి బ్రోచుచుండగా పూవును తావివలె భగవంతునితో నైక్యము చెందియుందును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎన్నఁడు మానవు | 215 | 85 | 3 | 57 |

అవ: పరమప్రపన్నుల స్థితిని కొనియాడుచున్నాడు.

సీ. హరినామజపమె సర్వాభరణమ్ములు
పరమాత్మువినుతియే పరిమళమ్ము
గోవిందుపదపద్మ సేవయే భోగమ్ము
పరములైన ప్రపన్నజనుల కెపుడు;
దేవునిధ్యానమ్ము దివ్యాన్నరాసులు
శ్రీవిభుభక్తియే జీవనంబు
విష్ణుకైంకర్యమ్మె విమలసంసారమ్ము
పావనులైన ప్రపన్నజనుల;

గీ. కఖిల మా సప్తశైలశిఖాధిరూఢుఁ;
డతని కిడు వందనమె విధి; యతనిశరణుఁ
జొచ్చినట్టి మహాత్ములే యచ్చమైన
బంధుజనములు పరమప్రపన్నులకును. 164

భక్తిరసభరితులైన భాగవతుల కెపుడును హరినామజపమే సకలాభరణములు, పరమాత్ముని కీర్తించుటయే పరిమళము (సువాసన). గోవిందుని పాదపద్మ సేవయే సుఖానుభవము. వేంకటేశ్వరునిపై భక్తియే జీవనము. స్వామికైంకర్యమే పరిశుద్ధమైన సంసారము. ప్రపన్నునికి సర్వస్వము ఆ ఏడుకొండలరాయడే. ఆతనికి జేయు నమస్కారమే తన దైనందిన కార్యము. స్వామిశరణు పొందిన భక్తులే తన కాప్తబాంధవులు. ప్రపన్ను లీ విధముగ జీవయాత్ర గడపుదురు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కామధేను విదే | 195 | 488 | 2 | 329 |

అవ: సకలప్రాణుల పంచేంద్రియము లొకేశక్తిగల్గిన వనియు, వేంకటాచలపతి యొకడే సర్వజనసేవ్యు డనియు సోదాహరణముగా నిరూపించుచున్నాడు.

**సీ. ఎల్లవారల చూడ్కు లేకమంటకు గుఱి**
**కొండ కొండయెగాక గుడిసె యగునె?**
**ఎల్లవారల రుచు లేకమంటకు గుఱి**
**తీపి తీపియగాక తిక్త మగునె?**
**ఎల్లవారల యూర్పు లేకమంటకు గుఱి**
**కర్పూరమృగమదగంధ మొకఁడె?**
**ఎల్లవారల విన్కి యేకమంటకు గుఱి**
**దీవన దీవన తిట్టు తిట్టె**

**ఆ. ఎల్లవారిచిత్త మేకమంటకు గుఱి**
**పవలు పవలె రేయి పవలు గాదు;**
**తిరుమలాధిపుండు దేవుఁ డంటకు గుఱి**
**భక్తకోటిపడయు బహువరాలె.** 165

అందరిచూపు లొక్కటే యనుటకు గురుతు కొండ కొండయేగాని గుడిసె యగునా? కా దనుట. అనగా కొండంత గొప్పదేవునే అందరు దర్శింతురనియు గుడిసెవంటి అల్పదేవతలను చూడరని భావము. మరియు చక్షురింద్రియమును స్వామిదర్శనమున లగింపవలె ననుట. అందరి రుచు లొక్కటే యనుటకు తార్కాణము తీపిపదార్థము తియ్యగా నుండునేగాని చేదుగానుండునా? ఉండ దనుట. భగవన్నామము అందరకును తీపియే యనియు, తదితరములు చే దనియు గ్రహింపనగును. అందఱియుచ్ఛ్వాసము లొక్కటే యనుటకు గుర్తు, పచ్చకర్పూరపువాసన కస్తూరివాసన దేని కది వేర్వేరుగా నుండుటే. అనగా భక్తు లెల్లరు స్వామియొక్క నిర్మాల్యముల వాసనచూతురుగాని ఇతరముల నాఘ్రాణింప రనుట. అందరిశ్రవణములు ఒకతీరైనవే యనుటకు సాక్ష్యము దీవన దీవనగా తిట్టు తిట్టుగా అలించుటయే. స్వామికథలు దీవనలు; ఇతరములు తిట్లవంటివి. అందరిమనను ఒకరీతిదే యనుటకు చిహ్నము పగటిని పగలుగనే గుర్తించుచున్నదిగాని రాత్రిని పగలుగా గుర్తింపదు. అనగా కొండలప్ప పగటివంటివా డనియు పెరలు అంధకారతుల్యులని భావము. పైవిధముగా తిరుమలేశు డొకడే దేవు డనుటకు గుర్తు భక్తజనము శ్రీవారివల్ల పొందునట్టి వరములే. 'కలౌ వేంకటనాయకః' అను సూక్తిని భక్తుడు దృఢీకరించుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మరియు నొక్కఁడే గురి | 191 | 467 | 2 | 315 |

అవ: మనోనిగ్రహముయొక్క ఆవశ్యకతను వెల్లడించుచున్నాడు.

సీ. మానస మ్మింద్రియాధీన మైన యెడల
జీవుండు తనుదానె చిత్తజుండు;
తనదుచిత్తమ్ము క్రోధమునకుఁ జిక్కినఁ
దలపోయ రుద్రుండు తనకుఁ దానె;
భావ ముద్యోగ ప్రపంచవశమ్మైన
బ్రహ్మాంశ మగుచును బరఁగుఁ దానె;
కనులకు లోనయి తనర రేయుఁబవలు
చంద్రుండు తానె భాస్కరుఁడు దానె;

గీ. తనబ్రదుకు గురువచనబద్ధంబునైన
ఖండితమ్ముగ నిత్యముక్తుండు దానె;
తిరుమలేశ్వరుఁ డాత్మ కధీనుఁడైన
ధరణిలో దివ్య యోగియుఁ దానె తానె. 166

మనస్సు చక్షురాదీంద్రియములకు లోనైనచో జీవుడు తనకుదానే మన్మథుడై కూర్చొనును. అనగా మనసునకు ఇంద్రియములు లోబడ వలయునే గాని ఇంద్రియములకు మనస్సు వశ్యము కారాదు. అట్లయినచో జీవుడు కాము డగునని భావము. తన చిత్తము కోపయుక్తమగునేని తాను రుద్రుడే యగును. కోపిష్ఠియై అహితకార్యము లాచరించు ననుట. పాటమరించిన క్రోధమును మనస్సులోనే అణచుకొనవలెనని సారాంశము. తన భావము (ఆత్మ) బహుళవ్యాపారములతో గూడిన ప్రపంచమునకు అధీన మైనచో తాను బ్రహ్మాంశమైన జీవుడుగానే ఉండిపోవును. అటుగాక ప్రాపంచిక విషయవిముఖు డైనచో తానే బ్రహ్మ మగును. రేపవళ్ళు తాను నేత్రేంద్రియాధీను డైనచో తానే సూర్యుడును చంద్రుడును అగును. ఎవని జీవితము గుర్వాజ్ఞకు లోబడిన దగునో అట్టివాడు నిశ్చయముగ నిత్యముక్తుడే. గురువునాజ్ఞ పాలించుట నిత్యముక్తిహేతు వని నిరూపితము. ఫణిగిరినాథుడు నిరంతర మాత్మలో నున్నచో అట్టిభక్తు డొకడే ఈ భూమిలో దివ్యయోగి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్నిటా శాంతుఁడైతే | 190 | 460 | 2 | 310 |

అవ: ముముక్షువగు భక్తుడు క్రమముగా పరబ్రహ్మ మగునని పలుకుచున్నాడు.

సీ. అందాఁకఁ దాఁ దానె యంత కెక్కుఁడు గాఁడు
ముందువెనుక లెంచ ముఖ్యుఁ డతఁడు
అంతర్ముఖమ్ము సేయంగ నేర్చినఁ జిత్త
మవల నాతఁడు యోగి యనఁ బరఁగును;
సదసద్విచారమ్ము సమకొనినంతట
వినుతింపఁ బడును వివేకి యంచు;
భావ మభావమ్ము బాగుగఁ దెలియఁ గై
వల్యనిలయుఁ డంచుఁ బ్రణుతి గాంచు;
తన్ను దైవము మతి దలపోయఁ గలుగ జీ
వన్ముక్తుఁ డంచును వాసి కెక్కుఁ;

గీ. మించి వైరాగ్యధనము నార్జించె నేని
చెప్పనేల? జితేంద్రియస్థిరుఁడె యతఁడు;
అంజనాచలవిభు దాసుఁడయ్యె నేని
పన్నుగాఁ దుట్టతుద పరబ్రహ్మ మతఁడె. 167

ఎవడు అతీతానాగతములను, పుణ్యాపాపములను సంసార మోక్షములను గూర్చి పర్యాలోచింపడో అంతవరకు అత డాతడు గానే మిగిలి యుండును. అనగా అజ్ఞాని యై యుండునేగాని అధికుడు కాజాల డనుట. పైవానిని విమర్శించినచో అతడు మనుజులలో ముఖ్యు డగును. అట్టివాడు మనస్సును ప్రాపంచికవిషయములలోనికి జొరనీక ఆత్మాన్వేషణ చేయుచూ అంతర్ముఖ మొనర్చినచో అపుడు యోగి అనబడును. అటుపై సత్తు అసత్తుల విచారము చక్కగ చేసినచో అతడు వివేకి యని పొగడబడును. మఱియు భావమును, అభావమును అనగా సత్యపదార్థమును, మిథ్యయగు జగత్తును సమ్యగ్దృష్టితో ఎఱిగినవాడు కాగా ముక్తియే స్థానముగాగలవాడని కీర్తి పడయును. తానె దైవ మను బుద్ధితో నుండువాడు జీవన్ముక్తు డనబడును. అతిశయించిన వైరాగ్యమనే ధనము నార్జించినవా డైనచో వానివిషయము చెప్పనేల? అతడే జితేంద్రియుడు, స్థిరుడు. అంజనాద్రీశునికి దాసు డైనచో చిట్టచివర కాతడు ఒప్పిదముగ తానే పరబ్రహ్మ మగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అందాఁకా దాఁ దానే | 189 | 452 | 2 | 304 |

అవ: ఆశను జయించుట కష్టమని నిరూపణ గావించుచు అద్దానిని నిర్జించి కొండలప్పని సేవింపగా సకలశుభము లొనగూడునని వాకొను చున్నాడు.

**సీ. వేపమ్రానికి పాలు వెనపోసి పెంచిన**
**తిక్తంబుగా కది తీపి యగునె?**
**పాయఁదీసి వెదురుబద్దలఁ గట్టిన**
**చక్కగా వచ్చునే కుక్కతోక?**
**ఎంతసెప్పినను దేహేంద్రియాల్ పోయిన**
**పోకలేగాక సద్బుద్ధి గనునె?**
**మానక నీటిలో నానఁబెట్టిన నైన**
**నెత్రతి గొడ్డలి మెత్తపడునె?**
**పంచపాతకముల బారిఁబడ్డ మనస్సు**
**దంచి చెప్పిన వంగి దారిఁ జనునె?**

**గీ. కూర్మితోఁ దేలు కొనివచ్చి కోకలోనఁ**
**బెట్టుకొన నూరకుండునే కుట్టుఁగాక;**
**అట్టి బాధించు నాశను మట్టుపెట్టి**
**వట్టి కొండప్పఁ గొలువ శుభంబు గలుగు.** 168

వేపచెట్టున కెన్నిపాలుపోసి పెంచినను చేదుగా నుండునుగాని తీపిగా మారదు. కుక్కతోకను వంపు సవరించి వెదురుబద్దలతో కట్టినను అది తన సహజవక్రతను మానదు. దేహమందలి యింద్రియములను ప్రయత్నించి అదుపులో పెట్టినను అవి తమ విషయములబారిబడి వరువిడునుగాని ఆముష్మికమార్గము వైపునకు మరలవు. కఠినమైన ఇనుపగొడ్డలిని ఎంతకాలము నీటిలో నానబెట్టినను అది మెత్తపడదు. స్వర్ణస్తేయము, సురాపానము, బ్రహ్మహత్య, గురుపత్నీగమనము- ఇవి నాల్గుచేయువారితోడి సహవాసము అను మహా పాతకముల కలవాటుపడినమనస్సు ఎంతగా కొట్టి (నిర్బంధించి) చెప్పినను అది లోబడి మంచిదారిలో పయనించదు. ప్రీతితో తేలునుబట్టి తెచ్చి తన కట్టుగుడ్డలో బెట్టుకొన్నచో అది కుట్టకమానదు. అనగా పైవన్నియు తమ నైసర్గికగుణములను మాన వనుట. ఆ రీతిగా బాధాకరమగు ఆశను మొదలంట త్రుంచివైచి వేంకటేశ్వరుని జేరి సేవింపగల్గినచో క్షేమ మొదవును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భారమైన వేఁపమాను | 47 | 287 | 1 | 192 |

అవ: జ్ఞాని అజ్ఞాని-వీరి హెచ్చుతగ్గులను తెల్పుచున్నాడు.

సీ. అనలమ్ము నర్కుండు నన్నింట వెలసినఁ
బావను; లట్లె పావనుఁడు జ్ఞాని
బంగార మది యంటువడిన నింద్యము గాదు
ముట్టంటువడ పెంచు ముట్ట రాదు;
జ్ఞాని నంటదు పాపచయము నల్పవనైన
నజ్ఞానిఁ బైకొను నాచరింప;
నావంతయేని జిడ్డంటునా నాలుక?
కటుగాక చేతికి నంటుఁగాక;
కణుదులయోగికిఁ గర్మమ్ము లంటునా?
గొనకొని జడుఁ జుట్టుకొనునుగాక;

గీ. అంటునా తామరాకును నంబువటలి?
యటులుగా కన్యవస్తుల నంటుఁగాక ;
వేంకటేశ్వరదాసుఁడు విశ్వధాత్రి
దేనిఁ గామింప మాయకు లోనుగాఁడు. 169

అగ్ని సూర్యుడు ఎట్టి అపవిత్రస్థలములం దున్నను వారు పవిత్రులే. అట్లే జ్ఞానియు పవిత్రుఁడు. బంగారమును అంటరానివా డంటినను అది శుచియే. కాని ముట్టుత ముట్టిన కుండ పెంచిక అపవిత్రము. దానిని తాకరాదు. అట్లే జ్ఞానియగువాడెన్ని పాపకార్యము లాచరించినను వానిని పాప మంటదు. కాని అజ్ఞాని పాపముల నాచరించినచో పాపఫల మతనిని చేరును. తైలపక్వము లెన్ని తిన్నను నాల్కకు జిడ్డు అంటుకొనదు. కాని చేతికి తప్పక అంటుకొనును. ఈ రీతిగనే నిపుణుడగు యోగిని కర్మలు పట్టుకొనవు. మూఢునిమాత్రము ఆ కర్మములు బంధించును. నీటిబిందువులు ఇతరవస్తువుల కంటుకొనునేగాని తామరపాకున కంటవుగదా! ఆ మాదిరి శ్రీ వేంకటేశ్వరునిభక్తుడు ఎట్టికామనలకు లోనైనను మాయలకు లోనుగాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అనలము సూర్యుఁడు | 188 | 445 | 2 | 300 |

అవ: శ్రీపతిని శరణుజొచ్చుటయే సర్వశ్రేయమనీ, సిద్ధు లన్నిటికీ ఇదియే ఫలమని వక్కాణించుచున్నాడు.

సీ. సిద్ధు లెల్లను హరి సిద్ధింపుటే; శ్రీశు
శరణుఁ జొచ్చుటయెపో పరమపదము;
గణుతింపఁగాఁ బరకాయప్రవేశమ్ము
పరమాత్ముపై నాత్మఁ బఱపుటె యగు;
వడసెడు ఖేచరత్వమ్ము వైకుంఠుని
హృదయాంబరమున స్మరించుటె యగు;
తనకైన దూరశ్రవణ మచ్యుతుని నామ
మాలకించుటె విబుధాళివలన ;
షట్కమలమ్ముల జలజాక్షు ధ్యానమ్ము
దూరగమన మింట దొరకుటె యగు;

గీ. అనిమిషత్వమ్మునందుట యవ్యయాత్ము
సొరిది లోచూపుతోడఁ జూచుటయ దలఁప
శ్రీనివాససేవకుఁ డౌట వేనవేలు
తత్త్వవిజ్ఞానవిధులఁ దాఁ దనరుటె యగు. 170

సిద్ధు లన్నియు శ్రీహరిని జేరుటకే. శరణాగతి నందుటయే పరమపదము. ఆలోచింపగా పరకాయప్రవేశ విద్యగఱచుట యన్నది పరమాత్మలో ఆత్మను ప్రవేశింపజేయుటయే యగును. అనగా ఆ విద్యను పరమాత్మలో ప్రవేశించుటకు వినియోగింపదగు ననుట. ఆకాశగమన మనగా వికుంఠుని తన హృదయాకాశమున దలంచుచుండుటయే యగును. దూరశ్రవణవిద్య అచ్యుతుని నామమును విజ్ఞులవల్ల వినుటయే. మూలాధారాదిషట్కమలములందు శ్రీవేంకటేశ్వరుని చింతించుటయే దూరగమన మను సిద్ధి యగును. రెప్పపాటులేమిని (అనిమేషత్వము-దివ్యత్వము) పొందుటనగా నాశరహితుడైన ఆ పరమాత్ముని లోచూపుతో తనలో జూచుటయే యగును. శ్రీనివాసపదసేవకు డగుటయే పరమాత్మతత్త్వ విజ్ఞానమునకు సంబంధించిన విధులతో తా నొప్పియుండుటయే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| శ్రీపతి నీవు సిద్ధించుటే | 155 | 258 | 2 | 173 |

అవ: కామాదులు నశింపవలె నన్నచో సత్త్వగుణ మావశ్యక మనియు, ఆ సత్త్వగుణము శ్రీపతిదయతో తానై తన్ను జేరవచ్చు ననియు నుడువు చున్నాడు.

సీ. తిన్ననే విషమెక్కు తిన్నగ విషలత
కన్నచో వలపెక్కు కామినులను;
అంటి కౌఁగిటియందు నలమికొనిన మంట
గలసినభ్రమ మాన వలనువడదు;
మెట్టినఁ గఱచును మెలపుతోడుతఁ బాము
పట్టిన విడువదు పసిఁడిముక్క;
దట్టమ్ముగా మేనఁ దగులుకొన్న నగలు
వెళ్లఁబోయినయాన విడిచిపెట్ట;
ఆ. దట్టి తొలఁగు భూత మాహార మిడినంతఁ
బ్రోదిగాంచుఁ బ్రాయ మోదనమున;
గరుడశైలవిభుఁడు కరుణింపఁ దనుతానె
పాయ మగుచు వచ్చు సత్త్వగుణము. 171

విషలతను తిన్నచో విషము క్రమముగా శరీరమున వ్యాపించును. స్త్రీలను జూచినంతనే ప్రేమవిషము సర్వాంగముల నలముకొనును. మఱియు ఆ మగువలను స్పృశించి గాఢముగా కౌగిలించుకొన్నచో బుగ్గైన ఆ భ్రమ వదలుటకు శక్యముగాదు. పామును త్రొక్కినచో అది కఱచును. కాని బంగారపుతునుకను పట్టుకొన్నచో అది చేతిని వదలి పెట్టదు. అనగా దానిపై మమకారము వీడలే మనుట. అటులుండగా శరీరమునిండుగ ఆభరణములను తగిలించుకొన్నచో ఆ పాడైనయాశ మనలను వదలిపెట్టదు. దయ్యమునకు కోరిన యాహారము నొసగినచో అదివట్టినవానిని విడిచిపెట్టి వెళ్ళిపోవును. కాని ఆహారమువలన వయోమదము విజృంభించును. (సాత్త్వికాహారము గొనవలెనని బోధ.) పైని చెప్పినవి దుష్టజములు గాన ఏడుకొండలరాయని శరణుజొచ్చి వానికరుణకు పాత్రు డగుచో సత్త్వగుణము తానై భక్తు నావహించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మనసులో మర్మమై | 151 | 238 | 2 | 159 |

అవ: కన్నులు చెవులు నాల్క వీనిని భగవద్దర్శన కథా శ్రవణనామోచ్చారణము లందు లగ్నము గావించినచో పరమార్థము పడయగల్గుదు వంని ఉపదేశ మొనర్చుచున్నాడు.

సీ. కన్ను లనెడి పాపకర్మమ్ము లివిరెండు
పన్ని యన్నింటిపైఁ బాఱుచుండు
మున్నె శ్రీహరిపాదముల మీఁద నిలిపిన
నన్నిపున్నెమ్ములు నపుడె గలుగు;
వీను లనెడి రెండు వెడనరకమ్ములు
పరనింద లాలించి మురియుచుండు
నారాయణునికథల్ నానాఁట వీనిలోఁ
బూని నించినఁ బుణ్యభోగ మిచ్చు;

గీ. అన్యగుహను జిహ్వయను నాగుఁబా మొండు
నిక్కి యనృతవిషము గ్రక్కుచుండు;
స్వామి వేంకటేశనామామృతము నింప
నాత్మశుభము లొనఁగు ననుదినంబు. 172

పాపపుపనులు చేసే ఈ రెండుకన్నులు అన్నింటిపైకి పరుగెత్తుచుండును. మొదటనే వాటిని శ్రీనివాసునిపాదములందు నిలిపినయెడల ఆ క్షణంలోనే సకలపుణ్యములు సమకూడును. రెండుచెవులు నరకమునకు కారణములు. ఏలనగా అవి పరనిందలను వినుచు ఆనందించును. వాటియందు పూనికతో క్రమంగా నారాయణమూర్తికథలను నింపినచో ఆ కథలు పుణ్యానుభవములను కలిగించును. నోరే ఒక బొరియ. అందులోనినాలుక ఒకపాము. అది వెలికివచ్చి అబద్ధమనే విషమును గ్రక్కుచుండును. అటుగాక ప్రభువగు శ్రీవేంకటేశుని నామమనే అమృతమును ఆ నాలుకపై నింపినచో ఆత్మసుఖమును కలకాల మిచ్చును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మనసొకటి కోరికలు | 274 | 426 | 3 | 287 |

అవ: వృషభాద్రీశుని ధ్యానింపనిచో ఆశానంసారశరీరములకు అంతములే దనుచున్నాడు.

సీ. తొల్లిటి కర్మంబు తోడ్తోడఁ గుడువనే
తనువును జీవుండు తాల్పుటెల్ల;
నొల్లననిఁ బోవ దున్నంతకాలమ్ము
మల్లాడి విష్ణువే మఱవఁ దగదు;
కోరినకోర్కికి గురిసేయుకొఱకెపో
చవిగొల్పు సంసారసంగ మిద్ధి;
నేరిచి బ్రదికెడి నెపమునఁ బోదిద్ధి
కూరిమి శౌరినే కొలువవలయు;

గీ. కొవ్వరించెడి యాసలఁ ద్రిప్పుకొఱకె
ప్రబల పంచేంద్రియమ్ముల వంత మిద్ధి;
చించినం బోదిది వృషాద్రి శేఖరపతి
నంచితమ్ముగ మననులో నించవలయు. 173

జీవుడు మునుపటికర్మల ననుభవించుటకే వెనువెంటనే శరీరమును ధరించుచున్నాడు. ఆ శరీరం వలదన్న వదలదు. కనుక దేహ మున్నంతకాలము పెనగులాడియైనను శ్రీమహావిష్ణువును మఱవరాదు. రుచు లూరించే ఈ సంసారసంబంధము కోరినకోరికల నీడేర్చుకొనుటకే యగుచున్నది. నైపుణ్యముతో బ్రతుకుట అనే వ్యాజముతో ఈ సంసారమును నశింపజేయ నలవిగాదు. సంసారనాశమునకు ప్రీతితో శ్రీశుని సేవించవలయును. బలవంతములగు పంచేంద్రియములు పంతగించి అతిశయించే ఆశలలో త్రిప్పుచుండును. అది సులభముగా పోదు. అయితే పైవానిని బాపుకొనుటకు వృషభాచలాధిపతిని ఒప్పిదముగా మనసులో నుంచుకొనవలయును. ధ్యానింపవలెనని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తీరుచు నతఁడే | 230 | 459 | 3 | 309 |

అవ: హరినామము పరమార్థప్రదమని జీవరక్షకమని సర్వాధికమని సర్వాభిలషణీయమని నుడువుచున్నాడు.

సీ. పరహరినామమ్ము నాల్కపై నుండంగఁ
బర మొకరి నడుగఁ బని యిఁ కేల?
చిరపుణ్య మయ్యదే జీవరక్షక మదే
నరగఁ గాచును నొక్కసారి నుడువ;
మానసవీథిలో మాధవుఁ డుండంగ
వెనుకొని యొక్కచో వెదకనేల?
కొనకుఁగొన యదియె కోరెడి దయ్యదే
తన్నుఁ దా రక్షించుఁ దలఁచుమాత్ర;

గీ. శేషగిరివిభుండు చేరువ నుండంగ
భావకర్మములకు భ్రమయనేల?
దేవుఁడును నతండె తెరువును నయ్యదే
కావకుండఁబోఁడు కావలెనన. 174

నృసింహస్వామినామము నాలుకపై నుండగా పరమార్థమును పరుల నర్థించుటెందుకు? ఆ నామమే దాని నొసంగు ననుట. ఆ నామము చిరపుణ్యఫలముగా నబ్బు నట్టిది. ఒకపరి ఆ నామమును ఉచ్చరించినచో అది రక్షించును. హృదయాకాశములో రమాపతి నివసించుచుండగా ఇటునటు వేఱొకచో వెదకు టెందుకు? మనసులోని దేవుని తెలియు మనుట. సర్వోత్కృష్టమైనది, సకలజనులు కోరునట్టిది ఆ దేవుని ధ్యానించుటయే. తలచినంతనే అతడు తన్ను రక్షించును. శేషాచలాధిపతి దగ్గరనుండగా జన్మకర్మము లనెడి భ్రాంతి ఎందుకు? అనగా స్వామినామస్మరణంచేత జన్మకర్మలు నశించు ననుట. ఆ నామమే దైవము. ఆ నామమే దైవసన్నిధికి గొనిపోవుమార్గము. ఆత దనుకొన్నచో నామస్మరణముచేత ప్రీతుడై జీవుని తప్పక కాపాడును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మునుల తపము నదె | 283 | 477 | 3 | 321 |

అవ: గోవిందునిభక్తి అనే నావలేక సంసారమును దాటుటకు ఎవ్వరికినీ సాధ్యము కాదని నిర్ద్వంద్వముగా పలుకుచున్నాడు.

**సీ. చింతార్ణవమునకుఁ జిత్తమే నీరమ్ము**
**పరికింపఁ బుణ్యపాపములె దరులు;**
**గగనమంటెడు తరంగములు బల్ కోరికల్**
**తండుముం డగుటయే దాఁటలేరు;**
**ఆపదల్ సంపద లందలిమకరముల్**
**కైయొత్తు లరయంగఁ గాఁపురములు;**
**చపలగుణమ్ములు సరిఁజొచ్చు నేఱులు**
**దావుదండ గొనియు దాఁట లేరు;**

**గీ. పోలికకు నుబ్బునగ్గులు పోటుపాటు;**
**బలువయిన యాశయే ఘోరబాడబాగ్ని;**
**నాగనగనాథు సద్భక్తినౌక లేక**
**తఱుఁగు మొఱఁగుల నెవ్వారు దాఁటలేరు. 175**

చింత అనేది సముద్రం. చిత్తమే అందులోని జలము. పుణ్యపాపములే దాని యీవలావలి గట్టులు. ఆకాశాన్ని అంటే కోరికలే దానితరంగాలు. ఇందులో జిక్కి సతమత మగుటయేగాని దీనిని ఎవ్వరును దాటలేరు. ఆపదలు సంపదలు అందులోని మొసళ్ళు. కాపురములు అనునవియే తెడ్డులు. చపలములైన గుణములే ఆ సముద్రములో ప్రవేశించే నదులు. అంచులు చూచి, ఆధారము గొనియు దీనిని దాటలేరు. పోల్చిచూడగా కష్టసుఖములే ఇందులోని ఆటుపోటులు. ప్రబలమైన ఆశయే భయంకరమైన బడబానలం. శేషాచలపతిమీది భక్తి అనే నౌక లేకున్నచో ఎవ్వరు ఈ సముద్రమును దాటలేరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరిభక్తి వోడ | 110 | 56 | 2 | 38 |

అవ: జీవుని యవివేకమును భక్తుడు తెలియజెప్పుచున్నాడు.

సీ. ఏడుమడఁకలతో లింతయుఁ దూటులై
గాడఁ బెట్టుచుఁ జీము గాఱగాను
బాపురే! యిందులో బ్రదుకుఁగోరెడి ప్రాణి
వీడఁదన్నుకచను వెరవు గనఁడు;
కడుపులో నిండిన కష్టమ్ము నలుగడ
వెడలుచు ముఱికిని వేయఁగాను
ఇడుమఁ బొందుచు సుఖం బిందులో వెదకెడి
తనువు మోవఁగనోప ననఁగ లేఁడు;

గీ. ఉదకమయదృక్కు లన్నింటి నుఱికి కనుచు
మదవికారమ్ము మతికిని మరపఁగాను
జీవుఁడిది యెంచి శేషాద్రిదేవుఁ గాంచి
నదమలానందరుచి నొంద నమకొనండు. 176

ఈ శరీరము ఏడుపొరలు గలిగినది. అంతయు తూంట్లబొంత. దీనిలో వ్రణము లేర్పడి చీము కారుచున్నను ఆహా! ప్రాణి ఈ శరీరంలోని బ్రతుకునే కోరుచుండును. జుగుప్సితమైన యిట్టిశరీరమును వదలి ముక్తిపొందే ఉపాయ మాలోచింపడు. కడుపులో నిండియున్న ఆహారము మలమూత్ర రూపమున మాలిన్యమును వెలికి నెట్టుచున్నను ప్రాణి కష్టము లనుభవించుచునే ఈ శరీరములో సుఖమును కోరుచుండునుగాని దీనిని భరింపజాల ననడు. పుసులు నీరు కారు కన్నులు సర్వమును కలయజూచుచు బుద్ధికి మదమును గూర్పగా జీవుడు పైవాటిని గమనించి శ్రీవేంకటేశ్వరుని దర్శించి నిర్మలమైన ఆనందమును చవిచూచుటకు పూనుకొనడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏఁటివిజ్ఞాన మేఁటిచదువు | 13 | 77 | 1 | 53 |

అవ: మూర్ఖుని దారికిదెచ్చుట శ్రీనివాసునకుదప్ప అన్యుల కశక్య మనుచున్నాడు.

సీ. త్రాడి నెక్కెడువాని మూడిఁబట్టి పయికిఁ
దోఁతోడ నెందాఁకఁ ద్రోయవచ్చు?
కాడ్పడ్డ చిత్తంబు కలకాల మిటు లాడి
కలకు లోనై తృప్తి గనకపోయె;
మన్నుదినెడి దూడ మాను మంచును మొత్తి
కన్నిడి యెందాఁకఁగాయవచ్చు?
నన్నపుటాసల చణిఁబడ్డ తను విది
కన్నపుఁజూపులఁ గట్ట దాయె;

గీ. త్రొక్కకుము హేయ మనఁగఁ దిందు ననువాఁడు
చాయకును రాక యున్నచోఁ జేయు టేమి?
మాయలాఁడు మంగేశుఁడు మచ్చుచల్ల
నతనిఁజేరె నాయాత్మ; భయంబు దీఱె. 177

తాటిచెట్టు నెక్కువానిని మరొకడు ఎంతసేపని పై కెక్కించగలడు? కొంత వరకే అని భావము. అడవిబడ్డమనసు ఎంతకాలమైనను పరనిందలపాలై తృప్తి చెందకున్నది. మనసునకు తృప్తి గల్గించుట త్రాటిమానెక్కువానికి సాయపడుటవలె దుస్సాధ్య మనుట. మన్నుతినే దూడను ఆ పని మానుమని కొట్టి ఎంతకాలము కన్నుంచి కాయవచ్చును? కాయలే మనుట. ఈ శరీరము అల్పములగు ఆశలనే చరియపై బడినది. దొంగచూపులను అరికట్ట లేకపోయినది. అనగా శరీరికి తుచ్ఛపుటాసలధికము లనియు దోషాన్వేషణపరత్వ మెక్కు డనియు తాత్పర్యము. మన్నుతినే దూడవలె దేహి ఆశలపై కురుకు ననుట. అంతేకాని కృష్ణకటాక్షమునకు పాత్రుడుకాడని భావము. మలమును త్రొక్కకు మనగా మూర్ఖుడు దానినే తిందునను. అట్టివాడు మంచిదారికి మరలకున్నచో ఏమిచేయుట? ఏమియు చేయలేమని అభిప్రాయము. మాయదారి మంగపతి మత్తుమందు చల్లగా నా యాత్మ ఆతనియందు హత్తుకొన్నది. నాభయమెల్ల తీరిపోయినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పోయెఁ బోయఁ గాలమెల్ల | 34 | 208 | 1 | 138 |

అవ: కర్మాచరణము సంసారకారణ మనియు, దైవసృష్టమగు మాయ ప్రాణిని కోరికలతో కట్టివైచుననియు, భోగానుభవముచే తృప్తి కల్గ దనియు, శ్రీనివాసస్మరణ లేక సంసారము నశింప దనుచున్నాడు.

**సీ. చంప నొల్లకకదా సంసార మనియెడి**
**గంపమోపు గడించెఁ గర్మచయము;**
**లంపటు విరియింప లావు చాలక తుదిం**
**దింప కొంతేనియుఁ దెంపు లేదు;**
**మనుపనోపకకదా మాయావిడంబన**
**గనుమూసి దైవమ్ము కట్టెఁ గాంక్ష;**
**దినభోగములు వీడ తెఱఁ గేమిటను లేమి**
**తనివి నొందింపంగఁ దరముగాదు;**

**గీ. తెలుపనోపకకద వృషాచలవిభుండు**
**బహుళవేదనలన్ వేచెఁ బ్రాణికోటి;**
**పటుతరాజ్ఞానతిమిరమ్ముఁ బాసి యితనిఁ**
**దలఁచి కాని భవాంబుధి దాఁటరాదు.** **178**

కర్మలసముదాయము ప్రాణిని చంపలేక సంసారమనే గంపబరువును నెత్తి కెత్తినది. ఆ సంసారపులంపటను తొలగించుకొనుటకు శక్తి చాలదు. దానిని బాపుకొను సాహసమును లేదు. అనగా భక్తి కొంచెమైనను తనలో పొటమరింపలేదనుట. కాపాడ నిచ్చలేకగదా విధి మాయచే కనులుగప్పి కోరికల కధీనం చేసెను. నిత్యానుభవములైన విభవములను వదలుటకు మార్గమే లేదు. భోగాలతో జీవుని సంతృప్తుని గావించుటసాధ్యంకానిపని. వృషభాద్రినాథుడు జ్ఞానము నను(గ్రహింపక ప్రాణులను అనేకవేదనలలో వేగించుచున్నాడు. కరడుగట్టిన అజ్ఞానమనే చీకటిని తొలగించుకొని సంసారసముద్రమును దాటుటకు శ్రీనివాసస్మరణలేక ఎవరికినీ శక్యం కాదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కటాకటా దేహంబు గాసి | 29 | 178 | 1 | 119 |

అవ: హరిభక్తి లేనివారి యగచాట్లను ప్రకటించుచున్నాడు.

**సీ. దర్పముచెడువానిఁ దరుణి కౌఁగిటఁ జేరి**
**యప్పటప్పటి కుస్సు రనిన యట్లు**
**లొప్పగు హరిభక్తి నొల్లనివాని పె**
**న్గుప్పలౌ సంపదల్ క్రుళ్ళులోన**
**నాఁకలిచెడువాని కన్నము కంచమం**
**దోకిలించుచు నేల నొలికి నట్లు**
**తేకువ హరిభక్తి తెరువు గానని వాని**
**వ్రేకపుసిరు లిల్లు విడిచిపోవు;**

**గీ. ఒడలుమాసినమానిసి నున్న చుట్ట**
**పక్కములు బడిబడినుండి పాసినట్లు**
**లంజనగిరీశుఁ దలఁపనియట్టి వాని**
**నడరుబుద్ధులు పగఁబూని యలఁచి కలఁచు. 179**

పురుషత్వములేనివానిని యువతి కౌగిటబట్టి నిరాశచెంది నిర్వేదముతో నిట్టూర్పు వదలిన విధముగా ఒప్పిదమగు హరిభక్తి నంగీకరింపనివాని బహుళములగు సంపత్తులు లోలోననే క్రుళ్ళిపోవును. ఆకలిలేనివాని కిడిన అన్నము కంచములో రోతపడి నేలపా లగురీతి ధైర్యముతో హరిభక్తిమార్గం అనుసరింపనివానిసిరులు అధికము లైనను జారిపోవును. శరీరం మురికితో కంపుకొట్టుచుండగా దగ్గరి చుట్టములు కూడా దరికి చేరనీయక వదలి దూరంగా వెళ్ళిపోదురు. ఆ విధముగానే అంజనాచలపతి స్మరణలేని వాని దుర్బుద్ధులు వానిపై పగబూని శ్రమ కలిగించి కలచివైచును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ముచ్చుఁ గన్నతల్లి | 39 | 240 | 1 | 161 |

అవ: జీవు లంద ఱొకటేయనీ, వీరి నానాచేష్టలు తిరుమలయ్యకు వినోదకారణములనీ పలుకుచున్నాడు.

సీ. నేర్చి బ్రదుకువారు నేరక వీఁగువా
రేరీతిఁ బరికింప నెవరులేరు;
తీరుగ తమలోని దేవుఁడు పెరరేఁచ
మేరతో జీవులు మెఱయుచుండ్రు;
కడుగొప్పజీవులు కడు చిన్న జీవులం
చెందుఁ జూచిన భూమి నెవరు లేరు
బొందులు వేఱుగాఁ బుట్టించె దేవుఁడే
యందాలు సేయఁగ నమరుచుండ్రు;

గీ. అసురకాణాచి సురకాణయాచివార
లెటు విచారించ జీవులం దెవరు లేరు ;
తిరుమలేశుండు వెన వినోదించినట్లు
క్షితితలమ్మునఁ గానవచ్చెదరు వీరు. 180

జీవులలో కొందఱు నైపుణ్యముతో బ్రతుకువారనీ, మరికొందఱు అసమర్థతతో జీవించువారనీ ఎంత ఆలోచించినను ఎవరునూ లేరు. అనగా అందరిబ్రతుకులు సమానమే. తమలో నున్న పరమాత్మ ప్రేరణచే వా రావిధముగా నడతురు. వారి ప్రవర్తనకు దైవప్రేరణయే కారణమనుట. ఈ భూమిలో కొందఱు గొప్పజీవులనీ మరికొందఱు అల్పజీవులనీ ఎట్టు లాలోచించినను ఎవరునూ కానరారు. కాని ఈ జీవులశరీరములను దేవుడు వేరువేరుగా సృజించి అందచందా లమరింపగా భిన్నభిన్నముగా భాసించు చుందురు. కొందఱు అసురసంపత్తికి చెందినవారనీ, మరి కొందఱు దైవసంపత్తికి చెందినవారనీ ఎంత విచారించినను జీవులం దెవ్వరునూ లేరు. తిరుమలయ్య వినోదం కోసము ఈ నేలపై వీరీవిధముగా ప్రవర్తించుచున్నట్లు కానబడు చున్నారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వట్టిస్వతంత్ర మిందులేదు | 243 | 243 | 3 | 164 |

అవ: హరిస్మరణలేక ఇహభోగాలకు లోనైనవారిని గూర్చి వాపోవుచు దేవుని దయలేనిదే జన్మరాహిత్యం కలుగదని కంఠోక్తిగా పలుకుచున్నాడు.

సీ. నరజన్మమెత్తి నానాభోగములఁ జొక్కి
హరి నెఱుంగక మత్తుఁ డగుచునుండు
సుకృతఫలమ్మున సురలోకముం జొచ్చి
గరిమ విజ్ఞానమార్గము దెలియఁడు ;
పెక్కుగాలమ్ము జీవించి కోర్కులఁ జిక్కి
యచ్యుతుఁ గొలువక యలసుఁ డగును;
ఘనతప మ్మొనరించి గణుతికెక్కి పరమ
తత్త్వంబు దెలియక తత్తఱించు ;

ఆ. వేయిబుద్ధు లెఱిఁగి వేడ్క సంసారియై
శ్రీనివాసుఁ గనక చింతఁ గుందు;
దైవ మతఁడు తన్ను దయఁజూడ కున్నచో
భవము వాయుటెట్లు పాపజీవి? 181

మానవుడై పుట్టియు భక్తి లేక భోగపరవశుడై మదించినవాడై యొకడు తిరుగుచుండును. మఱియొకడు యాగాదులుచేసి ఆ సుకృతమునకు ఫలంగా పునరావృత్తి గల స్వర్గమును జేరును. అంతేకాని గొప్పగా జ్ఞానమార్గమును గ్రహించలేడు. పెక్కుసంవత్సరములు బ్రతికియు కోరికలవలలో తగుల్కొని స్వామిని సేవింపక సోమరిగా కాలం గడపును. మరొకడు గొప్పగా తపస్సిద్ధిని పొంది సిద్ధులువడసి ప్రసిద్ధుడై యుండునుగాని పరతత్త్వమును దెలియుటలో క్రిందుమీ దగును. బహుళశాస్త్రములు చదివియు ఎంతయో తెలివితేటలను సంపాదించియు సంసారమందు వ్యామోహము కలవాడై చింతలతో కుందుచుండును. దైవమైన శ్రీనివాసుడు దయతో తన్ను చూడకున్నచో పాపపుజీవి ఎడతెరపిలేని పుట్టువుల పరంపరలను ఎట్లు వదలించుకొనగలడు? దైవకృపలేక మోక్షం ప్రాప్తించ దనియు, అజ్ఞానము వీడ దనియు సారాంశము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎన్నఁడు వివేకించే | 236 | 204 | 3 | 137 |

అవ: హరిదాసుల మహిమను ఉగ్గడించుచున్నాడు.

సీ. ముక్కోటితీర్థాలు మురరిపుదాసుల
యొక్క పాదాంగుళి నొలుకుచుండు
జపములు తపములు శరణాగతుల దివ్య
కరుణాకటాక్షాలఁ గాఁపురించు;
చేయు పుణ్యఫలాలు శ్రీవైష్ణవుల చేత
రాసులై యిటు నటు రాలుచుండు;
అతులవిజ్ఞానార్థ మదిగో ప్రపన్నుల
భాసురాధరములఁ బల్లవించు;

గీ. దేవతాతతినుండి సాధించువరము
లెల్ల హరిభక్తులే వెదచల్లుచుంద్రు;
వేంకటాద్రీశు మహిమలు వీరి సరస
సల్లపనముల సతతంబు జాలువాఱు. 182

ముక్కోటితీర్థములు మురాంతకుని దాసులైనవారియొక్క అడుగువ్రేళుల అంచులలో తొణికిసలాడుచుండును. జపతపాలు శరణాగతి పొందినవారియొక్క దయామయమగు క్రేగంటిచూపులలో కాపురముండును. అనేకపుణ్యముల ఫలములు విష్ణుదాసులచేతులనుండి ఇటునటు రాలుచుండును. పుణ్యఫలమును హరిదాసు లిత్తు రనుట. అల్లదిగో చూడుము. ప్రపత్తి చెందినవారి పవిత్రమైన పెదవులపై సకలవిజ్ఞానసారము చిగిరించుచుండును. విజ్ఞానసారమును వారు బోధింతు రనుట. దేవతల వల్ల మానవులు సాధించే వరములను హరిభక్తులే వెదజల్లగలరు. హరిదాసులు దేవతాసమాను లనుట. వేంకటాచలపతిమహిమలు ఈ దాసుల రసవంతమగు సంభాషణములలో స్రవించుచుండును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎందు వెదకనేల | 278 | 450 | 3 | 303 |

అవ: తోలుతిత్తివంటి దీ శరీరస్థితి అస్థిరమనీ, సర్వమూ విష్ణుమయమని
విజ్ఞాను లెఱుంగుదురనీ నుడువుచున్నాడు.

సీ. ఎదుట నెవ్వారులే రింత విష్ణుమయమ్మె
హరిదాసవర్గమా నరుల కెల్ల;
ముచికుందవరదుని మూర్తులే జగమెల్ల ;
నతనినామమ్ములే యక్షరములు ;
పాఱెడునదులు గోపతి పాదతీర్థమే ;
తత్పాదరేణువే ధరణియెల్ల ;
మురహరుకైంకర్యములె సర్వకర్మమ్ము ;
లతనిప్రసాదమే యన్నిరుచులు ;

గీ. హృదయభావమ్ము లా వేంకటేశ్వరుండె;
వాని దుస్తరమాయయే ప్రకృతియెల్ల ;
నితనికంటెను దలఁప లే దితర మెద్ది
తిత్తిబ్రదుకునెఱుంగు సుధీవరులకు. 183

హరిదాసులకూటమిలోనివారికి అంతయు విష్ణుమయ మనియు తదితరముగ నెవ్వరు లేరనియు తోచును. స్థావరజంగమాత్మకమగు సకలప్రపంచము ఆ ముచికుందునికి వర మిచ్చిన విష్ణుదేవునిమూర్తియే అనిపించును. అకారాదిక్షకారాంతమగు వర్ణసమామ్నాయ మెల్ల ఈతని నామములే. ప్రభువగు ఆ వేంకటేశ్వరుని పాదతీర్థమే ప్రవహించు ఈ నదు లన్నియు. ఆయన పాదపాంసువే ఈ ధరణియంతయు. ప్రాణు లొనర్చు సకలకర్మలును మురాసురుని హరించిన హరియొక్కకైంకర్యరూపములే. ప్రాణు లనుభవించెడి రుచు లన్నియు ఆతనిప్రసాదమే. హృదయములో జనించు భావా లన్నియు ఆయనవే. ఈ ప్రకృతి యంతయు ఆ దేవుని దాటరాని మాయయే. ఆలోచింపగా ఈతనికంటెను భిన్న మైనది మరేదియును లేదు. శరీరము క్షణభంగుర మని యెఱిఁగిన జ్ఞానులు ఈ విషయ మెఱుంగ గలరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎదుట నెవ్వరు లేరు | 100 | 502 | 1 | 336 |

అవ: దైన్యహైన్యాదులు శరీర మున్నంతవఱకును, కోపతాపములు మన నున్నంతవరకును వదలవు. మానవుడు ప్రయత్నించి దేవుడు కావచ్చునని హితవు చెప్పుచున్నాడు.

సీ. ఈ దైన్య మీహైన్య మీ చిత్తవువికార
మీ దురవస్థలు నీ గతులును
ఈ లంపటత్వమ్ము లీ యనుబంధమ్ము
లొడలుండు దనుకను విడువఁబోవు ;
ఈ చూపు లీ తీపు లీ చొక్కులును పొక్కు
లీ చెల్మిలును బల్మి లీ చనవులు
ఈ ఘనతలు నల్క లీ హాస మీ రోస
ముల్లమ్ముగలవఱ కుడుగఁ బోవు ;

గీ. ఈ తెలువు లీ తలంపులు నీ వెరవులు
దైవకృతములు స్వకృతముల్ ; ధైర్య మూని
దైవికమునకు వగవక తన తలంపె
యగ్గలంబైన దైవంబె యగును దాను. 184

శరీర మున్నంతవరకును దీనత్వము, హీనత్వము, మానసికవికారములు, కష్టస్థితులు, దుర్గతులు, లంపటములు, బంధకములు వదలిపోవు. మన సున్నంత వఱకును చూపులు, ఆసక్తులు, తృప్తి, అతృప్తి, స్నేహము, బలిమి, చనవు, గొప్పలు, అలతలు, నవ్వులు, కోపములు వీడవు. ఈ తెలివితేటలు, కోరికలు, ఉపాయములు దైవకృతములుగాను, స్వకృతములుగాను ఉండును. దైవకృతమునకు చింతింపక ధైర్యము వహించి "దైవం నిహత్య కురు పౌరుష మాత్మశక్త్యా" యన్నరీతి స్వప్రయత్నం అధికం చేసుకొన్నచో తానే దేవు డగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తనకర్మవశం బించుక | 10 | 65 | 1 | 63 |

అవ: భగవంతునిసేవలో అందరు సమానులే యనుచున్నాడు.

సీ. హీనాధికము లింక నేడనున్నవి కాని
యందఱికి సమంబె యతనిసేవ
ననిచినభక్తి నానావర్ణములవారు
తలఁచెడి దతనిమంత్రం బొకండె ;
పూని యాతనిఁగొల్చి భువి నెట్టిజాతియు
మునుకొని పొందెడి మోక్ష మొకఁడె;
వెనుకముందఱలకు విష్ణుకింకరు లెల్లఁ
బనివడి గైకొను భక్తి యొకఁడె;
అతఁడె యంతర్యామియై యుండ నునియెడి
శ్రీవైష్ణవకులంబు చెప్ప నొకఁడె;

గీ. లేవు భేదముల్ మఱుఁగులు లేవు లేవు
ఆదియం దంత్యమందు ముక్తాత్మ లొకఁడె;
దేవుఁడైన శేషాద్రిమందిరుని చెంద
లలితశరణాగతియు నెల్లరకు నొకండె. 185

భగవంతునిసేవ అందరికి సమానమై యుండగా ఇక హెచ్చుతగ్గు లెక్కడనున్నవి? అతిశయించినభక్తితో సకలకులస్థులు జపించే భగవన్మంత్ర మొకటియే. ఎట్టిజాతికి చెందినవాడైనను ప్రయత్నముతో ఆతనిసేవించి పొందెడు మోక్ష మొక్కటియే. ఏ కాలమందైనను స్వామికైంకర్యపరులు స్వీకరించు భక్తి ఒకేతీరైనది. అతడే అంతర్యామియై యుండగా బ్రతికెడి శ్రీవైష్ణవకుల మొక్కటే. భేదములుగాని చాటుమాటులుగాని లేనే లేవు. ముక్తాత్ము లెపుడు ఒకేతీరున నుందురు. దేవదేవుడు శేషాచలాధిపునిపొందుటకు అందరును ఆశ్రయించు శరణాగతిమార్గమ్ము అరయ నొకటె.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హీనాధికము లింక | 308 | 43 | 4 | 29 |

అవ: స్వామిసేవ, ఇంద్రియనిగ్రహము, లోచూపు, ప్రాణాయామము, మనోలయము, విషయములం దనాసక్తత జీవన్ముక్తికి కారణములనీ, స్వామిచరణములు శరణ మందుట దివ్యపదప్రాప్తికి హేతువనీ నిశ్చయించుచున్నాడు.

సీ. **ఏ తపమ్ముల నేమి? యే దానముల నేమి ?**
**శౌరిసంతతసేవ జన్మ ఫలము ;**
**దేహేంద్రియమ్ముల దేహమం దణఁచుటే**
**దేహమ్ముతోఁ దాను దేవుఁ డగుట;**
**వెలిఁజూచు చూపు లోపలఁ జూచుటే దేవ**
**తలఁ దనయందును దాను గనుట ;**
**వెలికి నిట్టూరుపు వెడలనీ కాఁగుట**
**ప్రోగుచేయుట పత్తపోధనమ్ము ;**
**తలఁపును దనయంద తగ లయ మ్మొనరించు**
**టఘబంధచయము లయమ్ము సేఁత ;**

గీ. **వెనుక సంసారమందున విషయముక్తుఁ**
**డౌట మునుప జీవన్ముక్తుఁ డౌట తాను ;**
**సప్తశైలేశుపదములే శరణ మనుట**
**యనువయిన దివ్యపదము తా నపుడె గనుట.** 186

శ్రీవేంకటాచలపతిని ఎడతెగక సేవించుటే జన్మకు ఫలముగాని ఎట్టి తపస్సులు చేసినను, దానములు సల్పినను ఏమియు ప్రయోజనములేదు. ఈ శరీరముతోనే దేవత్వ మందవలె నన్నచో దేహమందలి యింద్రియములను దేహమందే అణచివేయవలెను. ఇంద్రియములను నిగ్రహింపవలె ననుట. ఇష్టదైవతములను తనలో తాను చూచుట యనగా బాహ్యప్రపంచమును జూచు చూపును లోనికి (హృదయంలోపలికి) ప్రవేశింపజేయవలెను. తపస్సనే ధనము నార్జించుట యనగా శ్వాసమును వెలికి వదలక స్తంభింపజేయుటయే. ప్రాణాయామంవల్ల తపోవృద్ధియగు ననుట. పాపపుంజమును భస్మం చేయు టెట్లనగా తలంపు లెచట పుట్టునో యచ్చోటనే వానిని లయింపజేయుటయే. సాంసారికములగు విషయములం దాసక్తి లేకుండుటే మున్ముందు తాను జీవన్ముక్తు డగుటకు కారణము. భక్తు డెప్పుడు శేషాచలపతిచరణాలే శరణమంటాడో అప్పుడే తాను అర్హమగు దివ్యపదమును చూచును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏ తపములు నేల | 312 | 68 | 4 | 46 |

అవ: ఇంద్రియాదులు ఐహికాముష్మికములు రెంటికి ఉపకరించున వైనను వాటిని ఆముష్మికమునకు మరలించి సుగతి నందుదని విజ్ఞాపించు చున్నాడు.

సీ. **నాలుకచివరనే నానారుచులు మఱి**
**నాలుకవే హరినామములును**
**పోలిక నొక్కటి భోగైకమూలమ్ము**
**నాలింపఁగా మోక్షమూల మొకటి ;**
**మనమున నయ్యెదే మగువలమోహ మా**
**మనముననే సిరిమగని చింత ;**
**భావింప నొకటి ప్రపంచైకమార్గమ్ము**
**వైకుంఠమార్గమై వఱలు నొకటి ;**

గీ. **వెలుఁగు చీఁకటు లొకనాఁడె కలిగినట్లు**
**కలిగె నివి వారువా రొడిగట్టుటకును ;**
**మహిని శ్రీవేంకటేశ్వరుమాయ యొకటి**
**చూడ నాతనిదాసుల సుగతి యొకటి.** 187

ఒక్కనాలుకయే నానారుచుల నాశించును ; హరినామసంకీర్తనమును చేయును. చూడగా భోగమునకును మోక్షమునకును నాలుక కారణ మగుచున్నది. సుగతికిమూలం నామస్మరణ మనుట. మనసునందే మగువలపై మోహమును, లక్ష్మీపతిచింతనమున్నూ కలుగుచున్నవి. రెంటికినీ ఒకమనసే కారణము. మనసున మోహమువీడి భగవచ్చింతనము కలిగియుండవలె ననుట. ఆలోచింపగా మోహము ప్రాపంచికమునకు మార్గము. శ్రీనివాసచింతనం వైకుంఠమునకు మార్గమైవరలును. ఈజంటలు – రాత్రింబవళ్ళొకనాడే కలిగిన ట్లేర్పడినవి. దాసులైనవారు దాసులుకానివారు పుణ్యపాపము లొడిగట్టుట కివి ఇట్లేర్పడినవి. మొదటిదారి శ్రీశుని మాయావిలసిత మైనది. ఇది దుర్గతిహేతువు. రెండవది ఆలోచింపగా దాసులకైన సుగతి మార్గము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పాపముఁ బుణ్యము పరగ | 337 | 218 | 4 | 146 |

అవ: చెడుగు లాచరించి కష్టములపాలైనగాని మంచిపై మనసు కలుగదను చున్నాడు.

సీ. అపరాధములు పెక్కు లాచరించినఁ గాని
పుణ్యమార్గముఁద్రొక్క బుద్ధిగాదు ;
విపరీతపాపాలు వేయి చేసినఁగాని
యణఁగి గర్వము శర ణనఁగ లేఁడు ;
పలులంపటమ్ములఁ బడి బడలినఁ గాని
పనవి నిన్నుఁ దలంప భక్తి రాదు ;
పులుసు నంజినఁగాని పుడమి మిక్కిలి తీపి
మతినెంచ నోటికి నితవుగాదు ;

గీ. నేరము లొనర్చి వెఱపు జనింపఁ గాని
చేరదు మనస్సు వేంకటశిఖరినాథు ;
లోకమాయలవలఁ దగుల్కొనినఁ గాని
ముక్తి వెదకంగ జీవుండు మునుకొనండు. 188

పలుతప్పిదములు చేసిన పిదపనే పుణ్యమార్గ మనుసరింప బుద్ధి పుట్టును.వివరీతముగా ఎన్నో పాపములుచేసి పొగ రణగినగాని శరణ మనజాలడు. నానావిధములగు శ్రమలనొంది దుఃఖించిన పిదపనేగాని ఓ వేంకటాచలపతీ! నిన్ను స్మరించే భక్తి కుదురదు. పులుపుపదార్థములు తిన్నవెనుకనే తప్ప తీపిపదార్థము నోటికి హితవుకాదు. దోషము లాచరించి భయ మేర్పడినగాని మనసు శ్రీవేంకటేశ్వరుని జేరదు. లోకములోని మాయలవలలో చిక్కి చీకాకు చెందినగాని జీవుడు ముక్తిమార్గమును వెదకుటకు ప్రయత్నింపడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరమాత్మ నాజాడ | 319 | 106 | 4 | 71 |

అవ: సస్యసమృద్ధికన్న హరిభక్తి మిన్నయనుచున్నాడు.

సీ. తొడుకు మేయఁగ రాదు తూర్పెత్తపాలివోదు
బడిబడి హరిభక్తి పంటవండ
ఒకతతి యనియులే దుడివోవ దెన్నఁడు
చెడని శ్రీహరిభక్తి చెట్టుకట్ట
వలువు దీసినఁ బోదు వాడినఁ దఱుఁగదు
కొలిచి శ్రీహరిభక్తి కుప్పసేయ
ఎలుకకుఁ దినఁగరా దేవేళఁ, జివుకదు
హరిభక్తి మనసుపాతఱను బెట్ట

గీ. కఱవునకు లోనుగాదు సుంకరికి నబ్బ
దెలమి శ్రీహరిసద్భక్తి యిల్లునిండ
నెల్లకాల మామనియెనుం డెఱుఁగునట్టి
దాసులకు హరిభక్తి సంధారణమ్ము. 189

హరిభక్తి అనెడిపైరును దొంగపశువులు మేయ లేవు. ఆ ధాన్యమును తూర్పెత్తగా తాలుగింజలు లేవు గనుక ధాన్య మంతయు కళ్ళమున గట్టిగా నిలుచును. పైరునకు అద నున్నది. హరిభక్తికి అదనులేదు. ఫలించినపిమ్మట పైరు ఉడిగిపోవును. హరిభక్తి ఆ విధముగా ఈటుపోదు. పొట్టుతీసినను, వాడినను ధాన్యము యొక్క పరిమాణం తగ్గిపోవును. హరిభక్తి ఇనుమడించునే గాని అట్లెన్నటికి తఱుగదు. హరిభక్తి యనెడి ధాన్యమును మనసనెడు పాతఱలో నుంచగా ఎలుకలు దానిని తినలేవు. ఎన్నటికిని అది ముక్కిపోదు. ధాన్యమును ఎలుకలు తినవచ్చు; ధాన్యము ముక్కిపోవచ్చు. అట్టిది హరిభక్తికి సంభవింప దనుట. హరిభక్తి నెవ్వరు హరింపలేరు; ఎన్నడును చెడదు. కాటక మేర్పడినప్పుడు ధాన్యం వ్యయ మగును. హరిభక్తి కాటకములో తఱుగదు. ధాన్య పుటాదాయమునుబట్టి సుంకము చెల్లించవలె. భక్తి ఆదాయ మెంత పెరిగినను పన్ను నెవ్వరు విధింపలేరు. హరిభక్తి నింటనింపు కొన్న జ్ఞానులకు కలకాలము ఫలసమృద్ధియే. అనగా హరిభక్తులు సర్వసమృద్ధితో ఇహపర సౌఖ్యములు చూఱగొందు రనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏకాలము నామనే | 240 | 230 | 3 | 154 |

అవ: హరిదాసులు కాఁగోరువా రవలంబించవలసిన రీతిని సెలవిచ్చు చున్నాడు.

సీ. ఆత్మలో హరిమీఁది యాందోళనమె వలెఁ
జిక్కకుండినఁ జింతసేయవలయు;
నతనిఁ జూచుటకునై యానఁ బొరలవలె
రీతి నెప్పుడు విచారింపవలయు
నిఖిలేశుకథలకు నివ్వెఱపడవలె
నాలించి యట భ్రమయంగ వలయుఁ
దాల్మిఁ దన్మహిమలఁ దలపోసికొనవలె
విడువక ధ్యానించి వెదకవలయుఁ

ఆ. జేరి వేంకటేశు సేవించుకొనవలెఁ
బరమగౌరవమును మరగవలయు
నరసి పెద్దవారినడుగుచుండఁగ వలెఁ
గేరి పాడవలయు నోరు నొవ్వ. 190

ఇతరచింతలు మాని ఆత్మయందు శ్రీహరిసంబంధమగు ఆరాటము కలిగి యుండవలయును. హరిదర్శనం కోసమై చింత సలుపవలెను. శ్రీహరి సందర్శనమునకై ఆశపడవలెను. మఱియు అందుకు దగిన విధానము నాలోచింపవలెను. సర్వమునకు ప్రభువైన ఆ దేవుని కథల కచ్చెరువందుచు విని మైమఱపు నొందవలెను. ఓర్పుతో ఆ దేవుని మహిమలను తలపోసికొను చుండవలెను. ఎడతెఱపిలేక భగవంతుని ధ్యానించుచు అతని నన్వేషింప వలయును. దగ్గరకు వెళ్ళి వేంకటాచలపతిని సేవించుకొనవలెను. పెద్దమనిషి తనము నలవరచుకొనవలెను. భగవంతునిగూర్చి గొప్పవారి నడిగి తెలుసుకొన వలెను. నోరు నొప్పిపుట్టునట్లుగా విజృంభించి దేవుని మీదిపాటలు పాడవలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నారాయణ నీదాసుల | 240 | 228 | 3 | 153 |

అవ: విష్ణుభక్తు లెదురులేక ఎల్ల విధముల చరింతురని నిశ్చయించు చున్నాడు.

సీ. ఎదురులేక చరింతు రెట్లైన వైష్ణవుల్
మదపుటేనుఁగులకు మట్టు గలదె ?
భాగీరథీనదిఁ బాప మున్నదె పుణ్య
వేదాల బొంకులు వెదుకఁ గలవె ?
అమృతరసమ్ములో నరయ చేఁదున్నదే ?
పరికింప నింగిలో నెరసు గలదె ?
చిత్రభానునెదుటఁ జీఁకటి యున్నదే ?
కలవె యీరానివి కామగవికి ?

గీ. స్వామి తిరుమంత్రమందు దోసమ్ము లున్నె ?
గురుకటాక్షంబు గల్గిన కొఱఁత గలదె?
అంజనాచలవిభు శరణాగతులకు
విరస మొక్కింత యిందందు వెదుకఁ గలదె? 191

మదపుటేనుగునకు హద్దుపద్దు లున్నవా ? లే వనుట. గంగానదిలో పాపముండునా ? ఉండ దనుట. ఎంత వెదకినా పావనములగు వేదాలలో బొంకులుండునా ? ఉండ వని భావము. చూడగా అమృతపుసారంలో చేదుండునా? ఉండదనుట. (అమృతసారమనే గ్రంథములో ఎక్కడను కటుశబ్దం, భావం ఉండదని ధ్వన్యర్థము) పరీక్షించిచూచినను ఆకాశంలో ఒక నలుసైన నుండునా ? ఉండ దనుట. సూర్యుడు ప్రకాశించుచుండగా చీఁకటి ఉండదుగదా? కామధేనువునకు ఈయజాలనివి కలవా? శ్రీహరితిరుమంత్రంలో దోస ముండునా ? గురుకటాక్షం కల్గితే ఇక కొఱత లుండునా? అంజనాద్రీశుడైన వేంకటేశ్వరుని శరణందినవారు అందరిపట్ల సరసులై యుందురేగాని ఎంతెంత వెదకినా వీరిలో వైరస్య ముండదుగదా ! విష్ణుభక్తులు మదపుటేనుగులమాదిరి ఎదురులేక స్వేచ్ఛగా తిరుగాడుచుందు రని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎదురులేక చరింతురెట్లైనా | 270 | 401 | 3 | 270 |

అవ: మనసు నరికట్టలేము. భోగాలను వీడలేము. ఇంద్రియములను జయించలేము. అట్టి మనకు తిరుమలేశుని గొల్చుటే సులువైనదారి యని ప్రబోధించుచున్నాడు.

**సీ. మనసులోపలిది మా మర్మ మెఱుఁగలేము**
**ఘనుఁడైన హరి నెట్లు కానఁగలము?**
**తనువుతో భోగాల తగులు వీడఁగ లేము**
**కర్మపాశవిముక్తి గాంచఁగలమ?**
**వడిపెట్టునింద్రియాల్ వారింపఁగా లేము**
**తొడరి సంసారమ్ము త్రోయఁ గలమ?**
**బడిబడి నానాటి బ్రతు కెంచఁగా లేము**
**మించి పరులకు బోధించఁగలమ ?**

**గీ. కొంక కాడినమాటలు గుఱుతుపెట్ట**
**లేము వేదవాక్యాలు వల్లించఁ గలమ?**
**తిరుమలేశుఁ డతండె మా దేవుఁ డంచు**
**నుందుమేగాక నీఁక వెత చెందఁగలమ?** **192**

మనసు అగోచరమై లోన నుండునది. దానిరహస్యం తెలియజాలము. ఇక ఘనుడైన ఆ శ్రీహరి నెట్లు తెలియగలము ? శారీరకసుఖానుభవములను వదలిపెట్ట లేము. ఇక కర్మపాశాలను ఎట్లు త్రెంపగలము? తొందఱగలిగించే ఇంద్రియాలను అణచలేము. మఱి ప్రయత్నించి సంసారము నెట్లు త్రోసిపుచ్చగలము? క్రమాగతమైన జీవితమునే తెలియజాలము. ఇక ఇతర్గులకు మంచి నేమి బోధించగలము? జంకులేక చెప్పినమాటనే మఱచిపోవుచున్నాము. అట్టి మనము వేదములను కంఠస్థము చేయగలమా? తిరుమలయ్య మాదేవుడని భక్తి కలిగియున్నచో పైపనులు చేయలేకపోయితిమిగదా అని చింతపడ నక్కఱలేదు.

భగవంతుని నమ్మి స్మరించుట సులభతరణోపాయ మని ఉద్బోధ.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గోవిందు దాసులమై | 295 | 549 | 3 | 369 |

అవ: తన తనువే శ్రీనివాసుడనీ, తాను తద్భిన్నుడైన స్వతంత్రుడు కాదనీ భగవదైక్యమును ప్రతిపాదించుచున్నాడు.

సీ. **తనువు గోవిందుండు తలఁపు ముకుందుండు**
**వినికియు మనికియు విష్ణుమూర్తి**
**కనుఁగొనుచూపులు కమలామనోహరుం**
**డింక జీవునిశక్తి యేడఁ గలదొ?**
**లోక మెల్లను హరి లోనెల్ల కృష్ణుండు**
**కర్మమ్ము వాక్కును కైటభారి;**
**చైతన్య మెల్ల విశ్వంభరుం డిక్కడ**
**నే ననువాఁడు తా నేడఁ గలఁడొ?**

గీ. **వెనుక నారాయణుఁడు ముందు విట్ఠలుండు**
**పుండరీకాక్షుఁడే కొన మొదలు నడుము ;**
**అంతయును శ్రీనివాసమయంబె నన్నుఁ**
**గాన నెట నాస్వతంత్రత గ్రాలు నెచట?** 193

శరీరం గోవిందుడు. ఆలోచన ముకుందుడు. వినికీ, మనికీ విష్ణువే. చూచేచూపులు కమలామనోహరుడే. ఇక హరికి భిన్నంగా జీవునికి శక్తి ఎక్కడిది? లే దనుట. లోకముల లోపల , వెలుపల కృష్ణుడే యున్నాడు. జీవుడు చేసేకర్మము, వాక్కుకూడ హరియే. చైతన్య మంతయు ఆ విశ్వంభరుడే. ఇక నే ననే మఱియొక డెక్క డున్నాడు? వెనుకవైపున నారాయణుడు, ముందుభాగమున విట్ఠలు డున్నాడు. ఆదిమధ్యాంతము లందును ఆ పుండరీకాక్షుడే యున్నాడు. సకలమును శ్రీనివాసమయముగా చూచుచున్నాను. నన్ను వేఱుగా నెచ్చటను చూచుట లేదు. ఇక నాకు స్వాతంత్ర్య మెక్కడిది? అనగా జీవుడు స్వతంత్రుడు కాడనీ, భగవత్పరతంత్రుడనీ తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంతటా హరినే కాని | 191 | 463 | 2 | 312 |

అవ: జననమరణాత్మకమైన సంసారముతో సతమత మవుతున్న జీవుని ఓదార్చుచు ఇకనైన ఆత్మలోగల వేంకటేశ్వరుని తెలిసికొన్నచో అతడే రక్షించు ననుచున్నాడు.

సీ. **ఎఱుఁగక పుట్టితి విన్ని యోనులఁ దొల్లి**
**తఱి నాయెఁబోయెను దాని కేమి ?**
**నరకమ్ములోఁ గొన్నినాళులు నానితి**
**తరవాయి దెలిసికో దాని కేమి?**
**కృతపాపపుణ్యాల వితరులఁ గొలుచుచుఁ**
**దాపముల్ పొందితి దానికేమి ?**
**సంసారమును నమ్మి జజ్జయియిన్నాళ్ళు**
**దాపులే కుంటివి దానికేమి ?**

గీ. **దగ యొదవె నీకు నాసల దానికేమి?**
**యింకనైనను హరిఁజేరు మింతెచాలు;**
**ఉల్లమున వేంకటేశ్వరుం డున్నవాఁడు**
**తగ నెఱుంగుము నినుఁబ్రోచు దానికేమి?** **194**

తెలివిలేక ఎన్నోజన్మ లెత్తితివి. ఆ కాలమున ఆ జన్మ లెత్తుట జరిగిపోయినది. అంతమాత్రాన నిరుత్సాహపడకుము. నరకములో కొన్నాళ్ళు మురిగిపోయితివి. అందుకై వగవకుము. తరువాత బాగుపడేమార్గ మాలోచింపుము. పాపములు పుణ్యములు చేయుచు ఇతరుల గొల్చితివి. ఎంతో పరితాపం చెందితివి. ఇక చింతింపకుము. సంసారమును విశ్వసించి యిన్ని దినములు దిక్కులేకుంటివి. ఇంతలో మునిగిపోయిన దేమియులేదు. నీకు పేరాస జనించినది. మరేమియు బాధలేదులే. ఇకనైన బుద్ధితెచ్చుకొని హరి దరిచేరుము. ఇదొక్కటే పైవాటి నన్నిటినీ పరిహరించుదారి. మనసున శ్రీవేంకటాచలపతి ఉన్నాడు. అతనిని తెలసికొనుము. అతడు నిన్ను కాపాడును. నీ కిక సేగి లేదుసుమా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంకనైన హరిఁజేరు | 258 | 331 | 3 | 223 |

అవ: పొదిపొదిమాటలతో నీతులు గఱపుతూ మురారినామము జపింపు మనుచున్నాడు.

సీ. వనితల వలవకు ; వైరాగ్యమున నుండు ;
గొనకొని తపముఁ జేకొనుము ; గురుల
యానతి మీఱకు ; మన్యధర్మ్ములఁ
దలఁపకు ; పరమశాంతమున మెలఁగు ;
గోవిందుని భజింపు ; కొలువకు మితరదై
వముల ; మురారినామము జపింపు ;
వినుము పురాణముల్ ; విజితేంద్రియుండవై
మనుము ; తత్త్వజ్ఞానమును బడయుము ;

గీ. కర్మఫలమును దూఱకు ; ఖలులతోడఁ
జేరకు ; శరీరభోగముల్ కోర కెపుడు ;
వేంకటాద్రీశు మఱవకు ; విష్ణు వేఁడు ;
వెఱవకుము పుట్టువులకు ; సాత్త్వికుఁడ వగుము. 195

స్త్రీలను కోరవద్దు. వైరాగ్యముతో నుండుము. ప్రయత్నపూర్వకముగా తపస్సు చేయుము. గురువులయాన జవదాటవద్దు. ఇతరమతధర్మాలను తలచను గూడా తలచవద్దు. మిక్కిలి ప్రశాంతంగా ప్రవర్తింపుము. గోవిందుని భజించుము. అన్యదేవతలను భజించవద్దు. మురహరినామాన్ని జపించు. పురాణాలు విను. ఇంద్రియాలను జయించి ప్రవర్తించు. తత్త్వాన్ని తెలునుకో. కర్మలకు అనుగుణంగా నీకేర్పడిన ఫలాన్ని నిందింపకు. దుర్మార్గులతో చేరవద్దు. శరీరసంబంధమైన తుచ్ఛసుఖాలను ఆశించవద్దు. వేంకటేశ్వరుణ్ణి మఱవవద్దు. విష్ణుదేవుని ప్రార్థించు. జన్మలకు భయపడవలదు. సత్త్వగుణం కలిగిఉండు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నమ్మితిఁ జుమ్మీ | 384 | 487 | 4 | 328 |

అవ: దేవతాకోటిలో మోక్షప్రదాత శ్రీహరి యొక్కడే అనుచున్నాడు.

సీ. **ఇందు మొదలికర్త యెవఁడు లేఁడేమొ? ఆ**
**కరివరదుఁడె ముఖ్యకర్త యేమొ?**
**ఆడితి పలురూపు లన్ని యోనులఁ బుట్టి**
**బ్రహ్మాదు లనియెడి ప్రభుల యెదుట ;**
**ఔ ననువారు కా దనువారు లేరైరి**
**అడవిగాసిన వెన్నెలాయె బ్రదుకు;**
**ఆగమంబు లనెడి యంగడివీథియం**
**దాటలో విప్రుఁడ నయి చెలఁగితి;**
**నను( జూచువారలు నవ్వువారలు లేరు**
**తోయధిలో వానలాయె బ్రదుకు;**

గీ. **భవపునాటకశాలలోఁ బ్రతిమనైతి**
**మంగపెనిమిటి కృపవల్ల మాయ దొలఁగ**
**హింసలు తొలంగె; చుట్టలై రెల్లవారు;**
**హంసచేతి పాల్నీరున ట్లాయె బ్రదుకు.** 196

ఈ సంసారమనే నాటకరంగానికి అద్యుడు, ఆధ్యుడు అయిన సూత్రధారుడు ఎవడో? ఆ కరిరాజవరదుడే దీనికి ముఖ్యకర్తయై యుండును కాబోలు! నానాప్రాణియోనులందు జన్మించుట యను బహువేషములు ధరించి బ్రహ్మాదు లనబడు ప్రభువులయెదుట నాడితిని. నాయాటను జూచి పొగడువారుగాని తెగడువారుగాని లేకపోయిరి. కనుకనే నా జీవితం అడవిలో గాచిన వెన్నెలవలె నిరర్థకమైపోయినది. అనగా మహావిష్ణువుదప్ప పెరవారలు మోక్ష మొసగ జాల రనుట. బహుజన్మముల అనంతరం పుణ్యపరిపాకంచేత వేదము లనెడు బజారున విదూషకవేషము ధరించిన విప్రుడనై వెలసితిని.

బజారులో మంచిచెడువస్తువులు విక్రయింప బడును. వేదములందు కామ్యకర్మలు, నిష్కామకర్మలు తెలియబడుచుండును. కాని ఆ బజారు నాటకములో నాపాత్రను చూచి నన్ను మెచ్చుకొనువారుగాని, హేళనచేయువారు గాని లేరైరి. అనగా అందరు నాఆటపట్ల ఔదాసీన్యము వహించి రనుట. కనుక నాజీవితం సముద్రములో కురిసిన వానవలె వ్యర్థమైనది. పైవిధముగా సంసారమనే నాట్యశాలలో నే నొక బొమ్మనై నిలిచితిని. ఇపుడు శ్రీనివాసుని దయవల్ల నాలోని మాయ, హింసాత్మకచర్యలు తొలగిపోయినవి. దుష్టత్వము పోయి సర్వసమత్వబుద్ధి కల్గినది. హంస నీటిని వదలి పాలను గ్రహించురీతి నాబ్రతుకు సదసద్వివేకముచే పరిశుద్ధమైనది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందులో మొదలికర్త | 100 | 6 | 2 | 5 |

అవ: కోపతాపములు, మోహమదాదులు కొంతైనా వదలుటలేదు. శ్రీ వేంకటేశ్వరు నెఱుగుటయే వీనిని పరిహరించుమార్గ మని చాటి చెప్పుచున్నాడు.

**సీ. పాపమ్ము వాయదు పయిపయి మనమున**
**కోపమ్ము తొలఁగదు కొంతయేని**
**దీపనబాధయుఁ దీఱ దిన్నియు నొక్క**
**యేపునఁ బెనఁగొనె నేది తెరువు?**
**ఎలజవ్వనపుమద మెడయదు కోరిక**
**క్రొవ్వు నణంగదు కొంతయేని ;**
**దూరమై పోవదు తోరంపుమమకార**
**మెవ్విధియును గాన మేది తెరువు?**

**గీ. వెఱపు వీడిచనదు వెడమాయలం బడి**
**కొఱఁత మానఁబోదు కొంతయేని;**
**తెఱఁగు దెల్పునట్టి తిరువేంకటేశ్వరు**
**నెఱిఁగి యెఱుఁగలే మిఁకేది తెరువు?** 197

పాపం తొలగిపోవుటలేదు. మనసులోనికోపం కొంతైనా వీడుట లేదు. ఆకలిబాధ తీరుట లేదు. ఇవన్నీ ఒక్కసారిగా ప్రబలంగా పెనవేసు కున్నవి. ఇక మార్గ మేది? పొటమరించే యౌవనసంబంధమగు మదం వదలిపెట్టదు. కోరికలవలని క్రొవ్వు కొంచెమైనను తగ్గుట లేదు. బలసిన మమకారం నన్ను వదలి దూరంగా పోవుటలేదు. వీనిని రూపుమాపుటకు ఏ విధానంకాని, ఏ మార్గంగాని తెలియుట లేదు. భయము అధికమైన మాయలోపడి వీడిపో కున్నది. అసంతృప్తి కొంచెమైనను మానుట లేదు. పై వానిపరిహారమునకు మార్గం చూపగల్గిన తిరుమలేశుని తెలిసియు తెలియలే కున్నాము. ఇక మనకు దిక్కేది?

వేంకటాద్రీశుని నమ్మి భజించు టొక్కటే మార్గమని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తొక్కనిచోట్లు | 45 | 276 | 1 | 135 |

అవ: క్షుద్రవిద్యోపాసకుడు క్షుద్రవిషయాసక్తుడై యుండును. స్వామికృపకు పాత్రుడు గానిదే భక్తుడు కాడని లోకానుభవమును తెలియజేయు చున్నాడు.

సీ. ముదిమి మానుపుకొన మొనసెడు నాసతో
 చేఁదుమందులు దిన సిద్ధ మగును
మంత్రసిద్ధుండయి మంతు గాంచెడునాస
 ఘోరపుఁబాట్ల కొగ్గును శిరంబు
చేరి యక్షిణిఁ బంపు సేయించుకొనునాస
 ప్రాణిహింసల కెల్లఁ బాలుపడును
సరిఁ దా నదృశ్యత సాధించునాసతో
 భూతాలఁ బూజింపఁ బూనుకొనును

గీ. చలనపున్ సిరులకు శక్తిఁ గొలుచునాస
నొడఁబడును నిందలకు; నాత్మనున్న హరిని
కొలువఁ డీ దేహి; స్వామి చేకొనినదాఁక
నాపరానియాసకు లోఁగి అన్ని సలుపు. 198

ఒకమూర్ఖుడు ముసలితనమును పోగొట్టుకొనవలెనను ఆశతో చేదుమందులను మ్రింగుటకు సైతము ఉత్సహించును. క్షుద్రమంత్రాలతో సిద్ధి నొందదలచి భయంకరములగు పలుపాట్లను శిరసా వహించును. యక్షిణిచేత పనులుచేయించుకొనవలెనని ప్రాణిహింసకుగూడ పాల్పడును. అదృశ్యత్వమును సాధించగోరి భూతములను పూజింప పూనుకొనును. అస్థిరసంపదలపైగల అపేక్షతో నిందలను భరించుచు శక్తిపూజలకు ఉపక్రమించును. అడ్డగింపరాని ఆశకు లోబడి ఎంతటి దుష్కార్యము లైనను చేయునట్టి ఈ ప్రాణి శ్రీనివాసునిదయ తన కబ్బువరకు అయనను కొలువజాలడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తనలోనుండిన హరి | 147 | 213 | 2 | 143 |

అవ: భగవచ్చింతనము, నామసంకీర్తనము, పాదదాస్యము-- అని మహిమలను తెలుపుచున్నాడు.

సీ. **పాతకకోటుల భవసంచయమ్ములఁ**
**గాల్చి బూదియొనర్పఁ గలది యొకటె**
**శ్రీతరుణీపతిచింత ; నిజమ్ముగా**
**నేతరిమానస మ్మెఱుఁగ దింత ;**
**మరణభయమ్ములు మదములు కుటిలతల్**
**గ్రన్నన మాన్పఁగాఁ గలది యొకటె**
**హరినామసంకీర్తనామృత ; మందలి**
**చవి మరగదు గాని స్వాంత మింత ;**

గీ. **నిఖిలదుర్గుణములను తృణీకరింపఁ**
**జేయఁగల దొక్కటే శేషశిఖరినిలయు**
**చరణసంసేవనారతి సకలసుగతి**
**కనియు చండాలచిత్తమ్ము కనదు గాని.** **199**

పాపపుంజములను జన్మపరంపరలను కాల్చి భస్మంచేయగల దొక్కటే. అదేదనగా లక్ష్మీభర్తయగు వేంకటనాయకుని చింతనము. అయితే ఈ దుష్టమగు మనస్సు ఈ విషయమును కొంచెమైనను తెలియదు. మరణమువలని భయమును, మదమును, కుటిలత్వమును, పోగొట్టగల దొక్కటియే. అదియే హరినామసంకీర్తన మనెడు నమృతము. కాని యీ పాడుమనస్సు ఆ నామ రుచికి అలవాటు పడదు. సకలదుర్గుణములను గడ్డిపోచగా నెగురగొట్టగల దొక్కటియే. అదేదన శేషాద్రివాసుని పాదములను సేవించుటయందలి ఆసక్తి. ఉత్తమగతులకు అదే కారణం. కాని ఈ నీచపుబుద్ధి దానిని తెలియదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇన్ని సేఁతలకు | 46 | 285 | 1 | 190 |

అవ: శ్రవణకీర్తనాదులు నవవిధభక్తులు ప్రసిద్ధములై యుండగా మరొకతీరున నవవిధభక్తులను ప్రతిపాదించుచున్నాడు.

**సీ. హరికిగా వాదించు టయ్యది యున్మాద**
**భక్తి ; పతివ్రతాభక్తి పరులఁ**
**గొలువ కుండుట ; యాత్మఁ దెలియుట విజ్ఞాన**
**భక్తియౌ; నానందభక్తి యనిన**
**నొడలు మఱచి సొక్కియుండుట ; సాహస**
**పూజ రాక్షసభక్తి ; పూన్కితోడ**
**నొకపనిఁ గోరి చేయుటయె తామసభక్తి ;**
**వైరాగ్యభక్తి శ్రీవరుఁడె పరమ**

**గీ. గతి యటంచుంట; రాజసికంపుభక్తి**
**నెట్టన స్వతంత్రుఁ డగుట ; వినిర్మలంపు**
**భక్తి శరణార్థియగుట- యే భక్తినైన**
**నియ్యకొని కాచు శ్రీ వేంకటేశ్వరుండు. 200**

శ్రీహరి అస్తిత్వమునుగూర్చి గట్టిగా వాదించుట ఉన్మాదభక్తి. ఇతరదేవతల నాశ్రయింపక శ్రీహరినే గొల్చుట పతివ్రతాభక్తి. తన యాత్మలోనే దేవునిగనుట విజ్ఞానభక్తి. శరీరమందు స్పృహలేక పరవశతనందుట ఆనందభక్తి. సాహసముతో హింసాత్మకంగా చేయుపూజ రాక్షసభక్తి. ఏదేని కార్యమును సాధింపనెంచి చేసెడు నర్చనమే తామసభక్తి. రమాపతియే పరమగతియని తలంచుట వైరాగ్యభక్తి. తాను స్వతంత్రుడనుకొని చేయుపూజ రాజసభక్తి. అన్నిటికన్న గొప్పది, అచ్చపుభక్తి శరణాగతి నందుటయే. వీటిలో భక్తు డే భక్తి ననుసరించినను స్వామి కాపాడును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నానాభక్తు లివి | ₁92 | 469 | 2 | 316 |

అవ: భగవత్పరములగు జపసేవాదులే తన సర్వస్వ మనుచున్నాడు.

సీ. **నగధర వామన నందపుత్ర్త నృసింహ**
**జగదేకపతి యను జపము మాది;**
**అచ్యుతు డింగరు లతని లెంకలు బంటు**
**లని మెఱయుట పెద్దతనము మాకు ;**
**హరి పుండరీకాక్ష యాదినారాయణ**
**యను నామమంత్రముల్ ధనము మాకు ;**
**పాయక సర్వేశు పాదదాసులసేవ**
**మరగిన దిదియె మా మతము మనికి ;**

గీ. **అంజనాద్రి వృషాద్రి శేషాద్రి వేంక**
**టాద్రి గరుడాద్రి నారాయణాద్రినాథు**
**భక్తి గొలుచుట మాకుఁ గైవల్యపదము**
**వెన్నునికి మ్రొక్కు లిడుట వేవేలు మాకు.** **201**

గోవర్ధనగిరి నెత్తినవాడా ! వామనరూపా ! నందునికుమారుడా ! నరసింహస్వామీ ! జగత్తు లన్నింటికిని ఒకేప్రభువైనవాడా ! అని భగవన్నామముల నుచ్చరించుటే మా జపము. అచ్యుతుని సేవకులమని, బంట్లమని, పనివారలమని చెప్పుకొనుటయే మా గొప్పతనము. హరీ, పుండరీకాక్షా, ఆదినారాయణా అనునట్టి మంత్రములే మా ధనములు. పరాత్పరుని పాదదాసులను విడువక సేవించుటయే మా మతము; మా బ్రతుకు. అంజనాద్రి, వృషాద్రి, శేషాద్రి, వేంకటాద్రి, గరుడాద్రి, నారాయణాద్రి అను పేళ్ళుగల పర్వతములకు ప్రభువైన శ్రీ వేంకటేశ్వరుని భక్తితో కొలుచుటయే మాకు మోక్షపదవి. విష్ణుదేవునకు నమోవాకము లర్పించుటయే మాకు వేనవేలు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఉన్నసుద్దు లేల మాకు | 340 | 236 | 4 | 158 |

అవ: శ్రీపతిసేవనము సకల శ్రేయములకు మూలమని ఉద్బోధించు చున్నాడు.

సీ. చేపట్టుకుంచమ్ము శ్రీమానినీపతి
వై పెఱింగి పొగడవలయుఁ గాక
మనసులోని హరిని మఱవక తలఁచిన
నిహపరసౌఖ్యమ్ము లేమి యరుదు?
పెనఁగొని వెన్నుని పేరులు నుడివిన
నెపుడు బ్రహ్మానంద మేమి యరుదు?
పుట్టించినాతని పొసఁగంగఁ గొలిచిన
నెల్లమీఱు వివేక మేమి యరుదు?
చుట్టి గోవిందుదాసులకును మ్రొక్కిన
నిట్టె పుట్టుల గెల్పు టేమి యరుదు?

ఆ. శేషగిరినివాసుఁ జేరి భజించిన
విద్ధసత్త్వసిద్ధి యేమి యరుదు?
పరఁగ నతనిమీఁద భక్తిని నిలిపిన
నెలమి తన్నుఁ గనుట యేమి యరుదు? 202

ఉపాయము తెలిసి పొగడినచో శ్రీపతి చేపట్టుకుంచ మగును. సులభముగా వశ్యుడగు ననుట. మనసులోనే యున్న హరిని మఱచిపోక తలచినచో ఇహలోక పరలోక సౌఖ్యము లేమి యరుదు? అరుదుకా ననుట. పూనికతో కృష్ణునినామముల నుచ్చరించినచో అనవరతబ్రహ్మానంద మబ్బుట ఏమి యరుదు? అరుదు కాదని భావము. జన్మమిచ్చిన ఆ దేవుని ఒప్పుగా సేవించినచో హద్దుమీఱిన జ్ఞానమబ్బుట ఏమి యరుదు ? అరుదుకా దనుట. హరిదాసులకు ప్రదక్షిణపూర్వకముగ నమస్కరించినచో జన్మరాహిత్యమును పొందుట ఏమి యరుదు? అరుదు కాదు. శేషశైలంమీద నుండు లక్ష్మీవల్లభుని సేవించినచో శుద్ధసత్త్వగుణము సిద్ధించుట ఏమి యరుదు? అరుదుకా దనుట. చక్కగా భగవంతునిపై భక్తిని కేంద్రీకరించినచో ఆ స్వామిని ప్రత్యక్షముచేసికొనుట ఏమి అరుదు? అతడు తప్పక ప్రత్యక్షమగు ననుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చేపట్టుఁ గుంచము | 330 | 174 | 4 | 117 |

అవ. పాపము నరకమునకును, కోరికలు ఇహపరాలకు, జననము మరణమునకును కారణము లనుచున్నాడు.

సీ. వెలినుండు లోనుండు విశ్వమంతట నుండు
జలజాక్షు శరణమే సాధనమ్ము
తనదు కిల్బిషమె మీఁదటఁ దోఁచు నరకమై
తననీడ దర్పణమ్మునను బోలె
లేకున్నచో మొదల్, లేదు కొనయుఁగూడ
గుఱుతుగ నిహపరాల్ కోరినంతె;
తొల్లిఁ జూచినయూరె యుల్లమ్ములోఁ దోఁచు
గహనసంసారమే కల యయినటు
జననమ్ము లేకయే చావులే దెరికి
వెడసుఖదుఃఖముల్ వేఁడినంతె

గీ. కాయు వెన్నెల యెండలుగాయు బయల
రేయుఁబవ లొక్కదినమైన రీతిగాను
లేఁడు దేవుండు జీవుండు లేకయున్న
నంత శ్రీవేంకటేశుఁడే యంతరాత్మ. 203

"ఇందుగల డందులే" దన్నట్లు ప్రపంచము వెలుపల లోపల అంతట నిండియుండే తామరలబోలినకన్నులుగల శ్రీమన్నారాయణుని శరణాగతియే మోక్షమునకు ఉపకరణము. తననీడయే అద్దములో అగపడునట్లు ఇప్పటి తనపాపమే మీద నరకముగా ఏర్పడుచున్నది. మూలమే లేకున్నచో కొనయును లేదు. అటులే కోరికలవల్లనే ఇహపరములు కలుగుచున్నవి. దుస్తరసంసారమే కలవంటిదైన విధంగా (అశాశ్వతమైనదనుట) ప్రత్యక్షముగా మొదటచూచిన ఊరే పిదప మనసున గోచరించును. పుట్టుట లేనిదే గిట్టుట లేదు. సుఖముగాని, దుఃఖముగాని ఎవరికి వారు కోరితెచ్చుకొన్నంతయే. వెన్నెలయు ఎండయు ఒకేబయలునందే కాయును. రాత్రింబవళ్ళు కలసి ఒకదినమైన రీతిగా ఒకేసంసారమున సుఖదుఃఖాలు, జననమరణాలు కలుగును. జీవుడు లేకున్నచో దేవుడే లేడు. శేషశేషిభావముతో జీవదేవులకు సంబంధము అవినాభావంగా ఉన్నదన్నమాట. ఆ దేవుడు అంతర్యామి యైన శ్రీవేంకటేశ్వరుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెలినుండు లోనుండు | 316 | 93 | 4 | 63 |

అవ: భగవత్ప్రాప్తి సాధనము లెఱిగించుచున్నాడు.

సీ. జగదీశ్వరుఁడె పొందఁదగిన సద్వస్తువు
శరణాగతి యొకండె సాధనంబు
తా ననియెడి బుద్ధి దైవమం దుంచి తా
తనమతిమఱచుట తత్త్వసుఖము;
మే ననియెడిబుద్ధి మేదినీప్రకృతియం
దానించి మమతల నన్నివిడుట
యాత్మవిజ్ఞానమౌ; నవల నింద్రియజయ
మద్ది పరమయోగ మగునుజూవె;
పొరి కర్మపుంబుద్ధి పుట్టువుపై నుంచి
విడ పాపపుణ్యాల్ వివేకపదము;

గీ. వేగ వెలిబుద్ధి లోనుంచి రేఁగు చంచ
లత్వముం బాయుట సమాధిలక్షణమ్ము;
పలుతలంపుల నొకభక్తిఁ బాదుకొలిపి
హరిని గలియుటయ తురీయమగు నవస్థ. 204

అందఱకును పొందదగిన సద్వస్తువు పరమేశ్వరు డొక్కడే. అతనిని చేరుటకు సాధనము శరణాగతియే. తాను దేవుని అంశమని తలంచి బుద్ధిని దైవమందుంచి, తాను వేఱనుబుద్ధి లేకుండుటయే తత్త్వానందము. ఈ శరీరమనే బుద్ధిని భూమియం దుంచి అనగా శరీరము పాంచభౌతికమని తలంచి మమకారమును వీడియుండుటే ఆత్మవిజ్ఞానము. అటుపై ఇంద్రియములను జయించవలెను. అదియే పరమయోగముసుమా! కర్మములు జన్మకారణము లని యెఱింగి ఎట్టికర్మములను ఆచరింప కుండుట వివేకము. వెలుపల పరుగులుతీసే బుద్ధిని తనలో నణచుకొని చపలత్వము లేకుండుటయే సమాధిలక్షణము. అన్నికోరికలను ఒక భక్తి యందే చేర్చి హరియం దైక్య మందుట తురీయావస్థ అనబడును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సర్వం విష్ణుమయం | 316 | 90 | 4 | 61 |

అవ: మనస్సు, మాయ, ఆశ మున్నగునవి జీవుని కలతనొందించు నట్టివి. వేంకటాచలపతిసేవచే నివి తొలగి పరమపదము ప్రాప్తించు ననుచున్నాడు.

**సీ. జీవుఁ డేమియొనర్చుఁ జిత్తమ్ము వశముగా**
**కీవలావలఁ బర్వు లెత్తుచుండఁ**
**జిత్త మేమియొనర్చుఁ జిత్తమ్ములో నున్న**
**శ్రీవల్లభునిమాయ చిమ్మి రేఁచ**
**దేహ మేమియొనర్చు దేహమ్ములో నున్న**
**దారుణాశలు వెళ్లిద్రవ్వగాను**
**ఆశ లేమియొనర్చు నన్నింటికిని మధు**
**రిపునియాజ్ఞలు పెరరేఁచగాను**

**గీ. ఏమిసేయుఁ బుట్టువు పురాకృతమువెంటఁ**
**గట్టి నట్టిబంధమ్ములై కలఁచగాను**
**గుట్టుగా వేంకటేశ్వరుఁ గొలువ నతఁడు**
**మంచిపద మిచ్చి నన్ను మన్నించగాను.** **205**

మనస్సు అధీనముగాక ఇటునటు పరుగు లెత్తగా జీవు డేమిచేయగలదు? మనోనిగ్రహం అవసర మనుట. మనసులోనున్న భగవంతుని మాయ కలవర పెట్టుచుండగా మనసేమిచేయగలదు? మాయను జయింపవలె ననుట. భయంకరములగు ఆశలు వెళ్లిపుట్టింపగా దేహమేమి చేయును? ఆశలను వదలవలె ననుట. మధుసూదనుని ఆజ్ఞ ననుసరించియే ఆశ లుప్పతిల్లును. కడచిన జన్మములలోని కర్మములు గట్టి కట్టులై కలచగా పుట్టు వేమిచేయగలదు? కర్మలను త్యజింపవలె ననుట. దృఢముగా వేంకటాచలపతిని సేవించగా అతడు పుట్టువులేని పట్టు నిచ్చి నన్ను మన్నించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నే నేమిసేయుదును | 309 | 53 | 4 | 36 |

అవ: దేహము హేయము; వేంకటాచలపతి దేవుడు. తాను జీవుడు; భగవద్దాస్యమే ఇహపరసాధక మని పలుకుచున్నాడు.

సీ. **మనుజజన్మం బంట మలమూత్రతనువఁట**
**చూడ హేయముగాక శుద్ధిగలదె?**
**మానని కోరికల్, మాయసంసృతి యంట**
**దీనవృత్తియగాక తేజ మున్నె ?**
**చంచలమన మంట చలితేంద్రియము లంట**
**భూరిపాపముగాక పుణ్య మున్నె ?**
**సంచితకర్మముల్ జననలయము లంట**
**ఖేదమ్ముగాక ప్రమోద మున్నె ?**

గీ. **తాను వేంకటపతియంట నేను జీవుఁ**
**డంట యన్యంబు గలదె? దాస్యంబుగాక ;**
**ఇహపరము లంట నాకవి యివల నవలఁ**
**గైవసము లాయె నఁట నింకఁ గడమ గలదె?** **206**

ఇది మానవజన్మము. ఈ శరీరము మలమూత్రాదులతో నిండినట్టిది. ఆలోచింపగా ఇది నీచమైనదేగాని పవిత్ర మైనదా? కాదనుట. కోరికలకు ఎడతెఱపి లేదు. సంసారము మాయతో కూడినది. కనుక ఇందులో దయనీయ మగువృత్తియే కాని తేజమున్నదా? లే దనుట. మనసు చంచలమైనది. ఇంద్రియములో చపలము లైనవి. కావున ఇందులో అధికమగు పాపమేగాని పుణ్యమున్నదా? లేదు ; సంపాదించిన కర్మములు, చావుపుట్టుకలు కలిగిన శరీర మిది. ఇందు ఖేదమేగాని మోద మున్నదా ? లేదు. బ్రహ్మస్వరూపుడు ఆ వేంకటాచలపతి. నేనో జీవుడను. ఆయనను చేరుటకు దాస్యమే కారణము గాని వేఱుకారణ మున్నదా? లేదు. ఇహపరములు నా కధీనము లైనవి. ఇక నాకు కొఱత యున్నదా? లేనే లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దివమఁట రాతిరఁట | 322 | 129 | 4 | 87 |

ఉప. ఎవరి కెంతెంతయో అంతే లభించును. ఆశాపరులను జూచి స్వామిభక్తులు నవ్వుదురని చెప్పుచున్నాడు.

సీ. పలు లంపటమ్ములఁ బడి గడించెడిసొమ్ము
పోలదు బిచ్చపుబువ్వతోడ
తొలుత జంతువుల నుదుళ్ళ వ్రాసెను బ్రహ్మ
దైవికమ్ముల దాఁటఁ దరముగాదు
పాపఘ్నమౌని కోపమువీడి శాంతితో
మనుట కే సుకృతంబు మాఱుగాదు
వేదశాస్త్రములు దెల్పెడి యర్థ మియ్యదే
కడు బడలెద రేల? పుడమిజనులు

గీ. సహజము జగమ్ములో పనుల్ జరుగుచుంట
యెవరి కెంతెంతయో యది యీశ్వరేచ్ఛ;
పన్నగగిరీశునమ్మిన భక్త జనులు
జగతి గని నవ్వుదురు; పెఱల్ తగులుచుంద్రు. 207

నానావిధకష్టము లనుభవించి సంపాదించినధనము భిక్షాన్నముతో సరిరాదు. మొదటనే బ్రహ్మదేవుడు ప్రాణుల నుదుట వారివారి భవిష్యత్తును వ్రాసియున్నాడు. ఆ తలవ్రాతను తుడుచుట అశక్యము. పాపము సల్పక కోపము వహింపక శాంతముతో జీవించుటకు ఏ పుణ్యమును సాటికాదు. వేదములు, శాస్త్రములు తెలుపునట్టి పరమార్థ మియ్యదే. లోకులు దీని నెఱుంగక మిగుల ప్రయాసపడెదరేల ? ప్రపంచములో పలుపనులు జరుగుట సహజము. ఈశ్వరేచ్ఛ ననుసరించి ఎవరి కెంత రాదగునో అంతే వచ్చును. వేంకటాచలపతిని నమ్మినట్టి భక్తులు ఈ లోకము యొక్క వాలకమును జూచి నవ్వుకొందురు. ఇతరులు ఆశకులోనై బాధపడుదురు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏ పను లెవ్వరికి | 318 | 102 | 4 | 69 |

అవ: శరీరమే రథమని, మానవుడే సారథి యని, వేంకటేశ్వరుడే రథికుడని శరీరమునందు రథత్వమును ఆరోపించుచున్నాడు.

సీ. **బండికన్నులజత పరికింపఁ బిఱుఁదులు**
**చరణాలు రెండును చాఁవునొగలు ;**
**కనుఁగవచూపులు కట్టిన వగ్గముల్**
**తీయుఁబో జీవుండు దేహరథము ;**
**పంచభూతమ్ములు పలువన్నె కోకలు**
**చక్కని చేతులు టెక్కియములు ;**
**భావింపఁగ శిరమ్ము పైనున్న శిఖరమ్ము**
**పంచేంద్రియపుఁదేరు పఱపు దేహి ;**

గీ. **పాపపుణ్యాలు రెండును ప్రక్కచీల**
**లన్న పానీయములు త్రోయునట్టి తెడ్లు**
**వేంకటేశ్వరుఁ డెక్కి తా వీథులందు**
**వెడలఁ దనువను నరదమ్ము గడపు నరుఁడు.** **208**

శరీరరథమునకు పిఱుదులే బండికండ్ల జత. కాళ్లురెండును పాడవుపాటి నొగలు. కనుచూపులే పగ్గములు. ఈ దేహరథమును జీవుడు నడపును. పంచభూతములు రథమున కలంకరించిన పలురంగుల వస్త్రములు. ఎత్తినచేతులే టెక్కెములు. తలయే రథముపైనున్న శిఖరము. ప్రాణి పంచేంద్రియ సంబంధమగు ఈ తేరును కదలించును. పాప పుణ్యములు తేరుచక్రములకు గల ప్రక్కచీలలు. ఆహారము, పానీయము ఇవి ఆ తేరును ముందునకు సాగించు తెడ్లు. ఇట్టి శరీరమనెడి అరదమును జీవుడు నడిపింపగా శ్రీ వేంకటేశ్వరుడు దాని నెక్కి వీథులందు ఊరేగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గుఱ్ఱాలఁగట్టని తేరు | 136 | 152 | 2 | 102 |

అవ: దేవునిమహిమలు తెలియ రనియు, శ్రీహరియు, శ్రీసతియు వరము లిచ్చి కాపాడుదు రనియు తెలిసినవారలు వెఱ్ఱివారు కారని యనుచున్నాడు.

సీ. తెలుపంగ రానివి దేవునిమాయ లీ
వట్టిన వెఱ్ఱిచే ఫల మెఱుఁగరు;
పుట్టిరి దివిజులు పురుషోత్తమునియందు
నట్టే యణంగిరి యతనియందు ;
నిట్టే ముకుందుని నిందఱతో నరి
పెట్టి కొల్చుట యొక పెద్ద వెఱ్ఱి;
హరివరములచేత నందఱు బ్రదికిరి
వరులవరాలచే బడలి రసురు;
లిది యెఱింగియు శౌరి నిందఱతో నరి
సాటిగ మ్రొక్కుట చాలవెఱ్ఱి;

గీ. అంజనాచలవిభుఁడు జీవాంతరాత్ముఁ
డాశ్రితావనపరుఁడు దయావిధేయుఁ
డతఁడు తత్పతి సిరు లిత్తు రంచు నెంచు
పుణ్యులకు నెప్పుడును పట్టఁబోదు వెఱ్ఱి. 209

దేవునిమాయలు తెలువుటకు వీలుగానివి. వెఱ్ఱిపట్టినవారికి వీటివిషయము తెలియదు. దేవతలు పురుషోత్తమునియందే పుట్టిరి. అతనియందే లయించిరి. మోక్షప్రదుడగు ముకుందుని ఇతరదేవతలతో సమునిగ భావించి కొలుచుట ఒక పెద్దవెఱ్ఱి. శ్రీహరివరములవలన ధ్రువుడు, ప్రహ్లాదుడు మున్నగువా రెందరో చిరంజీవులైరి. ఇతరదేవత లిచ్చిన వరముల వలన రావణాదిరాక్షసులు చచ్చిరి. ఈసంగతి తెలిసియు శ్రీశుని ఇతరదేవతలతోపాటు నరిపెట్టి మ్రొక్కుటయు వెఱ్ఱియే. అంజనాద్రిపతి జీవులకు అంతరాత్మ అయినవాడు. చేరినవారిని కాపాడువాడు. దయకు అధీనమైనవాడు. అట్టి నారాయణుడును ఆతని పట్టమహిషి యగు అలమేల్మంగయు సంపద లిచ్చి కాపాడుదురని ఎంచు పుణ్యవంతులకు ఎప్పుడును వెఱ్ఱిపట్టదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలుపఁగ రాదిది | 296 | 558 | 3 | 375 |

అవ: సకలము దైవాధీనమని యెఱింగియు దైవమును సేవించుట లేదనియు, మంగపతిమహిమ నెఱిగిన పిదప ఆ దేవుని మఱవబోమనియు వాకొనుచున్నాడు

సీ. భగవద్విభవమెల్లఁ బ్రత్యక్ష మేగదా
జిగి నిందొకటియేనిఁ జేయఁగలమె?
దైవికమ్ములు గావె తలపోయ వానలు
తలయెత్తుమొలకలు దైవికములె;
కనులారఁ జెవులారఁ గనుచును వినుచును
దైవమ్ము నేలొకో తలఁపలేము;
జననముల్ మరణముల్ గన దైవికమ్ములే
తనుపోషణమ్ములు దైవికములు;

గీ. దైవికము లిహపరములు; దైవికములు
తహతహ లడంగుటలు; మఱి తత్త్వ మెఱిఁగి
మరగి కొలువము దైవమ్ము మనము; మంగ
మగనిమహిమమ్ము గంటిమి మఱవఁబోము. 210

భగవంతుని వైభవ మంతయు కనులకు గోచరించుచునే యున్నది గదా? ఇందులో ఒకవైభవమునేనియు మనము చేయగలమా ? చేయలేమనుట. ఆలోచింపగా వానలు కురియుట మొలకలు మొలచుట దైవికమేగదా! దీనిని కనులార చూచుచు చెవులార వినుచు ఎందుకో దేవుని స్మరింపలేకున్నాము. చూడగా పుట్టుకలు, మరణములు, శరీరపోషణములు దైవికములే. ఇహపరములు దైవికమే. లంపటలు అణగారుటయు దైవికమే. కాగా మన మీ నిజము తెలిసి ఆసక్తితో దైవమును సేవింపము. మంగపతి మహిమ నెఱింగితిమి. మరి ఆ దెవమును మఱవజాలము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భగవద్విభవపు | 278 | 448 | 3 | 301 |

అవ: సంసారములోని దొసగులను చూపుచు ధ్యానముచే కొండలప్ప దర్శన మీయగా ఆ సంసారమే శాంతిసుఖములకు నెలవగునని విశ్వసించుచున్నాడు.

సీ. **ఒండె నాపద మఱియొండె సంపద వచ్చు**
**నావంతదీఱదు హరి దలంప;**
**తండోపతండముల్ తలమోపులౌ పనుల్**
**సంధించి పనిగొను సంసరణము;**
**పాపమొల్లకయున్న బలుపుణ్యమై యంటు**
**నే ప్రొద్దు దీఱదు విభుఁ దలఁప**
**ఓవనన్న విడువ దూర కే పనిగొను**
**చావక్రిందిజలమ్ము సంసరణము;**

గీ. **పై కొనును రేయి నిద్దుర పగ లలసినఁ**
**గనఁబడదు శౌరిఁ దలపంగ క్షణము తనకు;**
**దయను పొడసూప శేషాద్రిదైవతమ్ము**
**శాంతిసుఖముల కిరవాయె సంసరణము.** 211

మానవునకు ఆపదలు గాని సంపదలు గాని ఒకదానితర్వాత మరొక్కటి వస్తుంటాయి. కాని హరిని తలంచుటకు అవగింజంత అవకాశం లభించదు. ఎన్నియో పనులు తన తలపై తాండవిస్తుంటాయి. సంసారము నరులను అకార్యములలో చొప్పించి పనిచేయించును. మనుజుడు పాప మాశించకున్నను అనేక పుణ్యకార్యములలోనైన తలమునుకలగుచుండును. కాని పరంధాముని తలంచుటకు ఆతనికి ఒకసమయమం దైనను తీరిక యుండదు. ఈ సంసారము చావక్రిందినీరువలె నెమ్మదిగ వ్యాపించుచు తాళజాల నన్నను విడిచిపెట్టదు. వెట్టి పనులు చేయించుచుండును. పగలు బాగుగా అలసిపోయినచో రాతిరి నిదుర ముంచుకొనివచ్చును. హరిని స్మరించుటకు తన కొక నిమిషమేని తీరిక అగుపించదు. దయతో శేషాచలపతి అగుపించగా ఆ సంసారమే శాంతిసుఖములకు నిలయ మగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒక్కటి తరువాత | 220 | 111 | 3 | 75 |

అవ: మూఢు లేవేవో ప్రాయశ్చిత్తములు, వ్రతాలు చెప్పుచుందురు. కాని భగవంతుని నామజపము, పూజనము సకలపాపములు హరించును. దాసులకు రక్షకుడు వేంకటేశ్వరుడే అనుచున్నాడు

**సీ. ఓంకారరూపు నామోచ్చారణమ్మున**
**వీడని కర్మముల్ వేఱుగలవె?**
**అజ్ఞు లేవేవొ ప్రాయశ్చిత్తమ్ములు చెప్పు**
**దురు హరినామమ్మె దురితహరము;**
**శ్రీపతిఁ గొనియాడఁ జేరని సిరులేవి ?**
**యెఱుఁగనివార లాయీవ్రతాలు**
**తెలుపుచుండుదురు వారలతోడ వాదేల?**
**పద్మాక్షుపూజ సంపత్కరంబు;**

**గీ. అచ్యుతుం డంతరాత్ముఁ డన్యము భజింపఁ**
**దావుగల దెందు ? దేవతాంతరము లేవొ**
**పేరుకొందురు పామరుల్; పోరు లేల?**
**ఏడుగడ దాసులకు వేంకటేశ్వరుండె.** 212

ప్రణవస్వరూపుడైన శ్రీహరినామజపమువలన తొలగని కర్మబంధము లేవైన నున్నవా ? లే వనుట. ఈ విషయ మెఱుంగక మూఢులు ఆయీప్రాయశ్చిత్తములను చెప్పుదురు. కాని హరినామమొక్కటే పాపమును పోగొట్టునట్టిది. లక్ష్మీపతిని పూజింపగా పొందరాని సంపద లున్నవా? లే వనుట. ఈ సంగతి తెలియనివారు ఏవోవ్రతాలు చేయుడని చెప్పుచుందురు. అట్టివారితో మనకు వాదులాట ఎందులకు ? సిరిమగనిపూజయేగదా సంపద నిచ్చును ? అచ్యుతుడే అంతరాత్మయై యుండగా ఇతరదైవమును పూజించుటకు ఆస్కార మెక్కడిది? ఈ నిజము తెలియక కొందరు మూర్ఖులు ఇతరదేవతలను పూజింపవలె నందురు. వారితో మనకు తగవులాట ఎందుకు?

సారాంశ మేమనగా దాసులకు వేంకటాచలపతియే దిక్కు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| శరణాగతవజ్రపంజరు | 221 | 117 | 3 | 79 |

అవ: భక్తుని దోషములను గణింపక పెరుమాళ్ళు రక్షించు నను విషయమును సోదాహరణముగ నిరూపించుచున్నాడు.

సీ. నే నెంత పాపినై నేరముల్ సేసిన
  నేలువాఁ డెటులేని నేలఁగలఁడు
మేనిదోసముమాన్పి మే లొసంగెద నని
  యతఁ డాడె చరమపద్యంబునందు
మట్టులే కేనెంత మఱచియుండినఁ గాని
  పుట్టించినయతండె ప్రోవఁ గలఁడు
గట్టిగఁ దనవారిఁ గాచి యుండెద నన్న
  గుట్టు పాండవులందుఁ గోరిచూపె

గీ. తప్పనడచినఁగాని మా గొప్పయవ్వ
యొప్పులుగ దిద్ది రక్షింప నొద్దఁగలఁడు
చెప్పనేల గోపికలు చేసిన దొసఁగులు
కప్పిపుచ్చి పుణ్యముసేయు ఘనుఁడు గాఁడె? 213

భక్తుడగు నే నెంత పాపినై యపరాధములు చేసినను తాను రక్షకుడు కాబట్టి రక్షించియే తీరును. శరీరము ధరించిన ప్రాణి చేసిన దోషములను పరిహరించి మేలుగూర్తునని ఆ దేవుఁడే భగవద్గీతాచరమశ్లోకమందు "అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" అని సెలవిచ్చెనుగదా! మరియాద నెఱుంగక తన్ను నే నెంతగా మఱచినను పుట్టించిన యా దేవుడు కాపాడితీరును. తనవారిని తప్పక కాపాడుదు నని పాండవులవిషయమున తాను చేసి చూపినాడుగదా !

"అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే,

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్".

అనిగదా శ్రీనివాసుని ప్రతిజ్ఞ!

భక్తుడు తప్పు లొనర్చినను వానిని ఒప్పులుగా భావించి కాపాడుటకు ఆ కొండలయ్య అండనే యున్నాడు. ఈ సంగతి వేఱుగ చెప్పవలెనా? గోపిక లెన్ని దోషములు చేసినను వాటిని కప్పిపుచ్చి వారికి పుణ్యము గలిగించిన ఘనుడు గదా అతడు !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంక నేల నాకు వెరపు | 244 | 251 | 3 | 170 |

అవ: అన్నింటికి మూలము శ్రీ వేంకటేశ్వరుడే యనుచున్నాడు.

సీ. మాయామయమ్మయి మను జగమ్మిద్ది యే
చాయల నెందు నిజమ్ము గలదె?
తలపోయ సుఖదుఃఖములకుపొత్తి మేను
రేయియుఁ బవ లోకరీతి వగునె?
దైవతాధీనమ్ము ధరణి సంసారమ్ము
వావిరి జీవులవశముగాదు;
నిజకర్మమూలమ్ము నిజముగా మనసిద్ధి
వేవేలచందాల విడువ వశమె?

గీ. బ్రదుకు పంచేంద్రియములచేఁ బాలితమ్ము
చంచలం బిది; కాదు నిశ్చలము; వేంక
టాద్రివిభుఁ డిన్నిటికి మూల మా కృపాళు
మన్ననకొలంది మనలక మాఱు గలదె? 214

ఈ జగము మాయతో నిండినది. ఎటుచూచినను ఇది నిజముకాదు. రాత్రింబవళ్ళకు దినము స్థానమైన రీతిని ఈ శరీరము సుఖదుఃఖములకు నిలయము. రాత్రింబవళ్ళు ఒకేరీతివి కానట్టుగా ఖేదమోదములు రెండును ఒకేరీతివి కావు. సుఖము పగలువంటిది. దుఃఖము రాత్రివంటిది. ఈ నేలపైని సంసారము దైవాధీన మైనదే. కనుక సంసారమును చక్కజేసికొనుట జీవులకు శక్యం కాదు. మనుజుడు సల్పు సుకృతదుష్కృతములకు మూలకారణము నిజంగా ఈ మనస్సే. మనసులోని సంకల్పవికల్పములను విడుచుటకు ఎన్నివిధములచేనైనను వలనుకాదు. అనగా అమనస్కయోగము అసాధ్యమనుట. చక్షురాదిపంచేంద్రియములచే పాలింపబడే ఈ జీవితం నిశ్చలంకాదు గనుకనే చంచలమైనది. ఇన్నింటికి కారణం ఆ వేంకటరమణుడే. ఆ దయామయుని ఇచ్చచొప్పున బ్రతుకవలెనేగాని వేఱుమార్గం లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇన్నిటిమూలం బీశ్వరు | 252 | 296 | 3 | 200 |

అవ: శ్రీనివాసుదాసుల లక్షణములను వివరించుచున్నాడు.

సీ. అందఱు నిర్మలు లని తలంచినఁ దన
నిందలేని మనంబె నిర్మలమ్ము;
లోకులతో మంచివాకులాడినఁ గడు
మంచిదౌ తననోరె యెంచిచూడ
నంతట నున్నాఁడు హరియంచుఁ జూచిన
నంతరంగమ్మున నతఁడె యుండు
జగము పావన మని సంస్మరించినఁ దన
బగ్గి బుగ్గి తనువె పావనమ్ము

గీ. తనదుపాలికి విశ్వంబు తాను పుట్టఁ
బుట్టెఁ; దనతోడిదేనుమ్ము పుట్టు వెల్ల;
నిడవలయు జ్ఞాన మా వేంకటేశ్వరుండె
శ్రీనివాసునిదాసుల చిన్నె లివియె. 215

తాము పరిశుద్ధాత్ములమని తమకు దాము అనుకొన్నంతమాత్రమున ఏమి ప్రయోజనము ? ఎవడు ఇతరులనిందలకు పాత్రుడు కాడో అట్టివానిమనస్సే నిర్మల మైనది. అందరితో నెవడు మంచిగా మాటాడునో అట్టివానివాక్కే మంచిది. హరి సకలమం దున్నాడని భావింపగా తన యందును అతడు గోచరించును. జగత్తు పవిత్ర మైనదని యనుకొన్నచో తన యీ పాడుశరీరమే పావనమైన దగును. తాను పుట్టగా ఈ జగత్తు పుట్టినది. సర్వము తనభావనచే కల్గినదే. సమ్యక్ జ్ఞానమును ఆ వేంకటాచలపతియే ప్రసాదించవలెను. పై విధములగు భావనలు కలిగి యుండుటే శ్రీనివాసదాసుల చిన్నెలు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏపాటి తన కర్మ | 278 | 452 | 3 | 304 |

అవ: వేంకటాచలపతి పాదతీర్థమే అమోఘమైన మందని అభివర్ణించు చున్నాడు.

సీ. కంటగించనిమందు కడు చల్లనగుమందు
నూరని కాచని నున్నమందు
వెలకు చిక్కని మందు వేరువెల్లంకులు
కూర్పక చేసిన గొప్పమందు
గుఱుతైన రోగముల్ గుణముచేసెడిమందు
దురితముల్ పెడ(బాపు దొడ్డమందు
నతము బ్రహ్మాది దేవతలు గైకొనుమందు
నరకబాధలుమాన్పి ననుచు మందు

గీ. ఎట్టిభయములు తముఁ బొందనీని మందు
మంకుబుద్ధులు మాన్పెడు మంచిమందు
వ్రచ్చి మోహంబు, మోక్షంబు నిచ్చుమందు
శ్రీనివాసాంఘ్రితీర్థమే చెడనిమందు. 216

ఏవగింపు పుట్టింపనట్టి, చల్లనైనట్టిది, కల్వములో మర్దించబడ నట్టిది, కాచబడనట్టిది, మృదువైనట్టిది, అమూల్యమైనట్టిది, మూలికలతో చేయబడనట్టిది, ఎట్టిరోగములనేని హరించునట్టిది, పావముల నశింపజేయునట్టిది, బ్రహ్మాదిదేవత లెప్పుడు సేవించునట్టిది, నరకబాధలను నిర్మూలించునట్టిది, భయమును దరికి రానీయనట్టిది, మూర్ఖపుబుద్ధులను మాన్పునట్టిది, మోహమును పాఱదోలి మోక్ష మిచ్చునట్టిది శ్రీనివాసుని పాదతీర్థమనెడి ఔషధమే వ్యర్థముగాని గొప్పమందు.

అన్నమయ్య జీవితచరిత్ర - పీఠికలోని పదమునకు పద్యరూపమిది.

అవ: వేంకటాచలపతియే అందఱిలో నంతరాత్మగా నున్నా డనియు, ఆతడే జీవులను బొమ్మలవలె నాడించుచున్నా డనియు పలుకుచున్నాడు.

సీ. పొడమించు నాతఁడే పొదలించు నాతఁడే
నొడివించు నాతఁడే నోరికొలఁది;
గడియించు నాతఁడే కడలేని సిరులెల్ల
నడియాలమగు లోని యంతరాత్మ;
మతినిచ్చు నాతఁడే మఱపించు నాతఁడే
గతియగు నాతఁడే కరుణకునిధి;
వెతమాన్పు నాతఁడే వెలయించు నాతఁడే
యతిశయిల్లెడు లోని యంతరాత్మ;

గీ. ఎదురెదురువచ్చి యాతఁడే యిహము నిచ్చు;
సహజముగ నట్టె పరము నొసంగు నతఁడె;
విహగగమనుండు వేంకటవిభుఁ డతండె
యహరహ మ్మాదరించెడు నంతరాత్మ. 217

శ్రీపతియే జీవులను పుట్టించుచున్నాడు; పెంచుచున్నాడు. నోటి కొలది పలికించుచున్నాడు. అంతులేని సిరులను నంపాదించుచున్నాడు. ప్రాణులలో నతడు గురుతుగ నున్నాడు. స్మృతి విస్మృతులను కలిగించు చున్నాడు. జీవుల కాతడే గతి. దయకు నిధి. కష్టములను బాపును. ప్రసిద్ధిని గలిగించును. ప్రసన్నుడై ఇహసుఖముల నిచ్చును. అటులే పరమును గూడ ప్రసాదించును. ఆ యంతరాత్ముడే గరుడవాహనుడైన శ్రీ వేంకటేశ్వరుడు. భక్తుల నాత డనుదినమును బ్రోచును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒకరి బుద్ధులు | 366 | 390 | 4 | 262 |

అవ: శరణాగతరక్షకుడు వేంకటాచలపతి అండనుండగా భక్తులకు భయ మెక్కడిదని నిర్భయముగా పలుకుచున్నాడు.

సీ. ఆతఁ డనంతుఁ డనంతహస్తముల న
నంతాయుధమ్ముల నలరుచుండఁ
గనుఁగొని శరణార్థిజనుల కెవ్వారికి
నుంతయు భయపడఁ జోటిఁకేది?
ధారుణి నభయహస్తముతోడ నెప్పుడు
హరి రక్షకుం డౌచు నలరుచుండ
నరహరికరుణనే నమ్మినవారికి
నించుక భయపడ నేది చోటు?

ఆ. శేషశిఖరియందు జీవులఁ గాచుచు
నవల నివల స్వామి యలరుచుండఁ
దానె మాకు దరియు దాపయి యుండంగ
నింక భయపడంగ నేది చోటు? 218

ఆ దేవుడు అంతములేనివాడు. సహస్రబాహువులు కలవాడు. అనంతములగు ఆయుధములను ధరించువాడు. కాగా అతనిశరణు పొందినవారికి, ఎటువంటివారి కైనను కొంచెముకూడ భీతిచెందుట కవకాశమే లేదు. ఆ స్వామి అభయహస్తముతో పాలకుడై పరగుచుండగా ఆ శ్రీహరిదయనే నమ్మినవారికి ఏ మాత్రము భయము చెందు దుఃస్థితి కలుగదు. ఆ ప్రభువు శేషాద్రిపై వసించుచు నలువైపులనున్న జీవులను గాపాడుచున్నాడు. అతడే మాకు అందుబాటులో నున్నాడు. ఇక మాకు భయమే లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతఁడే రక్షకుఁడు | 364 | 360 | 4 | 255 |

అవ: బ్రహ్మాండ పిండాండములకు పోలిక జూపుచు సర్వజ్ఞుడైన శ్రీశుని శరణందుట జన్మఫలమని హితము చెప్పుచున్నాడు.

సీ. **ఉదయాస్తమయములు నొనరిన యటువలె**
**నిదురలు మేల్కను నియమములును;**
**తులకించు సంజప్రొద్దులు మూటికైవడి**
**నలువొందుఁ దలఁప గుణత్రయమ్ము**
**పుడమి సస్యమ్ములు పొదలినచాడ్పున**
**నొడలిరోగమ్ములు నున్నయవియె;**
**ఉడుగని వెలుపటియుద్యోగములభంగి**
**కొనలిడు మితిలేని కోర్కిగములు;**

గీ. **అద్ది బ్రహ్మాండ ; మిద్ది పిండాండ ; మిందుఁ**
**జెలఁగుజీవుల ; మెవఁడు వెల్పలఁ గలండు**
**వాఁడు కలఁ డాత్మ వేంకటేశ్వరుఁడు; వాని**
**చరణశరణంబె భాగ్యంబు జన్మఫలము.** 219

బ్రహ్మాండమందు ఉదయాస్తమయములు నియతముగా నేర్పడు నటులే శరీరమునకు నిద్రాజాగ్రదవస్థలు కూడ. అందులో ప్రాతర్మాధ్యాహ్నిక సాయం సంధ్యలవలె దేహంలో సత్త్వరజస్తమో గుణములును. పొలములో పైరుల విధంగా దేహంలో రోగాలును. బాహ్యముగా జరిగే అనేకక్రియల మాదిరి శరీరములో పుట్టే కోరికలు కొనలువేయిచుండును. ఒకటి బ్రహ్మాండము. మరియొకటి పిండాండము. ఈ పిండాండములో ఉండే జీవులము మనము. వెలుపలనుండే ఆ వేంకటేశ్వరుడే ఆత్మయందును కలడు. ఆయనపాదాలను శరణుపొందుటే జన్మసాఫల్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అది బ్రహ్మాండం బిది | 363 | 373 | 4 | 250 |

అవ: హరినామమహిమను ప్రకటించుచున్నాడు.

సీ. పంచ పాతకులను పరమపావనులఁ గా
వించుకంటెను మంచివిద్య లున్నె ?
ఇనుమంత హరినామ మింతలోననె ముట్టు
పెంచు మాణిక్యపుబిళ్ళ సేసె;
మాలవిద్దెల మాపి మఱి బ్రహ్మవిద్యల
పాల్సేయుకంటెను బ్రతుకు గలదె?
నాల్క పైఁగల విష్ణునామమంత్రము చెప్పు
తోలుబిళ్ళఁ బసిండి దుడ్డు సేసె;

గీ. కుక్కఁ దెచ్చి గంగిగోవుకొదమగాఁగఁ
జేయనోపె నొక్కచిన్నిమాట
నాగశైలనాథునామంబు రోఁతయౌ
కక్కుఁగూటిఁ బాలకడలి సేసె. 220

పంచమహాపాతకములు చేసిన (బంగారము దొంగిలించుట, మద్యము త్రావుట, బ్రహ్మహత్య, గురునిభార్యతో పొందు - ఇవిచేయువారితో సహవాసము) మహాపాపులను సహితము పరమపవిత్రులుగా మార్చెడు విద్య లున్నవా ? లే వనుట. కాని అటు చేయగల్గిన దొక్క హరినామమే. ఆ నామము ముట్టరాని చిల్ల పెంకును గూడ మాణిక్యపుపదకముగా మార్చునది. అనగా పతితునిగూడ పావనుని చేయు మహిమగల దన్నమాట. నీచపుచదువులు మాన్పి బ్రహ్మము నెఱిగించు విద్యల మఱపుటకంటె వేరగు జీవిత మెద్ది? అనగా బ్రహ్మోపాప్తియే జీవితపరమావధియనుట. నాలుకపై విష్ణునామ మున్నచో అది హీనమగు చెప్పుతోలుబిళ్ళను గూడ దీనారము, టంకము అనెడు బంగారపునాణెముగా చేయును. అనగా భగవన్నామోచ్చారణ మహిమచే అత్యల్పుడైనను, అత్యధికు డగు ననుట. హరి యను రెండక్షరములుగల ఒక చిన్నమాట కుక్కను గంగిగోవుగా మార్చును. క్రక్కినకూటినైనను పాలసముద్రముగా చేయును. హరి నామమహిమ మట్టిది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నన్ను నింతసేయుకంటె | 74 | 44 | 4 | 390 |

అవ: హరినామస్మరణమహిమ నుద్ఘాటించుచున్నాడు.

సీ. నలినాక్షునామమ్ము కలిదోష హరణమ్ము
తలపోయఁ గైవల్యదాయకమ్ము
బహుఫలసారమ్ము బంధనిర్మూలమ్ము
తలఁచవో తలఁచవో తలఁచు మనస!
నగధరునామమ్ము నరక సంహరణమ్ము
జగదేకహితము సత్సమ్మతమ్ము
సగుణనిర్గుణము సాక్షాత్కారవిభవమ్ము
పొగడవో పొగడవో పొగడు మనస!

గీ. ఫణిగిరీంద్రునామమ్ము సంపత్కరమ్ము;
ఇందు నందును మివుల నానందకరము;
సౌఖ్యముల కెల్ల మూలమ్ము; సంతతమ్ము
తడవవో నీవు తడవవో తడవు మనస! 221

ఓ చిత్తమా! తామరలబోలిన కన్నులుగల ఆ గోవిందునినామము చూడగా కలిమలాపహారకము. మోక్షప్రదము. అనేకపుణ్యఫలముల సారమైనది. సంసారపు కట్టులను త్రెంచునట్టిది. అట్టి భగవన్నామమును ముమ్మాటికి స్మరింపుము. గోవర్ధనగిరి నెత్తిన ఆ పురుషోత్తమునినామము నరకములను నశింపజేయును. జగత్తులకు అ దొక్కటే హితమైనది. సాధువులకు నిష్టమైనది. ఆ నామము కల్యాణగుణ సహితము, హేయగుణరహితము. పరబ్రహ్మసాక్షాత్కారమును సమకూర్చునట్టిది. ఆ నామమును ముమ్మాటికి కీర్తింపుము. అది సంపదను, ఇహపరములందానందమును ప్రసాదించును. సకలసౌఖ్యములకును అది మూలకారణము. కనుక అట్టి హరినామమును ఓ మనసా! నీ వెల్లప్పుడు స్మరింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరినామము కడు | 309 | 409 | 4 | 274 |

అవ: మనసునిలుకడ లేకున్నదని, నిశ్చలమగు భక్తిని ప్రసాదింపు మని భగవంతుని ప్రార్థించుచున్నాడు.

సీ. వైరాగ్య మొకవేళ వాంఛింతు; నొకతఱి
నాఱడిసంసార మభిలషింతు;
మట్టుమీఱక కోఁతిమనసెందు నిలువదు
నిముస; మెన్నఁడు నాకు నిశ్చయమ్ము ?
కొంతతడవు సత్త్వగుణమందు నెలకొందు;
నంతలో రాజసుఁ డగుచునుందుఁ;
దామసగుణముఁ జెంతనె నేను చేకొందు
నెగడు టెన్నఁడు నాకు నిశ్చయమ్ము ?

గీ. ఒక్కవేళ వివేకియ ట్లొప్పుచుందు;
నవల మూఢుండనై యుందు నంతలోనఁ;
గాఁపురపుఁబ్రదుకాయెను కాల మెల్ల
నినుఁ దలఁచు నిశ్చయం బిమ్ము నీవె స్వామి! 222

ఒక సమయములో వైరాగ్యమును కోరుదును. వెనువెంటనే వ్యర్థపు సంసారమును వాంఛింతును. హద్దుపద్దులులేక కోతివంటిమనస్సు ఒకనిముసమైనను నిలుకడలే కున్నది. ఇక నాకు నిశ్చలమైన భగవద్బుద్ధి ఎప్పుడు కలుగును? కొంత సేపు సత్త్వగుణం కలిగియుందును. అంతలోపలనే రజోగుణం నాలో తలయెత్తును. వెంటనే తమోగుణములో ప్రవేశింతును. ఇక నాకు నిశ్చయబుద్ధి యెక్కడ ? ఒకపరి జ్ఞానిగా, అంతలోన మూర్ఖుడుగా నగుదును. కలకాలం సంసారమే బ్రతుకైనది. ఈ చపలునికి నీ పైని నిశ్చయబుద్ధిని స్వామీ ! అనుగ్రహింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలకాలము నిట్టే కాఁపురపు | 361 | 361 | 4 | 242 |

అవ: సకలము భగవత్స్వరూప మనుబుద్ధిని ప్రసాదింపు మని కోరుచున్నాడు.

సీ. చూడకమానవు చూచెడి నేత్రమ్ము
లితరమ్ము లెన్నేని నేడనేని ;
నిజముగా నయ్యవి నీరూపు లనియెడు
నీడువడని తెల్వి నీయఁగదవె!
పాఱకమానదు పాపంపుమనసిది
యీరనమ్ములతోడ నెందునేని
పద్మాక్ష! యదియు భవన్మయమ్మే యను
నీరీతితలఁపు నా కీయఁగదవె !

గీ. కాయవుసుఖమ్ము లెన్నేనిఁగలవు పుడమి;
గలుగ కెన్నఁడు మానవు; కలుగువేళ
నన్నియును నీకె యర్పణ మ్మనెడు భావ
మీయఁగదవయ్య! వేంకటాద్రీశ! శ్రీశ! 223

కనులు చూచెడుస్వభావము గలవి. అవి వేనినైనను ఎక్కడ నైనను చూడక మానవు. ఆ చూడబడు సమస్తము సాటిలేని నీరూపములే యనెడు జ్ఞానము నాకు దయచేయుము. పాపిష్ఠిమనను ద్వేషముతో ఎంతదూరమున కైనను పరుగెత్తక మానదు. తామరపూలవంటినేత్రములుగల ఓ తిరుమలయ్యా! ద్వేషముతో నాబుద్ధి ఎందెందు వ్రాలునో అదియంతయు నీవే యను తెలివి నాకు ప్రసాదింపుము.

ఈ భూమిలో శారీరకసుఖము లెన్నియో గలవు; వాని ననుభవింపక తప్పదు. ఆ యనుభూతసుఖము లన్నియు నీకే అర్పితము లనెడు తలంపు నాకు కలిగింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి నీవే సర్వాత్మకుఁడవు | 375 | 441 | 4 | 297 |

అవ: సంసారవుపాటులు తెలియుచు తెలియనితనము వహించి హృదయములో నున్న స్వామి నెఱిగి యిపుడు కర్మత్యాగ మొనర్చితి మని స్వానుభవమును తెల్పుచున్నాడు.

సీ. వినుచున్నవారము వెనుకటిపాటులు;
కనుచున్నవారము కలఁగువారి;
దినదినభావమ్ము దెలిసియుఁ దెలియదు
నాత్మలో భయ మిసుమంత లేదు ;
భువి నెఱుంగుదు మిదె పుట్టెడి దెసలను;
మఱి తలంచెద మిట్లె మరణములను;
వివరపుటాసలు విడిచియు విడువవు;
నవమౌ విరక్తియు నాటుకొనదు;

గీ. చదివెదము సర్వశాస్త్రాలు వెదకి వెదకి;
వేంకటేశ్వర ! మదిలోన వెలయుచున్న
నిను మఱచియుంటి; మియ్యదే నేఁడు కంటి
మెదుటఁ గనులార నింక మా కేల పనులు? 224

జీవులు గతంలో పడినపాట్లు వినుచున్నాము. తలక్రిందు లౌతున్న ఇప్పటి వారినిగూడ చూచుచున్నాము. దైనందినక్రియాకలాపములను తెలిసియు జ్ఞానోదయ మగుటలేదు. మనసున పాపభీతి కొంచెమైనను లేదు. నేలపై జననమరణములను గూర్చి తెలుసుకొనుచున్నాము; ఆలోచించు చున్నాము. ఆశలను ఒకపరి వదలియు మఱియొకతఱి విడువలే కున్నాము. క్రొత్తగా గాఢవిరక్తియు కల్గుటలేదు. వెదకి ఎన్నోశాస్త్రాలు చదువుచున్నాము. ఓ వేంకటేశ్వరా ! అయినను హృదయమందే యున్న నిన్ను ఇన్నాళ్లు మరచియుంటిమి. ఇదిగో ! ఈనాడు కన్నులార ఎట్టయెదుట నున్న నిన్ను కాంచితిమి. ఇక మాకు కర్తవ్యము లేమియు లేవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమని చెప్పెద | 367 | 394 | 4 | 264 |

అవ: స్వామిని శరణుజొచ్చినచో ఎట్టి వికారములు చెంతకు జేర వనుచున్నాడు.

**సీ. తనువికారమ్ములు తరువులు పెట్టినఁ**
**గొనయెఱు కైనను గొఱతపడును;**
**మనసువికారమ్ము మమతలఁ దవిలిన**
**నెనసి యెదుర్కొన నెవరితరము?**
**కంతువికారమ్ము కన్నులఁ గప్పిన**
**బటువైన విరతియు బయలె యగును;**
**చింతాలహరు లెల్లఁ జిఁదర రేఁగిన**
**నింతయు వీడ్కొన నెవరితరము?**

**గీ. అతిగుణవికార మాసలయందుఁ బెట్ట**
**సతతయోగంబు లవియెల్ల జడనువడును;**
**నీవె శరణని మతియందు నిన్నె కొల్వ**
**నితరమును డగ్గఱంగ నిం కెవరితరము?** 225

శారీరక మగు పరిణామ మెన్నిటినో కోరుచు తన్ను నిర్బంధింపగా జ్ఞానముకొంత లోపించును. మానసికముగా మమకార మేర్పడగా దానిని త్రోసిపుచ్చుట యెవరికి సాధ్యము ? ఎవరికిని సాధ్యముగా దనుట. మాన్మథికప్రకోపము కన్నుల నడ్డగింపగా స్థిరముగా నుండిన విరక్తి శూన్య మగును. చింతలపరంపరలు పెల్లురేగగా వానిని వదలుట ఎవరి తరము? ఎవరికిని తరముగా దనుట. సత్త్వరజస్తమోగుణములు ఆసలను గూర్పగా ఎడతెగని యోగములు కూడ మ్రాన్పడును. కనుక ఓ వేంకటాచలపతీ! నీవే శరణని నిన్నే సేవించుచుండగా ఇతరమును జేరుట ఎవరికి శక్యము? అనగా నిన్ను నమ్మినవారు ఇతరమును చేర రనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి నీకే శరణని | ౨68 | 401 | 4 | 26౨ |

అవ: సర్వసముడ నని గీతలో చెప్పి కొందఱిని పాపులుగా, మఱి కొందఱిని పుణ్యులుగా ఏల చేసితి వని భగవంతుని ప్రశ్నించుచున్నాడు.

**సీ. రావణాదికమైన రాక్షససమితిలో**
**నీవె దేవతలలో నీవ కావె**
**భావింప నసురులు పగవార లేలైరి**
**హితులయి రేటికి నివల సురలు?**
**సకలజంతువులకు చైతన్యమవు నీవె**
**యుపకృతినల్పిరే యొకరు నీకు?**
**అకట! కొందఱను బాపాత్ములుగాఁ జేసి**
**కొందఱఁ జేసితి గుణనిధులుగ**

**గీ. సమమతి నటంచు గీతలఁ జాటె దిట్టి**
**నేర్పునేరము లెవరివి? నీదుచిత్త**
**మవల మా భాగ్య మింతె; శేషాద్రిరమణ!**
**నీదుదాసులు ఘనులైరి నీదుకరుణ.** 226

రావణాదిరాక్షసులలో బ్రహ్మేంద్రాదిదేవతలలో అందరిలో నీవున్నావు. వితర్కింపగా రక్కసులు విరోధులు, అమరులు ఆప్తులు నీ కెందుకైరి? సకల ప్రాణులలో నీవు చైతన్యరూపుడవై యున్నావు. వీరిలో నెవరైనను నీ కేమైన ఉపకారము చేసినారా ? లేదు. కాగా కొందఱిని (రాక్షసులను) పాపులుగా, మరికొందఱిని (దేవతలను) పుణ్యులుగా ఏల చేసితివి? గీతలలో నే నందఱకు సమానుడను అనగా ఎవరి యెడ పక్షపాతం లేనివాడను. "సమోఽ హం సర్వభూతేషు నమే ద్వేష్యోఽస్తిన ప్రియః" అని చాటుకొన్నావు. కాని నీ నడవడి అందుకు భిన్నముగా ఉన్నది. ఈ నేర్పునేరములు మ రెవ్వరివి? గుణవంతులగు దేవతలదినేరుపని, పాపులగు రాక్షసుల వినేరములని, నీవి కావనియు భావము. ఫణిగిరిరమణా! అంతయు నీ చిత్తము, మా భాగ్యము. నీదయచే దాసులు గొప్ప వారైరి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సమమతి నని నీవే | 362 | 366 | 4 | 246 |

అవ: మాయామహిమచే కప్పబడిన జగమునందు సకలము సంశయాస్పదమేయని, భగవద్దాసుడైనచో మాయను జయింపవచ్చు నని హిత ముపదేశించుచున్నాడు.

సీ. నిన్నటిదివసంబు నిజమొ కల్లయొ నేఁడు
కనులఁగన్న ట్లాయెఁ గానరాదు
ఎన్న రేపటిదిన మేమియో యెట్లులో
యున్నట్టు తెలియరా దొహోహో! మాయ
భ్రమయో నిజంబొ యాబాల్యజన్మం బది
కతలాయె; కాలంబు గాలిఁబోయె
మఱి మీఁది మరణంబు మా టేమియో యెట్టొ
యొక్కింత తెలియరా దొహోహో! మాయ

గీ. అది నిజమొ కల్లయో మ్రింగినట్టి పిడుచ
గ్రక్కునం దోఁచె రుచియును గానరాదు;
ఒహోహో! కనవచ్చు నీమాయ నొకొట నీకు
దాసుఁడైనను శేషాద్రిధామ ! రామ ! 227

కడచినదినము నిజమో అబద్ధమో కాని ఆ నిన్నటిచర్యలు ఊహలో తోచుచున్నవి. గతదివసము కంటి కగుపించదు. ఆలోచింపగా రేపటిదిన మేమిటో ఎట్లుండునో యథాతథముగా ఇప్పుడు గోచరింపదు. ఆహా! మాయామహిమ! ఆ శిశుత్వము భ్రమయా? లేక నిజమా? ఇప్పుడవి కథలుగా నిలిచిపోయినవి. కాలము గాలిపాలైనది. గడచిపోయిన దనుట. మృతిచెందినతరువాత ఈ జీవుని స్థితి ఎట్టిదో కొంచెమైనను తెలియదు. ఔరా! మాయాస్వభావము ఎంతవిచిత్రము! తాను కబళము మ్రింగుట నిజమా? అబద్ధమా ? మ్రింగునపుడు రుచి తోచినది. మ్రింగిన తరువాత తోచుటలేదు. జీవు డిపుడు తాను చేసిన కర్మల కనుగుణముగా వెంటనే జన్మమెత్తునుగాని ఆ కర్మలను గూర్చిన జ్ఞాన ముండదు. ఓ శేషశైలనివాసా! నీకు దాసుడైనచో మాయను తెలియును.

మాయను జయించుటకు నీ దాసు డగుటయే మార్గము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బాపుబాపు దేవుఁడా | 369 | 407 | 4 | 273 |

అవ: సంసారము తప్పించుకొనుటకు శక్యము గానిది. మాయయో దుస్తరము. వీటిబారినుండి తన్ను కాపాడు మని స్వామిని వేడుచున్నాడు.

సీ. కలిమియే చిత్తవికారకారణ మగు;
దైన్యనిదానమ్ము తలఁప లేమి;
వలులంపటమ్ములు బంధబీజమ్ములు;
తలఁగిన నడవదు తనువుప్రోవు;
మహితయౌవన మెంచ మదములకుం జోటు;
తుద వార్ధక మ్మెంతొ దుస్సహమ్ము;
అర్థార్జనమ్ము యాతాయాతయాతన;
మానిన నాఁకలిమంట ఘనము;

గీ. ఎందుఁ బోరాని సంసార మిద్ది; యేమి
మాయ? యెన్ని గడించుట, మాను టెన్ని?
అంతరాత్ముండ వన్నిట నహిగిరీశ!
కన్నుదనియ ననుం గృప గావఁ గదవె. 228

సంపదయే మనోవికారమునకు కారణము. ఆలోచింపగా దారిద్ర్యమే దీనతకు మూలము. ఐహికమైన శ్రమలే బంధహేతువులు. శ్రమపడనిచో శరీరపోషణ జరుగదు. విచారింపగా అనర్థకారియైన యౌవనమే మదమునకు తోడైనది. కడపటిదశయందు ముదిమి సహింపరానిది. ధనసంపాదనము రాకపోకలశ్రమతో గూడినది. ధనసంపాదనము మానినచో క్షుద్బాధ తీరదు. ఈ సంసారము ఎటూ తప్పించుకొన సాధ్యము గానిది. మాయ చాల గొప్పది. ఈ సంసారములో ఏది సంపాదించుట? ఏది వదలుట? ఈ రెండును సాధ్యముగాని వనుట. ఓ ఫణిగిరినాథా ! అన్నిప్రాణులలో నంతరాత్మగా నున్నావు. కనులు తనియునట్లు దర్శన మిచ్చి నన్ను కరుణతో కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎందును బోరాదీ సంసారము | 380 | 464 | 4 | 313 |

అవ: అజ్ఞుడగు తన్ను గావుమని దేవుని ప్రార్థించుచున్నాడు.

సీ. చవిగొంటి నెత్తురు చన్ను బా లంచును
భువిఁ దొల్లి నోచితి పుట్టువునకె
ఎఱుఁగను కడుపులో హేయ మెయ్యదియొ కూ
డెయ్యదో యింక ని న్నెఱుఁగఁ గలనె ?
వెఱతుఁ జావునకు ముందఱఁ గాననేమి; లం
పటమైనఁ జాల వేసట వహింతు ;
వగపు నగవు నొక్కవదనమందే దాల్తుఁ
దలఁపు నీపై నాకు వెలయఁ గలదె?

గీ. భ్రమసితిని గొంతమన్ను నా రాజ్య మనుచు
సతులు సుతులంచుఁ గోరి సంసారి నయితి;
చూడు కృప నన్ను నే వెఱ్ఱివాఁడ నైన
నీవు వెఱ్ఱివి గావుగా వృషగిరీశ ! 229

నెత్తుటిని చనుబాలని చవిచూచితిని. భూమిపై జన్మకు నోచుకొంటిని. కడుపునగల మేధ్యామేధ్యముల నెఱుగని నేను నిన్నెటు లెఱుంగుదును? మరణమునకు భీతి చెందుదును. మీదిసంగతుల దెలియలేను. శ్రమగల్గినచో చాల విసుగు చెందుదును. ఒకముఖముననే ఖేదమోదముల ప్రదర్శింతును. అట్టినాకు నీ జ్ఞప్తి కల్గునా ? కొంతభూభాగము మారాజ్యమని భ్రమ చెందితిని. ఆలుబిడ్డల తగులముచే సంసారి నైతిని. వృషభగిరినాథా ! నన్ను దయతో చూడుము. నేను వెఱ్ఱివాడను. నీవు వెఱ్ఱివాడవు కావుగదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దైవమా వో దైవమా | 230 | 171 | 3 | 115 |

అవ: మానవుడు లోలుడైనను భాగవతు డైనచో సుఖించునని చాటుచున్నాడు.

సీ. కలలోన నింతులఁ గలసినయట్టులే
వెలిఁ గామినులతోడి వేడ్క లెల్ల
లలి నిందులకుఁగాను లంపటమ్ములఁ బడి
పలుమారు లూరక బడలెఁ బ్రాణి
విన్నటి యాహార నిజరుచివంటిదే
యొదవిన యిప్పటి యోగిరమ్ము
ఎన్నఁగా నిందుకే యిడుమలఁ బొరలుచుఁ
గన్నగతులఁ గడుఁ గలఁగెఁ బ్రాణి

గీ. పరున మంటిన పసిఁడికైవడిని పరమ
భాగవతపట్టములు గని బ్రదుకుఁ బ్రాణి
కరుణ బోధించవే నిజగతిని, నిన్నుఁ
గొలువక వృషాచలేశ్వరా ! యలసెఁ బ్రాణి. 230

స్వప్నమున స్త్రీలను గూడుట వంటిదే జాగ్రదవస్థయందును స్త్రీలకూటమి. అనగా ఈ రెంటియందును క్షణిక మగు ఆనందమే కల్గను. అవస్థాభేదమేగాని ఆనందానుభవములో భేదము లేదనుట. ఈ కూటమికై శరీరి శ్రమపడి పలుమారు వ్యర్థముగా బడలిక చెందుచున్నాడు. నిన్నతిన్న యాహారరుచి యెట్టిదో నేడుతినెడు ఆహారముకూడ అట్టిరుచి కలదే. ఒకపరి చవి చూచితిమిగదా యని ప్రాణి మానుట లేదు. అటువలెనే ఒకపరి సంభోగమువల్ల కలిగే క్షణికానందమేగదా మరల మరల కలుగుచున్నదని మానవుడు మానడు. ఇందులకై ప్రాణి పలుపాట్లు పడుచు నానావిధముల మిగుల వగల పొగులుచున్నాడు. పరుసవేదిసంబంధంవల్ల లోహం బంగారమైన రీతిగా నీభక్తి సంబంధంవల్ల పరమభాగవతుడై భక్తుడు మనగల్గును. ఓ వృషాచలాధీశా! దయతో నీ నిజతత్త్వమును బోధింపుము. నిన్ను సేవింపకయే ప్రాణి అలయుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కరుణించవే | 365 | 381 | 4 | 256 |

అవ: వేంకటాచలపతిని శరణుజొచ్చుటయే సర్వవేదశాస్త్రసార మని విశ్వసించుచున్నాడు.

సీ. **జన్మకారణ మగు సలుపంగఁ బుణ్యమ్ము**
**కలుష మ్మొనర్ప దుఃఖమ్ము గలుగు**
**నూరకుండినఁ బ్రపంచోల్లంఘనమ్మగు**
**నే రీతి నడచుట యిందిరేశ !**
**అన్నింటికిం దగులగు దయం దలఁపంగఁ**
**గొంకక కోపింపఁ గ్రూరతయగు**
**మఱి యూరకున్నచో మదమత్తత జనించు**
**నిఁక నేమిసేయుట యిందిరేశ!**

గీ. **ఇన్ని చిక్కులు మా కేల? యిట్టె నిన్ను**
**శరణుఁ జొచ్చుట మేలగు; సర్వవేద**
**శాస్త్రసమ్మతధర్మ మీ చంద మరయఁ**
**జేయఁగల వన్నియును నీవె శ్రీనివాస !** **231**

మానవుడు పుణ్యకార్యము లాచరించినచో తత్ఫలానుభవమునకై జన్మమెత్తవలసి వచ్చును. పాపము లొనర్చినచో దానివలన కష్టము లేర్పడును. ఈ రెంటిని సల్పక ఊరకున్నచో ప్రపంచము నతిక్రమించు టగును. కనుక ఓ యిందిరానాథా ! ఏ రీతిగా మెలగవలెను? దయ కలిగి యున్నచో అది యన్నిటికి బంధక మగును. జంకక కోపించినచో అది క్రూరత్వ మనిపించుకొనును. ఉపేక్షా భావముతో నున్నయెడల దానిచే మదమత్తత యేర్పడును. ఇట్టిస్థితిలో నేమి చేయుట? ఈ చిక్కు లన్నియు మాకెందులకు? అన్నిటికంటెను నిన్ను శరణు జొచ్చుటయే మంచిది. వేదములు, శాస్త్రములు సారభూతమైనధర్మ మిదే యని చెప్పుచున్నవి. చేయగల వన్నియును శ్రీనివాసా ! నీవే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ముట్టితేనే మూయైె | 365 | 382 | 4 | 256 |

అవ: వేదాంత మనగా నెట్టిదో వేంకటేశ్వరమత మెద్దియో వివరించు చున్నాడు.

**సీ. విరతియేలాభమ్ము విరతియే సౌఖ్యమ్ము**
**విజ్ఞాన మనఁగను విరతిపొమ్ము;**
**విరతిచే ఘనులైరి వెనుకటివా రెల్ల;**
**విరతిఁ బొందకయున్న విడదు భవము;**
**చిత్తమే పాపమ్ము చిత్తమే పుణ్యమ్ము**
**చిత్తమే కైవల్యసిద్ధిదమ్ము;**
**చిత్తమ్మువలననే శ్రీహరి నిలుచును**
**లేదు మనశ్శాంతిలేక పరము;**

**గీ. ఇదియ వేదాంత మన వేంకటేశుమతము**
**నిదియ; మతి యెంతచదివిన నింతకంటె**
**నేమిలేదు; శ్రీపతిదాసు లెప్పు డౌట**
**యెంతవారల కైనను నిదియ తెరువు.** 234

దేనియందును ఆస్థ లేకుండుటయే విరతి. అట్టివిరతి కలిగి యుండుటయే లాభము. సౌఖ్యమును, విజ్ఞానమును గూడ నిచ్చునట్టిదియు నదియే. కడచినకాలములోని వా రెందరో ఈ విరతిచేతనే గొప్పవారైరి. విరతి లేకున్నచో జన్మము వీడదు. పాపపుణ్యములకు మోక్షమునకు చిత్తమే కారణము. అట్టిచిత్తమును శ్రీశాయత్త మొనర్పవలె ననుట. నిశ్చలముగానున్న చిత్తములో శ్రీహరిని దర్శింప నగును. ఆత్మశాంతి లేకున్న పరము సిద్ధించదు. విరతి విజ్ఞాన చిత్తస్వాస్థ్య మనశ్శాంతులను బడయుటకంటె వేరు వేదాంత మేదియు లేదు. ఇవియే వేదాంతసారము లనుట. వేంకటాచలపతి కభిమతమైన మత మియ్యదియే. మరెన్ని శాస్త్రములు చదివినను పై వాని నభ్యసింపు డనియే అవి బోధించును. ఎంతవారలైనను శ్రీశునికి దాసు లగుటయే మోక్షమునకు మార్గము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇదియే వేదాంత | 363 | ౬69 | 4 | 248 |

అవ: స్వామిసందర్శనమునకై నానాదేశములనుండి భక్తిప్రపత్తులతో వచ్చెడి భక్తబృందమును వర్ణించుచున్నాడు.

**సీ. నానాదిశలనుండి నరులు సద్భక్తితో**
**వానలలోననె వత్తు కదలి;**
**సతులును సుతులును హితులు బంధులు పరి**
**చరులును గొల్వఁగా శతసహస్ర**
**యోజనవాసు లీ యోజ నువ్రతముల**
**తోడనే కదలివత్తురు; ముడుపులు**
**తలమూటలును జాలియల మణుల్ కరితురం**
**గములు చెల్వారంగఁ గదలి వత్తు;**

**ఆ. మకుటవర్ధనులును మండలేశులు జగ**
**దేకపతులు చతురు లెల్లవారు**
**వేంకటాద్రిరమణు వేడ్కఁ జూడఁగఁ బెక్కు**
**వగల సిరులతోడ వత్తు కదలి. 235**

అన్నిదిక్కులనుండియు భక్తులగుమానవులు భక్తియుక్తులై శ్రమకోర్చి జడివానలు కురియుచున్నను శ్రీనివాససందర్శనమునకై కొండకు వత్తురు. ఆలుబిడ్డలు, ఆప్తులు, చుట్టములు, సేవకులు కొలిచిరాగా వందల వేలమైళ్ళదూరమునుండి ఈ విధంగా పసుపుగుడ్డలు ధరించి ఉపవాస నియమములతో కాలినడకలతో వచ్చుచుందురు. ముడుపులు, తలమూటలు ధరించి కొందరు; సంచులనిండుగా ద్రవ్యము, రత్నరాసులు నింపుకొని మరికొందరు; ఏనుగులు, గుఱ్ఱములు వెంటరాగా రారాజులు పయనమై వత్తురు. కిరీటధారులు, మండలాధిపతులు, సమ్రాట్టులు, సమర్థులు-అన్నిరీతులవారు వేంకటాచలపతిని వేడుకతో చూడనెంచి పలురకములగు కానుకలు పట్టుకొని వత్తురు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నానాదిక్కుల నరులెల్లా | 67 | 346 | 1 | 231 |

అవ: శ్రీవేంకటేశ్వరుని మహాభూత మనుచు తద్దశావతారచర్యల నభివర్ణించు చున్నాడు.

సీ. పుడమి నందఱఁబట్టె భూత మియ్యది కడు
పొడవైన నల్లని భూత మిద్ది
కినుకతో నోడ మ్రింగెడి భూత మియ్యది
పునుకవీపున నొప్పు భూత మిద్ది
కనలి కవిసెడు చీఁకటిభూత మియ్యది
పొనుఁగు సోమపుమోము భూత మిద్ది
చేటపాదాలతోఁ జెలఁగు భూత మ్మిద్ది
పోటుదారల పెద్ద భూత మిద్ది
గాటంపుజడల బింకపు భూత మియ్యది
పొదలు నల్లముసుంగు భూత మిద్ది

గీ. ఏ తఱిని బిత్తలఁ జరించు భూత మిద్ది
పొలుపయిన దాట్లు వేసెడు భూత మిద్ది
పులుఁగుపయి స్వారిగావించు భూత మిద్ది
పొడవయిన శేషగిరిమీఁది భూత మిద్ది. 236

శ్రీనివాసు డొకభూతము. ఇది కడు పొడవైన నల్లనిభూతము. ఈ భూమిలోని సకలప్రాణులను ఆవహించియున్నది. అనగా సమస్తమున అంతర్యామిరూపముతో ఉన్నదనుట. "ఏకో విష్ణు ర్మహద్భూతం పృథక్ భూతాన్యనేకశః, త్రీన్ లోకాన్ వ్యాప్య భూతాత్మా భుంక్తే విశ్వభు గవ్యయః"- అని గదా శాస్త్రము. ఈ భూతము కోపించి ఓడనే మ్రింగివేయునట్టిది (మత్స్యావ తారం) .ఈ భూతము ఎముకచిప్పతో నొప్పు మూపుగలది (కూర్మావతారం) కోపముతో పైకొను స్వభావముగల్గిన ఈ భూతము చీకటివలె నల్లనైనది (వరాహావతారం). ఇది మహాభయంకరమైన ముఖముగలది (నారసింహావతారం). చేటలవలె విశాలములగు పాదములతో నొప్పు భూత మిది (వామనావతారం). పదునైన అంచులుగల్గిన గండ్రగొడ్డలిగల భూత మిది (పరశురామావతారం). దట్టమైన జడలతో బింకముగా నున్న భూత మిది(శ్రీరామావతారం). ఈ భూతము నల్లని మునుగు ధరించియున్నది (బలరామావతారం). ఏ సమయమం దైనను ఈ భూతము దినవెులతో తిరుగుచుండును(బుద్ధావతారం). చాకచక్యముగా దౌడుతీయు భూత మిది (కల్క్యవతారం). ఇది పక్షి నెక్కి సంచరించే భూతము.

మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః ।
రామో రామశ్చ రామశ్చ బుద్ధః కలికి రేవ చ ॥

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పుడమినిందరిఁబట్టె | 18 | 109 | 1 | 75 |

అవ: భగవంతుని కల్యాణగుణగణమును చాటుచు, అట్టివానిని సేవించి మోక్షము చూఱగొను డనుచున్నాడు.

సీ. వేయిరూపులు దాల్చు విశ్వరూపుఁ డితండు
శ్రీమంతుఁ డీతండు శ్రీవిభుండు
భారమౌ ధర మోయు బలవంతుఁ డీతండు
దాసుల మన్నించు దైవ మితఁడు
కుక్షిలో బ్రహ్మాండకోటులు గలవాఁడు
కృప వేల్పు మొఱ లాలకించువాఁడు
చెట్టదైత్యుల నెల్లఁ జించి చెండాడువాఁ
డిట్టే శరణమన్న నేలువాఁడు

ఆ. కాలకర్మములను గల్పించినట్టివాఁ
డిష్టమైన వరము లిచ్చువాఁడు
ఇంతదేవుఁ డెవఁడొ యెంచి చెప్పఁడు? శ్రీని
వాసుఁ గొలిచి మోక్షపదవి గనుఁడు. 237

ఈ శ్రీనివాసుడు పలురూపులను ధరించు సకల చరాచరాత్మక మైన ప్రపంచ స్వరూపుడు. సంపద గలవాడు. అంతియేగాక సంపదల కధిదేవతయైన లక్ష్మీదేవికి ప్రాణవల్లభుడు. బరువైన ప్రపంచమును మోయునట్టి బలవంతుడు. దాసులను కాపాడు దేవుడు. తన కడుపులో అనేకబ్రహ్మాండములను దాచుకొన్నవాడు. దయతో దేవతల మొఱల నాలకించువాడు. దుష్టులగు రాక్షసుల నందరిని చించి చెండాడువాడు. ఎవరైనను శరణన్న మాత్రమున కాపాడు వాడు. కాలమునకు, కర్మమునకు కర్తయగువాడు. కోరినవరములిచ్చే ప్రభువు. ఇట్టిదేవు డెవడో ఆలోచించి చెప్పడు? ఇం కెవరు? శ్రీనివాసుడే గదా ? ఆయనను సేవింపుడు; తరింపుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంతదేవుఁ డింక | 120 | 116 | 2 | 78 |

అవ: మోక్షమును నిర్వచించుచు దేహ జన్మ క్షుత్కర్మ కామముల సహజస్థితిని తెలుపుచున్నాడు.

సీ. **శ్రీహరి చేసిన చిహ్నమ్ము లివ్వి యీ**
**మోహమ్ము విడుచుటే మోక్ష మద్ది;**
**మలినం బనఁగ నేది? మడుఁగన నెయ్యది?**
**కలుషంపుమలములకాయ మిద్ది;**
**కలిగిన దెయ్యది? కడులేని దెయ్యది?**
**చలనంపుమాయల జన్మ మిద్ది;**
**తనిసిన దెయ్యది? తనియని దెయ్యది?**
**దినదిన మ్మాఁకలి తీఱ దిద్ది;**
**కొన యిందులో నేది? గుఱి మొద లెయ్యది?**
**పనిగొను కర్మంపుబంధ మిద్ది;**

ఆ. **నిండినట్టి దేది? నిండని దెయ్యది?**
**కొండలపొడవైన కోర్కి యిద్ది;**
**అండనే వృషాచలాధీశుశరణని**
**యుండుటే యిహపరయోగ మద్ది.** 238

ఈ కనిపించే సమస్తము శ్రీహరి తన మాయచే నిర్మించి నట్టిదే. దీనిపై మోజుపడకుండుటే మోక్షము. శరీరము సహజముగనే పాపకారణమైన అశుద్ధమున కాస్పదమైనది. మఱి దీనికి మడి యేమిటి? మైల యేమిటి? రెండును లే వనుట. ఈ జన్మము చంచలములైన మాయలతో గూడినది. ఇక దీనికి కలిమిలేము లెక్కడివి? ఒకపరి కలిమియు, ఒకపరి లేమియు తోచుచుండు ననుట. ప్రతిదినము ప్రాణికి ఆకలి తీఱకయే యుండును. కనుక దీనికి తృప్తియు, అతృప్తియు ఎక్కడిది? ఆ తృప్తియు, అతృప్తియు అనుదినము అనుగమించుచుండు నని భావము. ఈ సంసారము కర్మల ఫలముగా ఏర్పడినది గనుక దీనికి ఆద్యంతములు లేవు. కర్మబంధ మనాది యనుట. కోరిక కొండలంతపొడ వైనది. కావున ఒక కోరిక నెరవేరినను మీద మీద కోరికలు పుట్టుచునేయుండును. కాన దానికి పూర్తియు, పూర్తికాకుండుటయు రెండును లే వనుట. చెంతనేగల వృషాద్రినాథుని శరణు పొందుట ఇహపరసౌఖ్యము లందుటకు తగిన యుపాయము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| శ్రీహరి చేసిన | 84 | 406 | 1 | 272 |

అవ: భగవంతుని దర్శింపని, సేవింపని వాని బ్రతుకు నిరర్థక మని నిరూపించుచున్నాడు.

సీ. తెరువుదప్పి యడవి దిరిగెడు తెరువరి
వంటిది, చదువక వాదుసేయు
వాని పాండిత్యమ్ము వంటిది శరణంది
వైకుంఠుఁ గొలువనివాని బ్రదుకు;
పోల్కి దేవరలేని పూజవంటిది, కర్ణ
ధారుండు లేని సంద్రంపునడిమి
యోడ వంటిది, పురుషోత్తమువయి నేక
భక్తి యెసంగనివాని బ్రదుకు;

గీ. సజ్జనులు లేని ధర్మప్రచారసదము
వంటిది, మురారిమహిమలు పగటని కథ
వంటిది, యదక్షిణమ్ము సవమ్మువంటి,
దెపుడు పూవని కాయని వృక్షములను
ప్రోదిసేయుట వంటిది యాదిమూర్తి
ఫణిగిరీశ్వరుఁ గాననివాని బ్రదుకు. 239

స్వామిని శరణువేడి సేవింవనివాని బ్రతుకు రాచబాటను తప్పగొట్టుకొని ముండ్లతో గుండ్లతో నిండిన అడవిలో తిరుగు బాటసారి వంటిది. మరియు అది శాస్త్రపరిచయము లేకయే చర్చసేయువాని పాండిత్యము వంటిది. పురుషోత్తమునిపై ఏకాగ్రమగు భక్తిలేనివానిజీవితము దేవుడులేని గుడిలో చేసే పూజవలె, పడవనడుపువాడు లేని సముద్ర మధ్యమందలి నావవలె నిష్ప్రయోజనము; ప్రాణాంతకము గూడ. ఆదిమూర్తి శేషగిరినాథుని దర్శింపనివాని బ్రతుకు సాధువులులేని ధర్మప్రచారపరిషత్తు వంటిది; మురహరిమహిమల నుగ్గడింపని కథల వంటిది; దక్షిణలు లేని యాగమువంటిది; పూలుపూయని, కాయలు గాయని క్రోటనుచెట్ల పెంపకమువలె నిరర్థకమైనది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరిహరి జగ మెఱుంగ | 166 | 320 | 2 | 214 |

అవ: సర్వదేవాధికుడు శ్రీవేంకటేశ్వరుడే యని, శ్రీవారిసంబంధమగు సర్వము సర్వోత్కృష్ట మని చాటుచున్నాడు.

సీ. ఇలలోన దేవత లెందఱు గలుగనీ
పరతత్త్వ మా కరివరదుఁ డొకఁడె
ఇరవైన మంత్రమ్ము లెన్నియో యుండనీ
కమలాక్షునామ మొక్కండె మిన్న
పెద్దలసంఖ్య వేవేలుగా నుండనీ
గోవిందుదాసు లెక్కుడు దలంప
నీవలావలఁ బుణ్య మెంతైనఁ గలుగనీ
చక్రికైంకర్యమ్మె సాధనమ్ము

గీ. తొట్టగిల్లు శాస్త్రజ్ఞాన మెట్టు లున్న
వృషనగాధీశుపదభక్తియే ఘనమ్ము
ఎట్టి లాంఛనములు ధర నెన్నియున్న
మూల మా దేవదేవుని ముద్ర లొకటె. 240

లోకములో ఎందరు దేవత లున్నను పరతత్త్వమైనవాడు ఆ కరిని గాచినవాడే. ఒప్పిదమగు మంత్రము లెన్నియున్నను అన్నింటికన్న మిన్నయైనది ఆ కమలాక్షుని నామ మొక్కటే. లోకములో పెద్దమనుష్యులు వేలువేలుగా నున్నను ఆలోచింపగా ఆ గోవిందుని దాసులే వారిలో నధికులు. మాటిమాటికి పుణ్యకార్యము లెన్ని సలిపినను ఆ చక్రాయుధుని కైంకర్యమే ముక్తికి సాధనము. తొణికిసలాడే శాస్త్రపరిచయ మెంత యున్నప్పటికిని దానికన్నను మిన్నయైనది ఆ వృషశైలకాంతుని పదభక్తియే. ప్రపంచములో ఎన్నియెూ ఆకర్షణీయములగు చిన్నె లున్నను ఆ దేవాధిదేవుడైన శ్రీనివాసునితిరునామము, శంఖచక్రములముద్రలు మాత్రమే మోక్షమునకు మూలములు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలిగినది యొక్కటే | 90 | 442 | 1 | 296 |

అవ: శ్రీనివాసుని సేవాఫలము ప్రకటించుచున్నాడు.

**సీ. కనుగల్గి హరి గొల్చి ఘనులైరి గాక మున్**
**మనుజులు గారొకో మునులు దలఁప ?**
**మనసులో నిపుడైన మరగి కొల్చినవారు**
**ఘనులౌట కియ్యది గాదె గుఱుతు?**
**భావించి హరిగొల్చి పదవు లందిరి గాక**
**జీవులు గారొకో దేవతలును?**
**మనసిడి కొల్చిన మఱి పదవుల కేమి**
**నరుల కిందఱ కిది గుఱుతు గాదొ?**

**గీ. హరిని గొలుచుచు నేర్పరు లైరిగాక**
**యుర్వి నున్నట్టివారెగా యోగివర్యు**
**లంజనాచలవిభు నమ్మినట్టివార**
**లిన్ని చేకొంటకును గుఱు తిదియ గాదొ? 241**

మునులును మనుష్యులే యైనను అనన్యదృష్టులై హరినిగొల్చిన కారణముచేత వారు చాల గొప్పవారైరి. ఈ కలిలో గూడ శ్రీనివాసునిపై మనసు నిలిపి ఎవరు సేవించినను ఘనులౌదు రనుట కిదియే దృష్టాంతము. సనకాదులే ఇందు కుదాహరణము.

దేవతలు ప్రాణు లైనను భావించి హరిని కొల్చియే పదవులను పొందిరి. ఇంద్రాదు లుత్తమపదవు లందుటకు హరిసేవయే కారణ మనుట. మనసు నిలిపి సేవించినచో పదవులకు కొఱత ఏ మున్నది? మనుజుల కిదియే తార్కాణ. ధ్రువప్రహ్లాదులే ఇందుకు నిదర్శన మనుట. యోగులు భూమిపై నుండువారైనను శ్రీశసేవాఫలంగా వారు సర్వలోకసంచార నిపుణులైనారు. ఇందుకు నారదాదులే సాక్షులు. అంజనాచలనాథుని నమ్మి సేవించెడివారు సమస్తము పొందుదు రనుటకు పైవిషయమే ప్రబలమైన సాక్ష్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కనియుఁ గానని మనసు | 83 | 404 | 1 | 271 |

అవ: వేంకటాచలపతిదాస్యముతో బ్రతుకు డని హితవు గఱపుచున్నాడు.

**సీ. సర్వజీవావస్థ లుర్విని క్షణములో**
**గణుతింపఁగలవాఁ డొకండు గలఁడు**
**అతఁ డంతర్యామి యణుమహత్తులయందు**
**వానికి బంట్లమై బ్రదుకవలయు**
**పనిగొని యేలంగ బ్రహ్మాదిసురులందుఁ**
**గనుపించునాతఁ డొకండు గలఁడు**
**సిరిచెలువుఁ డతండు వరదాయి వానికిఁ**
**బనివార మగుచును బ్రదుకవలయు**

**గీ. శంఖచక్రధరుండయి సతతరక్ష**
**కుండు వేంకటవిభుఁడు గలం డొకండె**
**యాతని మఱుంగుఁజొచ్చి యనంతహర్ష**
**పారవశ్యంబుతోడుత బ్రదుకవలయు. 242**

ఒకక్షణములో జగతిలోని జీవు లన్నింటియొక్క అవస్థలను లెక్కింపగల్గిన మహాప్రజ్ఞావంతుడు (శ్రీవేంకటేశ్వరుడు) ఒక డున్నాడు. అణుమహత్పదార్థములందు ఆత డంతర్యామిగ నుండును. అట్టిస్వామికి సేవకులమై మనవలెను. ప్రయత్నముతో బ్రహ్మాదిదేవతలం దుండి భక్తులను గాచువా డొకడు గలడు. ఆతడు లక్ష్మీభర్త; వరము లిచ్చువాడు. అతనికి ఊడిగము చేయువారమై జీవింప వలయును. శంఖచక్రములు చేబూని ఎల్లపుడు ప్రాణిరక్షకుడైనవాడు శ్రీ వేంకటేశ్వరుడొకడు "కలౌ వేంకట నాయకః" అనునట్లు వెలసియున్నాడు. ఆతని శరణుజొచ్చి నిరంతరానంద పారవశ్యముతో జీవింప వలయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నేమే బ్రహ్మా మనుకో నేరము | 105 | 30 | *2* | 21 |

అవ: నిజమగు శ్రీవైష్ణవ మెట్టిదో తెలుపుచున్నాడు.

సీ. **భగవంతునకు మఱి భాగవతుల కప**
**చారమ్ము నలుపక నంతతమ్ము**
**నగధరుశరణమ్ము నమ్మి యాచార్యుని**
**వజ్జ వాయనిదె శ్రీ వైష్ణవమ్ము;**
**దురహంకృతియు సుఖదుఃఖముల్ పొరయక**
**ప్రాకృతజనములవైపు పోక**
**తమి దర్శనాభిమానముచేత ధర్మమ్ము**
**వదల కుండుటె వీరవైష్ణవమ్ము;**

గీ. **ఏ యుపాయమ్ము లొల్లక యితరదైవ**
**తేచ్ఛమాని, తీర్థప్రసాదేచ్ఛతోడ**
**గరుడశైలాధినాథుఁడే గతి యటంచు**
**భక్తియుఁ బ్రపత్తి గలుగుటే వైష్ణవమ్ము.** **243**

భగవంతునికి, భక్తులకు ఎప్పుడుగాని అపచారము చేయక, శ్రీనివాసుని శరణమునే నమ్మి గురువుగారి సామీప్యమును వదల కుండుటయే శ్రీవైష్ణవము. దురహంకారము లేక సుఖదుఃఖముల కతీతుడై మూఢజనముతో చేరక, ప్రీతితో స్వామి దర్శనాభిమానము గలిగి వైష్ణవధర్మములను వదల కుండుటయే అసలు సిసలైన వైష్ణవము-ఏయుపాయమును కోరక-

"సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః."

అను భగవద్వచనానుసారముగా దేవతాంతరోపాసనమును మాని గోవిందుని తీర్థప్రసాదములను సంగ్రహించుకొన వలెనను నాసతో అ దేవుడే పరమగతియని నమ్మి భక్తిప్రపత్తులు కలిగి యుండుటే శ్రీవైష్ణవము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ప్రపన్నులకు నిది | 166 | 317 | 2 | 212 |

అవ: కొందరు ఆ భగవంతుడు నీరూపు దని పల్కుచునే మూర్త్యారాధనము చేయుచున్నారు. వారట్లుపల్కుట విష్ణుమాయచేతనే యని ఆశ్చర్య పడుచున్నాడ

సీ. మొగమున విప్రులు మొలచినా రఁట! యాతఁ
డెంచంగ నవయవహీనుఁ డంట;
భుజముల రాజులు పుట్టినా రఁట ! కాని
తనువు లేనట్టిదా తత్త్వ మంట;
తొడలందు వైశ్యులు పొడమినా రఁట! వట్టి
బయలంట యా పరబ్రహ్మమూర్తి;
పాదాల శూద్రులు ప్రభవించినా రంట!
చూడ వానికి రూపు శూన్య మంట;
అంజలి ఘటియించు నఁట ! తాను; తన్గన
నా దైవమునకు లే వంట కనులు;
విన్నపా లొనరించు టున్నది యఁట! వాని
కాలకింపంగ లేవంట చెవులు;
తాను నైవేద్యంబు మానక యిడునంట
తినఁగ లేదంట దేవునకు నోరు;
రేపుమా పిడునంట ధూపంబు; కాని యా
తనికి లేదంట మూర్కొనఁగ ముక్కు;
తానె దైవంబఁట పూని యజ్ఞమ్ములు
నొరులకుఁ గావించుచుండు నంట;

ఆ. తా స్వతంత్రుఁ డంట! తపముల వరములు
స్వీకరించు నంట ! చెప్పఁ దాను
యోగి యంట! ముక్తి యొకటి లేదఁట ! యేమి
మాట లివ్వి? విష్ణుమాయగాక. 244

'బ్రాహ్మణోஉస్య ముఖ మాసీత్' - అను ప్రమాణంవల్ల బ్రాహ్మణు లాతని ముఖమునుండి పుట్టినా రని చెప్పుచునే అట్టివా డవయవములు లేనివాడనుచున్నారు. 'బాహూ రాజన్యః కృతః' భుజములనుండి క్షత్రియు లుద్భవించిరి అంటూనే ఆ పరతత్త్వమునకు ఆకృతియే లేదనుచున్నారు. 'ఊరూ తదస్య యద్వైశ్యః'- తొడలనుండి వైశ్యులు జన్మించి రని చెప్పుచు ఆ పరబ్రహ్మము వట్టి బయ లను చున్నారు. 'పద్భ్యాం శూద్రో అజాయత' - అడుగులనుండి శూద్రులు పొడమిరని చెప్పుచు, చూడగా నట్టివానికి రూపమే లేదనుచున్నారు. ఇట్లు పలుకుచ్చాడు ఆ దైవమునకు దోసిలొగ్గును. కాని తన్ను జూచుట కాదైవతమునకు కన్నులే లేవనును. తానేమో ఆ దేవునకు విన్నపములు చేయును గాని వినుట కా వేల్పునకు వీనులు లే వనును. నియతముగా తాను నైవేద్యములు స్వామికి నమర్పించును. కాని ఆ భగవంతుడు తినుటకు నోరులేనివా డని పల్కును. సాయంప్రాతస్సమ యములందు ఆ దైవమునకు ధూపము లిడును. వాసనచూచుటకు ఆ దేవునకు ముక్కులేదని వచించును. అంతటితో నాగక "అహం బ్రహ్మాஉస్మి" - నేనే దేవుడ ననును. ఇతరుల నుద్దేశించి యాగములు చేయుచుండును. కాని తానే స్వతంత్రు డనును. తపములు చేసి ఆ దేవునివలన వరములు పొందుచుండును. కాని తానే యోగి ననుచు ఇతరముగా ముక్తి లేదనును. ఈ మాటలు అసంబద్ధములు; పరస్పర విరుద్ధములుగదా ! ఇదంతయు విష్ణుమాయా విలసనముగాక మరేమిటి?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పురుషుండని శ్రుతి | 154 | 252 | 2 | 169 |

అవ: క్లేశముతో గూడిన జపయజ్ఞాదులు చేయలేనివాడు భక్తుడైనచో శ్రీవేంకటేశ్వరుడే అట్టివానికి రక్షకుడని విశ్వసించుచున్నాడు.

సీ. చిరకాలఫలములు చింతింప జపయజ్ఞ
దానకర్మమ్ములు తత్త్వ మరయఁ;
బుణ్యతీర్థస్నానములు పాపమోచన
ములు; దేవతాంతరపూజ లెంచ
స్వర్గాది భువన సంప్రాప్తి మూలములు; త
పఃకారణము లుపవాస ముఖ్య
నియమవ్రతమ్ము; లింద్రియనిగ్రహంబు దు
ర్లభము దేహులకు; ధర్మంబు నర్థ
కామమ్ము లైశ్వర్య కందముల్; సప్తసం
తాన భూదేవ సంతర్పణములు

గీ. ఖ్యాతి సంధాయకములు; వేంకటగిరీశ!
నరవి పుత్రదార క్షేత్ర సంగ్రహమ్ము
తలఁప సంసారభోగ; మే నలసుఁడ నివి
చేయఁగాఁ జాల; నీవె రక్షింపు మయ్య! 245

నిజ మాలోచింపగా జపములు, యజ్ఞములు, దానములు, సత్కర్మలు చాలకాలమునకు ఫలము నిచ్చునట్టివి. పుణ్యతీర్థములందు స్నానము చేయుటవల్ల పాపములు తొలగ వచ్చును. ఇతరదేవతల పూజలు స్వర్గప్రాప్తి నీయవచ్చును. ఉపవసించుట మున్నగు నియమవ్రతములు తపస్సునకు కారణం కావచ్చును. ఇట్టి వాచరించినను ప్రాణులకు ఇంద్రియనిగ్రహము కడు దుర్లభమే. ధర్మార్థకామములు ఐశ్వర్యమునకు కారణములు. సప్తసంతానములు అనగా తటాకము, నిధి, అగ్రహారము, దేవాలయము, వనము, ప్రబంధము, పుత్త్రుడు అనువాని నేర్పరచుట, బ్రాహ్మణసంతర్పణము కీర్తికి కారణములు. సాంసారికసుఖము లనుభవించుటకు, భార్యాపుత్రక్షేత్రాదు లుపయోగపడును. ఓ వేంకటాచలపతీ! నేను సోమరిని. పైవాని నాచరింపలేను. నీవే నన్ను కాపాడుము.

| సంకీర్త | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇవి సేయఁగ నే నలసుఁడ | 168 | 328 | 2 | 220 |

అవ: దర్శించుటకు, కీర్తించుటకు, సేవించుటకు స్వామి అంతసులభుడు కాడని, తానే కృపతో తనలో నుండి మన్నింపవలెనని అభ్యర్థించుచున్నాడు.

సీ. **వెదకంగ వశమౌనె? వేగుదాఁకను నాకుఁ**
**గదిసి నీ మూర్తివి గాన వశమె ?**
**శంఖచక్రమ్ముల స్వామివి నే నంచు**
**నీకు నీవే మ్రోల నిలుతు గాక**
**పొగడ నా వశమె? నీ పుణ్యగుణమ్ములు**
**తగులంగ వశమె? నీ తలఁ పెఱింగి**
**నిను నీవె చాటుక నిగమాగమముల, మా**
**యజ్ఞాన మంతయు నణఁతు గాక**

గీ. **కొలువ నావశ మౌనె? నీ గుఱు తెఱింగి**
**చెలఁగి చేతుల నిన్నుఁ బూజించ వశమె?**
**నీవె నాయెదలోపల నిలచి యుండి**
**నిశ్చలానంద మిడుచు మన్నింతు గాక.** 246

తెల్లవారుదాక నిన్ను వెదకుట నాకు సాధ్యమా? చేరి నీరూపము కనుగొనశక్యమా? అందుచే నీకు నీవే శంఖచక్రములు ధరించెడు ప్రభుడను నేనే యని నా యెట్టయెదుట నిలుతువుగాక! నీ పుణ్యచరితలను గీర్తింప నా తరమా? నీ బుద్ధి కని పెట్టి చేరుట నాకు సాధ్యమా! వేదవేదాంతము లందు నిన్ను గూర్చి నీవే తెల్పుకొనుచు మా యజ్ఞానమును తొలగింతువు గాక! నీ లక్షణము దెలిసి నిన్ను సేవింప నాకు శక్యమా! ఉత్సాహపడి నిన్ను పూజించుటకు నాకు శక్తి చాలునా? నీవే నా హృదయముననుండి ఎడతెగని యానందమును నాకు గలిగించుచు మన్నింతువుగాక!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దేవ నీదయ యెంతునో | 107 | 38 | 2 | 26 |

అవ: తన అజ్ఞతను తెలుపుకొనుచున్నాడు.

సీ. చిత్తమ్ములో నిన్నుఁ జింతింప నేరక
మత్తుండనై పులుమాసి నయితి
అఱుత లింగము గట్టి యది నమ్మఁజాలక
పర్వత మేగిన బత్తుఁడయితి;
లలిఁ జంక మేఁకపిల్లను బెట్టుకొని నూత
నరయు గొల్లవిపోల్కి నజ్ఞుఁ డయితి;
ముడుపు కొంగునఁగట్టి మూలమూలలయందు
వేమారు వెదకెడి వెఱ్ఱి నయితి;

గీ. విడువ కిక్కడ నుండంగ వేంకటపతి
పొడగనన్ లేని కడు మందబుద్ధి నయితి;
భూ రసాతల దివులందు పొదలు జంతు
నిచయ మాతని తనువని నేర నయితి. 247

ఓ శ్రీశా! నా హృదయమందే యున్న నిన్ను చింతనముచేయక మత్తిల్లి నీచుడనైతిని. మెడను లింగమును గట్టుకొని, దానిని నమ్మక శ్రీశైలాది పర్వతముల కెగుఁబ్రాకు భక్తునివంటివాడనైతిని. చంకలో మేకపిల్ల నిరికించుకొని బావిలో వెదకు గొల్లవానివలె మూఢుడ నైతిని. ధనమును కొంగున మూటగట్టుకొని మారుమూలలందు పలుమారు దానికొఱకై వెదకు వెఱ్ఱివాడ నైతిని. శ్రీ వేంకటాచలపతి అంతటను నిండియుండగా చూడలేని మందబుద్ధి నైతిని. ముల్లోకములందుగల సకలజీవు లాతని శరీరమే యని తెలిసికొనజాల నైతిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చిత్తములో నిన్ను | 3 | 20 | 1 | 13 |

ప్రథమసంపుటములోని 'ఎవ్వరిగాదన్న' అనెడి 9వ సంకీర్తనములోని రెండుపంక్తులు ఎత్తుగీతిలోని ఉత్తరార్ధపూరణకై గ్రహింపఁబడినవి.

అవ: ఫణిగిరీశా! వీడెంతటివాడులే యని ఒప్పరికింపక తప్పక నీ సేవకుని నన్ను గాపాడు మని మొఱపెట్టుకొనుచున్నాడు.

సీ. **విండుబండికి చేట, నీకు నే భారమా?**
**శరణుఁ జొచ్చితి నన్నుఁ దఱుమ వలదు;**
**ఏమి చేసినఁ గాతు వీ వని దురితమ్ము**
**నల్పినాఁడ జముని నరకుగొనక;**
**ఇతఁ డెంతలే యంచు నిటు లుపేక్షించిన**
**నే నెవ్వరి నెఱుంగ నిన్నె గాని;**
**మిముఁ గొల్చినట్టి గర్వమునఁ గాలమునందు**
**వేనరి కర్మముల్ విడిచినాఁడ**
**దొమ్మి కోపక చాలదూరము నీకు నా**
**కని పరాకు వహింప మనికి గలదె?**

గీ. **నీకు మ్రొక్కితి నను గొప్ప నిబ్బరమున**
**వేల్పుమూఁకల నే వెలివేసినాఁడ;**
**ననుఁ గరుణఁజూచి తేని పన్నగనగేశ!**
**వారె మెత్తురు నీదుసేవకుఁడ ననుచు.** 248

నాగనగనాయకా! బరువుగల బండికి చేటయు, నీకు నేనును బరువా? భారము కాదనుట. యమధర్మరాజును కూడ లెక్కపెట్టక, ఎట్టి అకృత్యములు చేసినను నీవు నన్ను కాతువని, పాప మాచరించితిని. వీ డెంతలే యల్పుడని నన్నుపేక్షించినచో నిన్ను తప్ప మరెవ్వరిని నేనెఱుంగను. నిన్ను సేవించుచున్నానను పొగరుతో ఆ యా కాలములందు చేయవలసిన విధ్యుక్తకర్మలను గూడ విడిచిపెట్టితిని. నా నిర్బంధమున కోర్వలేక నీకు నాకు చాల దూర మని నీవు పెడమొగ మైతివేని నా కిక బ్రతుకు గలదా? లే దనుట. నీ దానుడను గదా అనే నిబ్బరంతో ఇతర దేవతలను బహిష్కరించితిని. ఓ స్వామీ! నీవు నన్ను దయతో జూచినచో బహిష్కృతులైన ఆ దేవతలే నీ దానుడ నని భావించి నన్ను మన్నింతురు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వేసరకు వీఁడేల యనకుము* | 106 | 35 | 2 | 24 |

అవ: భగవంతుడు తాను పట్టినదే ధర్మము; చెప్పినదే సత్యము; జరిపించినదే న్యాయము, ఆచారము; చేసినదే నీతి; మెప్పించినదే మాట అని ఉగ్గడించుచున్నాడు.

**సీ. పరమపురుష! నీవు పట్టినదే ధర్మ;**
**మరసి చెల్లించిన దదియె సత్య;**
**మవని నీ రెంటికి నయ్యతోఁ బగగొన్న**
**ప్రహ్లాదునకుఁ దోడుపడుటె గుఱుతు;**
**నారాయణుఁడ! నీవు నడపినదే తగ;**
**వాచార మీ వొప్పునన్న యదియె;**
**అన్నతోడఁ బెనంగు ననుజు సుగ్రీవుని**
**కోరి నీవు వహించుకొనుటె గుఱుతు;**
**గీ. శ్రీనివాసుండ! నీవు చేసినదె నీతి;**
**చేవతో నీవొడంబఱిచినదె మాట;**
**తాతతోఁ బోరు నర్జునుతట్టు నిలిచి**
**తివిరి రణమునఁ జక్ర మెత్తినదె గుఱుతు.** 249

ఓ పరమపురుషా! నీవు పట్టినదే ధర్మము. చెల్లించినదియే మాట. ఈ రెంటికి నుదాహరణము: తండ్రితో విరోధించుట అధర్మముగ దోచినను దుష్టుడెవ డైనను ద్వేష్యు డగుట ధర్మమే యైనది. "యోగక్షేమం వహా మ్యహమ్" అని నీవు చేసిన బాసను ప్రహ్లాదు నుద్ధరించి సత్య మొనర్చుకొంటివి. నారాయణా ! నీవు దేనిని ప్రవర్తింపజేతువో అదియే న్యాయము. నీ వనుకొన్నచో అనాచారము గూడ ఆచారమే యగును. ఈ రెంటికిని తార్కాణ: "జ్యేష్ఠభ్రాతాపితృసమః" అను న్యాయమునకు విరుద్ధముగా సుగ్రీవుడు వాలితో పోరినను అది న్యాయమేయైనది. వాలిభార్యను సుగ్రీవుడు స్వీకరించుట అనాచార మైనను నీ వంగీకరించితివి గనుక ఆచారమే యైనది. శ్రీనివాసా! నీచేత లన్నియు నీతియుక్తములే; నీ వంగీకరింపజేసిన దంతయు సత్యవచనమే. తాతతో యుద్ధముచేయునట్టి అర్జునునకు సాయపడుచు చక్రము పట్టనని చెప్పిన నీవే భీష్ముని జంపుటకు చేత సుదర్శనము పట్టితివి గదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరుల కైతే | 165 | 316 | 2 | 212 |

అవ: భగవంతునిగూర్చి వారికార్యములగూర్చి కుశంకలు, కుచర్చలు పనికిరావని బోధించుచున్నాడు-

సీ. వేదార్థములు నీవు విహరించు సుద్దులే
కాదౌ ననెడి కొన్ని వాదు లేల?
ఎది నీవు చేసిన నియ్యకోలే; పొంటు
లెంచఁగ నేల? సోదించ నేల?
కర్మము లెల్ల నీకైంకర్యసాధనా
లందలి మేల్గీళ్ళ నరయ నేల?
ధర్మమందున గజదంతపరీక్షలా?
నెరసు లెన్నఁగ నేల నీదుసృష్టి?

గీ. భక్తి యొక రాచబాట; నీ భవ్య సేవఁ
దలఁవనేల? పాత్రాపాత్రతల గుఱించి
ముక్తిమూలంబు నీ పదాంభోజయుగళి
సక్తులయి నమ్మటలుగాక శంక లేల? 250

వేదార్థములందు నీ లీలలు కథలే. అవి కావు అవును అనెడి వాదులాట ఎందుకు? కూడ దనుట. ఏ పని నీవుచేసినను అది అంగీకార్యమే. అందులో దోషముల వెదకు టెందులకు? వెదుకరాదు; శోధించు టెందుకు? దానిని విమర్శించుటయు కూడ దనుట. అన్ని కర్మలును నీ కైంకర్యసాధనములే. కాన వాని బాగోగులను పరామర్శింపరాదు. ధర్మయుక్తమగు నీ సృష్టిలో తప్పిదము లెంచనేల? అది గజదంత పరీక్షవలె వ్యర్థ మగును. భక్తి యనునది ఒక రాజమార్గము. పూజనీయమగు నీ సేవయందు కొందఱు పాత్రులని, మఱికొందఱు అపాత్రులని తలచరాదు. నీపాదపద్మములను ఆసక్తులై నమ్మవలయునే గాని ఇతరశంకలు భక్తునికి పనికిరావు. 'గజదంతపరీక్షలా?' అనుటకంటె 'కాకదంత పరీక్షలా' అనుట సముచితము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ముంచిన వేడుకతోడ | 99 | 497 | 1 | 333 |

అవ: శ్రీవేంకటాచలపతి జగన్నాటకసూత్రధారి యని చమత్కారముగా వర్ణించుచున్నాడు.

సీ. **గురుతర మ్మయినట్టి కొట్టాము లోవల**
**తిరమైన పెనుమాయ తెరను గట్టి**
**యరయ నజ్ఞానమ్ము లవి యడ్డముగఁ జేసి**
**వరఁగ నుజ్ఞానదీపములు వెట్టి**
**తోలుబొమ్మల నెల్ల దొరఁకొని గడియించి**
**గాలిచే నవ్వానిఁ గదలఁ జేసి**
**తొరలెడి రసములు తొమ్మిది నమకూర్చి**
**నలువున నాడింప నలుమొగాల**

గీ. **నిన్ను మెచ్చెద రీలేరు నీ కెదియును**
**లేరు మన్నించు దాతలు వృషగిరీశ!**
**ఆత్మదాసులు పొగడ ని ట్లాటవారిఁ**
**గూడి యాడింపఁగా నధికుండ వయితి.** 251

చాల విశాలమగు పశువులకొట్టము (ప్రపంచము) నందు అచంచలమైన మాయ అను తెరను కట్టినావు. ఆమాయ తెలియరాకుండ అజ్ఞాన మనెడు అడ్డు నుంచితివి. మాయ కవ్వల సుజ్ఞానమనే దీపమును వెలిగించితివి. తోలుబొమ్మలను (జీవరాసులను) సంపాదించుకొంటివి. వాటికి ఊపిరి పోసి ఒప్పిదముగ ఆ బొమ్మల నాడింప దొడగితివి. అన్నివైపుల వారు నీ యాట మెచ్చుకొందురేగాని నీ కేమియు నిచ్చుకొను దాతలు లేరు. నిన్ను ప్రశంసించువారును లేరు. నీ భక్తులు నిన్ను పొగడుచుండగా ఈ విధముగా ఆడునట్టివారితో చేరి ఆడింపగా నీ వధికు డవైతివి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆటవారిఁగూడి తొరా | 27 | 163 | 1 | 110 |

అవ: శ్రీశుని చెయ్వులను విశదీకరించుచున్నాడు.

సీ. సూత్రధారుఁడవీవు ధాత్రికి; నీదుసూ
త్రమున నాడుచుమ సర్వంబు గలదు;
ఏడఁజూచిన నుందు; వెవరికిఁ గనరావు
స్వాతంత్ర్య మొకరిపై నైతు వీవు;
మఱపించఁ దలఁపించ మర్మజ్ఞుఁడవు భవ
త్సంకల్ప మీ చరాచరజగమ్ము;
మఱి యీశ్వరుండవు మాటల కందవు
కర్తలఁ గావింతు కడఁగి యొరుల

గీ. అందఱ మొఱాలకించుచు నట్టె ప్రోతు;
కానవచ్చె నీ మహిమ వేంకటనగేంద్ర !
యెడమడుగు సుంతయును లేక యెవరి నైన
సరిగ మన్నింతు; విత్తువు వరము లెన్నొ. 252

ఈ ప్రపంచమునకు నీవు సూత్రధారివి. ఈ విశ్వ మొక నాటక రంగమనుట. ఆ నీ సూత్రముమీద సర్వమును ఆడుచున్నది. అంతటను నీ వుందువు. కాని ఎవ్వరికిని గానరావు. నీవే కర్తవై యుందువు గాని కర్తృత్వము నొకరి కంటగట్టెదవు. స్మృతి విస్మృతులను కలిగింప గల్గిన మర్మ మెఱింగినవాడవు. "మత్త స్స్మృతిర్ జ్ఞాన మపోహనం చ" అని గీతావచనము. నీ సంకల్పము వల్లనే ఈ స్థావరజంగమాత్మక మగు ప్రపంచముయొక్క మనుగడ సాగుచున్నది. ఈ జగముల కన్నింటికిని నీవే ప్రభుడవు. నీవు వాచామగోచరుడవు. భక్తులమొఱల నాలకించుచు కాపాడుదువు. ఓ వేంకటేశ్వరా ! నీ మహిమ తెలియవచ్చినది. హెచ్చుతక్కువలు లేక ఎట్టివారి నైనను సమానముగ నీవు మన్నింతువు. ఎన్నో వరములిత్తువు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలియరాదు నీ మాయ | 169 | 335 | 2 | 224 |

అవ: భగవన్మాయామహిమముల కొనియాడుచున్నాడు.

సీ. ఏ పొద్దు నీ చేఁత లెదుటనే కనవచ్చు
వీపుదోఁపఁగ దాఁగు విద్యనీది-
మెకమునకును బూరి మేయంగ నేర్పిరా?
పిల్లలఁబెట్ట నేర్పించినారె?
నీరున్నచోటులు నెమకంగ నేర్పిరా?
యింతలు నీమాయ లింతెకాక;
తీవకు నేర్పిరా దిక్కుల కెగఁబ్రాఁక ?
నేర్పిరా తతియందు నెగడిపూవఁ?
బ్రక్కకొమ్మలు పెట్టఁ బరువడి నేర్పిరా?
యెనఁగు నీ మహిమమ్ము లింతె కాక

గీ. కోరి నేర్పిరె పక్షికి గూండ్లు గట్ట?
నలవడఁగ నేర్పినారె జాత్యన్నరుచుల?
నింతయును నీవు చేసిన సృష్టిగాక
వేతె కలదయ్య భువిలోన వేంకటేశ !. 253

ఎప్పుడు నీవు ఎన్నో పనులు ఎదుటనే చేయుచుండియు, అంతలోనే వీపు చూపుచు దాగునట్టి విద్యనేర్చినవాడవు. మృగములకు గడ్డిమేయుటను, పిల్లల ఈనుటను, నీరుగల తావుల వెదకుటను ఎవరు నేర్పిరి? ఇదంతయు నీ మాయయే గదా! తీగలకు నలుదిక్కులకు ప్రాకుటను, కాలంలో పుష్పించుటను, ప్రక్కకొమ్మలు వేయుటను ఎవరు నేర్పిరి? ఇంతయు నీ మహిమయే గదా ! పక్షులకు గూండ్లు కట్టుటను, జాతీయమగు ఆహారమును ఆరగించుటను ఎవరు నేర్పిరి? ఇది నీ సృష్టిలోని చిత్రముగదా! నీ మహిమతప్ప భూమిలో వే తేమున్నది ? సర్వము నీ మాయా మహిమమని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏపొద్దూ నీచేఁత లెల్లా | 169 | 333 | 2 | 223 |

అవ: భగవద్దర్శనము దుర్లభము కాగా తద్దాసదర్శనమువల్ల భగవద్దర్శన లాభము పొంద నగునని నిశ్చయించుచున్నాడు.

**సీ. పెక్కు బ్రహ్మాండమ్ము లొక్కొక్కరోమకూ**
**పమునందుఁ దాల్చిన ప్రభుఁడ వంట**
**ఘనమైన నీరూపు గనుఁగొను టెట్టులు?**
**శ్రుతుల కేని నగోచరుండ వీవు;**
**ఎన్నో శిరము లంట యెన్నో పదము లంట**
**గణియింప లేనన్ని కరము లంట**
**ఇట్టి నీమూర్తి నింకెట్టు కన్గవఁ గంట ?**
**కడకు యోగుల కచింత్యుఁడవు వీవు**

**ఆ. కోటిసూర్యు లొక్కమా టుదయించిన**
**యట్లు దేహదీప్తు లడరు నంట;**
**తిరుమలేశ! నిన్నుఁ దిలకించు టెట్టులు?**
**నీదుబంట్లఁ గనుట నిన్నుఁ గనుట! 254**

తిరుమలేశా! ఒక్కొక్కరోమకూప మందును అనేకములైన బ్రహ్మాండములు కలిగియుందు వట! శ్రుతులకు గూడ గోచరింపనివాడవు. అట్టి నీ మహారూపమును చూచు టెట్టులు? నీకు శిరస్సులు, పాదములు, కరములు లెక్కపెట్టుటకు అలవిగాని వట! ఇటువంటి నీ పరమాకారమును చూచు టెట్టులు? తుదకు యోగులకు గూడ భావించుటకుగూడ శక్యముగాని వాడవు. నీ శరీరకాంతులు ఒక్కసారిగా కోటిసూర్యు లుదయించినంత కాంతిగలిగి యుండునట.

"అనేకవక్త్రనయన మనేకాద్భుతదర్శనమ్,
అనేక దివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్.
దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్,
సర్వాశ్చర్యమయం దేవ మనంతం విశ్వతోముఖమ్.
దివి సూర్య సహస్రస్య భవే ద్యుగపదుత్థితా,
యది భా స్సదృశీ సా స్యా ద్భాసస్తస్య మహాత్మనః."

అని భగవద్గీత. స్వామీ! ఇట్టి నిన్ను చూచు టెట్లు? కనుక నీదాసుల దర్శనమే నీ సందర్శనము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీ వెంత నే నెంత | 168 | 330 | 2 | 221 |

అవ: చూడబడిన వనితాదులపైని వలవు క్రమంగా వారితోడి సంపర్కాదులకు దారితీసి చివరకు జన్మలకు కారణ మగునని కాలవశంచేత జ్ఞాన మేర్పడగా అపుడు నీ వతనిని గాతువని పల్కుచున్నాడు.

సీ. **తన యొట్టయెదుటివి తలఁపులోపలఁ బాఱు**
**మనసులోపలి పంటు మర్మములను;**
**ఘనమర్మములు రేఁగి కాయమ్ము గరఁగించు;**
**తనుసుఖం బవ్వలితనువు నంటు;**
**ఆవలి తనుభోగ మట్టి కర్మము లౌను;**
**చెందు లోకమ్ములై చెలఁగుకర్మ;**
**లా లోకములు చేరి కాలమ్ము గడపును;**
**తెగనికాలము గూర్చుఁ దెలివి, నిద్ర;**

గీ. **ఆ తెలివి నిన్నెఱింగించు; నట్టి యెఱుక**
**కీవు మెచ్చి వచ్చెదవు దయేక్షణముల;**
**నీవు మెచ్చిన నిచ్చెద విహపరాలు**
**మెఱయు నంతట నీ యీవి తిరుమలేశ!** 255

కనిపించిన వనితాదులపై కలిగే వలపు తన మనసున చేరును. ఆ మనస్సు నందలి సంకల్పములు ఆ వస్తువు ననుభవింప యోగ్యములగు అవయవములను ప్రేరించును. ఆ అవయవసంక్షోభముచేత శారీరకముగ నిలుకడ ఏర్పడును. అది శారీరకసుఖాభిలాషతో మఱొక శరీరముతో నేకీభవించును. ఆ శరీరంతో కలిగిన భోగానుభవముచే కొన్ని కర్మలుప్పతిల్లును. కర్మానుగుణమగు లోకాలను ఈ శరీరి చేరుకొనును. ఇట్లు ఎంతోకాలం గడచును. అనాదియగు కాలము జీవియొక్క కర్మానుగుణముగా తెలివినిగాని, యజ్ఞానమునుగాని కలిగించును. తెలివి (జ్ఞానము) జీవికి నిన్నెఱుకపఱచును. ఆ జీవి జ్ఞానమునకు నీవు మెచ్చుకొని దయారసం తొణికిసలాడే కన్నులతో వత్తువు. కోరిన వరము లిత్తువు. అపుడు నీ వరదాతృత్వము అన్నిదిశల వెలుగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒకటి కొకటి లంకె | 171 | 346 | 2 | 232 |

అవ: వేంకటేశ్వరుని రామావతారమును కీర్తించుచున్నాడు.

సీ. కొలిచినవారల కొంగుపైఁడి యితండు
భావింపఁ దారకబ్రహ్మ మితఁడు;
ఇనకులాంబుధినుండి యెగసిన తేజమ్ము
ఘనయజ్ఞముల పుణ్యగణ్యఫలము;
మనుజరూపమ్మున మనియెడి బ్రహ్మమ్ము
నెనుపారు రఘువంశనిధి యితండు;
పరమాన్నమందలి పరమసారవుఁజవి
బర్హిర్ముఖానీక భయహరమ్ము
మైథిలి మెడలోని మంగళసూత్రమ్ము
ధరణిలో రామావతార మితఁడు;

గీ. చకిత దానవ సంహార చక్రహేతి
సకల వనచర సంచయ జయకరమ్ము
వేంకటాచల శృంగాగ్ర విహరణమ్ము
ప్రకట దశరథనరపాలభాగ్య మితఁడు. 256

సేవించువారల కితడు కొంగుబంగారమువలె సులభుడు. ఆలోచింపగా నితడే తారకబ్రహ్మము. సూర్యవంశసముద్రమునుండి పుట్టిన తేజోరూపుడు, అనేకములగు గొప్పయాగములవలని బహుపుణ్యముల ఫలమైనవాడు, మానవాకారంతో మసలే బ్రహ్మము, రఘువంశమునకు గనివంటివాడు, పరమాన్నములోని సారవంతమగు రుచివంటివాడు, దేవతల భీతిని బాపినవాడు, సీతమెడలోని తాళిబొట్టు, భూమిపై రాముడుగా నవతరించిన బ్రహ్మము ఈతడే. భయంకరులగు రాక్షసులను చంపుట యందు చక్రాయుధంవంటివాడు, వానరులకు జయ మొసంగిన వాడు ఇతడే. అట్టివాడే వేంకటాచలముయొక్క శిఖరాగ్రంలో విహరించేవాడు. ప్రఖ్యాతిగాంచిన దశరథమహారాజుయొక్క భాగ్యమైనవాడు ఇతడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కొలిచిన వారల | 273 | 419 | 3 | 282 |

అవ: శ్రీనివాసపరబ్రహ్మమహిమము ప్రకటించుచున్నాడు.

సీ. **చేరి యశోదకు శిశువాయె నీతండు**
**ధారుణి బ్రహ్మకుఁ దండ్రి యితఁడు-**
**సొలసి చూచిన మాత్ర సూర్యచంద్రద్యుతుల్**
**లలి వెదచల్లు విలక్షణుండు;**
**నిలిచిన నిలువున నిఖిలగీర్వాణులఁ**
**గలిగించు దేవతాఖని యితండు;**
**మాటలాడినయెడ మఱి యజాండంబులు**
**కోటులు పొడమెడి గుణి యితండు;**
**నీటగు నూర్పుల నిగమమ్ము లూ రెడి**
**కందు కుం దెఱుఁగని కడలి యితఁడు;**

ఆ. **ముంగిటం బొలసిన మోహన మాత్మలఁ**
**బొంగఁ జేయు పరమపురుషుఁ డితఁడు;**
**వరఁగ మమ్మువంటి శరణార్థిజనులకు**
**నంగ మితఁడు వేంకటాధిపుండు.** 257

ఈ దేవుడే శ్రీకృష్ణుడుగా నవతరించి, యశోదకు చంటిబిడ్డ డాయెను. ఇతడు బ్రహ్మదేవుని గన్నతండ్రి. విలాసముగా చూచినచో సూర్య చంద్రకాంతులను విరజిమ్మె విలక్షణుడు. ఇతడు దేవతాఖని. కనుకనే నిలుచున్నవాడు నిలుచున్నట్లే దేవతలను సృజింపగల్గినవాడు. ఇతడొక పలుకు పలికినచో కోటులు బ్రహ్మాండములు పుట్టును. ఇతడు కల్యాణగుణయుక్తుడు. ఇతని దీర్ఘనిశ్వాసమునుండి వేదము లుద్భవించెను. ఉబ్బుసగ్గులు లేని సాగరమువలె నీతడు గంభీరుడు. వాకిట నుండు మోహనమూర్తి యితడు. జీవులను కడతేర్చు పరమపురుషు డితడు. ఈ వేంకటాద్రిప్రభువు మావంటి శరణాగతులకు అంగమైనవాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చేరి యశోదకు | 284 | 485 | 3 | 326 |

అవ: వేంకటాచలపతి ఆదినారాయణుడని, ఆతని మహాకార్యములను పొగడుచున్నాడు.

సీ. గరుడునిపై నెక్కి ఘనచక్రముం బట్టి
వైకుంఠముననుండి వడిగ వచ్చి
మకరిని ఖండించి మనిచె నా కరిరాజు
ననమవిక్రముఁడు నారాయణుండు;
కనకాంబరము గట్టి కౌస్తుభమ్మును మెడఁ
బెట్టి శ్రీతరుణి సేవించుచుండఁ
బనిపూని జయముతోఁ బాంచజన్యమువట్టి
యనుకంపఁజూపు నారాయణుండు;

గీ. త్రిదశులు నుతింప దిక్కులు తేజరిల్ల
ముదముతో దాసవర్గంబు మ్రొక్కు లిడఁగ
వదల కెల్లరకును బెక్కువరము లిచ్చు
నహినగేశ్వరుఁ డాదినారాయణుండు. 258

సాటిలేని పరాక్రమముగల ఆ నారాయణుడు గరుత్మంతు నధిరోహించి చక్రధారియై వేగంతో శ్రీవైకుంఠమునుండి వచ్చి మొసలిని ఖండించి గజేంద్రుని కాపాడినాడు. పీతాంబరము ధరించి, కౌస్తుభమణి మెడలో వ్రేలాడుచుండగా, లక్ష్మీదేవి తన్ను సేవించుచుండగా, పనిగట్టుకొని పాంచజన్యమనే శంఖము చేతబట్టుకొని భక్తులపై ఎంతో దయచూపును. దేవతలు స్తోత్రము చేయుచుండగా, తన కాంతిచే దిక్కులు వెలుగుచుండగా, భక్తబృందము ఆనందముతో మ్రొక్కుచుండగా, సకల దాసులకు సదా సర్వవరము లనుగ్రహించువాడు ఈ ఫణిగిరీశుడు ఆదినారాయణుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
| --- | --- | --- | --- | --- |
| త్రిజగముల నెరుఁగ | 290 | 523 | 3 | 351 |

అవ: వహేతుకముగ వృషగిరిపతిని సర్వాధికు డని నిరూపించుచున్నాడు.

సీ. ఆదిమపురుషుండు హరి దేవదేవుండు
 శ్రీవత్సచిహ్నుండు చిన్మయుండు
ఈవల నావల నిలువేలు పీతండు
 భావజగురుఁడు మా పాలివాఁడు;
జగదేకగురుఁడు శాశ్వతుఁ డనంతుం డచ్యు
 తుం డగజకు వరదుండు ఘనుఁడు;
తగ మమ్ముఁ బ్రోచెడు దైవతం బేలిక
 నిజబాంధవుండును నిగమమూర్తి

గీ. బహుళకలిదోషహరుఁడు కైవల్యవిభుఁడు
జనని జనకుండు వేంకటేశ్వరుఁడు; పరుల
నడుగ మీతఁడె మాదాత; యన్యు లీతఁ
డిచ్చు నట్టులు వరముల నీయ లేరు. 259

ఇతడు తొలివేలుపు. పాపములను హరించువాడు. దేవతలకును దేవుడు. శ్రీవత్సమనే పుట్టుమచ్చ గుఱుతుగా గలవాడు. జ్ఞానస్వరూపుడు. పలువురకు కులదైవము. మన్మథునకు తండ్రి, మాపాలిటి దైవము. జగత్తులన్నింటికి ఏకైక గురువు. కలకాలం ఉండువాడు. అంతము లేనివాడు. చ్యుతిలేనివాడు. ఈ ఘనుడే పార్వతీదేవికి వరములు ప్రసాదించినవాడు. తగురీతి మమ్ము గాపాడుదేవుడు; ప్రభువు; మాచుట్టమును ఇతడే. ఈ వేదమూర్తి కలిదోషమును పూర్తిగా హరించువాడు. మోక్షాధికారి. మాకు తల్లియు దండ్రియు నితడే. మే మితరులను యాచింపము. ఇతడే మా దాత. మఱెవ్వరును ఈతనివలె వరము లీయ లేరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇతరుల నడుగము | 291 | 526 | 3 | 353 |

అవ: మోక్షమన నెట్టిదో విశదీకరించుచున్నాడు.

సీ. హరిభక్తి గలిగిన యతనికి మోక్షమ్ము
        పొరుగున మున్నట్లు పొసఁగినదియు-
దర్శనభక్తిచేఁ దవిలినవారికి
        నిరవయి ముక్తి కట్టెదుట నుండు
మహితభాగవతాభిమానవంతుల కది
        చేతిలోనిది ముక్తి చెప్ప నేల?
మఱియు నాచార్యాభిమానవిరతులకు
        తనలోనిదై ముక్తి తనరుచుండు

గీ. ఇందులోనిదె మోక్ష మెంతెంతవారి
కెంత తర్కించి చూచిన నేమియేమి
చదివినన్; మోక్షముండును వదనమందె
తిరుమలేశు సంకీర్తనపరుల కెపుడు. 260

శ్రీనివాసునిపై భక్తిగలవానికి మోక్షము సమీపమున నున్నట్టిదే. స్వామి దర్శనమందు రక్తి గలవానికి ముక్తి స్థిరముగా తన కన్నులయెదుటనే యుండును. పూజనీయులగు దాసులందు అభిమానము (మమత్వము) గలవారికి ముక్తి హస్తగత మగును. ఇంకను గురువునందు అభిమానము గలవారికి మోక్షము వారిలోనే నెలకొనియుండును. ఎంత గొప్పవారికైనను, ఎన్ని వాదోపవాదములు చేసినను, ఎన్ని శాస్త్రములు చదివినను ముక్తి పైవానిలోనిదే. తిరుమలేశుని సంకీర్తనములందు ఆశగలవారి కెపుడును మోక్షము వారిముఖమునందే యుండును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తప్ప దీ యర్థ మొకటి | 269 | 395 | 3 | 266 |

అవ: జీవిజీవిత మంతయు దేవుని చిద్విలాసమే యనుచున్నాడు.

సీ. అంతరాత్ముఁడు దేవుఁడఁట దేహ మరయంగఁ
గర్మముల్ నలుపంగఁ గల్గిన దఁట!
జీవుఁ డెంతటివాఁడు శ్రీశునాజ్ఞలుగాక
పాపపుణ్యాలతోఁ బనియె లేదు;
హరి జగమ్ముల నేలు నఁట మాయకుం జిక్కి
నరులజీవనములు నడచు నంట
వెరవులు మా కేల విష్ణుఁ డింతయుఁగాక
బహువిచారములతోఁ బనియె లేదు

గీ. నాలుకను వేంకటేశ్వరునామ మంట;
పాడితో నాతనికి నేను బంట నంట;
త్రోవచూపఁగ నాతఁడే; తోడునీడ
వాఁడె; కోర్కులతో మాకుఁబనియె లేదు. 261

జీవులలో దేవు డంతరాత్ముడై యున్నాడు. ఆలోచింపగా దేహము కర్మాచరణమున కుపకరణమైనది. జీవు డల్పాల్పుడు. శ్రీపతి యాజ్ఞచొప్పున నంతయు నడచును. కనుక పాపముతో, పుణ్యముతో నిమిత్తము లేదు. శ్రీహరి జగత్తులకు ప్రభువు. ఆతనిమాయకు లోనై నరుల జీవితములు ధరలో నడచుచుండును. అంతయు విష్ణుడే గనుక మాకు అన్యోపాయము లనవసరములు. ఆలోచనములు పెక్కింటితో పనిలేదు. నా నాలుకపై శ్రీవేంకటేశ్వరుని నామ మున్నది. నే నాతనికి న్యాయసమ్మతుడైన సేవకుడను. మంచిదారి చూపువా డతడే. మాకు తోడునీడయు నాతడే. కాబట్టి ఎట్టి కోర్కులు మేము కోరుట లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నేరుపు నతఁడే | 283 | 476 | 3 | 320 |

అవ: శ్రీనివాసుడు తనకు రక్షకుడై యున్నాడని పరమవిశ్వాసముతో పల్కుచున్నాడు.

**సీ. ఇటు దానధర్మమ్ము లేమి చేయుట లేదు**
**పాతకా లెల్ల దైవమె వహించు**
**భువిలోన నాకింకఁ బుట్టంగఁ బనిలేదు**
**భవరోగవైద్యుఁ డా ప్రభువు గాన**
**ఎలమి స్వర్గాదు లేమి కోరుటలేదు**
**వైకుంఠ మెవుడొ శ్రీపతి యొసంగె;**
**నాకుఁ జావులతోడి నలఁకువ లిఁక లేవు**
**బలువుఁ డా యచ్యుతుబంటఁ గాన**
**గీ. సుఖము దుఃఖమ్ము నొల్ల; శ్రీశుండె యిచ్చె**
**నతులమైన బ్రహ్మానంద; మాఁకటికివి**
**దూపకును నాకు వలదు తోట్రుపు లింక**
**కాఁ పమృతమథనుండు తాఁ గలఁడు గాన. 262**

దానధర్మములు నే నేమియు చేయుట లేదు. నా పాపము లన్నింటిని దైవమునకే అప్పన చేసితిని. అతడే నా పాపములు హరించు ననుట. భవరోగ వైద్యుడు ఆ ప్రభువు గనుక నే నిక ఈ భూమిలో పుట్టను. ఏనాడో శ్రీపతి నాకు పునరావృత్తిరహితమైన వైకుంఠమును ప్రసాదించియున్నాడు. "న త ద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః, యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ." మా ముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్, నాప్నువన్తి, మహాత్మాన స్సంసిద్ధిం పరమాం గతాః" "ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తి నోஉర్జున, మాముపేత్యతు కౌంతేయ పునర్జన్మ న విద్యతే" అని గీతా వాక్యములు. అల్పకాలిక సుఖప్రదములగు స్వర్గాదులను నేను కోరను. ఆ మహాప్రభువునకు లెంకను గాన నాకు మరణబాధలు లేవు. ఆ శ్రీపతి సాటిలేనిబ్రహ్మానందమును నాకు ప్రసాదించెను. కాన సుఖదుఃఖముల కిష్టపడను. అమృతమును చిలికిన ఆ విష్ణుడు నాకు రక్షకుడై యున్నాడు గాన ఆకలిదప్పులకై నేను అలమటించను. అమృత మథనుడు కాపై యుండుటచే ఆకలిదప్పికలు నాకు ఉండ వనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| జీవన్ముక్తులము | 284 | 486 | 3 | 327 |

అవ: అన్నిపుట్టువులందు తనతో నున్న దేవుని, ఐహికసుఖములకు తన్ను లోనుగానీక కడతేర్చు మని ప్రార్థించుచున్నాడు.

సీ. **ఎల్లయోనులఁ దొల్లి నేఁబుట్టునాఁ డంత**
**రాత్మునుండ నీవెకా యకట! నన్ను**
**నింద్రియమ్ములఁ గట్టి యిటు వేడ్క సూతువా?**
**కన నాకుఁ బొత్తులకాఁడవు గద!**
**పొరిది స్వర్గ నరక సుఖదుఃఖములనాఁడు**
**కర్మసాక్షిగ నుండి గడియయైన**
**విడువ వెప్పుడు నన్ను; విషయాలఁ జిక్కితి;**
**నొప్పిరికింతె మా యప్పవు గద!**

గీ. లేదు నీచేతఁగానిది; నాదుప్రాణ
మీవు; నీకంటెఁ గాచుట కెవరు వత్తు;
రంజనగిరీంద్ర! నీ పాదకంజయుగళి
శరణ మంటి; నన్ బ్రోవ తేజంబుగాదొ! 263

నే నెన్నియో జన్మము లెత్తగా నీ వపుడు నాలో అంతర్యామివిగా నున్నావు గదా! అకటా! అట్టినీవు న న్నిపుడు ఇంద్రియాలతో బంధించి ఈ విధముగా వేడుకచూతువా? చూడగా నా అండనుండి నన్ను రక్షించువాడవు నీవేగదా! నేను స్వర్గనరకలోకాలలో సుఖదుఃఖములను అనుభవించేనాడు నీవు కర్మసాక్షిగ నుంటివిగదా! ఒకగడియయైనను నన్ను విడిచి యుండిన వాడవు కావుగదా! నీవు నా తండ్రివిగదా! ఇంద్రియార్థములచే ఆకృష్టుడ నైతిని. ఇవు డిటు లుపేక్షింతువా? నీ కసాధ్యమైన దేదియు లేదు. నీవే నాప్రాణము. నన్ను బ్రోచుటకు నీవుగాక మరెవ్వరు వత్తురు? ఓ అంజనాద్రినాథా! నీ పాదములజంటను శరణంటిని. నన్ను గాచుట నీకు కీర్తికరముగదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| **అంతర్యామీ** | **279** | **458** | **3** | **308** |

అవ: ఇడుమ లన్నిటి నుడిపి ఉద్ధరింపగా వేంకటాచలపతియే దిక్కని మ్రొక్కుచున్నాడు.

**సీ. భవసాగరమ్ములోఁ బడి యుద్దుగుడిచెడి**
**నాకు నీ నామమన్ నౌక దిక్కు**
**చెలరేఁగు కర్మమన్ చిచ్చు సొచ్చిన నాకు**
**నాచార్యకరుణామృతాబ్ధి దిక్కు;**
**మోహ మ్మనెడు గాలిఁబోయెడి నాకు నీ**
**గొప్పయడుగు చింతకొమ్మ దిక్కు;**
**మనసను నాకసమ్మున వ్రేలు నాకు నీ**
**ఘనదాస్య మనియెడి గరుడి దిక్కు;**

**గీ. భూరిసంసార మను మంటిపొరలక్రింద**
**నలఁగు నాకు భవద్భక్తి బిలము దిక్కు;**
**ఎందు గతిలేదు శ్రీవేంకటేశ! మనుప**
**నంతరాత్ముండ వీవె గదయ్య! దిక్కు.** 264

ఓ వేంకటేశా! పుట్టుక లనెడి సముద్రంలో పడి తికమకలాడే నాకు నీ నామమనే నౌకయే రక్షకము. విజృంభించే కర్మఫలానుభవమనే దావానలంలో ప్రవేశించిన నాకు గురుదేవుల దయయనెడు పాలకడలియే దిక్కు. మోహమనే గాలిలో కొట్టుకపోతున్న నాకు నీ పాదమనెడు చింతకొమ్మయే ఆధారము. దిక్కు తెలియక మనసనే ఆకసమున వ్రేలాడే నాకు నీ కైంకర్యమనే గరుడుడే రక్షకుడు. అంతులేని సంసారమనే మంటిపొరలక్రింద ఊపిరియాడని నాకు నీ పదభక్తి యనెడు పర్వత బిలము దిక్కు. మరెక్కడను నాకు గతి శూన్యము. నన్ను గాచుటకు అంతరాత్ముడవై యుండేనీవే కదా దిక్కు ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| **మఱి యెంచూ గతిలేదు** | 135 | 146 | 2 | 98 |

అవ: తాను పాపకార్యము లాచరించిన గుణహీనుడ నని, యమునిబాఱి బడ నీయక తన్ను గావుమని వేంకటాచలాధినాథుని అభ్యర్థించు చున్నాడు.

సీ. ఆచరించిన శిశుహత్యలు గోబ్రహ్మ
హత్యలు లెక్కింప నలవి గాదు-
ఈసున నెఱిఁగియు నెఱుఁగక చేయు నా
కలుషకార్యములకుఁ గడమ లేదు;
నాదు వాచవులకై నమలు దుర్గంధశా
కములకు దొమ్మలకు మితిలేదు;
జముబారినుండి యే సరణి రక్షింతువో
గ్రక్కున శేషాద్రిరామరామ!

గీ. పరధన పరాంగనావాంఛ లరయ నాకుఁ
గొలఁది యిడరాని ఇటువంటి గుణవిహీనుఁ
గరుణ నెటువలెఁ గాచెదో దురిత ముడిపి
గ్రన్ననన్ వేంకటాచలరామరామ! 265

శేషగిరిపై వేంకటేశ్వరుడుగా వెలసిన ఓ రామా! నేనుచేసిన శిశు గో బ్రాహ్మణ హత్యలు లెక్కింప నలవి గానివి. ఈర్ష్యచే తెలిసితెలియక నేను చేసిన పాపకార్యములు అంతు లేనివి. జిహ్వాచాపల్యంతో నేను నమలిన పాసిన, క్రుళ్ళిన కూరగాయలకును, మాంసపుముక్కలకును మితిలేదు. శేషాద్రిరమణా! అవసాన సమయంలో యమునిబాఱి నుండి నన్ను తప్పింతువో లేదో? అది నీకే ఎఱుక. వేంకటాచలపతీ! ఇతరులసొమ్మును, స్త్రీలను అపహరించవలెనను ఆశ నాకు మెండు. నేను ఇట్టి గుణహీనుడను. అట్టి నాపాపములను పరిహరించి మించిన కరుణతో వెంటనే ఎట్లు నన్ను గాపాడెదవో ఇంక నీ యిష్టము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సతతము నేఁజేయు | 66 | 341 | 1 | 228 |

అవ: తాను పుణ్యపాపము లెఱుగని మందుడని, అట్టి తన్ను కాపాడుమని భక్తుడు శ్రీనివాసునికి మొఱపెట్టుకొనుచున్నాడు.

సీ. **ఆ రీతి నేను బ్రాహ్మణుఁడ నంటయె గాని**
**యాచారమునకు దేహము గొలుపదు;**
**తద్ద వైష్ణవుఁడను పెద్దఱికమె గాని**
**జ్ఞాన మించుక లేదు మానసమున;**
**చదివితి ననియెడి చలపాదితన మింతె**
**యదన నందలి పరమార్థ మెఱుఁగ;**
**రహిని సంసారమన్ బహురూపమే గాని**
**సామర్థ్య మిందు వీసమ్ము లేదు;**

గీ. **అకట! నీభక్తుడను తేజ మొకటె గాని**
**చేతులారంగ నిన్నుఁ బూజించ నేర;**
**నేను మంగేశ! నీ చేతిలోని వాఁడ**
**పాపపుణ్యంబు లెఱుఁగఁ గాపాడు మయ్య!** **266**

పేరుకు నేను బ్రాహ్మణుడనే కాని బ్రాహ్మణాచారములను పాటించుటకు నా శరీరము సహకరింపదు. మందుడను కనుక యని భావము. పైకి నేనుగూడ వైష్ణవుడననే గొప్పతనమేకాని ఆ వైష్ణవమునకు సంబంధించిన జ్ఞానం కొంచెము కూడ మనస్సునం దైనను నాకు లేదు. శాస్త్రములు చదివితి నను గర్వమే కాని ఆ చదువులలో మర్మమెల్ల అక్కఱకు వచ్చుట లేదు. సంసారమనే నాటకాన్ని ఆడుచున్నానే గాని దానిని సక్రమంగా నడిపే సామర్థ్యం వీసమైనా లేదు. ఆహా! నీ దాసుడ ననే పేరేగాని చేతులార నిన్ను పూజింపలేను. ఓ మంగాప్రియా! నేను నీచేతిలోని కీలుబొమ్మను. పాపపుణ్యము లెఱుగను. ఎట్టకేలకు నన్ను కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కమలారమణ | 154 | 255 | 2 | 171 |

అవ: సుఖమన నెట్టిదో వివరించుచున్నారు.

సీ. ఒరుల వేఁడకయున్న నున్నచోటు సుఖంబు,
పరనింద విడుమఖావంబె సుఖము;
పరవిఁ గినియకున్న జన్మ మెల్ల సుఖంబు,
హరిఁ గొల్చువారికి జరయు సుఖము;
తనువు సుఖము కానివని సేయకుండిన,
మౌనమ్ముతో నున్న మరులె సుఖము;
దీనత విడిచిన దినము లెల్లను సుఖం
బన్నిట సుఖము శ్రీహరి దలఁచిన;

గీ. చలమువీడిన యెడ ననిశమ్ము సుఖమె;
యాశ లుడిగిన నిహ మెల్ల నమితసుఖము
ఫణిగిరీశ్వరుదాసులై వారు - వీని
మెలఁకువ జయించినను క్రింద మీఁద సుఖమె. 267

ఇతరులను ప్రార్థింపకున్న తా నున్నచోటే తనకు సుఖప్రదము. ఇతరులను నిందింపకుండుట సుఖము. కోపము లేకున్నచో ప్రపంచ మంతయు సుఖమయమే. శ్రీహరిసేవకుల కెప్పుడును సుఖమే. కానిపనికి పూనుకొనకున్నచో ఈ కాయమే సుఖమయము. మౌనముతో నున్నచో మరులైనను సుఖమే. దైన్యము లేకుండిన ఎవ్వడును సుఖమే. శ్రీహరిస్మరణము సర్వత్రసుఖదము. మాత్సర్యము లేకున్న ఎల్లప్పుడును సుఖమే. ఆశలను వదలినచో ఈ లోకమంతయు సుఖప్రదమే. శేషాద్రి నాథునిభక్తులు పైవానిని జయించినచో ఈ లోకము, పైలోకముగూడ వారికి సుఖముగూర్చు నట్టివే యగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చంచలము మానితేను | 2[illegible]2 | 414 | 3 | 27[illegible] |

అవ: అజ్ఞానియగు జీవుడు మరి మరి పతనకార్యములకు పాలువడు చున్నాడని హెచ్చరించుచున్నాడు.

సీ. ముఱికిదేహ మొకటి మోయుచు మోవఁ గా
మింతు నీవు ముఱికి మేనిచెలుల
హేయమ్ము కడుపులో నింత నింపుక వెండి
హేయ మాటకుఁ దిన నిచ్చగింతు;
పసిఁడి కమ్మడువోయి పరులను భజియించి
పైఁ బెట్టి వాంఛింతు పైఁడిసొమ్ము;
కడుఁ బాపపుణ్యాలఁ బెడకేలు గట్టించు
కొని యవియే పల్కఁ గోరుచుందు;

గీ. పంచభూతాలచేఁ బట్టువడియు మరలఁ
బంచభూతదేహాలను పంబంధు లనుచు
పమనరించెద; వేపలే పనవు; మఱతు
వవురా! శ్రీ వేంకటేశ్వరుఁడాత్మ నున్న. 268

ఓ జీవుడా! నీవు మలినశరీరమును మోయుచు మలిన దేహములు గల మగువలను పై వేసుకో గోరుదువు. ఏవగింపదగిన మలమూత్రాదులను నీవు కడుపు నిండుగా కలిగియుండి మరి యా మలినములనే అధికపఱచు ఆహారముల తినగోరుదువు. ద్రవ్యమునకై నీవు పరుల కమ్మడువోయి వారిని సేవించి, వారివల్ల లభించే ధనంతో నగలునట్ట కొని ధరించి కులుకుచుందువు. మిక్కుటముగ పాపములను, పుణ్యములను ఆచరింతువు. అవి నీ పెడకేలుగట్టివేయును. అనగా తత్ఫలాను భవమునకై నీకు జన్మ లేర్పడు నట్లుచేయు ననుట. ఐనను నీవు మరల మరల ఆ పాపపుణ్యములనే సలుపక మానవు. పంచ భూతములచే పుట్టినవాడవయ్యు పాంచభౌతికదేహాలను చుట్టము లని మురియుదువు. నావల్ల గాదనక వారినే అనుసరింతువు. ఔరా! శ్రీశేషాచలపతి మనమున నున్నాడనుట మరతువు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బాపురే వో ప్రాణి | 268 | 391 | 3 | 263 |

అవ: పుణ్యాచరణాదులకంటెను శ్రీశుదాసులై మనుట మంచిదని హిత ముపదేశించుచున్నాడు.

సీ. ఇసుక లెక్కిడఁ బూన నెం తెంతయో గల
 దటువంటివే పుణ్ణియములు దలఁపఁ;
గొలఁదిమీఱిన దేవతలఁ గొల్చుకంటె శ్రీ
 హరివారలై సుఖ మంద రయ్య!
గోడఁ గడుగఁ బోవఁ గొనదాఁక రొంపియే
 తర్కవాదమ్ములు తాదృశములు
అఖిమతాలవాఁడై చరించుటకంటె
 శ్రీపతివారలై చెలఁగ రయ్య!

గీ. మనసునం బాలుద్రాగిన మట్టుమేర
లేదు సంసారభోగమ్ము లీదృశములె;
ప్రతిదినతపమ్ములన్ బడల్పడుటకంటె
తనిసి మంగేశుదాసులై మనఁగ రాదొ! 269

ఇసుకవలె ఎంతకు తరుగని పుణ్యము లనంతములై లెక్కిడ శక్యముగాకున్నవి. అనంతదైవతముల గొల్చుటకంటె ఒక్క శ్రీహరినే కొలిచి సుఖింపుడు. గోడను కడుగ బూనినచో కడవరకు అంతయు అడుసేగదా! అటులే తర్కవాదములకు దిగినచో అవి కడవరకు నిశ్చితాభిప్రాయమును తేల్చక వాదములుగనే మిగిలిపోవును. ఇతరమతములను స్వీకరింపక శ్రీనివాసునిదాసులై జీవింపుడు. మానసికముగ పాలుద్రాగుటలోవలె సంసారసుఖాదులకు గూడ హద్దుపద్దు లుండవు. ఎడతెగని తపములచేత డస్సిపోవుటకంటె తృప్తులై మంగాప్రియునికి దాసులై మన వచ్చునుగదా! మరి ఆ పనిచేయుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతనిలోనే యణఁగె | 298 | 568 | 3 | 381 |

అవ: ఛాయాపహారులైన కవిబ్రువులను పదకవితాపితామహులైన శ్రీతాళ్లపాక అన్నమాచార్యులవారు తూలనాడుచున్నారు.

సీ. వెఱ్ఱులారా! మీకు వేఁడుక గలిగిన
 నఱ్ఱువంచి తడక నల్లరాదొ
ముడిచివేసినపువ్వు ముడువ యోగ్యము గాదు
 కుడిచివేసిన పుల్లె కుడువఁ దగదు
ఒకరు చెప్పినదాని నొకరు చెప్పఁగఁ బోవ
 నఖిలాండవతి కది యర్హ మగునె?
గంపెఁ డుముక దినఁగా నొక్కవరిగింజ
 గలసిన నెట్టులు దెలియవచ్చు?
జంపులఁ బలవరించఁగ మంచిమా టొక్క
 టింపైన గోవిందుఁ డిడునె వరము?
ఉమిసినతమ్మలో నొక కొంతకప్రమ్ము
 నించి మేలని చప్పరించ నేల?
అమరంగ ఛాయాపహారులై తమమాట
 గూర్పి హసింపఁడో కొండలప్ప?
చిబికివేసిన గింజ చేతఁ బట్టఁగ నేల?
 గఱుకు కెంగిలిబూరెఁ గడుగ నేల?
తొబక కవిత్వంపు దొసఁగులఁ బొరలిన
 దిఱుకార నవ్వఁడే దేవుఁ డైన?
మించుచలిఁదికూటిమీఁద నుమిసినట్లు
 మంచి దొక్కటిచెప్పి మౌన మూని
కంచుఁ బెంచును నొక్కగతి నదికిన ముట్టు
 పెంచువలెనె చూచు విభుఁడు వాని;
పుచ్చినపండులో బూఁజు నిండుగ నుండు
 బచ్చెనకవితలు బ్రాఁతిగావు
ముచ్చుగనిన తల్లి మూల కొదిగినట్లు
 ముచ్చిమి నుతులేల మ్రొక్కుఁ డతని;
కుల్లి దినిన కోమ టూరకయున్నట్లు
 జల్లెడ నావాలు జాఱినట్లు
కల్లలు సెప్పి యా కథ కుత్తరము లేక
 మెల్లన నున్నచో మెచ్చునె హరి?
నేతిబీరయ కాని నే యందుఁ గన లేదు
 రాతిపీరునకు బీరంబు లేదు

**బూరుగుపండఁట పొట్టలో దూదియే;**
**పొల్లుమాటల విప్పఁ దుల్లసిలునె?**
**ఇరుగువా రెఱుఁగరు పొరుగువా రెఱుఁగరు**
**గొట్టుమాటల నేమొ గొణుఁగుచుండ్రు**
**పరులఁ గాదందురు వస తమలో లేదు**
**విరసు లవ్వారల విడుచు శౌరి;**

**తే. కొల్లఁగా వేంకటేశ్వరు తాళ్ళపాక**
**అన్నమాచార్యు లందఱు నభినుతింపఁ**
**బాడి; రొకఁ డెవ్వఁడో తాను వంతగించి**
**యొరయునఁట ! సమ్మతించునే తిరుమలయ్య! 270**

ఓవెర్రిమొర్రికవులారా! మీ కంత కండూతి కలిగితే మెడవంచి మీరూ ఒక తడిక అల్లుకొనవచ్చు. అన్యులను అనుకరించి అపహాస్యంపాలు కాకండి.

ఒకరు తలలోముడిచి తీసివేసినపువ్వు మరొకరు తలలో దాల్చుటకు తగినది గాదు. ఒకరిఎంగిలివిస్తరిలో మరొకరు భుజించుట యుక్తము కాదు. ఒకరు తన్ను గూర్చి చెప్పినకవితకు నకలుగా మరొకరు చెప్పబూనితే అఖిలాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరునకు అది భోగ్య మగునా? కాదని సమాధానము.

గంపెడుతవుడు తినగా అందులో ఒకవరిగింజ కలిసియుండవచ్చు. సారహీనమైన పదసహస్రములో ఎక్కడో ఒకచోట ఒకసొంపైనమాట దొరలి ఉండవచ్చు. అంతమాత్రాన అది శ్లాఘాపాత్రమైన కవిత అగునా?

దానిని లోక మెట్లుగ్రహింపగలదు? గ్రహింపదని భావము. అహోరాత్రాలు పలవరించగా పలవరించగా అందొక సొంపైనమాట చూపట్టవచ్చు. అంత మాత్రమునకే గోవిందుడు వర మనుగ్రహించునా? అనుగ్రహింప డని తెలియునది.

ఒకడు ఉమిసిన తమ్మలో కొంచెం పచ్చకర్పూరం కలుపుకొని దానిని నోట వేసికొని చప్పరించనేల? ఒకకవి కవితాచ్ఛాయను అపహరించి అందులో తనమాటలు ఒకటిరెండు చేర్చి ఆ రచనకు తానే కర్తనని విర్రవీగినచో ఏడుకొండలవాడు ఎగతాళి చేయడా? చీకిపాఱవేసినటెంకను చేబూనుట సబబుగాదు. కబళనమునకై ఒకరి ఎంగిలిబూరెను కడుగుట

సమంజసము గాదు. ఉప్పుచప్పనికవిత లల్లి ఆ తప్పులలో పొరలాడువానిని జూచినచో ఆ కొండలప్పుడు కిలకిల నవ్వక మానడు.

చద్దికూటిపై ఉమిసినచందంగా మేలిమాట ఒకటి ఎట్లో చెప్పి ఆ పిదప చెప్పలేక గ్రుడ్లు మిటకరించినచో పొత్తుకుదురని కంచును కుండ పెంచికను ఒకటిగా చేర్చి అదికినట్లుగా పొంకములేని అట్టి కైత లల్లువానిని ఆ దేవుడుగూడ అంటరాని ముట్టుపెంచిక వలెనే చూచును.

పుచ్చినపండు బూజుపట్టి ఎవరికినీ కొరగానట్లు తళుకుబెళుకుకవితలు గిలకరించినచో ప్రజ లాదరించరు. దొంగనుగన్నతల్లి సిగ్గుబిడియములతో మూలలలో దాగినరీతిగా పరాన్నభుక్కులైన ఓ కవినామధారులారా! మీకు దొంగస్తోత్రము లెందుకు? భగవంతునికి మ్రొక్కిన చాలును.

ఉల్లిదిన్నకోమటి ఉగ్రగంధమునకు జంకి నోరెత్తడు. జల్లెడలో పోసిన అవాలు జారిపోవును. ఆ విధంగా కంపుగొట్టు, తాలుతబకకవితలు చెప్పి పండితులు ప్రశ్నించినప్పుడు సమాధన మొసగలేక మూగనోము వహించినచో ముకుందుడు మెచ్చునా? మెచ్చడని అభిప్రాయము.

దానికి నేతిబీరకాయ అని పేరు. అందులో నేయి బొత్తిగానుండదు. రాతిపై చెక్కిన వీరునిప్రతిమకు పరాక్రమము లేదు. బూరుగుపండుపొట్ట విచ్చిచూచినచో దూదియేగాని అందు రసముండదు. ఆ రీతిగా నిస్సారములైన కైతలు శ్రీహరికి ఇంపుగొల్పవు.

కుకవులమాటలు ఇరుగువారికి, పొరుగువారికి తెలియవు. మార్దవములేని మాటలు తమలో తా మేమేమో వారు గొణుగు కొనుచుందురు. ఇతరులను సరకుగొనరు. తమలో పస లేదు. వారు సరసకవులు గారు, విరసకవులు. అట్టివారిని భగవంతుడు పరిత్యజించును.

తాళ్లపాక అన్నమాచార్యులు జను లందరు మెచ్చగా శ్రీవేంకటేశ్వరుని గూర్చి కొల్లగా పాడినాడు. అతని నెవడో పంతగించి కవితలో ఎదుర్కొనునట! ఔరా! ఇందుకా సప్తగిరిసార్వభౌముడు సమ్మతించునా? సమ్మతింపడని తీర్మానము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెఱ్ఱులాల మీకు | 196 | 494 | 2 | 333 |

అవ: కృష్ణావతారములోని వేంకటాచలపతియొక్క ఆశ్చర్యకృత్యములను పొగడుచున్నాడు.

సీ. **కొండెత్తి గొడుగుగాఁ గోరి గోవులఁ గాచెఁ**
**గొండవంటిదనుజుఁ గూల్చి వేసె**
**కొండ వేంగడ మెక్కి కోనేటి కఱుతనే**
**కొలువుండె మా పైఁడికొండలప్ప**
**మద్దిమ్రాఁకులఁ గూల్చి మఱి కల్పభూజమ్ము**
**పృథివిమీఁదికిఁ బెకలించి తెచ్చె**
**మ్రానెక్కి చీరలు మగువల కిడి చింత**
**మ్రాఁకుల కోనేఱు మరగినాఁడు**

గీ. **శేషపడగలనీడలోఁ జేరి వ్రజము**
**శేషజాతికాళియుని భంజించి కాచె;**
**శేషగిరినాథుఁడై సర్వశేషి యగుచుఁ**
**జెలఁగు కోనేటిదండ లక్ష్మీవిభుండు.** 271

గోవర్ధనగిరిని గొడుగువలె నెత్తి ప్రీతితో గోవులను రక్షించెను. కొండవంటి రాక్షసుని చంపివేసెను. వేంకటపర్వతము నెక్కి కోనేటిసమీపమున మా బంగారుకొండలప్పడు కొలువున్నాడు. నారద శాపముచే కుబేరపుత్త్రులైన నలకూబరమణిగ్రీవులు భూలోకమున నూఱుదివ్యవర్షములు మద్దిచెట్ల అకారముతో నుండగా ఆ వృక్షము లను గూల్చి వారిశాపమును బాపెను. స్వర్గమునుండు పారిజాత తరువును పెల్లగించి భూలోకమునకు తెచ్చెను. గొల్లచేడియల చీరలు దొంగిలించి పొన్నచెట్టుపై నెక్కి చేయెత్తి దండముపెట్టుచు చెంతకు రండని పిలిచి వారిచీరలు వారి కిచ్చెను. అట్టివాడు చింతమ్రాకులు గల స్వామి పుష్కరిణిచేరువ చేరినాడు. ఆదిశేషునిపడగలనీడలో అర్ధరాత్రమున వసుదేవుడు యమున దాటి తన్ను తోడ్కొనిపోగా గొల్లపల్లెను చేరెను. ఆ శేషునిజాతికే చెందిన కాళియుని గర్వ మణచి అభయ మిచ్చెను. ఆ లక్ష్మీవిభుడు నేడు శేషగిరినాథుడై సర్వమునకు శేషియై కోనేటిగట్టున వెలయుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వీఁడివో లక్ష్మీపతి | 270 | 402 | 3 | 271 |

అవ: నారాయణుని మహిమ నుగ్గడించి ఆతనిశరణమంది రక్షితులు కండని హితోక్తు లాడుచున్నాడు.

**సీ. నారాయణుఁ డితండు నరులార! భక్తితో**
**శరణనరో మిమ్ముఁ జక్కఁ గాచుఁ;**
**దలఁచినచోటను దానె యున్నాఁడు కా**
**వలెనన్నవారి కైవసము తాను;**
**కొలిచె మూఁడడుగులఁ గల భువనాలు త**
**న్గొలిచినవారిఁ జేకొనఁడె తాను?**
**ఎక్కడఁ బిలిచిన నేమని పలుకును**
**మ్రొక్కిన మన్నించు ముందు ముందె;**
**రక్కసుల నణంచి రక్షించు జగములు**
**తిరముగ నేలఁడా దిక్కటన్న?**

**గీ. చూపు రూపమ్ముఁ జూచినచోట్ల నెల్ల;**
**గుండె కరఁగంగఁ బొగడిన నుండు నోట;**
**నేడుకొండలనాయకుం డితఁడె యితఁడె**
**చేతులారంగఁ బూజింప సేవగొనఁడె?** 272

ఓ మానవులారా! ఈ కనుపించుచున్నవాడే నారాయణుడు. భక్తితో నతనిని శరణు పొందుడు. మి మ్మాతడు చక్కగా కాపాడును. మీ రెక్కడ తలచిన అక్కడ ప్రత్యక్ష మగును. తన్ను కావలె ననుకొన్నవారికి చేజిక్కువాడు ఇతడే. పదునాల్గులోకాలను మూడడుగులతో కొలిచినవాడు తాను. తన్ను సేవించువానిని తాను చేయి విడచునా? విడువ డనుట. ఎచ్చోట బిలిచినను ఓ యని తాను బదు లిచ్చును. మ్రొక్కియు మ్రొక్కక మునుపే మన్నించును. రాక్షసులను సంహరించి లోకములను కాపాడు ఆ ప్రభువు "స్వామీ! నీవే దిక్కు" అన్నచో నిశ్చయంగా రక్షింపడా? రక్షించు ననుట. భక్తు లెచట తదేకధ్యానముతో తన్ను చూతురో అక్కడ సాకారుడై దర్శన మిచ్చును. హృదయం కరిగేటట్లు స్తోత్రం చేయగా తాను నోటనే ఉండును. ఇడుగో! ఇతడే ఏడుకొండలరాయడు. మీరు చేతులార అర్చించినచో మీసేవ నంగీకరించడా? అంగీకరించు ననుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నారాయణుఁ డితండు | 225 | 141 | 3 | 95 |

అవ: నాగశైలేంద్రనివాసుని రామావతారవృత్తాంత ముగ్గడించుచు రాక్షసులను సహిత మాతనిశరణొంది రక్షణ పొందుడని పల్కుచున్నాడు.

**సీ. జగములో రాముఁడై జనియించె విష్ణువు**
**తగ లక్ష్మి సీతయై తనువుదాల్చె;**
**అహిపతి సౌమిత్రి యాయె; చక్రము, నంకు**
**భరతశత్రుఘ్నులూపమ్ము లయ్యెఁ;**
**సురలు వానరు లైరి; సూర్యుండు సుగ్రీవుఁ**
**డాయె; రుద్రుం డాంజనేయుఁ డయ్యెఁ;**
**బ్రహ్మదేవుఁడు జాంబవంతుఁడై పొడమంగ**
**వెరవరి నలుఁడయ్యె విశ్వకర్మ;**

**గీ. సింధువును దాఁటి లంకను జెఱుప దండు**
**ఫణిగిరీశరాఘవుఁడు రావణునిఁ జంపి**
**దాసులకు వరా లిచ్చెడి దైత్యులార!**
**పగవిడిచి శర ణనరొ ! కాపాడు మిమ్ము.** 273

ఈ భూలోకమున విష్ణువే రాముడుగా అవతరించెను. ఒప్పిదముగ శ్రీమహాలక్ష్మియే సీతగ అవతరించినది. ఆదిశేషుడు లక్ష్మణుడుగ, శంఖచక్రములు భరతశత్రుఘ్నులుగా రూపు గైకొనిరి. దేవతలు వానరులుగా, సూర్యుడు సుగ్రీవుడుగా, రుద్రుం డాంజనేయుడుగా, బ్రహ్మదేవుడు జాంబవంతుడుగా ఉద్భవించ విశ్వకర్మ ఉపాయశాలియైన నలు డాయెను. తన వానరసేన సముద్రముదాటి లంకను నాశనము చేయగా ఇపుడు శేషశైలాన ఉన్న రాముడు రావణుని దునుమాడి భక్తులకు వరము లిచ్చుచున్నాడు. ఓ రాక్షసులారా! మీరు కూడ వైరమును వీడి ఆ స్వామి శరణము పొందుడు. మిమ్మా ప్రభువు విరోధ మెంచక కాపాడును.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే,
అభయం సర్వభూతేభ్యో దదా మ్యేతద్వ్రతం మమ."

అనిగదా శ్రీరాముని వచనము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఓవో రాకాసులాల | 350 | 295 | 4 | 198 |

అవ: దేవుడు రాముడై చూపిన దైవమానుషకృత్యములను పేర్కొని, అతడే శ్రీవేంకటేశ్వరు డని ప్రశంస చేయుచున్నాడు.

సీ. **రాముఁడు లోకాభిరాముఁడు కామిత**
**ఫలదుఁ డాశ్రితజనములఘుఁ డితఁడు**
**దశరథనృపునకు తనయుండు తానఁట**
**తారకబ్రహ్మంబు తానె యంట**
**తా నొకరాజఁట తన పాదధూళిచే**
మగువశాపమ్మును మాన్పె నంట
నరవేష మఁట సురామరు లెక్కిడఁగ రాని
పరమేశ్వరునివిల్లు విఱిచె నంట
అల వసిష్ఠుని శిష్యుఁ డఁట జటాయువునకుఁ
జెలఁగి మోక్షము దయచేసె నంట
అగచరుల్ తన సేన లఁట దుస్తరమ్మైన
కడలిఁ గొండలతోడఁ గట్టె నంట
పడఁతికోన మ్మఁట పంకజాసనునకు
మనుమఁడౌ రావణుఁ దునిమె నంట
అడిగె నంట వరమ్ము లమరుల మఱి విభీ
షణునకు లంక నొసంగె నంట
ఎనఁగ నయోధ్యకు నేలిక తా నంట
యింద్రాదులకుఁ గొలు విచ్చె నంట
అంజనాద్రినివాస మఁట యెల్లజగముల
నిటు బొజ్జలో ధరియించె నంట

గీ. దైవమానుషలీలలు తనరఁ జూపు;
వలనుగాఁ జూపు లౌకిక వైదికములు;
**అడరి తనయందె చూపు మూర్ఖాధికతలు;**
**తెలిసి కొలువరో యాతని దేవదేవు.** **274**

యోగులమానసముల రమించువాడు, లోకమనోహరుడు, కోరికల నీడేర్చువాడు, ఆశ్రయించినవారికి సులభముగ లభించువాడు, దశరథ మహారాజునకు పుత్త్రుడై పుట్టినవాడు, తారకబ్రహ్మమైనవాడు, లోకములను రంజింపజేయువాడు, తన పాదధూళితో అహల్యాశాప విమోచనము నల్పినవాడు, మాయామానుషవేషధారి, దేవదానవులకు ఎక్కిడరాని శివునివిల్లు విఱిచినవాడు, ప్రసిద్ధుడగు వసిష్ఠమహర్షికి శిష్యుడు, జటాయువునకు మోక్ష మనుగ్రహించినవాడు, వానరులు సేనగా గలవాడు, దాటరాని సముద్రముమీద కొండలతో వంతెన నిర్మించినవాడు, సీతకై బ్రహ్మమనుమడైన రావణుని హతమార్చినవాడు, దేవతలను వరము లడిగినవాడు (ఆదిత్యహృదయం), విభీషణుని లంకకు రాజునుచేసినవాడు, పిదప అయోధ్యను జేరి పట్టాభిషిక్తుడై రాజ్యమేలినవాడు, ఇంద్రాదిదేవతలకు గూడ కొలువిచ్చినవాడు శ్రీరామచంద్రమూర్తి. అట్టివా డిప్పుడు అంజన పర్వతమే నివాసముగా గలిగి సకలలోకములను తన కుక్షిలో నిడుకొని భరించుచున్నాడు. ఈ రీతిగ దైవికములు, మానుషములు అగు లీలలను చూపుచుండును. అణుత్వమహత్త్వములను తనయందే ప్రదర్శించును. (వీటిని యథావకాశముగా ఈ పద్యమున ఊహించుకొనునది.)

ఇట్టి శ్రీవేంకటాచలపతి తత్త్వము నెఱిగి భజింపుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రాముఁడు లోకాభిరాముఁ డందరికి | 347 | 277 | 4 | 185 |

అవ: హనుమంతుని అతిమానుషకృత్యములను వర్ణించుచు అతడే విజయ నగరములో వేంకటాద్రిలో వెలసి అందరకు వరము లిచ్చుచున్నాడని చాటు చున్నాడు.

**సీ. ఈతఁడా రామునిదూత వాతాత్మజుం**
**డౌతతబలుఁ డందు రాతఁ డితఁడ?**
**సీత వెదకితెచ్చి చెప్పినయాతఁడీ**
**తఁడ ? ఘోరదనుజమర్దనుఁ డితండ?**
**అంజనానందనుం డక్షాంతకుండు సం**
**జీవిదెచ్చిన చిరంజీవి యితఁడ?**
**కాలనేమిని కాలుఁద్రోలి కంపినవాఁడు**
**సౌమ్యుఁడౌ కపిరాజసఖుఁ డితండ?**

**తే. ధీరుఁ డితండ? నిర్జితేంద్రియుఁ డితండ?**
**సురల కత్యుపకారంపుఁజుట్ట మితఁడ?**
**విజయనగరమ్ములోఁ దిరువేంకటాద్రి**
**నందఱకు వరా లిచ్చెడి హనుమ యితఁడ?** 275

వాయుదేవునికుమారుడు, రామునిదూత ఈతడేనా? ఎక్కుడు బలవంతుడందురే అతడేనా యితడు? సీతజాడ లరసి ఆ వృత్తాంతమును రామునికి చెప్పిన వాడు ఇతడేనా? భయంకరులగు రాక్షసులను సంహరించినవాడు ఇతడేనా? అంజన కుమారుడు, రావణునిపుత్రుడగు అక్షుడను వానిని చంపి, సంజీవిపర్వతమును పెకలించితెచ్చిన చిరంజీవి ఇతడేనా? కాలనేమిని యమునిపాలికి పంపినవాడు, సౌమ్యగుణముగల సుగ్రీవుని చెలికా డితడేనా? ధీరుడు, జితేంద్రియుడు, దేవతలకు మిక్కిలి మేలు చేసినచుట్టము ఇతడేనా? విజయనగరమునందును, వేంకటాచలము నందును భక్తులకు వరము లిచ్చుచున్న హనుమంతుడు ఇతడేనా?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| **మతంగపర్వతమాడ** | **149** | **223** | **2** | **149** |

అవ: కలశాపురంలో, వేంకటాద్రిలో వెలసిన హనుమంతునిచర్యలు కొన్నింటిని కొనియాడుచున్నాడు.

సీ. **తెలుత రాముని@ గాంచి తేడనే సుగ్రీవు@**
**గొలువ@ బెట్టి యతనికొమ్మ నతని**
**కిప్పించి వంద్రమ్ము కుప్పించి లంఘించి**
**లంకలో దేవి కుంగ్ర మ్మొసంగి**
**సీతమ్మ యానవాల్ శ్రీరామునకు నిచ్చి**
**యల విభీషణు ప్రభునండ@ జేర్చి**
**చేతుల@ బోట్లాడి చెండి రక్కసిమూ@క**
**సంజీవికొండను సరగ@ దెచ్చి**

తే. రావణుం గొట్టి రమణిని రాము@ గూర్చి
యక్కడ నయోధ్యలో@ బట్ట మలర@ గట్టి
వేడ్క 'కలశాపురమ్ము'నన్ వేంకటాద్రి
హరి గొలిచియున్న హనుమకు నంజలింతు. 276

మొదట శ్రీరాముని దర్శించి, సుగ్రీవు డాతనిని కొలుచునట్లుచేసి, సుగ్రీవు భార్యరుమను నతని కప్పగించునట్లు చేసినాడు. సముద్రమును దాటినాడు. లంకలోనున్న సీతాదేవికి రాము డిచ్చిన యుంగరము నిచ్చెను. సీత యొసగిన చూడామణిని రామున కర్పించెను. ఆ విభీషణుని రాముని సమీపమును పొందించెను. హస్తములే ఆయుధములుగా అనేకరాక్షసులను దునుమాడెను. సంజీవిపర్వతమును దెచ్చి ప్రభుల ప్రాణములను గాచెను. రావణుని మర్దించెను. సీతమ్మను రామునితో జేర్చెను. అయోధ్యానగరములో రామపట్టాభిషేకమును జరిపించెను. ఇప్పుడు వేడుకగా కలశాపురములోను వేంకటాచలములోను శ్రీనివాసుని కొలుచుచున్న ఆంజనేయునికి దోయి లింతును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతఁడా యీతఁడు | 324 | 141 | 4 | 95 |

అవ: హనుమంతుని బలపరాక్రమాతిశయము నభివర్ణించుచున్నాడు.

సీ. ముందటిలెడు పట్టమున కజుం డయినాఁడు
హరిపేరుదాల్చినాఁ డరులఁ జంపి
రుద్రవీర్యము నొంది రుద్రుఁడైనాఁ డహో !
యఖిలలోకమ్ముల హనుమ కెదురె?
చుక్కలంటఁ బెరింగి సూర్యుఁడై పాతాళ
మందుఁ దూఱుచు శేషుఁ డైనవాఁడు
పవనజుండై జగత్ప్రాణుఁ డైనాఁ డహో!
హనుమ కెవ్వరు విశ్వమందు నెదురు?

గీ. అబ్ధిపుట మెగయఁగఁ జంద్రుఁ డైనవాఁడు
మేరుగిరిపొంత సింగమై మెఱయువాఁడు
అహినగేశ్వరుబంటు మంగాబ్ధిహనుమ
కెవ్వ రేకైకవీరున కెదురు జగతి? 277

రాబోవుకల్పములో బ్రహ్మ కాబోతున్నవాడు, శత్రువులను సంహరించి హరియని పేరుపొందినవాడు. రుద్రవీర్యమున నవతరించి రౌద్ర రసము నొలికించువాడు ఆంజనేయుడు. ఇట్టిహనుమంతునకు ఏలోకమందైనను ఎవరైన నెదురున్నారా? లేనే లేరు శరీరమును పెంచి నక్షత్రముల నొరయుచు సూర్యు డైనాడు. పాతాళమును ప్రవేశించి శేషుడైనాడు. వాయుదేవునివరప్రసాదమున జనించి తండ్రిని మించి జగత్తునకు ప్రాణకారణమైనాడు. ఇట్టివాని కీ ప్రపంచమున ఎదు రెవరు? లేరనుట. సముద్ర ముప్పొంగగా చంద్రుడైనాడు. అటుపోటులతో అకసమంటే సముద్రాన్ని లంఘించినాడు. మేరు పర్వతప్రాంతంలో సింహముగా సంచరించాడు. శేషాచలపతికి బంటయినాడు. మంగానముద్ర మను గ్రామంలో నుండు హనుమంతుడు ఏకైకవీరుడు. లోకంలో అతని కెదు రెవ్వరును లేరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒక్కఁడే యేకాంగవీరుఁడు | 379 | 462 | 4 | 311 |

అవ: మంగాసముద్ర మను గ్రామంలో వెలసియుండే హనుమంతునకు శ్రీరామచంద్రునకు అన్నిట సామ్యమును చక్కగ నిరూపించు చున్నాడు.

**సీ. వనధి బంధించి దాఁటెను రాఘవుం డాతఁ**
**డలరి యూరక దాఁటె హనుమ యీతఁ;**
**డలుకతో రావణు నద టణంచె నతండు**
**మైరావణుని పిల్కుమార్చె నితఁడు;**
**గోవర్ధనంబను కొండనెత్తె నతండు**
**ధీరతద్రోణాద్రి దెచ్చెనితఁడు;**
**గౌతమపత్నికై కఱచె గుండు నతండు**
**గుండు గరఁగఁ బాడెఁ గోరి యితఁడు;**

**తే. ఆతఁ డేలిక; సేవకుం డీతఁ; డంజ**
**నాద్రిశ్రీవేంకటేశ్వరుం డాతఁ; డీతఁ**
**డంజనానందనుండు; దయాసముద్రుఁ**
**డతఁడు రఘుపతి; మంగాబ్ధి హనుమ యితఁడు. 278**

సముద్రముపై వంతెనగట్టి రఘురాముడు లంకను చేరుకొన్నాడు. ఈ ఆంజనేయు డెట్టి సాధనము లేకయే సముద్రమును దాటెను. ఇది రామునికంటె హనుమ గొప్పతనమును సూచించుచున్నది. ఆ రాముడు కుపితుడై రావణుని పీచ మణచగా ఈ హనుమ మైరావణుని గర్వమును భంజించెను. ఆ రఘుపతి కృష్ణుడై గోవర్ధనగిరిని ఉన్నచోటనే పైకెత్తిపట్టగా ఈ మారుతి ద్రోణపర్వతము నెటనుండియో మోసుకొనివచ్చెను. ఆ రాము డహల్యకు రూపు నిచ్చుటకై ఱాతిని తాకగా నీ హనుమంతుడు గుండు ద్రవీభవించునటులు శ్రీరాముని కీర్తించెను. గంధర్వవిద్యాతత్త్వజ్ఞుడని, త్రిపుటతాళప్రియుడని, గుండక్రియారాగప్రియుడని అయనకు ప్రశస్తి. అయినను రాముడు ప్రభువు. ఈతడో భృత్యుడు. ఆతడంజనాదేవి కుమారుడు. రాముడు దయాసముద్రుడు. ఇత డన్ననో మంగా సముద్రమున నుండు హనుమంతుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇతఁడే యతఁడు గాఁబోలు | 376 | 443 | 4 | 298 |

అవ: మతంగగిరిహనుమంతుని బృహదాకారమును, శౌర్యమును ప్రశంసించుచున్నాడు.

సీ. దక్షిణోత్తరదిశల్ తన భుజమ్ముల దాఁకెఁ
జాచెఁ బ్రాక్పశ్చిమాశలకుఁ గాళ్లు
బ్రహ్మలోకమ్ముమీఱఁగ మస్తక మ్మెత్తెఁ
బెంపారు మహిమతోఁ బెద్దహనుమ;
వినువీథితోఁ బెనవేసె వాలము సప్త
కంధులఁ జేసె మోకాలిబంటి
ఉగ్రదైత్యులతల లోడక పిడికిట
బేడలుగాఁ జేసెఁ బెద్దహనుమ;

తే. ఎత్తె జళిపించి వల కేలు; నేడుగిరుల
తన తొడలసందున నణంచె ఘనబలుండు
మంగ పెనిమిటిబంటు మతంగశైల
బిలముఖంబున నున్నాఁడు పెద్దహనుమ. 279

దక్షిణదిశను, ఉత్తరదిశను తన చేతులతో అందుకొన్నాడు. తూర్పుపడమర దెసలకు తన కాళ్లను చాచినాడు. బ్రహ్మలోకాన్ని దాటిపోవునట్లు తన తల నెత్తినాడు. ఈ విధంగా హనుమంతుడు తన మహిమను చూపెను. ఆకాశమార్గంతో తన తోకను పెనవేసినాడు. సప్తసముద్రాలను తన మోకాలంత లోతుకలవానినిగా చేసినాడు. ఈ మహావీరుడు భయంకరులగు రాక్షసుల తలలను కందిబేడల ప్రమాణముగా పిడికిట పొడిచి బ్రద్దలుచేసినాడు. కదలించుచు తన ఎడమ చేతిని మీది కెత్తినాడు. ఈ బలాఢ్యుడు ఏడుకులపర్వతములను తన తొడలసందులో ఇరికించుకొన్నాడు. ఈతడు శ్రీనివాసుని బంటు. మతంగ పర్వతములోని బిలద్వారమున నివసించుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమని నుతించవచ్చు | 172 | 350 | 2 | 235 |

అవ: శ్రీహరి సుగ్రీవనరహరియై రక్కసుల దునిమి దేవతలను గాచి అంజనాచలముపై శ్రీ వేంకటేశ్వరుడుగా వేంచేసియున్నాడు. ఆయనను సేవింపుడని భక్తులను ప్రభోధించుచున్నాడు.

**సీ. వేయిచేతులతోడ వెన్నెలనవ్వుతో**
**రహిమించు శంఖచక్రాలతోడ**
**అయితమై యుండె నదె సింగవుంగద్దె**
**శ్రీయుతుండైన సుగ్రీవనృహరి;**
**కుంకుమగోళ్ళతో కోఱదౌడలతోడ**
**రవిచంద్రవహ్నినేత్రములతోడ**
**నసురులఁ బరిమార్చి యమరబృందమునకుఁ**
**గీడ్పాటు మాన్పె సుగ్రీవనృహరి;**

గీ. బిరుదు పెండారములతోడఁ బీతవసన
రత్న ముకుటాది భూషణరాజితోడ
సిరుల కెల్లను నెలవగు శేషశిఖరి
వెలసె సుగ్రీవనృహరి సేవించ రయ్య! 280

సహస్రబాహువులతో వెన్నెలవంటి తెల్లనినవ్వుతో అందములైన శంఖచక్రాలతో అడుగో ఆ సింహాసనముపై లక్ష్మీదేవితోడ నరహరి సన్నద్ధుడై యున్నాడు. కుంకుమమువలె ఎర్రనిగోళ్ళతో (హిరణ్యకశిపుని చీల్చినాడు గనుక), కోఱపండ్లు గల దౌడలతో, సూర్యచంద్రాగ్నులే కన్నులుగా గలిగి రాక్షసులను పరిమార్చి దేవతా సమూహముయొక్క ఆపదబాపి శౌర్య చిహ్నములగు గండ పెండెరములు ధరించి పీతాంబరము రత్నకిరీటము మున్నుగాగల అలంకారములతో సంపదలకు కాణాచియగు శేషాద్రిపై వెలసియుండునట్టి చక్కని మెడగల నృహరిని సేవింపుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సేవించరో జనులాల | 327 | 157 | 4 | 105 |

అవ: అహోబలన్నృసింహునకు వేంకటాచలపతికి అభేదమును జెప్పి నరకంఠీరవుని వైభవము నుగ్గడించుచున్నాడు.

సీ. సగము మానిసిరూపు సగము మెగమురూపు
పరమతేజుం డహోబలవిభుండు;
కంబమ్ములోఁ బుట్టి గద్దెపై నున్నాఁడు
పిన్ననవ్వులు నవ్వుచున్నవాఁడు
పెనుమీనములవాఁడు పెద్దగోరులవాఁడు
ఘనునిఁ బ్రహ్లాదునిఁ గాచినాఁడు
మనసిచ్చి సురలతో మాటాడుచున్నాఁడు
శ్రీసతిఁ దొడమీఁదఁ జేర్చినాఁడు

గీ. వేయిచేతుల వెన్నెలచాయవాఁడు
బంటులై కొల్చువారి పాలింటివాఁడు
నాగనగరాజమున భవనాశిదండ
వెలసినటువంటివాఁ డహోబలవిభుండు. 281

అహోబలనరసింహస్వామి ఆకారమున సగము మనుష్యుడు సగము మృగమై పరమతేజోవంతుడై ప్రకాశించుచున్నాడు. స్తంభమునం దుద్భవించి సింహాసన మెక్కి చిరునవ్వు లొలకబోయుచున్నాడు. పొడవైన మీసములు పెద్దపెద్ద గోళ్ళుగలిగి భక్తాగ్రేసరుని ప్రహ్లాదుని రక్షించినవాడు. మనసార సురలతో మాట్లాడువాడు, లక్ష్మీదేవిని ఒడిలో కూర్చుండబెట్టుకొన్నవాడు, వేలచేతులు గలవాడు, వెన్నెలకాంతి గలవాడు, భక్తులై కొల్చువారిని కాపాడువాడు, శేషగిరిమీద భవనాశి యను పుష్కరిణి సమీపమున ఆ యహోబల నరసింహుడు నెలకొనియున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సగము మానిసిరూపు | 835 | 209 | 18 | 140 |

అవ: వేంకటేశ్వరునికి కదిరిలోని వీరనరసింహమూర్తికి అభేదమును పాటించి నృసింహావతారము నభివర్ణించుచున్నాడు.

సీ. చిడిముడిగోళ్ళతో సింగంపుమోముతో
జ్వాలామయపుఁ గేసరాలతోడ
కడలేని నవ్వుతోఁ గడురాజసముతోడఁ
దొడమీఁదఁ గూర్చున్న పడఁతితోడ
శంఖచక్రాలతోఁ జాయల మేనితో
సరిలేని అభయహస్తమ్ముతోడ
బిరుసుమీసాలతోఁ గఱకునాలుకతోడ
ముడివడ్డ దట్టంపుబొమలతోడ

గీ. బహుళమహిమలతోఁ బ్రతాపమ్ముతోడ
భక్తులనుగావ దుష్టులఁ బట్టి చెఱుప
వేంకటాద్రిలో కదిరిలో వెలసినట్టి
వీరనరసింహమూర్తికి వేయినతులు. 282

వంపులు దిరిగిన గోళ్ళు, సింహముముఖము, అగ్నిశిఖలవంటి జూలు, అంతులేని అట్టహాసము మిక్కిలిరజోగుణము గలిగినవాడై, ఒడిలో శ్రీలక్ష్మి నుంచుకొని శంఖచక్రములు ధరించి, రంగులీను దేహముతో; అభయముద్రను హస్తమందు గలిగి, బిరుసుమీసాలు, కఱకునాలుక, బొమముడి కలిగి, అనేక మహిమలతో, ప్రతాపముతో నొప్పినవాడై, భక్తులను రక్షించుటకు, దుష్టులను శిక్షించుటకు వేంకటాచలములో, కదిరి గ్రామములో వెలసియున్న వీరనరసింహస్వామికి వేయి దండాలు.

---

4వ సంపుటములోని "కదిరినరసింహుఁడు" (రేకు 306 సంఖ్య 32), "కొలువై తా నల్లవాఁడె" (రేకు 328 సంఖ్య 163)లను సంకీర్తనలు ఆధారముగా కూర్చిన పద్యమిది.

అవ: ఆదిశేషుని కీర్తించుచున్నాడు.

**సీ. వీఁడుగదే మహావృషభాద్రి శేషుండు**
**వైనతేయున కుద్దియైన వాఁడు**
**వేయిపడగలతో వెలసినవాఁడు వ**
**జ్రాలతళ్కుల శరీరంబువాఁడు**
**తలలపై మాణిక్యములు గలవాఁడు శ్రీ**
**శునకు నీడై వెంటఁ జనెడువాఁడు**
**వినుతి కెక్కిన రెండు వేల నాల్కలవాఁడు**
**హరిమెచ్చ నేర్పరియైన వాఁడు**

**గీ. వాహనంబుగ గొడుగుగా వఱలువాఁడు**
**ఉన్న పను లన్నిటికిఁ గాచుకొన్నవాఁడు**
**చెలువమంగకు వేంకటశిఖరిపతికి**
**నవిరతమ్ము మెత్తని పానుపైన వాఁడు.** 283

వృషభాద్రిపైనున్న ఆదిశేషుడు జవసత్త్వములందు గరుడునితో సమానమైనవాడు. వేయిపడగలతో ప్రకాశించువాడు. వజ్రాలవలె తళతళలాడు శరీరం కలవాడు. తన వేయితలలపై మాణిక్యములు గలవాఁడు. శ్రీకాంతునికి జతయై నీడవలె ఆయనవెంట దిరుగువాడు. ప్రశస్తిగాంచిన రెండువేలజిహ్వాలు గలవాడు. శ్రీహరిచే మెప్పు వడసిన నేర్పు గలవాడు. ఈ శేషు డాహరికి వాహనముగా, గొడుగుగా నొప్పువాడు. నారాయణుని పనులకెల్ల సంసిద్ధుడై యుండువాడు. అలమేలుమంగకు వేంకటాచలపతికి ఎల్లపుడు మెత్తని పరుపుగా ఉండి సేవించువాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వీఁడుగదే శేషుఁడు | 263 | 365 | 3 | 246 |

అవ: మహామహిమోపేతుడైన శ్రీఫణిగిరీంద్రునకు ఆరగింపులు చేయుడని భక్తుల నుద్బోధించుచున్నాడు.

సీ. పద్మజాండములు గర్భమునఁ దాల్చిన పర
మాత్మకుఁ జేయరో యారగింపు;
ప్రతిలేని క్షీరాబ్ధిఁ బవళించి లేచిన
శౌరికిఁ జేయరో యారగింపు;
ఏడుప్రొద్దులదాఁక నెత్తె పర్వతము ము
రారికిఁ జేయరో యారగింపు;
గొల్లచేడెలతోడఁ గూర్మిఁ బెనంగె శ్రీ
హరికిని జేయరో యారగింపు;

గీ. పట్టపుంజెల్వలుం దాను బంతిసాగి
కూరుచున్నాఁడు చేయరో యారగింపు;
అంజనాచలనాయకుం డారగించు
నాదరమ్మునఁ జేయరో యారగింపు. 284

ఎన్నో బ్రహ్మాండాలను తన కుక్షిలో నిముడ్చుకొన్న పరమాత్మునకు, అపార పయఃపారావారములో పవళించి మేల్కాంచిన పుండరీకాక్షునకు (నిద్రలేచినవానికి ఆకలి సహజము), ఏడుదినములు నిర్విరామముగా గోవర్ధనగిరి మోసిన మురారికి (శ్రమించినవానికి ఆకలి ఎక్కువ), వల్లవపల్లవాధరలతో రతిసల్పి అలసినశ్రీహరికి, పట్టపురాణులతో బంతిదీరి కూర్చున్న గోవిందునకు ఆరగింపు చేయుడు. ఇపుడు అంజనాద్రీశుడైన శ్రీమన్నారాయణునకు భక్తిశ్రద్ధలతో నారగింపుచేయుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వేఁకువఁ దిరుపళచ్చి | 252 | 298 | 3 | 201 |

అవ: స్వామి ప్రసాద మారగించి దాసుల కనుగ్రహించుటను చవిచూపు చున్నాడు.

సీ. ఏ పొద్దుచూచిన నిటు లారగించును
పదివేలరుచులతోఁ బరమపురుషుఁ;
డినచంద్రులట్టి గుండ్రనిపళ్ళెముల వేడి
రాజాన్నములు ఋక్షరాజివోలెఁ;
దనరంగ మేరుమందరముల కెనయైన
ఘనమైన యట్టి యిడ్డెనలు మెఱయ
సింధులవంటి పసిఁడి వెండిగిన్నెల
వెలిగొండలంతేసి వెన్న లొప్పఁ

గీ. జిలుపములు పంచదార వెన్నెలరసంబు
గురిసినట్లుండఁ బచ్చళ్ళు కూరగములు
వండి వడ్డించ మంగమ్మ కొండలప్ప
తాను దిని దాసులకు నెల్లఁ దనియఁ బెట్టు. 285

పరమపురుషుడు వేంకటాచలపతి దినదినమును పలురుచులుగల వంటకముల నారగించును. శ్రీవారి భోజనభాజనములు సూర్యచంద్రులంత పెద్దవి, గుండ్రనివి. ఆ పళ్ళెములలో వేడిగా నుండు మొలగొలుకులఅన్నము నక్షత్రాలవలె మెఱయుచుండును. కంచములో మేరుపర్వతం, మందర పర్వతంవలె ఉబ్బెత్తుగానుండు ఇడ్డెనలు వడ్డించుకొనును. సముద్రముల బోలి అగాధములు, అపారములైన పసిండి వెండిగిండులలో కైలాసమంత తెల్లని అపరిమితమైన వెన్నల నుంచుకొనును. చిలుపములు, పంచదార వెన్నెలరసం కురిసిన ట్లొప్పగా పచ్చళ్ళను కమ్మనికూరలను సిద్ధంచేసి అలమేలుమంగమ్మ వడ్డింపగా కొండలయ్య తా నారగించి దాసులకు తృప్తి కలుగునట్లుగా పెట్టును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏ పొద్దు చూచిన | 252 | 299 | 3 | 202 |

అవ: సర్వాధికుడు, సకలకారణుడు గరుడాద్రీశుడని ప్రబోధించుచున్నాడు.

**సీ. అందఱి కితఁడె పో యంతరాత్ముండంచు**
**నందు రీతఁడో కాక యవల నొకఁడొ?**
**నందసుతుఁడు జగన్నాథుఁ డచ్యుతుఁడు గో**
**విందుఁ డీతఁడు గాక వేఱొకండొ?**
**తనర నిందఱకుఁ జైతన్య మిచ్చినయాతఁ**
**డొనర నీతఁడొ మఱియొకఁడు గలఁడొ?**
**దినకరశతమహాతేజుండు దేవాది**
**వినుతుఁ డీతఁడుగాక వే ఱొకండొ?**

**తే. పంకజభవాదులకుఁగూడఁ బరమదైవ**
**మందు రీతండొ కా కన్యుఁ డధికుఁ డొకఁడొ?**
**కొండరాచూలిస్తోత్రముల్ గొనెడివాఁడు**
**వేంకటస్వామిగా కింక వే ఱొకండొ?** **286**

సకలప్రాణులకు ఈ వేంకటాచలపతియే అంతరాత్మయని అందురు. మఱి ఈతడుగాక వేఱొక డున్నాడా? లే దనుట. నందునితనయుడు, జగత్తులకు నాథుడు, అచ్యుతుడు, గోవిందుడు ఈతడుగాక మఱియొకడా? కా దనుట. ఒప్పిదముగా అందరికి చైతన్య మిచ్చినవాడు ఇతడుగాక మఱియొకడా? కా దనుట. నూర్గురు సూర్యుల తేజస్సువంటి తేజస్సు కలవాడు ఇతడుగాక మఱియొక్కడా? కా దని భావము. తమ్మిచూలియైన బ్రహ్మకుగూడ పరమదైవత మీతడుగాక వే ఱెవ్వడు? ఎవ్వడూ లే డనుట. పార్వతీస్తోత్రాల నందుకొనువాడు శ్రీవేంకటాచలపతిగాక మఱియొకడు గలడా? లేదని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మనసిజగురుఁ డితఁడో | 6 | 37 | 1 | 24 |

అవ: లక్ష్మీదేవిని ఇహపరము లనుగ్రహింపుమని ప్రార్థించుచున్నాడు.

సీ. పరమాత్ముఁడౌ హరిపట్టపురాణివి
మము విచారింప యుక్తమెగదమ్మ !
కమలజుఁగన్నట్టి కాముఁనిగన్నట్టి
యమరులఁగన్నట్టి యాదిలక్ష్మి !
విమలుఁడౌ మగనికి విన్నవించియు మమ్ము
దయ నేలుటలు నీకె తగిన దమ్మ !
కామధేనువు కల్పకము చందమామ తోఁ
బుట్టువులుగ నీవు పుట్టినావు
నీ పతిపంపున నిజసంపద లొసంగు
దానగుణము నీకె తగిన దమ్మ !

గీ. జలధికన్యవు పంకజాననవు పాల
వెల్లిఁ బవళించు శేషాద్రివిభుమహిషివి
ఏలినాతనిబంటుల కిహపరమ్ము
లీయ మాపాలఁగలిగితి వీవు తల్లి ! 287

ఓ ఆదిలక్ష్మీ! నీవు పరమాత్మయగు హరికి పట్టపుదేవేరివి. కనుకనే మాబాగోగులు విచారించుట నీకు తగును. బ్రహ్మను మన్మథుని దేవతలను కడుపారగన్నట్టి తల్లివి. శుద్ధసత్త్వస్వరూపుడైన నీభర్తకు మనవిచేసి దయతో మమ్మేలుట నీకు తగిన కార్యముగదా! కామధేనువు, కల్పవృక్షము, చంద్రుడు తోబుట్టువులుగా పాలసంద్రమున బుట్టితివి. నీ మగని యానతిచొప్పున భక్తులకు సంపదల నొసగే దానగుణము నీకే తగియున్నది. సముద్రుని కొమరితవు. తామర పూవు స్థానముగా గలదానవు. పాలకడలిలో పవళించే పరమపురుషుడు శేషగిరీశ్వరుని పట్టపురాణివి. ఓ తల్లీ! ఏలికయగు గోవిందునిదాసుల మగు మాకు ఇహపరముల నిచ్చుటకై మాపాలిట దేవత వైతివి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరమాత్ముఁడైన హరి | 1006 | 36 | 20 | 25 |

అవ: పద్మావతీశ్రీనివాసుల పరిణయమునకు రండని దేవతలను, మునులను, పరసజనమును ఆహ్వానించుచున్నాడు.

**సీ. శ్రీనివాసునకును శ్రీమహాలక్ష్మికి**
**రమ్యమౌ పెండ్లిమూర్తమ్ము నేఁడు**
**కడఁగి భేరులు మ్రోసె గరుడధ్వజ మ్మెక్కె**
**శౌరిపెండ్లికి వేల్పులార ! రారో !**
**కందర్పుతండ్రికి కమలకుఁ బెండిలి**
**పందిటిలోఁ దలఁబ్రాలు నేఁడు**
**కట్టిరి కలువడాల్ గంద మిచ్చెదరు శ్రీ**
**హరిపెండ్లికిన్ మునులార ! రారో !**

**గీ. అలరుమేల్మంగకును వేంకటాద్రిపతికి**
**మొదలితిరునాళ్ళకును నేఁడు మ్రొక్కు లిడెద;**
**మెదుట నేగుచు వరము లిచ్చెదరు వీరు**
**ఘనుల పెండ్లికి పరుసలు ! కదలిరారో !** 288

శ్రీనివాసునకు శ్రీపద్మావతీదేవికి రమ్యమైన పెండ్లిముహూర్త మీనాడే. భేరులు మ్రోగుచున్నవి. గరుడాళ్వారు ధ్వజ మెక్కినాడు. ఓ దేవతలారా! శౌరి పెండ్లికి రండు. మన్మథునితండ్రియగు విష్ణుదేవునకు కమలకు పెండ్లి. పందిటిలో తలంబ్రాలవేడుక ఈనాడే. ధ్వజస్తంభమునకు బంగారు కలువపూదండలు వ్రేలాడ గట్టిరి. చందన మిత్తురు. ఓ మునులారా! శ్రీహరిపెండ్లికి రండు. అలమేలుమంగకు వేంకటాచలపతికి ఈ తొలి తిరునాళ్ళలో మ్రొక్కుకొనుచున్నాము. వీరు భక్తులముం దూరేగుచు వరము లిచ్చెదరు. ఓ పరుసలారా! (యాత్రికులారా!) ఈ ఘనుల పెండ్లికి మీరు కదలిరండు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పసిఁడి యక్షంత లివె | 234 | 194 | 3 | 130 |

అవ: యుద్ధములందు జయముపొంది తేరిలో మరలివస్తున్న వేంకట విభుని ప్రస్తుతించుచున్నాడు.

సీ. బిఱబిఱఁ దిరిగెడు పెనుబండికండ్లతో
గుఱుతైన పడగలగుంపుతోడ
ధరణి గ్రక్కదలంగఁ దర లెడి తేరిపై
మెఱసెడివీథుల మేటివేల్పు;
ధగధగమను నాయుధవు మెఱుంగులతోడ
జిగిమించు పగ్గాల చేర్లతోడ
క్రూరరాక్షసులపైఁ బాఱెడి తేరిపై
నీటుచూపు నిగిడి మేటివేల్పు

గీ. ఘణఘణ మనెడు గంటలస్వనముతోడ
దయిత యలమేలుమంగ వంతాలతోడఁ
గదనములు గెల్చి తిరుతేరు కదలిరాఁగ
వేంగడపు మేటి వేలుపు వినుతి కెక్కె. 289

త్వరితముగా దిరుగు పెద్దపెద్దబండికండ్లతో, చిహ్నములైన జెండాలతో, భూమి అదరునట్లు కదలునట్టి తేరిపై వీథులలో దేవదేవుడు వేంకటాద్రీశుడు ప్రకాశించుచున్నాడు. ధగధగమని మెఱిసే ఆయుధాలతో, జిగిమీఱు పగ్గముల త్రాళ్ళతో, క్రూరులగు రాక్షసులపైకి ఉరికే తేరిలో సర్వాధికుడైన వేంకటాచలపతి తన గొప్పను చూపుచున్నాడు. ఘణఘణమని శబ్దించే గంటలచప్పుళ్ళతో, ప్రియురాలగు అలమేలుమంగపంతాలతో, యుద్ధములందు జయము సాధించి లక్ష్మీయుక్త మగుతేరు తిరిగి వచ్చుచుండగా, వేంగడమనే పర్వతముననుండు మేటిదైవము శ్రీనివాసుడు పొగడ్త కెక్కెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రెక్కల కొండవలె | 226 | 145 | 3 | 97 |

అవ: దిగ్విజయంచేసి తిరిగి వస్తున్న గోవిందుని అందమగు స్యందనమును దర్శింపుడని నరులను సురలను హెచ్చరించుచున్నాడు.

సీ. చూడరో నరులార ! సురలార ! హరితేరు
దనుజుల దండించి తరలి వచ్చె
వాయువేగమ్మున వనజాక్షునరదమ్ము
చండమార్తాండ తేజమ్ము తోడఁ
జక్రవాళగ్రావజలధులు దాఁటి పై
కమవచ్చెఁ; బైఁడిటెక్కెములు గనరో!
అదె మనోరయమున నచ్యుతునరదమ్ము
శతకోటిశశధరద్యుతులతోడ
కనకధాత్రీధరమ్మునకుఁ బెన్నుద్దియై
దిక్కులెల్ల జయించి తిరిగి వచ్చె

గీ. గరుడవేగాన వేంకటేశ్వరుశతాంగ
మిందిరాదేవితో వీథు లేగి తనదు
నెలవునకుఁజేరె విష్ణుదాసులకుఁ గనుల
విందగుచు నిస్తులానందకంద మగుచు. 290

శ్రీహరితేరు రక్కసులను శిక్షించి తిరిగి వచ్చుచున్నది. ఓ నరులారా! దేవతలారా! తిలకింపుడు. తామరలవంటికన్నులగల గోవిందుని రథము వాయువేగముతో మధ్యాహ్నమందలి సూర్యతేజమువంటి తేజముగలదై లోకాలోకపర్వతమును సముద్రములను దాటి వేగంగా వచ్చినది. అవిగో! బంగారపుపతాకలు ! అచ్యుతునిఅరదం మనోవేగంతో శతకోటిచంద్రుల కాంతులు గలిగి మేరుపర్వతముతో సమానమై అన్నిదిక్కులు జయించి తిరిగి వచ్చినది. శ్రీహరితేరు గరుడవేగంతో పద్మావతితో వీథులందు సంచరించి విష్ణుదాసులకు నేత్రానందం కలిగించుచు, సాటిలేనిఆనందానికి మూలమగుచు తనచోటు చేరుకొన్నది. కనుగొనుడు!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చూడరో చూడరో | 289 | 512 | 3 | 344 |

అవ: మంగపతి తేరియూరేగింపును ఏకతానముగా తిలకించి వర్ణించు చున్నాడు.

సీ. గరుడవాహనుఁడు బంగరుస్యందనమ్ముపై
నేగెడివీథుల నెదురులేక
సురలును మునులును సొంపుగ మోఁకులు
పట్టితీసెదరు సంభ్రమ మెలర్ప
ఇందిరావల్లభుం డింద్రరథమ్ముపై
దిక్కుల గెలిచెడి తేజ మొప్ప
పరఁగ శేషాదులు బ్రహ్మశివాదులు
సేవ లొనర్తురు చిత్త మలర

గీ. తుంగవిక్రముఁ డలమేలుమంగతోడ
వేంకటవిభుండు తేరిపై వెలుఁగుచుండ
పొగడెదరు నారదాదులు పొలుపు మిగుల
నాడెదరు పాడెదరు దేవతాంగనలును. 291

గరుడుడు వాహనముగాగల గరుడాచలాధిపతి బంగారుతేరిలో గూర్చుండి అడ్డమాపులులేక వీథులలో ఊరేగుచున్నాడు. దేవతలు మునులు ఆ తేరిమోకులు పట్టి గట్టిగా సంబరముతో లాగుతున్నారు. ఇందిరకు ప్రియుడైన వేంకటేశ్వరుడు ఇంద్రు డిచ్చిన రథమెక్కి తేజోవంతుడై అన్నిదిక్కులను జయించుచున్నాడు. ఆ సందర్భంలో అనంతవిష్వక్సే నగరుడాది నిత్యసూరులు బ్రహ్మేశానాదిదేవతలు మనస్సు పల్లవింపగా సేవలు చేసెదరు. అధికపరాక్రమవంతుడైన వేంకటాచలపతి అలమేలు మంగతోగూడి రథముపై విలసిల్లుచుండగా నారదుడు మున్నగు దేవర్షులు ఇంపుగా పొగడ్తలు చేయుదురు. రంభాదిదేవాంగనలు ఆడుచు పాడు చుందురు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అమరాంగన లదె | 305 | 26 | 4 | 18 |

అవ: స్వామి అలమేల్మంగాసమేతుఁడై రథ మధిష్ఠించి భక్తులకు వరము లిచ్చుచు విహరించుచున్నాఁడని వర్ణిస్తున్నాడు.

సీ. **వేదాలె గుఱ్ఱముల్ విష్ణుని తేరికి**
**బహుళశాస్త్రమ్ములు ప్రగ్రహములు;**
**బండికం డ్లరయంగఁ బంచభూతమ్ములే**
**యరుగు మనోవీథులందు రథము;**
**జీవులే సారథుల్ శ్రీవిభుతేరికి**
**పరఁగు యజ్ఞమ్ములే పడగగుంపు;**
**చింతింపఁ బ్రకృతియే సింహాసన మ్మగు**
**వేవేల సిరులతో వెలసె రథము;**

గీ. **లీల వేంకటపతి యలమేలుమంగ**
**వరము లొసఁగుచు విహరించునరదమునకు**
**పైఁడికుండలు చంద్రుండు భాస్కరుండు**
**పొదలు శృంగారము లవెల్ల పుణ్యచయము.** 292

విష్ణుదేవుని తేరుకు వేదములే గుఱ్ఱములు. శాస్త్రసముదాయము కళ్ళెములు. పంచభూతములే బండికండ్లు. ఆ రథం మనస్సులనే వీథులలో పయనించును. శ్రీహరితేరుకు సారథులు జీవులు. యజ్ఞములే పతాకలు. ఆలోచించగా ఈ ప్రకృతియే ఆయనసింహాసనము. కోట్లసంపదలతో ఆ రథం ప్రకాశించును. అంజననగాధిరాజు అలమేలుమంగతో అందాసీనుడై భక్తులకు వరము లిచ్చుచు విలాసముగా పయనించును. సూర్యచంద్రులు ఆ రథానికి పైన ప్రకాశించే స్వర్ణకలశాలు. అతిశయించే అందాలన్నీ పుణ్యసమూహమే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందిరయుఁదాను గూడి | 226 | 146 | 3 | 98 |

అవ: స్వామివారి రథోత్సవమును శ్లాఘించుచున్నాఁడు.

సీ. **వీథివీథివి వీఁడె వీఁడె వీఁడె చెలంగు**
**నాదిదేవుఁడు వేంకటాద్రిభర్త**
**గరుడధ్వజం బదే ఘనమైన రథ మదే**
**నరి శంఖచక్రాలు శార్ఙ్గ మదియె;**
**అరుల నెల్లర గెల్చి యమరులఁ గావంగ**
**నాయత్తమై యుండె వరద మందు;**
**సారథి యాతఁడే సమరభేరియు నదే**
**యిరువంక బ్రహ్మాదిసురలు వీరె;**

గీ. **ఆటపాటలు బిరుదు పద్యంబు లవియె;**
**సంగడి మెలంగు నలమేలుమంగ యదియె;**
**అచ్చరలు వారె దాసుల యార్తిఁ బాపి**
**కోరికలు దీర్ప వేంచేయు శౌరి వీఁడె.** 293

దేవతలకు మొదటివాడైన వేంకటేశ్వరుడు అడుగో ప్రతివీథిలో ఒప్పిదంగా రథంలో ఊరేగుతున్నాడు. అల్లదిగో గరుడపతాకం. అదే ఆయన రథం! అవే శంఖం, చక్రం, శార్ఙ్గ మనే ధనువు. శత్రువు లందరినీ గెలిచి దేవతలను కాపాడటానికై రథంలో స్వామి సంసిద్ధంగా ఉన్నాడు. అడుగో రథసారథి. యుద్ధభేరికూడ అదే! రెండువైపుల బ్రహ్మ మొదలైనదేవతలు వారే. అవే ఆటలు, పాటలు, బిరుదుపద్యాలు. చెంతనే మెలంగుచున్న అలమేలుమంగమ్మ ఆమెయే. వారే అప్సరసలు. భక్తుల బాధలు బాపి కోరిక లివ్వడానికై వేంచేస్తున్న శ్రీమన్నారాయణమూర్తి ఇతడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వీదివీది వాఁడే | 248 | 274 | 3 | 185 |

అవ: ఊరేగుచున్న స్వామివారి రథమును స్వభావోక్తితో వర్ణించుచున్నాడు.

**సీ. దేవదుందుభులతో, దివిజబృందమ్ముతో**
**హరితేరు వీథుల నరుగు నేఁడు**
**గరుడధ్వజముతోడఁ, గనకాశ్వములతోడఁ**
**గడు వఱవగు బండికండ్లతోడ,**
**పట్టునూలి నిడువవగ్గాలతోడ, వై**
**దూర్యంపుటిరుసులతోడ, పూల**
**దండలతోడ, ముత్యాలకుచ్చులతోడ,**
**జిగిమీఱు వగడంపునొగలతోడ**

**గీ. మంచినీలాలగద్దెతో, మణులదర్ప**
**ణములతో, కుందనపుఁగలశములతోడ,**
**బహుళశృంగారములతోడ, పద్మతోడ,**
**వేంకటేశ్వరుతో తేరు వెడలు నేఁడు.** **294**

దేవదుందుభులు మ్రోగుచుండగా, దేవతాబృందము వెంట నడచిరాగా శ్రీ వేంకటాచలపతితేరు ఈనాడు వీథులవెంట వెడలును. గరుడపతాకముతో, బంగరు వన్నెగుఱ్ఱాలతో, విరివియగు బండికన్నులుగలిగి, పట్టునూలుతో పేనబడిన నిడుపాటి పగ్గాలతో, వైదూర్యమ్మణులతో చేయబడిన ఇరుసులు గలిగి, పూలదండలతో, ముత్యాలకుచ్చులతో, అలంకృతములై ప్రకాశించెడు పగడంపునొగలతో, మేలినీలాలగద్దెతో, మణులతో చేయబడిన అద్దాలతో, బంగారుకలశములతో కూడి అన్నివిధము లైన శృంగారములతో విలసిల్లి పద్మావతితో శ్రీవేంకటాచలపతితో ఈనాడు తేరు ఊరేగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దేవదుందుభులతోడ | 288 | 510 | 3 | 343 |

అవ: వేంకటాద్రిలో ఒకరథముపై కృష్ణుడు, మరొకదానిపై శ్రీవేంకటేశ్వరుడు, వేఱొకదానిపై శ్రీభూదేవు లెక్కి ఊరేగుటను వర్ణించుచున్నాడు.

సీ. **కోనేటిదరిఁ గనుఁగొనరొ? మూఁడు రథమ్ము**
**లమరులారా! నరులార! మీరు ;**
**ముందుగ నొకతేరు ముద్దుకృష్ణుం డెక్కె**
**వేంకటేశుం డెక్కె వేఱు తేరు;**
**ఇఁక నొక్క తేరెక్కి రిందిరాభూసతు**
**లరదముల్ నడగొండలట్లు గదలె;**
**కృష్ణుని దదె కపికేతన; మ్మేడుకొం**
**డలరాయనిది గరుడధ్వజమ్ము;**
**కమలకు ధరణికిఁ గరిలాంఛనపతాక**
**బ్రహ్మాండముల రీతిఁ బరఁగుచుండె;**

గీ. **చెఱకువింటిని చేపట్టె మురవిరోధి**
**చక్రము ధరించె వేంకటాచలవిభుండు;**
**తాలిచిరి మేదినియు నలమేలుమంగ**
**తమ్మి మొగ్గల నందాలబొమ్మ లగుచు.** **295**

ఓ దేవతలారా! ఓ నరులారా! కోనేటిగట్టు నుండి మూడురథములు కదలివచ్చుచున్నవి. మీరు కనుగొన్నారా? వాటిలో ఒకదానిపై చిన్నికృష్ణు డెక్కినాడు. మరొకదానిని వేంకటేశ్వరు డెక్కినాడు. ఇంకొకదానిలో లక్ష్మీదేవి భూదేవి ఎక్కికూర్చున్నారు. ఆ రథములు నడిచే కొండలవలె కదలి వస్తున్నాయి. కోతిటెక్కెము గలది శ్రీకృష్ణునిరథం. కొండలప్పది గరుడ ధ్వజముగల తేరు. శ్రీదేవీభూదేవుల రథం ఏనుగుజెండా గలది. అవి బ్రహ్మాండములంత ఉన్నతములు, విశాలము లైనవి. మురుడను రక్కసుని ఉక్కడగించిన శ్రీకృష్ణుడు చేత చెఱకువిల్లు పట్టినాడు. వెంకన్న సుదర్శనచక్రం ధరించినాడు. శ్రీభూదేవులు అందాలబొమ్మలుగ చూపట్టుచు చేతులలో తామరమొగ్గలు ధరించినారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కోనేటిదరుల | 289 | 517 | 3 | 347 |

అవ: శ్రీవారిపాన్పుసేవను వర్ణించుచున్నాడు.

సీ. **కొలువుచాలించెను గోవిందుఁ డుక్కడీల్!**
**వెలుపట నుండరో వేగుదాఁక**
**ఈ వేళ కరిగిరం డింద్రాదిదేవతల్!**
**శ్రీపతి పవళించె శేషుమీఁద;**
**దివ్యమౌనుల కిండు తీపిప్రసాదమ్ము**
**వైపుగఁ దెలవాఱ వత్తురుగాని;**
**బ్రహ్మరుద్రులు! పొండు పాళెముపట్లకు**
**పవ్వండె శ్రీహరి పాలకడలి;**
**లోనికి విచ్చేసె శ్రీనిలయుఁడు ద్వార**
**పాలకుల్! వాకిళ్ళఁ బదిలమునుఁడీ!**

గీ. **కిన్నరులు! పాడరో జయగీతిసమితి**
**నెలమి శ్రీవేంకటేశ్వరుం డెక్కె మేడ;**
**కడఁగి నిలువరో! యూడిగకాంద్రు! మిమ్ము**
**రేయి యెపుడైన రండనునో విభుండు.** **296**

ఓ సేవకులారా! గోవిందుడు కొలువు చాలించినాడు. తెలవారుదాక మీరు వెలుపలనే యుండుడు. ఇంద్రాదిదేవతలారా! శ్రీపతి శేషపర్యంకముపై పవళించినాడు. ఈనాటి కిక వెళ్ళిరండు. దేవమునులు తెల్లవారినపిదప వచ్చెదరుగాని వారి కిపుడు మధురమగు ప్రసాద మొనగుడు. బ్రహ్మ రుద్రులారా! శ్రీహరి పాలనముద్రములో పవ్వళించినాడు. మీరు మీవిడిదిపట్టులకు పొండు. ఓ ద్వారపాలకులారా! శ్రీనిలయుడు లోనికి వేంచేసినాడు. వాకిళ్ళవద్ద జాగ్రత్తసుమా! వేంకటాచలపతి మేడెక్కినాడు. కిన్నరులారా! జయగీతములను గానముచేయుడు. రాత్రియెప్పుడేని స్వామి మిమ్ము పిలుచునోయేమో గాని ఓ పనివారలారా! మీరు మాత్రము ఇక్కడ నిలువుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కొలువు ఎరిసె | 291 | 525 | 3 | 353 |

అవ: భగవంతు నెఱుంగుట ఎంతవారికి నశక్య మనియు, నమ్మి భక్తితో భజించు తమోగుణులను తమ్ము కావు మని వేడుకొనుచున్నాడు.

**సీ. యక్ష గంధర్వ సురాసురుల్ మిముఁ దెలి**
**యంగ లేరు; పరాశరాదిమునులు**
**మీరూపు భావించ లేరు; మే మెంత? యా**
**కరిఁ గాచినటువలెఁ గాతుగాక!**
**నిను వేదశాస్త్రముల్ వినుతింపలేవు చిం**
**తించ యజ్ఞములు సాధించ లేవు**
**నరులము మే మెంత? కరుణ నహల్యను**
**గాచిన యటువలెఁ గాతుగాక!**

**గీ. భూ రమా నీళ లెఱుఁగంగ లేరు నీ త**
**లంపు; నీ జాడ మీఱఁజాలరు ఫణీశ్వ**
**రాదులు; తమస్స్వభావులమైన మమ్ము**
**గరుడగిరినాథ! మ్రొక్కంగఁ గాతుగాక!** 297

గరుడాద్రివాసా! శ్రీనివాసా! యక్షులు, గంధర్వులు, దేవతలు, దానవులు నిన్ను భావించలేరు. పరాశరుడు మున్నుగాగల మహర్షులునూ మీ రూపము నూహింప జాలరు. మఱి మే మెంతవారము? అట్లైనను ఓ స్వామీ! ఆ గజేంద్రుని (జంతువును) కాపాడిన రీతిగానే మమ్మును గాపాడుము. వేదములు, శాస్త్రములు నిన్ను కీర్తింప సమర్థములు గావు. యాగములు నిన్ను సాధింప జాలవు. మానవమాత్రులము మే మెంతటి వారము? దయతో నీవా అతివ నహల్య నుద్ధరించి నటులే మమ్ముగూడ నుద్ధరింపుము. నీ మనస్సును శ్రీభూనీళాదేవులుగూడ కనిపెట్టలేరు. ఆదిశేషుడు మున్నగువారు నీదారి నతిక్రమింప జాలరు. అట్లుండగా ఇక తమోగుణులమైన మేము నీకు మ్రొక్కగా మమ్ము దయతో రక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇటులైతేఁ బుణ్యము | 162 | 297 | 2 | 199 |

అవ: అంజనాద్రినాథుని మహామహిమమును, అట్టిస్వామిని శరణందిన తమస్థితిని తెలుపుచున్నాడు.

సీ. వేదసముద్ధర్త విశ్వసంరక్షకుఁ
డాదినారాయణుం డచ్యుతుండు
సోదించి కొలువగా సుముఖుఁడై మమ్మేలె
నే దెస మాపాలి కితఁడె గలఁడు;
ఆపన్నివారకుఁ డానందరూపుండు
శాంతుఁ డంతర్యామి జలధిశాయి
శరణంటి మీతఁడు చేకొని మముఁ గాచెఁ
దరువాతిపనులకుఁ దప్పఁ డితఁడు

గీ. ఈశ్వరేశ్వరుఁ డంజనాద్రీశ్వరుండు
వెదకి నమ్మితి మీతండు విడువఁ డెపుడు
తుదకు మొదలికి దొరకిన నదయుఁ డితఁడు
మఱుఁగులు మొఱంగు లిఁక మఱి మాకు లేవు. 298

అతడు వేదముల నుద్ధరించినవాడు; ప్రపంచమును గాచువాడు; ఆదినారాయణుడు; నాశములేనివాడు. ప్రయాసపడి అతనిని కొలువగా, అతడు ప్రసన్నుడై మమ్ము గాచెను. అంతటనూ ఆతడు మాకు రక్షకుడై యున్నాడు. అతడు ఆపదలను పోగొట్టువాడు; ఆనందస్వరూపుడు. శాంతస్వభావుడు. సకలప్రాణుల హృదయాంతరాళములలో నుండువాడు. సముద్రశయనుడు. అట్టివానిని శరణు వేడితిమి. అతడు మాకు చేయూత నిచ్చి మమ్ము బ్రోచెను. ముమ్ముందు మాకుమేలు కలిగించి దేహాంతమున సాయుజ్యమునుగూడ ప్రసాదించును. దేవతలకు ఇతడు దేవుడు. గాలించి ఇతనిని కనుగొని గట్టిగా నమ్మితిమి. ఈ శ్రీవేంకటేశ్వరు డెపుడును మమ్ము విడువడు. మా కాద్యంతములకు (సర్వదా) లభించిన దయామయు డితడు. గోప్యములు, కపటములు ఇక మాకు లేనే లేవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎఱిఁగితి నమ్మితి | 198 | 502 | 2 | 339 |

అవ: నృసింహుని మహిమ అన్నియెడల నిండెనని ఆయనను నవరస భరితునిగా వర్ణించుచున్నాడు.

సీ. **నిండె నన్నియెడల నీ మహామహిమమ్ము**
**లండనే మ్రొక్కెద మాది నృహరి!**
**కూర్మి యిందిరమీఁదఁ గోప మ్మసుర మీఁద**
**హాసమ్ము సురసమూహమ్ము మీఁదఁ**
**గరుణ ప్రహ్లాదుపైఁ గరములు ప్రేగు జం**
**దెములపైఁ గన్నులు దెసల మీఁద**
**శాంతమ్ము జగముపై శౌర్యమ్ము పగఱపైఁ**
**గాంతులు నిజదివ్యకాయముపయి**

గీ. **చెలువయిన యోలగ మ్మహోబలముమీఁదఁ**
**జింతదీర వినోదమ్ము శేషశిఖరి**
**వయిని దయివాఱఁ బటు యోగ పట్టబంధ**
**కటితటిఁ జెలంగు నరహరి! కావుమయ్య!** 299

ఓ ఆదినరసింహా! నీమహిమ మంతటను నిండియున్నది. నిన్ను సమీపించి మ్రొక్కెదము. నీప్రేమ శ్రీమహాలక్ష్మిపై (శృంగారము), నీకోపము హిరణ్యకశిపునిమీద (వీరము), నీచిరునవ్వు దేవతలమీద (హాస్యము), దయ ప్రహ్లాదునిమీద (కరుణము) నీ చేతులు ప్రేగుజందెములమీద (బీభత్సము), కన్నులు దిక్కులపైని, (భయానకము), నీశాంతము లోకముపై (శాంతము), శౌర్యము శత్రువులమీద (రౌద్రరసము), దివ్యమైన తేజము నీశరీరముపై చెలువారినది.

అహోబలక్షేత్రములో నీ యందమగు పేరోలగ మమరినది. చీకు చింతలు లేక నీవు శేషశైలమున వినోదింతువు. సమర్థవంతమగు యోగమున కనువగు పట్టబంధము నడుమున నొప్పియుండగా ఓ నరహరీ! మమ్ము కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిండె నిన్నిచోటులను | 153 | 248 | 2 | 166 |

అవ: పదకవితాపితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులవారు తన వినయమును, సంకీర్తనల గొప్పతనమును స్వామికి విన్నవించు కొంటున్నాడు.

సీ. దాచుకో నీ పదద్వయికి నేఁ జేసిన
పుల్లయశస్సుమ పూజ లివ్వి
ఒక్కకీర్తనచాలు నేమంగఁ గడమవి
బండారమున దాఁగి యుండనిమ్ము;
తలఁప నీనామము వెల సులభము ఫల
మధికము సాధన మదియె స్వామి!
నా నాల్కపై నుండి నైకసంకీర్తనల్
కృపను నాచేఁ బలికించినావు;
వేనామములవాఁడ! వినుతింప నేనెంత?
కడుపున్నియము నాకుఁ గట్టినావు;

గీ. గరువపున్ మాటగాదు నీపరమ మహిమ
పొగడితిని; నా స్వతంత్రత నిగిడి నుడువ;
నేమమునఁ బాడువాఁడను నేరములను
సైఁపుమీ దాసుఁడను శేషశైలవాస! 300

నీపాదాలజంటకు నేను గావించిన నీకీర్తిరూపమైన పూలపూజ లివి. ఈ కీర్తనలను నీవు భద్రముగా నుంచుకొనుము. నీవు నన్ను రక్షించుటకు నాకీర్తన మొక్కటియే చాలును. మిగిలిన కృతులు భండారములో పదిలముగా నుండుగాక! ఆలోచింపగా నీనామము వెల తక్కువ; ఫల మెక్కువ; నీనామమే నాకు ధనము. అనగా నామోచ్చారణము సులభమనీ, దానిఫలం అధికమనీ భావము. ఓప్రభూ! నీవు నానాలుకపై నిలిచి దయతో నా చేత పెక్కు సంకీర్తనములు పలికించినావు. సహస్ర నామములుగల శ్రీశా! నిన్ను ప్రస్తుతింప నేనెంతవాడను? తగనివాడ ననుట. అయినను నాచే పొగడింప జేసుకొని ఎంతో పుణ్యమును నాకు అంటగట్టినావు. ఇది గర్వోక్తికాదు. నీ అధికానంత మహిమనే నేను గానము చేసితిని. అంతేగాని హెచ్చిన స్వతంత్రభావముతో గాదు. నియమముతో నీపరమైన కీర్తనలు గానము చేసుకొనుచుందును. ఓ శేషగిరినివాసా! నేనునీదాసుడనుగదా! నా తప్పులు మన్నించు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దాచుకో నీపాదాలకు | 169 | 338 | 2 | 226 |

# సంకీర్తనల అకారాదిసూచిక


| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| **అ** | |
| అంతర్యామీ | 263 |
| అందరికి సులభుఁడై | 11 |
| అందరివలెనే వున్నాఁడు | 20 |
| అందాఁకాఁదాఁదానే | 167 |
| అక్షయంబగు మోక్ష | 49 |
| అటు గొన్నాళ్ళందాఁక | 70 |
| అట్టయితే నా యంతర్యామి | 35 |
| అతఁడే రక్షకుఁడు | 218 |
| అతనిలోనే యణఁగె | 269 |
| అతిసులభం బిదె శ్రీపతి | 118 |
| అది బ్రహ్మాండం బిది | 219 |
| అదియేల తా మాను | 34 |
| అదె లంకసాధించె | 14 |
| అనంతాపరాధి నేను | 82 |
| అనరాదు వినరాదు | 111 |
| అనలము సూర్యుఁడు | 169 |
| అని బ్రహ్మాదు లెంచేరు | 4 |
| అనుచు మునులు ఋషులు | 5 |
| అన్నిటా నాపాలికి | 232 |
| అన్నిటా నీవేవుందు | 81 |
| అన్నిటా శాంతుఁడై తే | 166 |
| అన్నిటా శ్రీహరిదాసు | 159 |
| అన్నిటికి నారదాదు | 154 |
| అన్నిటికి నొడయుఁడవైన | 44 |
| అన్నియు నాలోనుండఁగ | 144 |
| అమరాంగనలదె | 291 |
| అల్పశక్తి వాఁడ | 33 |
| **ఆ** | |
| ఆటవారిఁగూడి తౌరా | 251 |
| ఆతఁడా యీతఁడు | 276 |
| ఆదిమపూరుషు | 9 |
| ఆనతియ్యఁగదవే | 48 |
| ఆర్తుఁడ నేను | 80 |
| **ఇ** | |
| ఇంక నేమిసేసేము | 137 |
| ఇంకనేల నాకు వెరపు | 213 |
| ఇంకనైన హరిఁజేరు | 194 |
| ఇంతగాల మాయ | 63 |
| ఇంతటఁ గావఁగదే | 59 |
| ఇంతటా హరినేకాని | 193 |
| ఇంతదేవుఁ డింక | 237 |
| ఇందిరయుఁ దాను గూడి | 292 |
| ఇందిరాధిపునిసేవ | 119 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| ఇందునుండ మీకెడలేదు | 122 |
| ఇందులో మొదలికర్త | 196 |
| ఇటు గరుడని | 105 |
| ఇటులైతేఁ బుణ్యము | 297 |
| ఇతఁడే యతఁడు కాంబోలు | 278 |
| ఇతనికంటే మరిదైవము | 10 |
| ఇతరుల నడుగము | 259 |
| ఇదియే వేదాంత | 234 |
| ఇదివో మాయింట | 113 |
| ఇన్నిజన్మము లెత్తిన | 149 |
| ఇన్నిటిమూలము | 29 |
| ఇన్నిటిమూలం బీశ్వరు | 214 |
| ఇన్నిదేహములఁ బుట్టి | 148 |
| ఇన్ని సేఁతలకు | 199 |
| ఇరవగువారికి | 140 |
| ఇలువేల్పితఁడే | 2 |
| ఇవి సేయఁగ నే నలసుఁడ | 245 |
| ఇహపరసాధన మీతలఁపు | 128 |
| ఇహా మెట్టో | 131 |
| **ఈ** | |
| ఈ తగవే నాకు నీకు | 66 |
| ఈతఁడే ద్రిష్టవరము | 120 |
| ఈహీ శ్రీహరిగంటే | 158 |
| **ఉ** | |
| ఉన్నచోనే మూఁడులోకాలు | 150 |
| ఉన్నమంత్రా లిందుసరా | 130 |
| ఉన్నసుద్దు లేలమాకు | 201 |
| **ఎ** | |
| ఎంతపుణ్యమో యిటు | 84 |
| ఎంత విచారించుకొన్నా | 47 |
| ఎందునుబోరా దీసంసారము | 228 |
| ఎందు వెదకనేల | 182 |
| ఎక్కడచూచిన వీరే | 112 |
| ఎక్కడి పుట్టుగు | 102 |
| ఎట్టు నేరిచితివయ్యా | 46 |
| ఎట్టువలసినాఁ జేయు | 98 |
| ఎదుట నెవ్వరు లేరు | 183 |
| ఎదురులేక చరింతు | 191 |
| ఎదురేది యింక మాకు | 76 |
| ఎన్నఁడుఁ జెడని | 145 |
| ఎన్నఁడు నేనిఁక | 99 |
| ఎన్నఁడు మానవు | 163 |
| ఎన్నఁడు వివేకించే | 181 |
| ఎన్నిచందముల నిట్లైన | 60 |
| ఎన్నిలేవు నాకిటువంటివి | 45 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| ఎఱిఁగితి నమ్మితి | 298 |
| ఎవ్వరి దూరఁగఁజోటు | 55 |
| ఎవ్వరి వసము గెల్వ | 51 |
| ఎవ్వరు దిక్కింక నాకు | 3 |
| **ఏ** | |
| ఏఁటివిజ్ఞాన | 176 |
| ఏకాలము నామనే | 189 |
| ఏతపములు నేల | 186 |
| ఏది మాకు గతియిఁక | 42 |
| ఏదైన దేవుఁడు | 233 |
| ఏపను లెవ్వరికి | 207 |
| ఏపాటి తనకర్మ | 215 |
| ఏపొద్దు చూచిన | 285 |
| ఏపొద్దూ నీచేఁత | 253 |
| ఏమనిచెప్పెద | 224 |
| ఏమని నుతించవచ్చు | 279 |
| ఏమిదిరిగే మెందైనను | 136 |
| ఏమి నిద్దిరించేవు | 24 |
| ఏమిసేతు నిందుకు | 74 |
| ఏమిసేయఁగల | 64 |
| ఏవల్లనౌఁగాము లిఁక | 56 |
| **ఒ** | |
| ఒకటికొకటీ లంకై | 255 |
| ఒకరిబుద్ధులు | 217 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| ఒక్కటి తరువాత | 122 |
| ఒక్కఁడెవ్వఁడో | 13 |
| ఒక్కఁడే యేకాంగవీరుఁడు | 277 |
| ఒడఁబరచుకొంటివి | 86 |
| **ఓ** | |
| ఓవో రాకాసులాల | 273 |
| **క** | |
| కంటిమిదివో నేము | 28 |
| కటకటా దేహంబుగాని | 178 |
| కడనుండిరావు | 61 |
| కనియుఁ గాననిమనసు | 241 |
| కమలారమణా | 266 |
| కరుణించవే | 230 |
| కలకాలము నిట్టే | 222 |
| కలఁడా యింతటిదాత | 17 |
| కలదొక్కటే గురి | 71 |
| కలిగినది యొక్కటే | 240 |
| కాకుంటే యీశూన్యవాద | 75 |
| కామధేను విదే | 164 |
| కాయము నాదే | 106 |
| కొలిచినవారల | 256 |
| కొలువు విరిసె | 296 |
| కోనేటి దరుల | 295 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| **గ** | |
| గడ్డపార మింగితే | 162 |
| గుఱ్ఱాలగట్టని తేరు | 208 |
| గోవింద నీవన్నిటిలో | 41 |
| గోవిందు దాసులమై | 192 |
| **ఘ** | |
| ఘనమనోరాజ్యసంగతి | 132 |
| **చ** | |
| చంచలము మానితేను | 267 |
| చాల నొవ్వి సేయునట్టి | 134 |
| చాలుఁజాలు నీసటల | 115 |
| చిత్తజగురుఁడ | 108 |
| చిత్తములో నిన్ను | 247 |
| చూడరో చూడరో | 290 |
| చూడవే గోవింద | 39 |
| చూతువు రావమ్మా | 110 |
| చూపఁ జెప్పఁగల | 92 |
| చెప్పితేఁ బాసునందురు | 83 |
| చెప్పినంతపని | 69 |
| చెలఁగి యధర్మము | 54 |
| చేపట్టుఁ గుంచము | 202 |
| చేరి యశోదకు | 257 |
| **జ** | |
| జీవన్ముక్తులము | 262 |
| జ్ఞానులాల యోగులాల | 117 |
| **త** | |
| తనకర్మవశం బించుక | 184 |
| తనలోనుండిన హరి | 198 |
| తప్ప దీయర్థమొకటి | 260 |
| తప్పులువొప్పులు దేహి | 156 |
| తలఁచినప్పుడు వచ్చు | 3 |
| తలపోఁత బాఁతె | 114 |
| తానెకా కెవ్వరు | 10 |
| తీరుచు నతఁడే | 173 |
| తెప్పగా మఱ్ఱాకుమీఁద | 8 |
| తెలియరాదు నీమాయ | 252 |
| తెలిసినవారికింతా | 127 |
| తెలిసినవారికి దేవు డితఁడే | 12 |
| తెలిసినవారెల్లా | 126 |
| తెలిసియుఁ దెలియను | 100 |
| తెలుపగరాదిది | 209 |
| తొక్కనిచోట్లు | 197 |
| త్రిజగముల నెరుఁగ | 258 |
| **ద** | |
| దాచుకో నీపాదాలకు | 300 |
| దినమఁట రాతిరఁట | 206 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య | సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|---|---|
| దీనుఁడ నేను | 103 | నీవెంత నేనెంత | 254 |
| దేవదుందుభులతోడ | 294 | నీవే యంతర్యామివి | 50 |
| దేవ నీదయ యెంతునో | 246 | నేనేమిబాఁతి నీకు | 79 |
| దేవ నీవిచ్చేయందుకు | 88 | నేనేమిసేయుదును | 205 |
| దేవుఁడొక్కఁడేగురి | 129 | నేమే బ్రహ్మ మనుకో | 242 |
| దైవమా నీకు వెలితా | 89 | నేరుపునతఁడే | 261 |
| దైవమా నీవే యిందు | 57 | **ప** | |
| దైవమా వోదైవమా | 229 | పంచేంద్రియములనే | 125 |
| **ధ** | | పచ్చిదేరుచు | 25 |
| ధరలో నాజన్మమే | 58 | పట్టినముట్టకుందరు | 94 |
| **న** | | పరమపాతకుఁడ | 104 |
| నన్ను నింతసేయుకంటె | 220 | పరమవైష్ణవుల | 142 |
| నమ్మితిఁ జుమ్మీ | 195 | పరమాత్మా నాజాడ | 188 |
| నానాదిక్కుల నరులెల్లా | 235 | పరమాత్ముఁడైన హరి | 287 |
| నానాభక్తులివి | 200 | పరులకైతే | 249 |
| నారాయణ నిను నమ్మిన | 40 | పలుదెరువులు నీకు | 62 |
| నారాయణ నీదాసుల | 190 | పసిఁడియక్షంతలివె | 288 |
| నారాయణుఁ డితండు | 272 | పాపము పాపము | 123 |
| నిండె నిన్నిచోటులను | 299 | పాపముఁ బుణ్యము | 187 |
| నిజము దెలియని | 96 | పామరుల కెంతైనా | 52 |
| నిరుహేతుకాన నన్ను | 36 | పారవేసిన | 101 |
| నీకు నాకు నెట్టుగూడె | 32 | పుట్టించేవాఁడవు నీవే | 53 |
| నీవారైనవారికి | 67 | పుట్టుభోగులము | 139 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| పుడమి నిందరిం బట్టె | 236 |
| పురుషుండని శృతి | 244 |
| పెట్టిన నీవెఱుంగుదు | 93 |
| పోయఁబోయఁ గాలమెల్ల | 152 |
| పోయెఁబోయఁ గాలమెల్ల | 177 |
| ప్రపన్నులకు నిది | 243 |
| **బ** | |
| బంటుకు బంటవుదురా | 107 |
| బలవంతుఁ డితనిబంట్లమై | 21 |
| బలువగుకర్మము లివిగో | 135 |
| బాపుబాపు దేవుఁడా | 227 |
| బాపురే నీమాయ | 78 |
| బాపురే వోప్రాణి | 268 |
| **భ** | |
| భగవద్విభవపు | 210 |
| భారమైన వేఁపమాను | 168 |
| భావించలే రెవ్వరును | 87 |
| భావించి తెలుసుకుంటె | 18 |
| **మ** | |
| మతంగపర్వతమాద | 275 |
| మతంగపర్వతము | 6 |
| మదనజనకునికి | 27 |
| మదమత్సరములేక | 141 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| మనసిజగురుఁ డితఁడో | 286 |
| మనసులో మర్మమై | 171 |
| మనసొకటి కోరికలు | 172 |
| మఱియెందూ గతిలేదు | 264 |
| మానరో వోలోకులాల | 143 |
| మాయామోహము | 153 |
| ముంచిన వేడుకతోడ | 250 |
| ముచ్చుఁగన్నతల్లి | 179 |
| ముట్టితేనే మూయై | 231 |
| ముద్దుగారే యశోద | 16 |
| మునులతపమునదె | 174 |
| మూఁడుమూర్తులనైన | 151 |
| మొదలే తెలియవలె | 155 |
| మొఱవెట్టెదము | 124 |
| **య** | |
| యజ్ఞ మూర్తి యజ్ఞకర్త | 95 |
| **ర** | |
| రాతిరెల్ల సతులతో | 23 |
| రాముఁడు రాఘవుఁడు | 7 |
| రాముఁడు లోకాభిరాముఁడు | 15 |
| రాముఁడు లోకాభిరాముఁడందరికి | 274 |
| రెక్కలకొండవలె | 289 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| **ల** | |
| లేదందువల్లఁ దెలివి | 68 |
| లేదుభయము | 161 |
| లోకమంతా నిండె | 146 |
| **వ** | |
| వట్టిమోపు మోయనేల | 147 |
| వట్టిస్వతంత్ర మిందులేదు | 180 |
| విచ్చనవిడినే యాడీ | 109 |
| విత్తొకటి వెట్టఁగా | 43 |
| విశ్వప్రకాశునకు | 133 |
| విశ్వరూప మిదివో | 1 |
| విష్ణుదేవుపాదములే | 121 |
| వివేకించ వేళలేదు | 160 |
| వీఁడివో లక్ష్మీపతి | 271 |
| వీఁడుగదే శేషుఁడు | 283 |
| వీదివీదివాఁడే | 293 |
| వెఱ్ఱిమానుప రెవ్వరు | 138 |
| వెఱ్ఱులాల మీకు | 270 |
| వెలినుండు లోనుండు | 203 |
| వేకువఁ దిరుపళచ్చి | 284 |
| వేసరకు వీఁడేల | 248 |
| **శ** | |
| శరణాగతవజ్రపంజరు | 212 |
| శ్రీపతి నీవు సిద్ధించుటే | 170 |
| శ్రీపతి నీసేవ | 65 |
| శ్రీహరిచేసిన | 238 |
| శ్రీహరిపాదతీర్థమే | 216 |
| **స** | |
| సందడివిడువుము | 26 |
| సకలబలంబులు | 116 |
| సకలోపాసకులకు | 97 |
| సగముమానిసిరూపు | 281 |
| సడిబెట్టెఁ గటకటా | 38 |
| సతతము నేఁజేయు | 265 |
| సమమతినని నీవే | 226 |
| సర్వం విష్ణుమయం | 204 |
| సర్వాంతరాత్ముఁడవు | 90 |
| సరిగాఁడు వీఁడనవలదు | 30 |
| సర్వేశ్వరా నీతోసరి | 85 |
| సేయనివాఁ డెవ్వఁడు | 157 |
| సేవించరో జనులాల | 280 |
| **హ** | |
| హరిగోవిందా | 31 |
| హరినామము కదు | 221 |
| హరి నీకే శరణని | 225 |
| హరి నీయనుమతో | 91 |
| హరి నీవాఁడనే కానా | 72 |

| సంకీర్తన మొదలు | పద్యసంఖ్య |
|---|---|
| హరి నీవు లేవా | 77 |
| హరి నీవే సర్వాత్మకుఁడవు | 223 |
| హరినే నన్నిందులకుఁగాదు | 73 |
| హరిభక్తి వోడ | 175 |
| హరియు నొక్కఁడే గురి | 165 |
| హరిహరి జగమెఱుంగ | 239 |
| హీనాధికము లింక | 185 |

T.T.D. Religious Publications Series No. : 790
Price : Rs.



శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు నెల్లూరు జిల్లా గూడూరు వాస్తవ్యులు. జననం 02.09.1923. మద్రాసు విశ్వవిద్యాలయ 'విద్వాన్' పట్టభద్రులు. నెల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాలల్లో 30 సం॥లు ప్రధానాంధ్రపండితులుగా పనిచేసి ఉద్యోగవిరమణానంతరం 1980 లో తిరుమల తిరుపతి దేవస్థానం వారి పుస్తక ప్రచురణ విభాగంలో ఉపసంపాదకులుగా చేరి ప్రస్తుతం ఆ విభాగ సమన్వయకర్తగా పనిచేస్తున్నారు.

ముదివర్తి వారు తమ 'ధర్మదీక్ష'తో కవితావ్రతమారంభించి అమరసందేశము, వీరమనీడు, నారాయణమ్మ, పూర్ణాహుతి వంటి నలభైకిపైగా పద్య, గద్యకృతులు ప్రచురించారు. తాళ్లపాక అన్నమాచార్యులు. పెద తిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యుల అధ్యాత్మసంకీర్తనల్లో 1500 పదాలను సీసపద్యాలుగా మలచి అమృతసారము, అన్నమయ్య విన్నపాలు, బ్రహ్మాగాంధర్వము, ఆనంద నిలయము, శ్రీనివాసతేజము అనే శీర్షికలతో పంచప్రబంధాలను ప్రకటించారు.

వీరి రచనలు తిరుపతి వేంకటకవులు, శేషాద్రిరమణకవులు, వేటూరి, పింగళి, రాళ్లపల్లి, రాయప్రోలు, విశ్వనాథ, గడియారం వేంకటశేషశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, మధునాపంతుల, పుట్టపర్తి, విద్వాన్ విశ్వం, దివాకర్ల, కరుణశ్రీ, సినారె, దాశరథి, కుందుర్తి, ఆరుద్ర, ఆత్రేయ, గుంటూరు శేషేంద్రశర్మవంటి కవీంద్రుల ప్రశంసలందుకున్నాయి.

వివిధ విశ్వవిద్యాలయాలలో వీరి గ్రంథాలు పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించబడ్డాయి. వీరి రచనలపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరిగాయి.

టి.టి.డి ప్రచురించిన భారత, భాగవతాలలో కొన్ని భాగాలకు వీరు వ్యాఖ్యానం రచించారు. కవిశేఖర, విద్వత్కవి శిరోమణి, మహాకవి బిరుదాంకితులు శ్రీ ముదివర్తి కొండమాచార్యులవారు ఆంధ్రదేశంలో పలు నగరాల్లో అనేక సన్మానాలు పొందారు. 2006 సం॥నికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి ప్రతిభాపురస్కారాన్ని గ్రహించారు.

Printed and Published by Sri K.V.Ramanachary, I.A.S., Executive Officer, T.T.Devasthanams, Tirupati and printed at T.T.D. Press, Tirupati.